ఎమ్బీయస్ – గ్రేట్ ఆంధ్ర ఆర్కయివ్స్ ప్రాజెక్టు

# 2015 Q2 ఏప్రిల్ – జూన్ ఆర్టికల్స్
## (పిడిఎఫ్ రూపంలో)
## విషయసూచిక

**న్యాయస్థానాలపై నియంత్రణ**
**సల్మాన్ కేసులో బొంబాయి హైకోర్టు తీరు**
**పంద్రాగస్టా? గాంధీ జయంతా?**
**భారీ సంక్షేమ పథకాల వలన ప్రయోజనం**
**విద్యావంతులేం చేస్తున్నారు?**
**సినీ స్నిప్పెట్లు 01 – ఎన్టీయార్**
**ఏ దేశమేగినా, ఎందు కాలిడినా...**
**ఏడాది పాలనలో ఏం మారింది?**
**రేవంత్ అంశం ఎంతదూరం వెళుతుంది?**
**ఆంధ్రులకు మసి పులమడం అన్యాయం**
**ఉపయెన్నిక బరిలో జయలలిత**
**హస్తిన నాదా? నీదా?**
**సన్ టీవీకి రిలయన్స్ గ్రహణం?**
**సినీ స్నిప్పెట్స్ 02 – సావిత్రి**
**అనువాద కథలెందుకు?**
**గుబులు పుట్టిస్తున్న లలిత్‌గీతం**
**సినీ స్నిప్పెట్స్ 03 – వెళ్లవచ్చా అని గొల్లపూడిని అడిగిన ఇందిరా గాంధీ**
**బ్రిటన్‌లో పాగా వేస్తున్న రష్యా ప్రభుత్వపు టెలివిజన్**
**దేవుడి బంగారం బ్యాంకుల్లోనా?– ఒప్పుకోం**
**సినీ స్నిప్పెట్స్ 04 – రాజాజీ ఆఖరి సంతకం సింగీతంకే!**
**సెక్షన్ 8 పై రచ్చ**
**సినీ స్నిప్పెట్స్ 05 – ఘంటసాల భగవద్గీతావరణం**

**2015 ఏప్రిల్ 01** **ఎమ్బీయస్ : న్యాయస్థానాలపై నియంత్రణ**

ఇప్పటివరకు సుప్రీం కోర్టు, హైకోర్టు నియామకాలు, బదిలీలకై అమల్లో వున్న కొలోజియం వ్యవస్థను రద్దు చేస్తూ, జాతీయ న్యాయ నియామకాల కమీషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పిస్తూ కేంద్రం కితం వారం నోటిఫికేషన్ జారీ చేసింది. 2003లో నాటి ఎన్డీఏ ప్రభుత్వం ప్రయత్నించి విఫలమైన పనిని యీనాటి ఎన్డీయే ప్రభుత్వం పూర్తి చేసింది. ఇటీవలే ఏప్రిల్ 5న మోదీ న్యాయాధీశులను ఉద్దేశించి మాట్లాడుతూ పైపైన గ్రహించినదాన్ని (పెర్సెప్షన్) బట్టి తీర్పులు యివ్వడం మానుకోవాలి అన్నారు. ఫైవ్‌స్టార్ కార్యకలాపాల వలన అలాటి తీర్పులు యిస్తున్నారని కూడా అన్నారు. ఇప్పుడు యీ చర్య! కోర్టులను తమ దారికి తెచ్చుకునే ప్రయత్నం తప్ప యిది వేరేమీ కాదని అందరికీ అర్థమవుతోంది. గతంలో ఇందిరా గాంధీ కూడా 'కమిటెడ్ జ్యుడిషియరీ' పేర యిలాటి దారులే తొక్కారు. సోషలిస్టు విధానాల అమలుకై చట్టాన్ని, సహజ న్యాయాన్ని పక్కదారులు పట్టించినా ఫర్వాలేదనే వామపక్ష న్యాయాధీశులు ఆమె కాలంలో రాజ్యమేలారు. మధ్యలో కొంతకాలం కోర్టులు ప్రభుత్వాన్ని అదిలించే స్థితికి వచ్చాయి. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకే ప్రభుత్వాలు అనేక కుంభకోణాలపై విచారణలు యిష్టం లేకపోయినా చేపట్టవలసి వచ్చింది. మళ్లీ యిప్పుడు కోర్టులు పార్లమెంటు అధీనంలోకి వచ్చేట్లు వున్నాయి. పార్లమెంటు అంటే మెజారిటీ పార్టీ అభిమతం అనే అర్థం. సమసమాజస్థాపన పేరుతో సంస్కరణలు మొదలుపెట్టి కోర్టులను తనవైపు తిప్పుకున్న ఇందిరా గాంధీ తర్వాతి రోజుల్లో వాటిని తమ స్వార్థం కోసం, రాజకీయప్రయోజనాల

కోసం, కేసులు తప్పించుకోవడం కోసం వినియోగించుకున్నారు. అప్పటి న్యాయాధీశులు ఆమెకు తాళం వేస్తూ వచ్చారు. ఇప్పుడూ అదే జరుగుతుందా అన్న అనుమానం రావడానికి కారణం మోదీ సర్కారు వచ్చాక కొందరు న్యాయమూర్తులు వ్యవహరిస్తున్న తీరు! ముఖ్యంగా ఎత్తి చూపవలసినది – సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులోంచి అమిత్ షాను బయటపడేసిన విధం! 9 ఏళ్లుగా నలుగుతున్న కేసును వింత కారణాలతో సిబిఐ స్పెషల్ కోర్టు జడ్జి 2014 డిసెంబరులో మూడు రోజుల విచారణతో తేల్చిపారేశారు.

ఎన్‌కౌంటర్లు, నకిలీ ఎన్‌కౌంటర్లు మన రాష్ట్రానికి కొత్త కాదు. 45 ఏళ్ల క్రితం నక్సలిజం సమస్య వచ్చినప్పటి నుండి తీవ్రవాది చనిపోగానే పోలీసులకు అది ఎన్‌కౌంటరు, ప్రచ్ఛన్న మావోయిస్టులకు, పౌరహక్కుల వాళ్లకు అది నకిలీ ఎన్‌కౌంటరు! అందువలన గుజరాత్ ప్రభుత్వం కూడా సొహ్రాబుద్దీన్‌ను ఎన్‌కౌంటర్ చేసిందని వినగానే ఓహో అక్కడా మావోయిస్టులున్నారన్నమాట అనుకోవడం కద్దు. అక్కడ కేసు అలాటిది కాదు. సొహ్రాబ్ ఉద్దీన్‌కు మావో, లెనిన్లతో ముఖపరిచయం కూడా లేదు. ఈ కేసులో సిబిఐ సాక్షులుగా వచ్చిన అహ్మదాబాద్ లోని పాప్యులర్ బిల్డర్స్ కంపెనీ యజమానులు దశరథ్ పటేల్, రమణ్ పటేల్ ప్రకారం చెప్పాలంటే అతను పోలీసుల తరఫు గూండా. పోలీసులు బిల్డర్లను బెదిరించి డబ్బు గుంజడానికి సొహ్రాబ్‌ను, అతని మనుష్యులను పంపేవారు. ఈ పటేల్ ద్వయం వద్ద డబ్బు గుంజిన పోలీసు అధికారుల్లో ముఖ్యులు అభయ్ చూడాసమా, డిజి వంజారా! వీళ్లు అప్పటి గుజరాత్ హెూం శాఖలో సహాయ మంత్రి అమిత్ షా పేరు చెప్పి బిల్డర్లను, యితరులను డబ్బు గుంజేవారు. మేం మాట నమ్మం అంటే అమిత్ చేత మాట్లాడించేవారు.

ఈ పటేల్ సోదరులు డబ్బు యివ్వడానికి నిరాకరించడం చేతనో ఏమో కానీ 2004లో వాళ్ల ఆఫీసులో కొందరు వచ్చి రిసెప్షన్ వద్ద తుపాకీతో గాల్లో కాల్పులు కాల్చి అందర్నీ భయపెట్టారు. పోలీసుకు కేసు నమోదు చేసినప్పుడు సొహ్రాబ్ పేరే కాదు ఎవరి పేరూ రాయలేదు. తర్వాత కొన్నాళ్లకు విచారణ చేసి సిల్విస్టర్, ప్రజాపతి అనే యిద్దరిని అనుమానితులుగా పేర్కొన్నారు. బిల్డర్లు మాత్రం ఆ కాల్పులు జరిపినది సొహ్రాబ్ మనుష్యులే అన్నారు. కానీ సొహ్రాబుద్దీన్‌పై పోలీసులు ఏ కేసూ పెట్టలేదు. అది జరిగాక ఒక ఏడాదికి అంటే 2005 నవంబరులో పట్టుకుని కాల్చేశారు. ఈ మధ్యలో అతను చేసిన నేరం అంటూ ఏమీ కనబడదు. ఇంకొక వాదన ప్రకారం – యీ పటేల్ సోదరులు రాజస్థాన్ నుంచి మార్బుల్ తెచ్చి అమ్మేవారు. సొహ్రాబ్ వారి నుండి డబ్బు గుంజేవాడు. వాళ్లే అమిత్ షాకు లంచం యిచ్చి అతని ద్వారా పోలీసుల చేత సొహ్రాబ్‌ను మట్టుపెట్టించారు. పటేల్ సోదరులపై అనేక క్రిమినల్ కేసులున్నాయి. (ఇవన్నీ తమ దగ్గర డబ్బు గుంజడానికి పోలీసులు 2001–05 మధ్య బనాయించినవి అని వాళ్లంటారు) వాళ్లు అమిత్ షాకు చెప్పిన తర్వాత వంజారా, చూడాసమా సొహ్రాబ్ మనుషులను వెళ్లి పటేల్ ఆఫీసులో కాల్పులు జరపమని చెప్పారని, అది సాకుగా పెట్టుకుని సొహ్రాబ్‌ను చంపేశారనీ అన్నారు. కానీ ఆఫీసులో కాల్పులు జరిపిన ఏడాది దాకా సొహ్రాబ్‌ను పట్టుకోవడం జరగలేదు. అందువలన దీన్ని ఎంతవరకు నమ్మాలో తెలియదు) అంటే జరిగినదేమిటి అంటే సొహ్రాబ్ పోలీసులను ఎక్కువ వాటా కోసం వేధించడమో, బ్లాక్‌మెయిల్ చేయడమో చేసి వుండాలి. అందుకని వాళ్లు అతన్ని లేపేశారు. దీని వెనక్కాల అమిత్ షా హస్తం వుందా లేదా అన్నదే ప్రశ్న.

నేరం జరిగిన తీరు, దాన్ని కవర్ చేసిన తీరు చూస్తే అమిత్ షా వంటి పెద్ద తలకాయ హస్తం వున్నట్లు అనుమానం వస్తుంది. సంఘటనలన్నీ ఒక క్రమంలో పేర్చి చూస్తేనే ఒక అంచనా ఏర్పడుతుంది. సిబిఐ కోర్టుకి తెచ్చిన సాక్షుల్లో ఒకతను 'అమిత్ షా సొహ్రాబ్ జీవించే హక్కు కోల్పోయాడు అని అన్నాడు' అని చెప్పాడు. అది నిజం కావచ్చు, కాకపోవచ్చు. కానీ యితన్ని చంపడానికి గుజరాత్ నుంచి ఏకంగా ముగ్గురు ఐపియస్ అధికారులు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారంటే వారికి రాజకీయ మద్దతు వుందనే అనుకోవాలి. వచ్చినవారు అప్పా (పోలీసు ఎకాడమీ) వారి గెస్ట్ హౌస్‌లో బస చేసి, ఆంధ్రప్రదేశ్ పోలీసులకు ఏమీ చెప్పకుండా సొహ్రాబ్, అతని భార్య కౌసర్ బీ ఎక్కిన బస్సును వెంబడించారు. వాళ్లు హైదరాబాదులో కలీముద్దీన్ అనే అతని వద్దకు వచ్చి వుండి, తీర్థయాత్రకై సాంగ్లీ వెళుతున్నారు. వాళ్లతో బాటు వున్న సొహ్రాబ్ అనుచరుడు తులసి ప్రజాపతియే పోలీసులకు ఆనుపానులు చెప్పాడని సమాచారం వుంది. జహీరాబాద్ వద్ద బస్సు ఆపారు. బస్సులోకి ఎక్కి ఏకాయెకి వాళ్లు కూర్చున్న 29, 30 సీట్ల వద్దకు వెళ్లి మగవాళ్లిద్దరినీ కిందకు దిగమన్నారు. కౌసర్ బీ తాను కూడా దిగుతానని చెప్పి పోలీసులు వద్దంటున్నా దిగిపోయింది. ఆ బస్సులో వున్న ప్రయాణీకులు యీ మేరకు సాక్ష్యం చెప్పారు. మర్నాడు అంటే 2005 నవంబరు 23 న సొహ్రాబ్‌ను, కౌసర్‌ను గుజరాత్‌లోని వల్సాడ్, భారుచ్‌ల ద్వారా దిషా ఫారహౌస్‌కు తీసుకెళ్లారు. రెండు రోజులు పోయాక అతన్ని అర్హామ్ ఫాంహౌస్‌కు తీసుకెళ్లి కాల్చేశారు. ఆ తర్వాత కొన్నాళ్లకు కౌసర్‌ను కూడా కాల్చేయడం జరిగింది. కారణాలు తెలియవు. ఈ ఎన్‌కౌంటర్ గురించి చెపుతుందన్న భయం కావచ్చు. –

సొహ్రాబ్ చావు సంగతి బయటపడగానే సహజంగా వార్తల్లోకి ఎక్కింది. గుజరాత్ పోలీసులు వెంటనే అతను లష్కరే తొయిబా టెర్రరిస్టనీ, రాష్ట్రంలోని పెద్ద రాజకీయ నాయకుణ్ని (మోదీ అని భావం) చంపడానికి వచ్చాడని, అహ్మదాబాద్ నుండి సూరత్ వెళుతుంటే మధ్యదారిలో అతన్ని పట్టుకున్నామనీ, అతను కాల్పులు కాల్చడంతో ఎదురుకాల్పులు జరిపామనీ, వాటిలో అతను చనిపోయాడనీ, తమ సాహసకృత్యం ద్వారా టెర్రరిజానికి గుజరాత్‌లో స్థానం లేదని చాటామని చెప్పుకుని కేసు మూసేశారు. కానీ సుప్రీం కోర్టు యీ కథ నమ్మలేదు. ఈ చావుపై విచారణ జరిపించమని 2006 జనవరి 14న గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. గుజరాత్ డిజిపిగా వున్న పిసి పాండే విచారణ ప్రారంభం కాకుండా ఆర్నెల్లు ఆపాడు. సుప్రీం కోర్టు ఊరుకోలేదు, మూడుసార్లు గుర్తు చేసింది. (ఇలా గుర్తు చేసే న్యాయమూర్తులున్నారనే వాళ్ల నియామకాలు, బదిలీలు యిప్పుడు కొత్త చట్టం ద్వారా ప్రభుత్వం తన గుప్పిట్లోకి తెచ్చుకుంది)

దాంతో గతిలేక జూన్ నెలాఖరులో మొదలుపెట్టాడు. చివరకు విచారించే టీములో చూడాసమా, అమీన్ వుండి తీరాలని రాతపూర్వకంగా ఆదేశాలు యిచ్చాడు.

ఇంకో ఆర్నెల్లు పోయేసరికి గుజరాత్ పోలీసులు సొహ్రాబ్‌ను అహ్మదాబాద్ సూరత్‌ల మధ్య పట్టుకోలేదని, ఆంధ్రప్రదేశ్ నుంచి ఎత్తుకుని వచ్చామని ఒప్పుకోవాల్సి వచ్చింది. అది ఆంధ్రతో కలిసి జాయింటు ఆపరేషన్ అంది. మాకే పాపం తెలియదు బాబోయ్, మాకున్న నకిలీ ఎన్‌కౌంటరు కేసులు చాలనట్లు యిదొకటా అని ఆంధ్ర పోలీసులు మొత్తుకున్నారు. దాంతో గుజరాత్ పోలీసులు సుప్రీం కోర్టుకు 'ఆంధ్ర పోలీసులకు సంబంధం లేదు' అన్నారు. టెర్రరిస్టు కార్యకలాపమైతే ఆంధ్ర ప్రభుత్వం సహకారం తీసుకోవాలి కదా, అని కోర్టు అడిగితే 2007లో 'అబ్బే గుజరాత్ పోలీసులు తమంతట తామే పేరుకోసం, కీర్తి కోసం, ప్రమోషన్ల కోసం సొహ్రాబ్‌ను పట్టుకుని చంపేశారు' అన్నారు. దానిపై డి జి వంజారా, రాజకుమార్ పాండ్యన్ అనే సీనియర్ అధికారులతో సహా 13 మంది పోలీసులపై చార్జిషీటు దాఖలు చేయడం జరిగింది. (అప్పటిదాకా విధేయుడిగా వుండి తప్పనిసరి పరిస్థితుల్లో యిలా చేసిన డిజిపి పిసి పాండేపై అమిత్‌కు అమితకోపం వచ్చిందిట. ముగ్గురు ఐపియస్ అధికారులను తను అరెస్టు చేయించిన మర్నాడే తనను ఢిల్లీకి పంపేశాడనీ డిఐజి రజనీశ్ రాయ్‌కు చెప్పుకుని వాపోయాడట) ఎంత తప్పు చేసినా పోలీసులు యింతలా ఒప్పేసుకుంటారా అన్న అనుమానం వస్తోందా? దానికి ముందు కాస్త కథ జరిగింది.

సొహ్రాబ్ ఎన్‌కౌంటరు కేసు విచారించే బాధ్యత అప్పగించిన వసంత్ సోలంకీ అనే గుజరాత్ పోలీసు యిన్‌స్పెక్టరు చాలా గట్టివాడు. తన సీనియర్ అధికారులది తప్పుందని తన రిపోర్టులో రాసేశాడు. అది అమిత్ షాను మండించింది. 2006 నవంబరులో సోలంకీ గీతా జోహ్రీ అనే ఐజీ (ఇన్‌స్పెక్టరు జనరల్) కింద పనిచేస్తున్నాడు కాబట్టి ఆమెను పిలిచి ఎడిషినల్ డిజిపి జిసి రాయగిర్, డిజిపి పిసి పాండేల ఎదుట "నీ కింద పనిచేసే వ్యక్తి యిలాటి రిపోర్టు రాసి అందర్నీ యిబ్బందుల్లోకి ఎలా నెట్టగలిగాడు?" అని అడిగాడు. రాయగిర్ అమిత్ షాతో "నేను కొద్ది రోజుల్లో రిటైరు కాబోతున్నాను. ఈ రిపోర్టు బయటకు వస్తే నాకు చాలా కష్టం." అని వేడుకున్నాడు. (ఈ సందర్భంగా 'మీరంతా బయట పడాలంటే ఫలానాది చేయండి' అని అమిత్ తనకు చట్టవిరుద్ధమైన ఆదేశాలు యిచ్చినట్లు, 'ఆ ఆదేశాలు పాటించలేను, నన్ను దయచేసి సిఐడి ఎడిషనల్ చార్జి నుంచి తప్పించండి' అని తను అమిత్‌ను కోరినట్లు రాయగిర్ సిబిఐకు సాక్ష్యం యిచ్చాడు) అమిత్ గీతా కేసి తిరిగి "విన్నావుగా, ఆ రిపోర్టులు చింపి పారేయి. ఎవరికీ ఏ చికాకూ లేకుండా మార్చి కొత్తగా రాయమను." అని గట్టిగా చెప్పి పంపించాడు. ఆమె ఆఫీసుకి తిరిగి వచ్చి సోలంకీని పిలిచి "ఇదీ కథ" అంది. అంతా విని సోలంకీ "మా నాన్న స్వర్గం నుంచి దిగి వచ్చి ఆదేశించినా నేను మార్చను. సొహ్రాబ్ సంగతి సరే, అతని భార్య అమాయకురాలు. ఆమెను కూడా పట్టుకెళ్లి అన్యాయంగా కాల్చేశారు. వీళ్లను గట్టున పడేస్తే ఆ స్త్రీహత్యా పాతకం మనకూ చుట్టుకుంటుంది." అన్నాడు. ఆమె నుదురు బాదుకుని యితన్ని బయటకు పొమ్మంది. ఇతను బయటకు వచ్చి గీతా జోహ్రీ పియే ఆచార్యతో లోపల జరిగిందంతా చెప్పాడు. సోలంకీ, ఆచార్య యిద్దరూ ఆ మేరకు సిబిఐకు సాక్ష్యాలు యిచ్చారు.

ఇది జరిగిన నెలకు అంటే డిసెంబరు 18న సోలంకీ సొహ్రాబ్ ఎన్‌కౌంటరులో నిజానిజాలు తేలాలంటే అతని వద్ద పనిచేసి, పోలీసులకు సాయపడి, ప్రస్తుతం ఉదయపూరు జైల్లో వున్న తులసీ ప్రజాపతి, సిల్వెస్టర్లను యింటరాగేట్ చేయాలని దానికై తనకు అనుమతి యివ్వాలని సోలంకీ పైఅధికారులకు ఉత్తరం రాశాడు. దానిపై గీతా జోహ్రీ తను కూడా సోలంకీతో వెళదామనుకుంటున్నాననీ, అనుమతి యివ్వాలనీ కోరుతూ నోట్ రాశారు. వీళ్లకు అనుమతి నిరాకరిస్తూనే అక్కడ ప్రజాపతిని 9 రోజుల్లో లేపేశారు. డిసెంబరు 27 న అతను ఎన్‌కౌంటర్లో (!?) చచ్చిపోయాడు. సోలంకీ రాసిన లేఖ యిప్పుడు కనబడడం మానేసింది. దాని ఆఫీసు కాపీ కూడా మాయమైంది. ఎందుకంటే 2007 మార్చిలో డిప్యూటీ ఎస్‌పి (క్రైమ్) అహ్మదాబాద్ జోన్‌గా ఎన్‌కె అమీన్‌ను వేసి అతనికి యితని ఫైళ్లన్నీ అప్పగించమన్నారు. ప్రజాపతి చచ్చిపోయాక 'యిప్పుడు నువ్వు కావలిస్తే ఉదయపూరు వెళ్లవచ్చు' అని సోలంకీకి అనుమతి యిచ్చారు! సొహ్రాబ్ సోదరుడు యీ విచారణ మొత్తం మీద చాలా సందేహాలు లేవనెత్తాడు. 'సొహ్రాబ్ టెర్రరిస్టయితే, ఎదురు తిరిగి వుంటే, పట్టుకున్నాక 48 గంటల పాటు సజీవంగా ఎందుకు వుంచారు? ఫామ్‌హౌస్‌లకు తీసుకెళ్లి వివరాలు రాబట్టడం దేనికి? పోలీసు స్టేషన్‌కు ఎందుకు తీసుకెళ్లలేదు? అతని భార్య ఏ నేరం చేసిందని చంపేశారు? ఇప్పుడు ప్రజాపతి కూడా మిస్టీరియస్‌గా ఎన్‌కౌంటరుకి గురి కావడం ఏమిటి? గుజరాత్ పోలీసులు నిజాలు చెప్పడం లేదు. అందువలన కేంద్రప్రభుత్వం సిబిఐ చేత విచారణ జరిపించాలి' అని సుప్రీం కోర్టుకి పిటిషను పెట్టుకున్నాడు.

ఠక్, సిబిఐ విచారణను ఒప్పుకోం అని గుజరాత్ ప్రభుత్వం తన తరఫున హేమాహేమీల చేత సుప్రీం కోర్టులో వాదింప చేసింది. వారిలో జగమెరిగిన రామ్ జెత్మలానీ, ముకుల్ రోహత్గీ (ఎన్‌డిఏ అధికారంలోకి వచ్చాక 2014 జూన్‌లో దేశానికి ఎటార్నీ జనరల్ అయ్యారు) ఉదయ్ లలిత్ (ఆగస్టు 2014లో సుప్రీం కోర్టు జడ్జి అయ్యారు) వున్నారు. 'గుజరాత్ పోలీసు వ్యవస్థ చక్కగా విచారణ జరిపి కేసు మూసేసింది, అపరాధులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకుంటాం, యిప్పుడు సిబిఐకు అప్పగించడం దేనికి?' అని వాళ్లు వాదించారు. సిబిఐ రంగంలోకి దిగితే యీ పోలీసు అధికారులు ఎవరి ఆదేశాలపై యింత ఘాతుకాలు చేశారో బయటకు వస్తుందని భయం కావచ్చు. అలాటి పరిస్థితుల్లో 2007లో గుజరాత్ ప్రభుత్వం 13 మంది పోలీసు అధికారులను బలి యిచ్చి హమ్మయ్య అనుకుంది. అయితే కేసు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు మరీమరీ ప్రశ్నించడంతో కౌసర్ బీని కూడా ఫేక్ ఎన్‌కౌంటర్లో చంపేశారనీ, ఇల్లోల్ అనే గ్రామానికి తీసుకెళ్లి ఆమె శవాన్ని దహనం చేసేశారనీ కూడా 2007 మేలో చెప్పారు.

అయినా 2010 జనవరి 12 న సిబిఐ చేత విచారణ జరిపించాలని ఆదేశించింది. కారణం ఏమిటంటే నిందితులైన పోలీసు అధికారులపై నార్కో పరీక్షలు చేయడానికి సెషన్సు కోర్టు అనుమతి యిచ్చినా గుజరాత్ ప్రభుత్వం చేయించలేదు. మేం యిప్పటికే చాలా చర్యలు తీసుకున్నాం అంటూ గుజరాత్ ప్రభుత్వం 8 ఎటిఆర్ (యాక్షన్ టేకెన్ రిపోర్టులు) సమర్పించినా (2008లో యిచ్చిన దాన్లోనే కౌసర్ బీ ఫేక్ ఎన్‌కౌంటర్లో చనిపోయిందని ఒప్పుకోవడం జరిగింది) వాటిలో చాలా అవకతవకలున్నాయని, విచారణ సరైన దిశలో జరగలేదని సుప్రీం కోర్టు భావించింది. నిజానికి సెషన్స్ కోర్టు ఆదేశాల ప్రకారం నిందితులైన పోలీసు అధికారులకు నార్కో టెస్టులు చేయించడానికి అనుమతి కోరుతూ డిఐజిగా వున్న రజనీశ్ రాయ్ నోట్ పంపిన మర్నాడే సొహ్రాబ్ కేసును అతని నుంచి తప్పించారు. నోట్ రాసేముందు సీనియర్లను సంప్రదించి, అందరూ సమ్మతించిందే రాయాలని మందలించారు. అతని కాన్ఫిడెన్షియల్ రిపోర్టులో అప్పటిదాకా వున్న 'వెరీ గుడ్'ను 'యావరేజ్'కు దింపేశారు. ఇవన్నీ చూసి సుప్రీం కోర్టు కేసును సిబిఐకు అప్పగించింది.

సొహ్రాబ్ విషయంలో లాగే ప్రజాపతి కేసులో కూడా గుజరాత్ ప్రభుత్వం మొగ్గలు వేసింది. 2006లో అతని చనిపోయినపుడు 'అతన్ని రాజస్థాన్ నుండి తెచ్చి అహ్మదాబాదు కోర్టులో హాజరు పరిచి, వెనక్కి రైల్లో రాజస్థాన్ తీసుకెళుతూంటే అతని సహచరులు పోలీసుల కళ్లల్లో కారం చల్లి పారిపోయారు. పోలీసులు అతని గురించి వెతికితే మర్నాడు హైవే వద్ద కనబడ్డాడు. ఎదురుకాల్పుల్లో మరణించాడు' అని చెప్పారు. ఆ తర్వాత పోలీసుల కళ్లల్లో కారం ఛాయలు కనబడలేదని ఫోరెన్సిక్ నిపుణులు తేల్చడంతో 2010 జులై 30 లో 'ప్రజాపతి కూడా ఫేక్ ఎన్‌కౌంటరులోనే చనిపోయాడు' అని గుజరాత్ పోలీసు శాఖ ఒప్పుకుంటూ చార్జిషీటు ఫైల్ చేసింది. మర్నాడే అనుబంధ చార్జిషీటు వేసింది – సొహ్రాబ్ ఎన్‌కౌంటరుకి, దీనికీ సంబంధం లేదు అని.

సిబిఐ విచారణ కారణంగా 2010 జులైలో అమిత్ షాను హత్యానేరంపై అరెస్టు చేశారు. మూణ్నెళ్లలోనే గుజరాత్ హైకోర్టు అతనికి బెయిల్ యిచ్చింది. అయితే మర్నాడే సుప్రీం కోర్టు జడ్జి అఫ్తాబ్ ఆలమ్ విచారణ పూర్తయ్యేవరకు అతను గుజరాత్‌లో వుండడానికి వీల్లేదని ఆదేశించారు. దాని వలన 2010–12 మధ్య అమిత్ షా ఢిల్లీలో కాపురం పెట్టారు. అమిత్ బెయిలు రద్దు చేయమని సిబిఐ కోరినా సుప్రీం కోర్టు ఒప్పుకోలేదు. కేసు గుజరాత్‌లో నడుస్తున్నంతకాలం మా పని సాగటం లేదని, తమ అధికారులను వేధిస్తున్నారని సిబిఐ మొర పెట్టుకోగా 2012 సెప్టెంబరులో సుప్రీం కోర్టు ఆ కేసును ముంబయికి బదిలీ చేసింది. ప్రజాపతి చావు గురించిన ఫైళ్లు కూడా తరలించాలని సిబిఐ, అక్కరలేదు, దానికీ దీనికీ సంబంధం లేదని గుజరాత్ ప్రభుత్వం మొండికేయడంతో తరలింపు ఆలస్యమైంది. 2013 మేలో ముంబయిలో వున్న సిబిఐ స్పెషల్ కోర్టుకు రికార్డులు తరలించారు. ఇక అక్కణ్నుంచి స్పెషల్ కోర్టు న్యాయాధీశుల వ్యవహారం ప్రారంభమైంది.

2013 ప్రారంభంలో సుప్రీం కోర్టు జడ్జి ఒకాయన బొంబాయి హై కోర్టులోని సీనియర్ జడ్జికి ఫోన్ చేసి కేసు తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ఎవరైనా అకళంకితుడైన న్యాయమూర్తికి కేసు అప్పగించండి అని కోరారట. ఏ కేసు ఎవరికి అప్పగించాలో నిర్ణయించే హైకోర్టు కమిటీలో ముగ్గురు సీనియర్ జడ్జిలు వుంటారు, చీఫ్ జస్టిస్ అధ్యక్షుడిగా వుంటాడు. ఈ కేసు విషయంలో చీఫ్ జస్టిస్ మోహిత్ షా తను గుజరాతీ కాబట్టి ఆ మీటింగుకి రాకపోతే మంచిది అంటూ తప్పుకున్నాడు. కమిటీ నిర్ణయం ప్రకారం కేసును జెటి ఉత్పాత్‌కు కేటాయించారు. ఆ రికార్డులు అవీ గుజరాతీలోంచి, ఇంగ్లీషులోకి, మరాఠీలోకి అనువాదాలు చేయించేసరికి ఏడాది పట్టింది. ఈ వ్యవహారం అంతా చూసేసరికి బొంబాయి చీఫ్ జస్టిస్ షాపై సుప్రీం కోర్టు జడ్జిలకు అనుమానం వచ్చింది. 2013 మార్చిలో ప్రమోషన్లకు తగరని కొలీజియం భావించిన ముగ్గురు చీఫ్ జస్టిస్‌లలో షా ఒకరు! తక్కిన యిద్దరూ గుజరాత్ చీఫ్ జస్టిస్, ఉత్తరాఖండ్ చీఫ్ జస్టిస్! (ఇప్పుడు కొలీజయంనే రద్దు చేసేశారు)

రికార్డుల మాట ఎలా వున్నా ఉత్పాత్ అమిత్ షాను పిలిపించి ప్రశ్నలు అడగదామనుకున్నారు. అయితే అమిత్ తరఫు లాయరు రకరకాల సాకులు చెప్పాడు – డయాబెటిక్ కాబట్టి కదలలేడనీ, ఢిల్లీలో బిజీగా వున్నాడనీ.. యిలా. ఇలా ఏడాది సాగదీయడంతో (యీ లోపున మోదీ ప్రధాని అయ్యారు) ఉత్పాత్‌కు ఒళ్లుమండి 2014 జూన్ 6 న యివాళ మినహాయింపు యిస్తున్నాను కానీ జూన్ 20 నాటి హియరింగ్‌కు అమిత్ హాజరై తీరాలి అని గట్టిగా చెప్పారు. అప్పుడూ అమిత్ రాలేదు. ఉత్పాత్‌కు ఒళ్లు మండిపోయింది. జూన్ 26కి రాకపోతే ఊరుకోను అన్నారు. అంతే ఒక రోజు ముందు అంటే జూన్ 25న ఆయన్ను పూనాకు బదిలీ చేసేసింది బొంబాయి హైకోర్టు. ఎందుకంటే మే లోనే కేంద్రంలో ప్రభుత్వం మారింది. అమిత్ షాకు బలం పెరిగింది. ఈ బదిలీ ఏమిటి అని మీడియా అడిగితే హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ 'మా అమ్మాయి పూనాలో చదువుకుంటోంది కాబట్టి అక్కడకు బదిలీ చేయండి అని ఉత్పాతే అడిగారు. అందుకే బదిలీ చేశాం' అని చెప్పారు. సొహ్రాబ్ సోదరుడు ఇది అన్యాయం, ఉత్పాత్‌గార్ని వెనక్కి రప్పించండి అని బొంబాయి చీఫ్ జస్టిస్‌కు మొరపెట్టుకుంటే నాలుగు నెలలు పోయాక మళ్లీ రిజిస్ట్రార్ జనరల్ గారే 'మీ అభ్యర్థనను ముగ్గురు హైకోర్టు జడ్జిల కమిటీ పరిశీలించి నిరాకరించింది' అని జవాబిచ్చారు. కేసు విచారణ మొదలు నుంచి తుది దాకా ఒక జడ్జి చేతనే చేయించమని సుప్రీం కోర్టు ఆదేశించింది కదా అంటే, విచారణ ప్రారంభం కాలేదు కాబట్టి యిప్పుడు మార్చవచ్చు అంది బొంబాయి హైకోర్టు.

2010 ఉత్పాత్ స్థానంలో బ్రిజ్‌మోహన్ లోయా వచ్చారు. ఈయనది పాపం ఉదారబుద్ధి. అమిత్ షా స్వయంగా హాజరు కాకపోయినా ఏమీ అనలేదు. "విచారణ ప్రారంభమైన తర్వాత మాత్రం వచ్చి తీరాలి" అని సూచించారు. నవంబరు 30 న ముంబయి నుండి నాగపూరు పెళ్లికని వెళ్లి ప్రభుత్వ గెస్ట్‌హవుస్‌లో బస చేశారు. మర్నాటికల్లా పోయారు. తీవ్రమైన గుండె నొప్పి అన్నారు. 52 ఏళ్ల వ్యక్తి యింత త్వరగా పోవడంతో అందరికీ అనుమానాలు వచ్చాయి. ఢిల్లీలో కొందరు ఎంపీలు యీ మిస్టరీ పై

విచారణ జరిపించాలంటూ ప్రదర్శనలు నిర్వహించారు. సొహ్రాబ్ సోదరుడు సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌కు లేఖ రాశాడు – 'మొదటాయనను బదిలీ చేయించారు, రెండో ఆయన యిలా అయ్యారు. జడ్జిలను భయపెట్టే ప్రయత్నం జరుగుతోంది' అని. లోయా పోయిన 15 రోజులకు ఎంబి గోసావీ అనే ఆయన్ని జడ్జిగా వేశారు. స్పీడుకు మారుపేరు యీయన. డిసెంబరు 15 న హియరింగు మొదలుపెట్టి మూడు రోజుల్లో ముగించేశాడు. డిసెంబరు 29 న తీర్పు యిచ్చేశాడు. 710 మంది సాక్షుల స్టేటుమెంట్లు, చార్జిషీటు కలిపి 22 వేల పేజీలుంది. అదంతా ఎప్పుడు చదివాడో ఏమో కానీ ఆయన తన తీర్పులో 'ఈ కేసు అమిత్ షాపై రాజకీయ కారణాలతో మోపబడింది' అనే నిర్ణయానికి వచ్చేసి, కేసు కొట్టేశాడు. అమిత్ షాతో అనేకమంది పోలీసులు విముక్తులు అయిపోయారు.

ప్రాసిక్యూషన్ వాదనను యీయన ఎందుకు అంగీకరించలేదు అన్న సంగతి చాలా ఆసక్తికరంగా వుంది. అతి ముఖ్యులైన సాక్షులైన పటేల్ సోదరులు మూడుసార్లు సాక్ష్యం యిచ్చారు. సిబిఐకు రెండు సార్లు, మేజిస్ట్రేటు ముందు ఒకసారి. 'మూడుసార్లూ ఒకలాటి స్టేటుమెంటే యిచ్చారు – అక్షరం మార్చకుండా. ఇది కామన్‌సెన్సుకి విరుద్ధం. అందువలన యీ సాక్ష్యాన్ని లెక్కలోకి తీసుకోవడం లేదు' అన్నాడు గోసావీ. ఒక్కోసారి ఒక్కోటి చెపితే అప్పుడేమంటారు? సాక్షిని నమ్మడానికి వీల్లేదు అనరూ? వీళ్లు పోలీసు అధికారులు తమను బెదిరిస్తూ వుండగా వీడియో రికార్డింగు కూడా చేశారు. పోలీసు అధికారుల ద్వారా అమిత్ షా అభయ్ తమను బెదిరించాడని, దానికి చూడాసమా ఫోన్ వుపయోగించాడనీ వీళ్లు చెప్పారు. అది వాళ్ల వూహే తప్ప, వాస్తవం కాకపోవచ్చని గోసావీ తీర్పు. అమిత్ చట్టవిరుద్ధమైన ఆదేశాలు యిచ్చాడని రాయగిర్ చెపితే 'న్యాయబద్ధమైన ఆదేశాన్ని కూడా రాయగీర్ చట్టవిరుద్ధమైనదని అనుకోవచ్చు. అది అతని వ్యక్తిగత అభిప్రాయం' అన్నాడు. ఇలాటి మీటింగు జరగలేదని అమిత్‌కు మద్దతుగా నిలబడిన గీతా జోహ్రీ, పిసి పాండేల స్టేటుమెంటు మాత్రం ఆయనకు విశ్వసనీయంగా తోచింది. సోలంకీ రిపోర్టు గురించి అమిత్ గీతా జోహ్రీ వద్ద కోపం వెళ్లగక్కిన సంగతి చెప్పిన సోలంకీ, ఆచార్య స్టేటుమెంట్లు కూడా జడ్జిగారు కొట్టిపారేశాడు. అమిత్ షా అరిచినట్లు సోలంకీ చూశాడా? గీత చెప్పగా విన్నదే కదా అన్నాడు.

సొహ్రాబ్ కిడ్నాప్, ఎన్‌కౌంటరు జరిగిన నవంబరు 22 – 26, 2015 తారీకుల్లో అమిత్ షా ఎన్‌కౌంటరు చేసిన వంజారా, పాండ్యన్‌లతో నిరంతరం టచ్‌లో వున్నాడని నిరూపించడానికి సెల్‌ఫోన్ కాల్‌డేటాను సిబిఐ కోర్టుకి సమర్పించింది. 'రాష్ట్రంలో టెర్రరిస్టు కార్యకలాపాలు విపరీతంగా వున్నాయి కాబట్టి హెూం మంత్రి పోలీసు అధికారులను నిరంతరం సంప్రదించడంలో వింత లేదు' అని జడ్జిగారు దీన్నీ కొట్టి పారేశారు. గుజరాత్‌లో అప్పుడు టెర్రరిజం లేదు, వున్నా టెర్రరిజం వంటి తీవ్రసమస్యను డిజిపి స్థాయి వ్యక్తులతో చర్చిస్తారు కానీ ఎస్‌పి, డిప్యూటీ ఎస్పీ లెవెల్ వాళ్లతో ఎందుకు చర్చిస్తారు? అని సిబిఐ న్యాయవాది చేసిన వాదనను పట్టించుకోలేదు. గోసావిగారు 75 పేజీల తీర్పులో సిబిఐ వాదనలను రెండు పేజీల్లో ప్రస్తావించి వదిలేశారు, అమిత్ షా తరఫున చేసిన వాదనలకు 32 పేజీలు కేటాయించారు. 25 పేజీల్లో తన డిస్చార్జి ఆర్డర్ దయచేశారు. అమిత్ షాను వదిలేయగానే, మమ్మల్నీ వదిలేయండి అంటూ యితర పోలీసు అధికారులు అర్జీ పెట్టుకున్నారు. బిల్డర్లను బెదిరించారని ఆరోపణలు ఎదుర్కుంటున్న చూడాసమా, వంజారా కూడా బయటపడిపోయారు. చూడాసమాను గుజరాత్ ప్రభుత్వం వెంటనే సర్వీసులో చేర్చేసుకుంది కూడా. గోసావీగారు ఆ తర్వాత అదే స్పీడులో పిసి పాండే, రాజకుమార్ పాండ్యన్ అనే పోలీసు అధికారులపై కూడా కేసులు ఎత్తేశాడు.

ఇది జరిగిన రెండు నెలలకే 2015 ఫిబ్రవరి మూడోవారంలో స్పెషల్ కోర్టు రాజస్థాన్ హెూం మంత్రి గులాబ్‌చంద్ కటారియాను కూడా యీ కేసులో నిర్దోషిగా విడిచిపెట్టేసింది. విమల్ పట్నీ అనే మార్బుల్ వ్యాపారి నుంచి సొహ్రాబుద్దీన్ డబ్బు గుంజడానికి ప్రయత్నించాడని, అతని పీడ వదిలించమని పట్నీ అప్పటి బిజెపి ప్రభుత్వంలోని హెూం మంత్రి గులాబ్‌చంద్‌కు కోరాడని, అందుకే సొహ్రాబుద్దీన్ బోగస్ ఎన్‌కౌంటర్‌లో గులాబ్ చంద్ కూడా పాలు పంచుకున్నాడని ప్రాసిక్యూషన్ అభియోగం. సిబిఐ అనుబంధ చార్జిషీటులో అతన్ని నిందితుడిగా చేర్చింది. ఇప్పుడు కూడా అతను రాజస్థాన్ బిజెపి ప్రభుత్వంలో హెూం మంత్రిగానే వున్నాడు. ఈ కేసులో అమిత్ షా తర్వాత విముక్తి పొందిన రెండో రాజకీయ నాయకుడు అతను.

రాజకీయనాయకుల ప్రభావానికి లోనైతే న్యాయవ్యవస్థ ఎంత అందంగా నడుస్తుందో అమిత్ షా కేసు ఒక ఉదాహరణ. 2జి స్కాము, కోల్ స్కాము యిత్యాదులు బయటకు వచ్చాయంటే న్యాయవ్యవస్థ ఎంతోకొంత బలంగా వుండడం చేతనే! భవిష్యత్తులో అలాటి ప్రమాదం తలెత్తకుండా ప్రస్తుత ప్రభుత్వం జాగ్రత్తపడుతోంది. ఇప్పుడు కొలోజియం స్థానంలో ఏర్పరస్తున్న కమిషన్‌లో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ అధ్యక్షుడు. సీనియర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు (వాళ్లు ముకుల్ రోహత్‌గి, ఉదయ్ లలిత్ వంటి వారు కావచ్చుగా) కేంద్ర న్యాయశాఖ మంత్రి, మరో యిద్దరు ప్రముఖులు వుంటారట. ఈ ప్రముఖులెవరో చీఫ్ జస్టిస్, ప్రధాని, అపోజిషన్ లీడరు కలిసి నిర్ణయిస్తారట. చీఫ్ జస్టిస్ ప్రధాని నియమించిన వ్యక్తి అయితే వాళ్లదే మెజారిటీ అవుతుంది. అపోజిషన్ లీడరు వున్నా వాళ్లూ రూలింగు పార్టీ లాటి వాళ్లే కదా, వాళ్లపైనా బోల్డు కేసులుంటాయి కదా. అనేక సందర్భాల్లో పాలకపక్షంవారిపై ప్రతిపక్షనాయకులు కేసులు పెట్టడాలు, ఆ తర్వాత లోపాయికారీ ఒప్పందాలు జరిగి, విత్‌డ్రా చేయడాలూ చూశాం. ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే అవతలివాళ్లు దిగమింగిన డబ్బు కక్కించి, పేదలకు పంచిపెడతామని వాగ్దానాలు కురిపిస్తారు. నెగ్గిన తర్వాత అంతా గప్‌చుప్. ఇలాటి తోడుదొంగలు కలిసి తమ అకృత్యాలపై ఎవరు విచారించాలో నిర్ణయిస్తారన్నమాట. వీళ్లను బాలన్స్ చేయడానికై సామాజిక ప్రముఖులను కూడా వేస్తారట. వాళ్లు ఎలా తేలతారో తెలియదు. లెజిస్లేటివ్ కౌన్సిలులో మేధావులు వుండాలని ఒరిజినల్ ఐడియా. చివరకు సోషల్‌వర్కర్ల పేర సాధారణ ఎన్నికలలో ఓడిపోయిన రాజకీయనాయకులతోనే నింపేశారు. ఇప్పుడీ

'ప్రముఖులు' కూడా రాజకీయవాదులుగా తేలినా ఆశ్చర్యం లేదు.

ఇలాటి కమిషన్‌లో వుండడానికి చీఫ్ జస్టిస్ దత్తుగారికి సడన్‌గా మొహమాటపడ్డారు. మొన్న జనవరిలోనే ఆయన మోదీకి దూరద ృష్టి గల వ్యక్తి అని సర్టిఫికెట్టు యిస్తూ 'గతంలో ఎన్నడూ లేనంతగా న్యాయవ్యవస్థకూ, ప్రభుత్వానికి మధ్య అద్భుతంగా సంబంధాలు బలపడుతున్నాయి..' అని మెచ్చుకున్నారు. ఆయన ఆధ్వర్యంలో జరిగిన హైకోర్టు న్యాయమూర్తులు, ముఖ్యమంత్రుల సమావేశంలోనే మోదీ న్యాయమూర్తులు ఏ కేసులను విచారించాలో, ఫైవ్‌స్టార్ కార్యకర్తలు (తీస్తా సెతల్వాడ్ టైపని ఆయన భావమని విమర్శ) కేసులను ఎందుకు ప్రోత్సహించకూడదో వాళ్లకు క్లాసు తీసుకున్నారు. దత్తుగారికి అది అభ్యంతరకరంగా తోచలేదు. ఎప్పుడైతే న్యాయవాదులు, తక్కిన న్యాయమూర్తులు యీ మార్పులను గట్టిగా వ్యతిరేకించారో, అప్పటి నుంచి ఆయనకు గుబులు పుట్టినట్లుంది. కమిషన్‌లో వుండనంటున్నారు. దానితో న్యాయమూర్తులు నియామకాలన్నీ ఆగాయి. కోర్టుల్లో కోట్లాది కేసులు పెండింగులో వున్నాయి. ఇప్పుడీ ప్రతిష్టంభన వచ్చిపడింది. దీన్ని అధిగమించడానికి అంటూ రాజకీయనాయకులందరూ పోగడి తమకు కావలసినవారిని నియమించేసుకుంటారేమో తెలియదు. ఇప్పుడున్న కొలీజియం వ్యవస్థలో లోపాలు లేవని ఎవరూ అనలేరు. అవినీతి, బంధుప్రీతి, ఆశ్రితపక్షపాతం – యిత్యాది అనేక జాడ్యాలతో కోర్టులు కునారిల్లుతున్నాయి. దానిని సవరించవలసిన అవసరం ఎంతైనా వుంది. కానీ మందు వేయవలసిన డాక్టర్లు, రాజకీయనాయకులు కాదు. ఈ కమిషన్ నియామకాన్ని రాజకీయ నాయకులందరూ హర్షిస్తారు. కెసియార్ కూడా కోర్టుల జోక్యాన్ని నిరసిస్తున్నారు కదా – న్యాయానికి స్పీకరు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలి. కానీ స్పీకర్లందరూ అధికారపార్టీలకు వత్తాసు పలికేవారిగా తయారయ్యారు. పార్టీ ఫిరాయింపుదారులను బాహాటంగా కాపాడుతున్నారు. వారికి ముకుతాడు వేయాలని కోర్టులకు వెళితే అది యీ నాయకులు సహించలేకపోతున్నారు. ఇది యివాళ్టి గొడవ కాదు. తమిళనాడులో ఎస్‌ఎచ్ పాండ్యన్ అనే స్పీకరు నియంతలా ప్రవర్తించేవాడు. కోర్టు ఆదేశాలను కూడా ధిక్కరించేవాడు. 'నా అధికారాలకు పరిమితి ఆకాశం మాత్రమే, నా పేరులోని ఎస్‌ఎచ్ అంటే 'స్కై హై' అని చెప్పుకునేవాడు.

ఈ రోజు మోదీ యీ సవరణలు తెస్తున్నాడు కాబట్టి మోదీపై అభిమానంతో యిది సవ్యమైన చర్యే అని సమర్థిస్తే భవిష్యత్తులో చాలా విపరీతాలు జరుగుతాయి. మోదీ కలకాలం వుండడు కదా. మోదీ న్యాయబద్ధంగా వ్యవహరిస్తాడని అనుకున్నా తర్వాత వచ్చినవారు దుర్వినియోగం చేస్తే...? ఇప్పుడైనా ప్రతిపక్ష నాయకుడికి నియామకాల్లో పెద్ద భూమిక యిచ్చారు. ఆయన ఎవరు? నిలువెల్లా అవినీతిలో మునిగిపోయిన కాంగ్రెసు పార్టీకి చెందిన వ్యక్తి. తమ స్కాములన్నీ కోర్టుల కారణంగానే బయటకు వచ్చి, అధికారం పోయిందని న్యాయవ్యవస్థను తిట్టుకునే వ్యక్తి. ఎవరు న్యాయమూర్తులుగా వుండాలో ఆయనా నిర్ణయిస్తాడా? శాస్త్రప్రకారం సిబిఐ, కోర్టులు స్వతంత్రంగా ప్రవర్తించాలి. కానీ ఆచరణలో ఏం జరుగుతోందో విపులంగా చెప్పడానికి అమిత్ షా కేసును ఉదాహరణగా తీసుకున్నాను. ఉదాహరణలతో పని లేకుండా కూడా అందరికీ తెలుసు. అయినా కోర్టుల్లో కొందరు పెద్దమనుషులు వుండడం చేత ఆ వ్యవస్థ అంతంతమాత్రంగానైనా ఒంటికాలిపై కుంటుతూ నడుస్తోంది. ఆ కాలు కూడా విరిచేస్తాం, మేం యిచ్చే చంకకర్రలు పెట్టుకుని నడు అంటున్నారు రాజకీయనాయకులు. అది విషాదకరం. న్యాయవ్యవస్థ అధికార వ్యవస్థను అదుపు చేసేట్లా వుండాలనే ఆలోచన మన భారతీయ సంస్కృతిలోనే వుంది.

రాజు వుండేవాడు, అతని తప్పులని ఎత్తి చూపించి ధర్మాన్ని నిలబెట్టేందుకు బ్రాహ్మణ వ్యవస్థ వుండేది. ఇక్కడ అర్థం చేసుకోవలసినది ఒకటుంది. బ్రాహ్మణుడు అంటే ఆ కులంలో పుట్టిన ప్రతివాడికీ ధర్మం చెప్పే అర్హత వున్నట్టు కాదు. బ్రాహ్మణులు అనేక వ ృత్తులలో వుండేవారు. సైనికులుగా, రైతులుగా, పురోహితులుగా, పూజారులుగా, ఉపాధ్యాయులుగా, రాజోద్యోగులుగా రకరకాల పనులు చేసేవారు. పంచతంత్రం కథల్లో చూసినా యీ విషయం బోధపడుతుంది. ఇది గమనించని కొందరు పూర్వవ్యవస్థలో బ్రాహ్మణులు తిని కూర్చునేవారని ఆపోహ పడతారు. కొంతమంది ధర్మస్వరూపులైన బ్రాహ్మణులను మాత్రమే సమాజం పోషించేది. భుక్తికోసం వారు ఆరాటపడనక్కరలేకుండా, ఎవరిపై ఆధారపడనక్కరలేకుండా వారి అవసరాలు తీర్చే ఏర్పాటు చేసేది. అందువలన వారు ఎవరికీ జంకకుండా న్యాయాన్యాయాల గురించి తీర్పు చెప్పేవారు. రాజు తప్పు చేసినా దండించే హక్కు వాళ్లకు వుండేది. సమాజానికి ప్రతినిధి రాజు కాబట్టి రాజు అవి సమకూర్చేవాడు. తనకు వ్యతిరేకమైన తీర్పు చెప్పాడు కదాని వాటిని వెనక్కి తీసుకునే అధికారం రాజుకి లేదు. దురాశతో వాళ్ల ఆస్తి హరించబోతే దండనీయుడే. జమదగ్ని – కార్తవీర్యార్జునుడు కథలో యిది తెలుస్తుంది. ఎవరైనా ఋషి రాజు వద్దకు కుశలప్రశ్నలు వేసినపుడు 'మీ రాజ్యంలో బ్రాహ్మణులు నిర్భయంగా, సుఖంగా వున్నారు కదా' అని అడిగినప్పుడు యిటువంటి బ్రాహ్మణుల గురించే అడుగుతున్నారని గ్రహించాలి. అంతేకానీ మీ పురోహితుడు, మీ వంటబ్రాహ్మడు, మీ మంత్రి, మీ పిల్లలు ధనుర్విద్య నేర్పించే ఆచార్యుడు... అని కాదు. 'చతుస్సాగర పర్యంతం గోవులు, బ్రాహ్మణులు సుఖంగా వుంటే లోకమంతా సుభిక్షంగా వుంటుంది' అనే సూక్తిలో అర్థం కూడా అదే. మన దేశం వ్యవసాయిక దేశం కాబట్టి, మనది స్థిరనివాస జాతి కాబట్టి గోవు, గోరక్షణ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. గోవులను ఎత్తుకు పోవడానికి రాజుల మధ్య యుద్ధాలు కూడా జరిగాయి. ఈ బ్రాహ్మణ వ్యవస్థే వేదాలు, పురాణాలు అధ్యయనం చేస్తూ దేశకాల పరిస్థితుల బట్టి స్మ ృతులు, న్యాయసూత్రాలు ఏర్పరచేది. సమాజంతో బాటు మారుస్తూ వుండేది. ఈ ధర్మవ్యవస్థకు ప్రతినిధిగా వున్న వ్యక్తికి 'ఈ ప ృథివిపై రాజు తప్ప వేరే విష్ణువు లేడు' అని అందరిచేత అనిపించుకునే రాజు కూడా మోకరిల్లేవాడు. ఆజ్ఞను శిరసా వహించేవాడు. బ్రాహ్మణులుగా పుట్టినా రాజు కొలువులో పనిచేసే ఉద్యోగులకు యిలాటి మన్నన వుండేది కాదు. మంత్రుల స్థాయిలో వున్నవారు సలహా చెప్పగలరు కానీ

రాజాజ్ఞను కాదనలేరు.

ఇటువంటి మన సమాజపు తీరుతెన్నులను దృష్టిలో పెట్టుకునే మన రాజ్యాంగ నిర్మాతలు మూడు స్తంభాల వ్యవస్థను ఏర్పరచారు. రాచరికపు వ్యవస్థలో ఉద్యోగుల నియామకాలు రాజు యిష్టాయిష్టాలపై ఆధారపడతాయి. కానీ ప్రజాస్వామ్యంలో ఐదేళ్ల కోసారి ప్రజల చేత ఎన్నుకోబడిన పాలకులైనవారికి తమ చిత్తం వచ్చినట్లు ఉద్యోగులను తీసేసే అధికారం వుండదు. నాయకులు వస్తూ వుంటారు, పోతూ వుంటారు. కొంతకాలం రాష్ట్రపతి పాలన వుంటుంది, మరి కొంతకాలం ఆపద్ధర్మ ప్రధాని వుంటాడు, కానీ పాలనావ్యవస్థ మాత్రం నడుస్తూనే వుండాలి. ఉద్యోగిగా చేరినవాడు తన ఉద్యోగధర్మాన్ని అతిక్రమించకుండా వుంటే 35, 40 ఏళ్ల పాటు నిరాఘంటంగా పనిచేసుకునే హక్కు కోల్పోడు. పాలకుల కోపతాపాలకు దడిసి వారు నియమాలను అతిక్రమించవలసిన అవసరం లేదు. వారి ఉద్యోగాలకు రాజ్యాంగం ఆ భద్రత కల్పించింది. మరి పాలకుల అవసరం ఏమిటి అంటే అధికార యంత్రాంగానికి ప్రజల పట్ల జవాబుదారీ లేదు. ఉద్యోగభద్రత కారణంగా వారిలో నిర్లక్ష్యం పెరగవచ్చు. అందుకని ప్రజల ప్రతినిధులుగా, వారితో నిత్యం సంపర్కం కలిగిన వ్యక్తులుగా రాజకీయ నాయకులు అధికారులను అదుపు చేస్తూ, నియంత్రిస్తూ, నచ్చచెపుతూ వారి నుండి పని రాబట్టుకోవాలి. వారిద్దరి మధ్య సమీకరణాలు తూకంగా వున్నపుడే పరిపాలన బాగుంటుంది. కొన్ని సందర్భాల్లో యిద్దరూ కుమ్మక్కయి, ప్రజలను దోచుకుంటే అప్పుడు నివారణోపాయం ఏమిటి? దానికోసమే న్యాయవ్యవస్థ పెట్టారు. దానికి స్వతంత్ర ప్రతిపత్తి యిచ్చారు. ఈ మూడు వ్యవస్థలు ఒకరికి మరొకరు చెక్, ఎవరూ వేరేవారిని దాటిపోకుండా నియంత్రిస్తూ వున్నపుడే సమాజం బాగుపడుతుంది.

గతంలో చాలామంది ఉన్నతాధికారులు ధైర్యంగా వుండేవారు. నియమాలను అతిక్రమించిన నాయకులను ఎదిరించేవారు, దాని వలన సంభవించే కష్టనష్టాలను భరించేవారు. ఇటీవలి కాలంలో భజనపరులు ఎక్కువయ్యారు. ఎవరు అధికారంలో వుంటే వారికి తాళం వేయడం ఎక్కువైంది. గట్టిగా మాట్లాడేవారిని అధికారంలోకి వచ్చిన రాజకీయ నాయకులు కీలకమైన పదవుల నుంచి తప్పిస్తున్నారు. కేసులు బనాయిస్తున్నారు. ఇదే ఒక దుష్పరిణామం అనుకుంటే యిప్పుడు న్యాయస్థానాలను కూడా నియంత్రించాలని చూస్తున్నారు. ఇది తప్పు. ఇందిరా గాంధీ హయాంలో యిలాటి ధోరణి వెర్రితలలు వేసింది. వామపక్ష భావాలున్న న్యాయాధీశులు యాక్టివ్ జ్యుడిషియరీ పేరుతో తమ పరిమితులు మీరి ప్రవర్తించారు. సమాజంలో అనేక వ్యవస్థలు భ్రష్టు పట్టాయి. న్యాయవ్యవస్థకు కూడా దానికి అతీతం కాదు. అదీ చెడింది. దాన్ని బాగు చేయాలి. లేకపోతే 2 జి స్కాములు, కోల్‌గేట్ స్కాములు వంటివి ఎప్పటికీ వెలుగులోకి రావు. దాన్ని రాజకీయ నాయకులు చేతిలోకి తీసుకోవాలని చూడడం మంచిది కాదు. అమిత్ షా కేసులో న్యాయస్థానాలు ఎలాటి ఒత్తిళ్లకు లోనయ్యాయో సోదాహరణంగా చూశాం. ఇప్పుడే యిలా వుంటే కొత్త వ్యవస్థ వచ్చాక ఎలా వుంటుందో వూహించుకుంటే భయం వేస్తుంది.

ఇదీ యీ అంశంపై నా అభిప్రాయం. ఇక ముక్తాయింపుగా కొన్ని వాక్యాలు రాయాలి. నన్ను విమర్శించేవారు సైతం నన్ను మేధావిగా పేర్కొంటారు. నా బొంద నేనేం మేధావిని? నా పాఠకుల్లో కొందరు సూపర్ మేధావులు. ఏదైనా అంశాన్ని తెలుసుకోవడానికి, క్రమపద్ధతిలో అర్థం చేసుకోవడానికి నేను చాలా అవస్థ పడతాను. సొహ్రాబుద్దీన్ కేసు చాలా ఏళ్లుగా అప్పుడప్పుడు చదువుతూ వచ్చాను. అతను టెర్రరిస్టు అని చాలా ప్రచారం జరిగింది. 2007 ఎన్నికల సభల్లో మోదీ సొహ్రాబుద్దీన్ వంటి టెర్రరిస్టులను ఏం చేయాలి? అని జనాల్ని అడగడం, 'చంపేయాలి, చంపేయాలి' అని మూకుమ్మడిగా కేకలు పెట్టడం పేపర్లలో చదివాను. హిందూ రక్షకుడైన మోదీని చంపడానికి వచ్చిన ముస్లిం ఉగ్రవాది అన్నారు, తర్వాత కొన్ని రిపోర్టులు చూస్తే అతను పోలీసు రక్షణలో బతికే గూండా అని వుంది. అలాగే ఫేక్ ఎన్‌కౌంటర్ అని గుజరాత్ పోలీసులే ఒప్పేసుకోవడం నాకు బోధపడలేదు. చివరకు యీ కథనం చదివాక అన్ని విషయాలూ తెలిశాయి. అయితే అన్నీ యీజీగా అర్థం కావు. కొంత సమాచారం మెయిన్ స్టోరీలో వుంటుంది, కొంత బాక్సుల్లో, మరి కొంత ఇంటర్వ్యూలలో.. కథనం కూడా సాఫీగా వుండదు. ఫ్లాష్‌బ్యాక్‌లో, ఫ్లాష్ ఫార్వార్డ్‌లో గెంతుతూ వుంటుంది. చిన్నప్పటినుంచి లెక్కల మేస్టారు స్టెప్పులో, స్టెప్పులో అని చంపడం వలన అన్నీ వరుసగా తారీకుల వారీగా వేసుకుంటే తప్ప నాకు రీజనింగ్ అర్థం కాదు. అప్పుడు చచ్చీచెడి, చెమటోడ్చి పాఠకుడికి అర్థమయ్యే భాషలో చెప్పడానికి తంటాలు పడతాను. కానీ కొందరు పాఠకులున్నారే, వాళ్లకు నేనేం రాయబోతానో ముందే తెలిసిపోతుంది. మొదటి భాగం చదవగానే నేను మూడు భాగాలు రాస్తానో, ముప్ఫయి భాగాలు రాస్తానో తెలియకుండానే ఆఖరి భాగంలో ఏమిటుంటుందో, దాని వెనక నా ఉద్దేశం ఏమిటో యిట్టే కనిపెట్టేస్తారు. మా కజిన్ వున్నాడు. అనూరాధా ప్రొడక్షన్స్ వారి మూడో చిత్రం ప్రారంభం అనే వార్త పేపర్లో రాగానే 'ఇది ఫ్లాపరా' అనేవాడు. తారాగణం, సాంకేతిక నిపుణుల గురించి ఏమీ తెలియకుండానే అప్పుడే ఎలా చెప్పగలవ్ అంటే అదంతే అనేవాడు. మళ్లీ అంత మేధస్సు వున్న పాఠకులు యిన్నాళ్లకు తగిలారు. హెడింగ్‌కు, లోపలి సబ్జక్టుకు సంబంధం లేదని మొదటి భాగం చదవగానే చెప్పేయగలుగుతున్నారు. నేను చెప్పినది వాస్తవం కాదని ఖండిస్తే అదో పద్ధతి. ఆ ప్రయత్నం చేయరు.

వీళ్లు చదవగానే.. అని మాటవరసకి అన్నాను కానీ, వాళ్లు చదవనక్కరలేకుండానే అన్నీ గ్రహించేస్తారు. మొదటి భాగంలోనే నేను ఇందిర గురించి రాసి, యిటీవలి కాలంలో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకే ప్రభుత్వాలు అనేక కుంభకోణాలపై విచారణలు యిష్టం లేకపోయినా చేపట్టవలసి వచ్చింది అని కూడా రాశాను. అది వీళ్ల కంటికి ఆనలేదు. యుపిఏ గురించి ఏమీ రాయలేదట. ఎనిమిదేళ్లగా కాలమ్ రన్ చేస్తున్నవాణ్ని యుపిఏ గురించి రాయకుండా మోదీ గురించే రాస్తూ వచ్చానా యిన్నాళ్లూ!? అయినా యిది రాజకీయ

వ్యవస్థ న్యాయవ్యవస్థను లొంగదీసుకునే ప్రయత్నం. సొహ్రాబుద్దీన్ గూండా అయినా ఎన్‌కౌంటర్ చేసే హక్కు నాయకుల కుందా? మరి సొహ్రాబుద్దీన్ భార్య తప్పేమిటి? ఆమెను చంపినా తప్పు లేదా? ఇక్కడ జరుగుతున్నదేమిటి? రాజకీయనాయకులు పోలీసుల ద్వారా, గూండాల ద్వారా వ్యాపారస్తులను బెదిరించి డబ్బు లాగడం. అన్ని రాష్ట్రాలలో వేర్వేరు స్థాయిల్లో జరుగుతోంది. అమిత్ షా హిందూత్వవాది కాబట్టి దాన్ని సమర్థించాలా? రేపు యుపిలో ఆజం ఖాన్ యిదే పని చేస్తే..? ఒవైసీ యిదే పని చేస్తే...? అప్పుడూ సమర్థిస్తారా? **– (సమాప్తం) ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2015)**

**మే 01** **ఎమ్బీయస్ : సల్మాన్ కేసులో బొంబాయి హైకోర్టు తీరు**

సల్మాన్‌కు ప్రస్తుతానికి జైలు తప్పిస్తూ హైకోర్టు వ్యవహరించిన తీరు అతని అభిమానులను ఆనందపరిస్తే, సామాన్యులను నివ్వెరపరిచింది. వారం, పదిరోజుల బెయిలు కాదు, కేసు విచారణను జూన్ 15కు వాయిదా వేసి అప్పటిదాకా బెయిలుట! అంతేకాదు, జడ్జిగారు వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేశారు. ఎన్నో ఒత్తిళ్లు తట్టుకుని సెషన్స్ కోర్టు జడ్జి ఐదేళ్ల శిక్ష వేస్తే (పదేళ్ల దాకా వేసే అవకాశం వుంది) 'అప్పీలుపై విచారణ జరిగి నిర్ణయం తీసుకునే వరకూ అతణ్ని జైల్లో వుంచాల్సిన కేసు కాదిది..'' అనేశారు హైకోర్టు జడ్జి. పన్నెండున్నరేళ్లపాటు విచారించి, వెలువరించిన 240 పేజీల తీర్పును యీ జడ్జిగారు ఎప్పుడు చదివారో ఏమో? సల్మాన్ కారు తోలినంత వేగంగా చదివి వుంటారు. బుధవారం నాడు కింది కోర్టు తీర్పు వెలువడింది. సాయంత్రానికే హైకోర్టు రెండు రోజుల బెయిలు యిచ్చింది. రెండు రోజులయ్యేసరికి యిదిగో ఐదువారాల బెయిలు యిచ్చేసింది. ఈ కేసు విషయంలో సల్మాన్ ప్రవర్తన గమనించినవారికి యీ బెయిలుకు అతను తగినవాడా కాదా అన్నది సులభంగానే తోస్తుంది. అతనికి డ్రైవింగు లైసెన్సు లేదు, తప్ప తాగాడు, డ్రైవింగు సీటులో కూర్చుని నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదానికి కారకుడయ్యాడు. ఇది ప్రాసిక్యూషన్ వాదం. అది తప్పు అని డిఫెన్సువారు వాదించారు, సహజం. అతను డ్రైవింగు సీటులో లేడంటారు వారు. అదే నిజమైనా ప్రమాదం జరిగిన తర్వాత అతను పారిపోవడమేమిటి? తన డ్రైవరు కొందరు మనుష్యులపై బండి పోనిచ్చేస్తే పోలీసులకు ఫోన్ చేసి తెలియపరచవద్దా? క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే ఏర్పాటు చూడవద్దా? కేసు నడుస్తూండగా ఎన్ని రకాల వింత వాదనలు చేస్తూ, స్టేటుమెంట్లు మారుస్తూ పోయాడో చూడండి. అతని వ్యక్తిగతమైన అలవాట్లు పక్కన పెడదాం, కానీ చట్టం పట్ల అతని నిర్లక్ష్యం వన్యమృగాల వేట కేసు విషయంలో స్పష్టమైంది కదా.

ఇటువంటి వాడి హక్కుల గురించి జడ్జిగారు ఫీలై పోతున్నారు. అప్పీలు పిటిషన్‌ను అనుమతించి, పెండింగులో వుంచిన తర్వాత, ఆయన హక్కులకు భంగం కలిగించడం ఎందుకు? అని ప్రశ్నిస్తున్నారు. మరి చనిపోయిన, గాయపడిన వారి హక్కుల మాటేమిటి? ఫుట్‌పాత్‌ల మీద పడుక్కునే వారికి హక్కులుండవు అని సల్మాన్ అభిమానులు ట్వీటవచ్చు. ఫుట్‌పాత్‌లపై వాహనాలు నడిపే హక్కు వుందా? సమయానికి డ్రైవరు లేడు, ఎవరో కిడ్నాపర్‌ను లేదా హంతకుణ్ని పట్టుకోవడానికి వేగంగా వెళుతూంటే అనుకోకుండా ప్రమాదం జరిగింది అనేందుకు లేదు. డ్రైవరు వున్నాడు, తను తాగి వున్నాడు, డ్రైవరును తప్పుకోమని తాను స్టీరింగు పట్టుకున్నాడు. వేగంగా బండి తోలాడు. ఎందుకు? అదొక వేడుక! హైదరాబాదులో ఓఆర్‌ఆర్‌పై మోటారుసైకిళ్ల పందాలు వేసుకునే డబ్బున్న కుర్రాళ్ల తరహాలో ఒక ఎడ్వెంచర్! ఓఆర్‌ఆర్ ఖాళీగా వుంటుంది, వాళ్లు కూడా ఎవరూ లేని పొద్దున్న సమయాన్ని ఎంచుకుంటారు. ఇక్కడ సల్మాన్ అర్ధరాత్రి సాహసానికి దిగాడు. బొంబాయి నగరవీధుల సంగతి అతనికి తెలియనిది కాదు. అక్కడే పుట్టి పెరిగాడు. అతని సహనటులు కొందరు అలా పేవ్‌మెంట్లపై పడుక్కునే పైకి వచ్చారు. కానీ విజయమో, వీరస్వర్గమో అన్న థీమ్‌తో సల్మాన్ స్టీరింగు పట్టాడు. పూటుగా తాగి, తోలి, క్షేమంగా యిల్లు చేరగలిగితే సల్మాన్‌కు విజయమన్నమాట, మధ్యలో ప్రమాదం జరిగితే అవతలివాళ్లకు వీరస్వర్గమన్నమాట! చచ్చిపోయిన పేదల పట్ల సల్మాన్‌కు వ్యక్తిగతమైన కక్ష లేదు... నిజమే, జాలీ లేదు. ఆ తర్వాత పశ్చాత్తాపమూ లేదు. నాగయ్యగారు సినిమా హీరో అయ్యాక కారు కొని వేగంగా నడిపేవారు. ఓ రోజు బీచ్ రోడ్డులో ఓ కుక్క కారు కింద పడింది. ఒక ప్రాణి ఉసురు తీశాను, నాకు డ్రైవింగు చేసే అర్హత లేదు అనుకుని పశ్చాత్తాపపడి అప్పణ్నుంచి డ్రైవింగు జోలికి వెళ్లలేదు. ఆయనపై ఏ న్యాయస్థానమూ కేసు పెట్టలేదు. అయినా తనకు తానే శిక్ష వేసుకున్నాడాయన.

సల్మాన్ మళ్లీ డ్రైవింగు చేశాడో లేదో మనకు తెలియదు, కానీ తాగుడు మాత్రం మానలేదు. మద్యం వలన జరిగిన అనర్థమిది అని గుర్తించి, మద్యపానం మానేసి, దాని గురించి వుచితంగా ప్రచారం చేసి వుంటే అది ఒక పద్ధతి. ప్రచారం చేస్తే తప్పు ఒప్పేసుకున్నట్లవుతుంది అనుకుంటే కనీసం మానేసి వూరుకోవలసినది. ''మేయర్ ఆఫ్ కేస్టర్‌బ్రిజ్'' అని థామస్ హార్డీ నవల వుంది. డబ్బులేని ఒక తాగుబోతు, తాగుడు మైకంలో తన భార్యను, కూతుర్ని యింకోడికి అతి తక్కువ మొత్తానికి అమ్మేస్తాడు. మైకం దిగాక తన తప్పు గ్రహించి పశ్చాత్తాప పడతాడు. అప్పుడు తన వయసు 21 కాబట్టి, మరొక 21 ఏళ్లు మద్యానికి దూరంగా వుంటానని ప్రతిజ్ఞ చేస్తాడు. ఆ తర్వాత కష్టపడి పైకి వచ్చి, పేరు సంపాదించి కేస్టర్‌బ్రిజ్ అనే వూరికి మేయరు కూడా అవుతాడు. కానీ గతం తాలూకు నీడలు అతన్ని వెంటాడుతూనే వుంటాయి. ఇంకో అమ్మాయిని ప్రేమిస్తాడు, పెళ్లాడదామంటే పాతభార్యతో చట్టపరంగా విడాకులు తీసుకోలేదు, ఆ విషయం బయటకు వస్తే మానహాని. ఇలా సతమతమై జీవితం చిందరవందర అవుతుంది. ఒక రాత్రి మద్యపానం అతని జీవితాన్ని కలకాలం వేధిస్తుంది. తప్పు చేస్తే చట్టం నుండి తప్పించుకోలేరు అనే నీతినే ''లే మిజెహాబ్లా'' (ద

మిజరబుల్స్) అనే ఫ్రెంచ్ నవల చెపుతుంది. విక్టర్ హ్యూగో రాసిన యీ నవలను తెలుగులో "బీదలపాట్లు" పేరుతో రెండు సార్లు తీశారు. (దాని తమిళ వెర్షన్ "ఏళై పడుం పాటు" ను కాస్త ఆధునీకరించి కొన్నాళ్లకు "జ్ఞాన ఒళి" అనే పేరుతో తమిళంలో శివాజీతో తీశారు). పేదగా వుండగా చేసిన దొంగతనం చిన్నదే, కానీ చట్టం వెంటాడుతుంది – డబ్బు సంపాదించి, పేరు, వేషం మార్చుకుని పెద్దమనిషిగా అవతరించినా! జావర్ అనే పోలీసు అధికారి యీ కేసును వదిలిపెట్టడు, ఎన్ని మంచిపనులు చేసినా కడకు హీరోకు శిక్ష పడేట్లా చేస్తాడు.

సల్మాన్ మారిపోయాడు, వారెవరికో విరాళాలు యిచ్చాడు, కేసు కొట్టేయాలి అని సోషల్ మీడియాలో అడావుడి చేసేవారు గాలి జనార్దనరెడ్డి గురించి కూడా యిలాగే ఫీలవుతారా? వెంకటేశ్వరస్వామికి కిరీటం యిచ్చాడు కాబట్టి గనులు దోచినా వదిలేయాలి అంటారా? నా బోటి వాడు ఇన్‌కమ్‌టాక్సు కట్టడం మానేసి, ఆ డబ్బుతో ఆసుపత్రిలో రోగులకు రొట్టెముక్కలు పంచుతానంటే ఒప్పుకుంటారా? దేని దారి దానిదే! ధర్మరాజు ధర్మమూర్తి, స్వర్గానికి తీసుకెళ్లబోయే ముందు నరకం చూపించి, దానిలో వాళ్ల తమ్ముళ్లు నరకబాధలు పడుతున్నట్లు భ్రమ కల్పించి మనక్షోభ కలిగించారు. అదేమంటే అబద్ధంలా తోచే నిజం – అశ్వత్థామ హతః కుంజరః – చెప్పావు కాబట్టి అన్నారు. ఒక ఋషి చిన్న పిల్లాడిగా వుండగా వేడుక కోసం తుమ్మెదలకు ముళ్లు గుచ్చేడట. శూలశిక్ష పడింది. ఇదేమిటి? అంటే చిన్నప్పుడు చేసినదానికి... అన్నాడు యమధర్మరాజు. 'బాల్యంలో తెలిసీ తెలియక చేసినదానికి యింత శిక్షా? నీకు శాపం యిస్తున్నా' అన్నాడు ఋషి. శాపం యిస్తే యియ్యి కానీ శిక్ష తప్పదు, తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పు తప్పే! అన్నాట్ట ఆ సమవర్తి. ఇది భారతీయ సంస్కృతి. మరి న్యాయాధీశులు యివన్నీ చదివి తీర్పిస్తారో, లేక యిష్టాయిష్టాల బట్టి యిస్తారో తెలియదు. పురాణాల సంగతి వదిలేయండి, ఈ నేటి సమాజంలో కూడా ఉద్యోగి 40 ఏళ్ల సర్వీసులో సంస్థకు ఎన్ని లాభాలైనా చేకూర్చవచ్చు, ఒక్క ఖాతా విషయంలో చిన్న పొరపాటు జరిగినా చట్టప్రకారం శిక్ష తప్పదు. దానికీ, దీనికీ ముడిపెట్టరు. సత్యం రామలింగరాజు కేసులో ఏమైంది? ఎంతోమందికి ఉద్యోగాలిచ్చారు, భారత ఐటీ రంగానికి ప్రతిష్ట తెచ్చారు, అయితే మాత్రం జైల్లో కూర్చోబెట్టలేదా? సల్మాన్ విషయంలో బెయిల్ యిచ్చినంత మాత్రాన ఆయన పారిపోతాడా? అంటున్నాడు యీ జడ్జిగారు. రామలింగరాజు మాత్రం పారిపోతాడా? విదేశాల్లో సగం షూటింగు చేశాం, మిగతా సగం పూర్తి చేయకపోతే సినిమా నాశనమై పోతుంది, దానిపై ఆధారపడిన వందలాది కుటుంబాలు రోడ్డున పడతాయి అంటూ సల్మాన్ సినిమా నిర్మాత రేపు అనుమతికై అభ్యర్థించవచ్చు, యిలాటి జడ్జి అనుమతి దయచేయించవచ్చు కూడా. ఇలాటి బెనిఫిట్ లక్షలాది కేసుల్లో నిరాకరిస్తున్నారు, సల్మాన్‌కు ఎందుకు మినహాయింపు?

బయట వుంటే సాక్షులను ప్రభావితం చేస్తారు అంటూ రామలింగరాజును లోపల కూర్చోపెట్టారు – ఆయనే నేరం ఒప్పేసుకుని బయటపెట్టినా! మరి సల్మాన్ ఆ పని చేయడన్న గ్యారంటీ వుందా? కేసులో కీలకసాక్షి రవీంద్ర పాటిల్ సంగతేమైందో చూడండి. అతను మహారాష్ట్ర ప్రభుత్వం తరఫున సల్మాన్‌కు బాడీగార్డు. ప్రమాదం జరగగానే సల్మాన్ పారిపోగా, బాధ్యత గుర్తెరిగి పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేసినవాడు. ఉన్నదున్నట్టు చెప్పి ఆపదలు తెచ్చుకున్నాడు. సల్మాన్ తరఫు న్యాయవాదులు అతన్ని అనేక రకాలుగా ఒత్తిడి చేసి పిచ్చెక్కించారు. ప్రభుత్వం అతని ఉద్యోగం పీకేసింది. అతను ముంబయి విడిచి వెళ్లిపోయాడు. న్యాయవాదులకు భయపడి కోర్టుకి సరిగా రాకపోతే, కోర్టు జైలుకి పంపింది. చివరకు బిచ్చగాడిగా మారి, మద్యానికి బానిసై, క్షయ వ్యాధితో చచ్చిపోయాడు. సల్మాన్ డ్రైవరు కూడా సాక్ష్యం మార్చాడు. సల్మాన్‌కున్న వీర ఫాలోయింగ్ చూసి, అతను ఎవరినైనా కాల్చినా, కోసినా, నంజుకు తిన్నా తప్పు లేదు అని వీరంగం వేస్తున్న అభిమానుల సందడి చూస్తే ఏ సాక్షికైనా నోరు పెగలదు.

సినిమా పరిశ్రమలో అతని పక్షాన కాకుండా న్యాయం పక్షాన మాట్లాడిన వారెవరైనా వున్నారా? సినిమా పరిశ్రమకు యితను చేసిన ఉద్ధరింపు ఏమిటి? తన సహనటి అయిన ఐశ్వర్యా రైతో అతను ఫోన్‌లో ఎంత తీరుగా మాట్లాడాడో నీరా రాడియా టేపుల్లో తెలిసింది. జింకలను వేటాడిన మదం, మనుష్యులపైకి కారు పోనిచ్చిన నిర్లక్ష్యం, పొగరు, దబాయింపు – ఏమీ తగ్గలేదని ఆ టేపులు చెపుతున్నాయి. మరి ఎందుకు సినిమావాళ్లంతా అతని యింటికి క్యూలు కడుతున్నారు? అతను హీరో కాబట్టి! అదే ఒక చిన్న హీరో అయితే, మాజీ హీరో అయితే, ఫ్లాప్ హీరో అయితే పట్టించుకునేవారా? సల్మాన్ సినిమాలు యింకా ఆడుతున్నాయి కాబట్టి సినీరంగం, నిర్మాతలు, నిర్మాతల వెనక వున్న ఫైనాన్షియర్లు, కార్పోరేట్లు, వారికి దన్నుగా నిలిచే రాజకీయ నాయకులు మద్దతుగా నిలబడ్డారు. ఈ హంగామా అంతా చూసి జడ్జిగారు తడబడి వుండవచ్చు. హైకోర్టులో అప్పీలు విచారణ సమయంలో ఏదైనా జరగవచ్చు. అమిత్ షా కేసు యితీవలే చూశాం. కానీ యీ లోపున బెయిలు యివ్వడమే ఆశ్చర్యకరం. అతను ఒక్కరోజు కూడా జైలుకి వెళ్లకూడదని కొన్ని వర్గాలు పట్టుదలతో వున్నట్టున్నాయి. బలరాజ్ సహానీ అనే హిందీ సినిమా నటుడు మంచి కారెక్టరు యాక్టరే కాక, వామపక్షవాది కూడా. కార్మికోద్యమంలో, ఇప్టా అనే ప్రగతిశీల కళాకారుల సంఘంలో చురుగ్గా పాల్గొనేవాడు. దాని కారణంగా ప్రభుత్వం కేసులు పెట్టి జైల్లో పెట్టింది. షూటింగు వున్న రోజుల్లో ఆయన పోలీసు ఎస్కార్ట్‌తో స్పాట్‌కు వచ్చి నటించి మళ్లీ జైలుకి వెళ్లేవాడు.

సల్మాన్ విషయంలో కూడా సొంతం బెయిలు యిచ్చే బదులు, యిలాటి వెసులుబాటు యిచ్చి అతను ప్రస్తుతం కమిట్ అయిన సినిమాల పూర్తికి కోర్టు సహకరించవచ్చు. కానీ అలా చేయకపోవడంతో సల్మాన్ జైలుకి వెళ్లడు అనే ధీమాతో యీ విరామంలో అనేకమంది నిర్మాతలు కొత్త ఆఫర్లతో అతని వద్దకు రావచ్చు. ఈ కేసు అంతిమంగా ఏమౌతుందో వేచి చూడాలి. ఈ లోపున మాత్రం తోస్తున్నదేమిటంటే – నువ్వు ఒక మంచి నటుడవై, నీ సినిమాలు హిట్ అవుతూ వుంటే చాలు, ఏం చేసినా చెల్లిపోతుంది. మరి యీ

సూత్రం సంజయ్ దత్ విషయంలో ఎందుకు వర్తించలేదు? అని అడిగితే యిప్పుడే సమాధానం చెప్పడం కష్టం. దాన్నీ చాలా ఏళ్లు లాగారు. చివరకు లోపలకి పంపారు, అయినా మాటిమాటికీ ఏదో కారణం చెప్పి పెరోల్‌మీద బయటకు వచ్చేస్తున్నాడు. ఈ పోలిక వస్తుందనే భయం కూడా సల్మాన్‌కు వుందని కాబోలు యీ మధ్య కోర్టులో అసందర్భంగా తను 'హిందూ–ముస్లిం' అని చెప్పుకున్నాడు. తల్లి హిందువు, తండ్రి ముస్లిం అని అర్జంటుగా గుర్తు చేశాడు. సంజయ్ విషయంలో దీనికి విపర్యంగా తల్లి ముస్లిం, తండ్రి హిందువు. క్రిమినల్ కేసుల్లో కూడా క్షేత్రప్రధానమా? బీజప్రధానమా అనేది కూడా చర్చనీయాంశం అవుతుందని నేనెన్నడూ వూహించలేదు. దేశంలో చాలా వింతలు జరుగుతున్నాయి. వాటిలో యిదీ ఒకటిలా వుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2015)**

**మే 03** **ఎమ్బీయస్ : పంద్రాగస్టా? గాంధీ జయంతా?**

ఆగస్టు 15, జనవరి 26, గాంధీ జయంతి యిలాటి తారీకుల గురించి జైల్లోని ఖైదీలు ఆత్రుతగా ఎదురుచూస్తారు. అదేదో దేశభక్తి వలన అనుకోకండి. సత్ప్రవర్తనకు మెచ్చి శిక్ష తగ్గించి జైల్లోంచి వదిలిపెట్టే ఖైదీల జాబితాలో తమ పేరు వుంటుందేమోనని వాళ్ల ఆశ. ఇప్పుడు ముద్దాయిల విషయంలో దేశంలో యిలాటి పండగేదో నడుస్తోంది. కోర్టులు వారి విషయంలో అతి వుదారంగా వుంటున్నాయి. మీమీద ఏదైనా కేసు నడుస్తూ వుంటే యిదే సీజనులో అది అర్జంటుగా విచారణకు రావాలని దేవుణ్ని కోరుకోండి. ఎటొచ్చీ మీకు రాజకీయంగానో, మరో రకంగానో పలుకుబడి వుండాలి. మీరు జైల్లోంచి బయటకు రావాలనో, అసలు వెళ్లనే కూడదనో మందిరాల్లో, మసీదుల్లో మొక్కుబడులు పెట్టుకునేవారు, పొర్లు దణ్ణాలు పెట్టేవారు, గుండు గీయించుకునేవారు, మట్టి కలిపిన అన్నం తినేవాళ్లు, ఆత్మహత్యలు చేసుకునేవారు, సోషల్ మీడియాలో హల్‌చల్ చేసేవారు, లైక్స్ మీద లైక్స్ కొట్టేవారు మీ వెనక ఎంతమంది వుంటే దేవుడు అంత బాగా మీ ప్రార్థన వింటాడు.

అవాక్కయ్యారా? అని అడుగుతుంది ఓ ప్రకటన. ఇవాళ్టి పరిస్థితి గురించి మరొక స్లోగన్ ఏదైనా కాయిన్ చేయాలి. ఎందుకంటే షాకు మీద షాకు! జయలలితపై కేసు కొట్టేశారు. కాస్సేపటికే రామలింగరాజు, సోదరులకు కేవలం లక్ష రూపాయల పూచీకత్తుపై బెయిల్ యిచ్చి పడేశారు, వారిపై వేసిన ఏడేళ్ల కఠిన శిక్ష తీర్పు అమలు కాకుండా బ్రేక్ వేశారు. జయలలిత కేసులో తీర్పుపాఠం పూర్తిగా చదవకుండా ఏమీ వ్యాఖ్యానించకూడదు, నిజమే. కానీ పైపైన కనబడుతున్నదేమిటి? 18 ఏళ్లగా నడుస్తున్న కేసు అది. స్పెషల్ జడ్జి సెప్టెంబరులో నాలుగేళ్ల శిక్ష వేశాడు. పదేళ్లదాకా పదవిలో వుండకూడదన్నాడు. రూ.100 కోట్ల ఫైన్ వేశాడు. పది రోజులు పోయాక బెయిల్ అడిగితే కర్ణాటక హైకోర్టు కేసు తీవ్రత కారణంగా యివ్వడానికి వీల్లేదంది. జయలలిత సుప్రీం కోర్టుకి వెళ్లి ఆర్డరు తెచ్చుకుని 21 రోజుల్లో జైల్లోంచి బయటకు వచ్చింది. ఇప్పుడు అదే కర్ణాటక హైకోర్టు 8 నెలల తర్వాత అన్ని కేసులూ కొట్టేసింది. కింద కోర్టు తీర్పులను పై కోర్టులు సవరించడం మామూలే. హై కోర్టు మరణశిక్ష వేస్తే సుప్రీం కోర్టు దాన్ని యావజ్జీవంగా మారుస్తూండడం చూస్తూ వుంటాం. అలాటి ఆశలతోనే కష్టనష్టాల కోర్చి పైకోర్టుకి అప్పీలు చేస్తారు. కానీ యీ కేసు విషయంలో మొత్తం కేసు ఒక్కసారిగా దూదిపింజలా ఎగిరిపోయింది.

తన అక్రమాస్తుల గురించి ఎవరికీ సందేహాలు లేకుండా చేసుకుంది – జయలలిత! దత్తపుత్రుడి వివాహం ఆకాశమంత పందిరి వేసి, భూలోకమంత పీటలు వేసి జరిపించి తన వైభవాన్ని చాటింది. ఆ డోసు చాలదనుకున్న రుణానిధి తను అధికారంలో వుండగా జయలలిత యింటిపైకి వీడియో టీమును పంపి ఆవిడ కున్న చెప్పుల సంఖ్య, చీర్ల సంఖ్య అన్నీ మాయాబజారు సీన్లలా సన్ టీవీలో చూపించాడు. రాజకీయాల్లోకి రావడానికి ముందు జయలలిత సినిమా కెరియరంతా ముగిసిపోయిందని, మిగిలిన డబ్బును ఓ తెలుగు హీరోని నమ్మి పోగొట్టుకుందని లోకవిదితం. పోయెస్ గార్డెన్‌లో యిల్లు తప్ప ఏమీ మిగలని పరిస్థితిలో ఎమ్జీయార్ ఆమెపై జాలి పడి రాజకీయాల్లోకి తెచ్చాడని కూడా అందరికీ తెలుసు. తర్వాతి రోజుల్లో ఆమె అధికారంలోకి వచ్చాక అవినీతి జడలు విరబోసుకుని నర్తించిందని కూడా ఆనాటి కేసులు చెప్పాయి. ప్రభుత్వ ఆఫీసుల అమ్మకాన్ని అడ్డుకున్న మహిళా ఐయేయస్ అధికారిణిపై ఆసిడ్ దాడుల దగ్గర్నుంచి రకరకాల వికృత చేష్టలు జరగడం చేతనే, జయలలిత అధికారం పోగొట్టుకుంది. ఓపెన్ అండ్ షట్ కేసుగా అభివర్ణించదగిన యిలాటి కేసులో కింది కోర్టు తీర్పుపై పైకోర్టు కాస్త వెసులుబాటు యిస్తుందని అనుకోవడం సహజం. కానీ జరిగినదేమిటి? మొత్తం కొట్టి పారేశారు.

ఎందుకిలా? అంటే ఎవరి వూహాగానాలు వారివి. జయలలిత అంటే మోదీకి ప్రత్యేక అభిమానమనీ, రాజ్యసభలో మెజారిటీ తెచ్చుకోవడానికి ఎడిఎంకె మద్దతు అవసరం కాబట్టి జయలలితకు మేలు చేయాలని కోరుకుంటున్నారనీ, అందుకే అరుణ్ జైట్లీ మూడుసార్లు వెళ్లి జయలలితను కలిశారనీ అంటున్నారు. కరుణానిధి భావాలకు, మోదీ భావాలకు చుక్కెదురు. అందువలన తమిళనాడులో పట్టుకోసం మోదీ జయలలితను దువ్వవచ్చు, ఆశ్చర్యం లేదు. అందుకే సాటి బిజెపి నాయకుడు సుబ్రహ్మణ్యం స్వామి వేసిన కేసులో ముద్దాయి జయలలితకు ఊరట లభిస్తే మోదీ కంగ్రాట్స్ చెపుతూ ఫోన్ చేశారు, ఫిబ్రవరిలో పుట్టినరోజు నాడు శుభాకాంక్షలు చెపుతూ ట్వీట్ చేశారు. తను ప్రధాని, ఆమె మాజీ మరియు భావి ముఖ్యమంత్రి కాబట్టి సమాఖ్యస్ఫూర్తితో చేశారని సర్ది చెప్పుకుంటే చెప్పుకోవచ్చు. కానీ సుబ్రహ్మణ్యం స్వామి యీ తీర్పుపై సుప్రీం కోర్టుకి అప్పీలుకి వెళ్లినపుడు అక్కడి జడ్జిపై మోదీ వ్యాఖ్యల, అభినందనల ప్రభావం వుండదంటారా? అఫ్‌కోర్సు, థియరీ ప్రకారం ప్రధానిని సైతం కోర్టు జడ్జి మందలించవచ్చు, కానీ అలా

ఎంతమంది వ్యవహరిస్తున్నారు? జడ్జిల యిళ్లల్లో పెళ్లిళ్లకు రాజకీయనాయకులు హాజరవుతున్నారు, జడ్జిలు కుటుంబసమేతంగా గుడికి వెళితే మర్నాడు మీడియా అధినేతలు అదో పెద్ద న్యూస్‌లా ప్రచారం కల్పిస్తున్నారు. తమకు ఉచిత పబ్లిసిటీ యిచ్చిన పత్రికాధిపతులపై కఠినంగా వుండడం కష్టమే కదా! జడ్జిలు పాతకాలంలోలా మడి కట్టుకుని అసింటా అసింటా అనటం లేదు, జనజీవన స్రవంతిలో యీదులాడుతున్నారు. అందుకే మొహమాటాలు పెరుగుతున్నాయి, అదే నిష్పత్తిలో 'నాట్ బిఫోర్ మీ'లు వాడేసుకుంటున్నారు.

మోదీకి రాజకీయ అవసరాలుండవచ్చు, వ్యక్తిగత అభిమానాలు వుండవచ్చు, కానీ వాటికీ కోర్టు తీర్పుకి సంబంధం ఏమిటి? అని వాదించవచ్చు. సంబంధం వుంది అనేవాణ్ని కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కింద కేసు పెట్టి వేధించవచ్చు. అందుచేత యిది కాకతాళీయం అనుకుని సరిపెట్టుకోవాలి. ఇలా వారానికి ఓ కాకతాళీయం, యివాళ్టిలా రోజుకి రెండు కాకతాళీయాలు జరుగుతూ వుంటే కాకిలోనైనా పొరపాటుండాలి, తాళఫలంలోనైనా పొరపాటుండాలి, వాటిని మనం గమనించే తీరులోనైనా పొరపాటుండాలి. సరిగ్గా గమనించినవారిలో మాత్రం జ్ఞానజ్యోతి వెలుగుతుంది, ముందుచూపు కలుగుతుంది. అధికారంలో వున్నవారే అక్రమాస్తుల కేసులో తప్పించుకోగలిగినప్పుడు, అధికారంలో వున్న వారి కుటుంబసభ్యులపై క్విడ్ ప్రో కేసులు నిలుస్తాయా? పదవీ దుర్వినియోగం అనే మాట అక్కడ అన్వయించదు కదా, ముఖ్యమంత్రి అవినీతిపరుడైతే అతని కొడుకుపై కేసు పెట్టగలరా? పెడితే నిలుస్తుందా? ఇక గట్టిగా నిలిచే కేసులేమిటయ్యా అంటే ఆర్థిక నేరాల కేసులు. అవి ఎలా నడుస్తున్నాయో సత్యం రామలింగరాజు కేసు చెపుతోంది. అంతర్జాతీయంగా సంస్థలను, ఆర్థిక సంస్థలను మోసగించానని ఒప్పుకున్నాక కూడా, ఏడేళ్ల శిక్ష మాత్రమే పడితే యివాళ అది కూడా కోల్డ్ స్టోరేజికి వెళ్లింది. లక్ష రూపాయల పూచీకత్తు చాలట, వేసిన జరిమానాలో (సోదరులిద్దరికి కలిపి 5 కోట్ల చిల్లర) పదోవంతు కడితే చాలట. (సత్యాన్ని తిరగేసి మేతవేసిన నా వంటి కోటకోటీశ్వరుడికి ఇంత తక్కువ విలువ కడతారా అని రామలింగరాజుగారు అవమానంగా ఫీలవ్వాలి). కేసులు ధూళిరేణువుల్లా ఎగిరిపోతున్న యీ సీజన్‌లో తన కేసు కూడా చప్పున విచారణకు వస్తే మంచిదని జగన్ ఆశిస్తే ఆశ్చర్యం వుందా? ఈ లోపున బిజెపికి, మోదీకి వ్యతిరేకంగా జగన్ ఏమీ మాట్లాడటం లేదని ఫిర్యాదు చేసి లాభమేముంది?
**– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2015)**

## మే 04-05 ఎమ్బీయస్ : భారీ సంక్షేమ పథకాల వలన ప్రయోజనం

సంక్షేమ పథకాలు వుండాలా అక్కరలేదా అనేది మనబోటి వాళ్లందరినీ కలవరపెట్టే ప్రశ్న. పేదవాడికి చేపను పట్టి యిచ్చే బదులు, చేపలు పట్టే విద్య నేర్పించి వదిలేస్తే అతని బతుకు అతనే బతుకుతాడు కదా అనేది అందరూ ఒప్పుకోవాల్సిన సత్యం. అయితే గేలం పట్టుకునే ఓపిక కూడా లేనివాడి సంగతేమిటి? అందువలన వాడికి కాస్త తిండి పెట్టి, పాఠాలు చెపితే వినే ఓపిక కలిగేట్లా చేసి అప్పుడు చేపలు పట్టడమో, వలలు అల్లడమో నేర్పించాలి. సంక్షేమ పథకాలను విమర్శించేవారికి ఎన్టీయార్ యిలాటి సమాధానమే చెప్పేవారు. దీర్ఘకాలిక పథకాల ద్వారా రేపు స్వర్ణమయం చేసినా, ఆ రేపు చూడడానికి యివాళ యితడు బతికుండాలి కదా అని వాదించేవారు. అందుకే కిలో రెండు రూపాయల బియ్యం అన్నారు. దాన్ని ఎద్దేవా చేసినవారే తర్వాత తర్వాత ఓపెన్ మార్కెట్లో బియ్యం ధర విపరీతంగా పెరిగినా, 20 ఏళ్ల తర్వాత కూడా కిలో రెండుకి, ఒక రూపాయికి కూడా యిచ్చి ఆ లాజిక్‌ను ధ్వంసం చేశారు. 1983లో రెండు రూపాయలకిచ్చారంటే 20 ఏళ్ల తర్వాత 20 రూపాయల కిచ్చినా తక్కువకు యిచ్చినట్లే కదా! అది తోచలేదు పాలకులకు. సంక్షేమ పథకాల పేర పెళ్లి మేమే చేస్తాం, యిల్లు మేమే కట్టిస్తాం, దాంట్లో కలర్ టీవీ మేమే పెట్టిస్తాం, దానికి కేబుల్ కనెక్షన్ ఉచితంగా యిస్తాం, మీ పిల్లలను బళ్లకు పంపితే మేమే తిండి పెడతాం.. యిలా ఒకరిని మించి మరొకరు పథకాలు పెట్టి ప్రణాళికేతర వ్యయం విపరీతంగా పెంచుకుంటూ పోయి ఆర్థిక వ్యవస్థను క్రుంగదీశారు. దీని కారణంగా విద్యావంతులు, మేధావులు సంక్షేమ పథకాలంటే మండిపడే పరిస్థితి వచ్చింది.

ఉచిత పథకాలన్నిటినీ ఒకే గాటన కట్టడం అంత మంచి పద్ధతి కాదనిపిస్తుంది. మధ్యాహ్న భోజన పథకం వంటిది వుంది. స్కూలు నుంచి పేద విద్యార్థులు డ్రాప్ కావడాన్ని అది నివారిస్తుంది, అంతవరకు బాగుంది. కానీ ఆ క్రమంలో టీచర్లను వంటవాళ్లను చేయడం బాగాలేదు. దానికి పరిష్కారం కనుగొని, ఆరోగ్యవంతులైన బాలబాలికలను తయారుచేయగలిగితే జాతి బాగుపడుతుంది. ఎమ్జీయార్ పెట్టిన కొన్ని పథకాలు వింటే మొదట్లో నాకు నవ్వు వచ్చేది – ఉచిత పళ్లపొడి యిస్తామని, ఉచితంగా హవాయి చెప్పులు యిస్తామని.. యిలాటివి. బాగా ఆలోచించగా వాటిలో ఔచిత్యం కనబడింది. గ్రామాల్లో ఓరల్ హైజిన్ గురించి పట్టించుకోరు. వాళ్లకు పళ్లపొడి అలవాటు చేస్తే తర్వాత వచ్చే దంత సమస్యలు తగ్గుతాయి. అలాగే చెప్పులు లేకుండా నడవడం గ్రామాల్లో సర్వసహజం. చెప్పులు అలవాటు చేస్తే, పాదాలు రక్షింపబడతాయి. స్కీములో మొదటిసారి ఉచితంగా యిచ్చి అలవాటు పడేట్లా చేస్తే, తర్వాత వాళ్లు సొంత డబ్బుతోనే కొనుక్కుంటారు. ఆ మధ్య తమిళనాడులో ఒకతను లోకల్‌గా దొరికే మెటీరియల్‌తో తక్కువ ఖరీదులో శానిటరీ టవల్స్ తయారుచేసి పేదలకు అమ్ముతున్నాడని విన్నాను. అలాటివి ప్రభుత్వం సప్లయి చేస్తే, విస్తారంగా మరుగుదొడ్లు కట్టించడం చేపడితే స్త్రీల సమస్యలు చాలా భాగం తగ్గుతాయి. ఇలాటి పథకాలు పెట్టినా ఫర్వాలేదు అనే అభిప్రాయానికి వచ్చాను. ఏదైనా సంక్షేమ పథకం అనగానే అవినీతి, దురుపయోగం, ఆశ్రితపక్షపాతం యివన్నీ వుంటాయని తెలుసు. కానీ పది రూపాయల హవాయి చెప్పుల్లో ఎంత తినేస్తారు కనుక అని మానసికంగా సమాధాన పడ్డాను. కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఋణమాఫీ, ఫీజుల రీఎంబర్స్‌మెంటు

భారీ సంక్షేమ పథకాలు వుండకూడదు – వాటిల్లో ప్రభుత్వధనం చాలా దురుపయోగం అవుతుంది అని భావిస్తూ వచ్చాను. కానీ యిటీవలే నా అభిప్రాయం మారింది.

టిడిపి చేపట్టిన ఋణమాఫీ పథకం విషయంలో దాన్ని మ్యానిఫెస్టోలో ప్రకటించేవరకు, ఎన్నికలలో ప్రచారం చేసేవరకు వున్న స్వరూపం చూడండి, యిప్పుడు ఎలా మారిందో చూడండి. అప్పుడంతా వ్యవసాయదారులంటే అన్నదాతలు (రైతులు వరి పంట అమ్ముకుంటారు తప్ప అన్నంగా వుండి మనకు దానం చేయరు, కానీ రైతులకు అన్నదాత అనేది పర్యాయపదం అయిపోయింది), జాతి కోసం రక్తంగా చెమటగా మార్చి, యింట్లో భార్య మంగళసూత్రాన్ని సైతం తాకట్టు పెట్టి, కిట్టుబాటు కాని వ్యవసాయం చేసి, అప్పుల బాధతో ఆత్మహత్యకు ఒడిగట్టే ఆర్తుడు. కార్పోరేట్ల మొహాన కోటాన కోట్లు కుమ్మరిస్తున్నామే, వీరికి ఒక్కసారి ఋణమాఫీ చేస్తే తప్పేముంది? అని వాదించారు. మరి యిప్పుడు? రైతులలో అధికశాతం మోసగాళ్లని తేల్చారు. బ్యాంకుల వాళ్లతో కుమ్మక్కయి, నియమాలను ఉల్లంఘించి, తమకు రావలసిన దాని కంటె ఎక్కువగా, అవసరం లేకపోయినా అప్పులు తీసేసుకుని యింట్లో విలాసాలకు ఖర్చు పెట్టారని గణాంకాలతో సహా బయటపెడుతున్నారు. ఒక యింట్లో 70 మంది లోన్లు తీసుకున్నారని, ఒకే పొలంపై నలుగురు తీసుకున్నారని, జిరాక్స్ పాస్‌బుక్కులు కుదువ పెట్టారని, రావలసినది ఎకరాకు పదివేలైతే బ్యాంకు మేనేజరుతో చేతులు కలిపి నలభై వేలు తీసుకున్నారని, పేపర్లపై సరిగ్గా సంతకాలు పెట్టలేదని, డిక్లరేషన్లు సరిగ్గా యివ్వలేదని, తీసుకున్న ఋణాన్ని వ్యవసాయంపై ఖర్చు పెట్టలేదని, ఇంట్లో శుభకార్యాలకు ఖర్చు పెట్టారని.. యిలా ఎన్నో ఎన్నో విషయాలు పబ్లిక్ కంతా తెలియచెప్పారు. నేను చాలా తక్కువ చెప్పాను, ప్రభుత్వ సలహాదారు కుటుంబరావుగారిని అడిగితే గుక్క తిప్పుకోకుండా ఏకబిగిన ఏభై ఇర్రెగ్యులారిటీస్ చెప్పగలరు.

జుదీ 3 ఎచీ ్రాశీశ్రీఞఅఎం్రైతులొకరే మోసగాళ్లంటే పొరపాటు. వారితో పాటు బ్యాంకు అధికారులను కూడా తప్పుపట్టాలి. జిరాక్సు డాక్యుమెంట్లు యిస్తూ వుంటే, అవసరానికి మించి, అర్హతకు మించి అప్పు అడుగుతూంటే కళ్లు మూసుకుపోయాయా? మీరూ నేను ఓవర్‌డ్రాఫ్ట్ అడిగితే లక్ష షరతులు పెడతారే, మరి వీళ్ల విషయంలో యింత వెసులుబాటు దేనికి? లంచాలు పుచ్చుకున్నారా? అయితే వాళ్ల బ్యాంకులు యీ పాటికి వారిపై చర్యలు తీసుకోవాలే! ఏడాది అవుతున్నా యింకా ఆ కార్యక్రమం ప్రారంభం కాలేదేం? కాకపోవడానికి కారణం – బ్యాంకు ఉన్నతాధికారులకు కూడా జరిగినది తెలుసు. ఇదంతా వారి కనుసన్నల్లో జరిగినదే. ప్రభుత్వం వ్యవసాయరంగ ఋణాలు యిన్ని యివ్వాలి అని కొన్ని టార్గెట్లు పెడుతుంది, అవి చేరుకోవాలి. రూలు ప్రకారం వెళితే ఆ మేరకు అప్పులు యివ్వలేరు, బిజినెస్ సాగదు, లాభాలు రావు. ఉన్నతాధికారుల ఉద్యోగాలకే ముప్పు. మరో కోణం నుంచి చూస్తే గ్రామాలలో వున్న రాజకీయ నాయకులందరూ రైతులకు అప్పులిమ్మనమని ఒత్తిడి చేస్తూనే వుంటారు. డబ్బు మీకు తిరిగి వచ్చేస్తుంది, యివ్వడానికి ఏం పోయేకాలం? అసలో, నకిలీవో వాళ్లు ఏ డాక్యుమెంట్లు యిస్తే అవే తీసుకుని అప్పులిచ్చేయండి – అంటూ పోట్లాటకు వస్తారు. వీళ్లు కట్టకపోతే ప్రభుత్వమే యిస్తుంది, మన లోను ఎక్కడికీ పోదు అని బ్యాంకు వాళ్ల ధీమా. ఇలా అందరూ – అంటే రైతులు, రాజకీయ నాయకులు, బ్యాంకులు కలిసి కుమ్మక్కయి ఉత్పాదకతకు ఉపయోగపడవలసిన నిధులను యిలా దుర్వినియోగం చేస్తూ వచ్చారు. ఋణమాఫీ విషయంలో టీవీలో చర్చకు వచ్చిన వివిధ రాజకీయ పక్షాల నాయకులందరూ ఒప్పుకుంటున్నారు – ఎన్నో ఏళ్లగా ఋణాలు దుర్వినియోగం అవుతున్నాయని. కుటుంబరావుగారి వాదనలను కాదనే దమ్ము వారెవరికీ లేదు. ఇవన్నీ సహజమే, చాలా ఏళ్లుగా నడుస్తున్నాయి, రైతులు, బ్యాంకులు వాళ్ల తంటాలేవో వాళ్లు పడుతున్నారు, మధ్యలో మీరు వచ్చి ఋణమాఫీ అని వాళ్లకు ఆశ పెట్టి వాళ్ల కొంప ముంచారు అనే వారు టిడిపిని నిందిస్తున్నారు.

చంద్రబాబు పాదయాత్రలో మొదలెట్టారు ఋణమాఫీ అని. అప్పులు తిరిగి కట్టద్దన్నారు, (కట్టేస్తే మంచిదని ఇప్పుడు సలహా చెప్తున్నారు) బంగారం ఏ రకంగా కుదువ పెట్టినా విడిపిస్తామన్నారు. ఇక అప్పణ్నుంచి రైతులు అవసరం లేకపోయినా అప్పులకు ఎగబడ్డారు, పాతవాటికి ఎగనామం పెట్టారు. విభజన జరిగిన తర్వాత, కొత్తగా ఏర్పడే ఆంధ్ర రాష్ట్రానికి ఆర్థిక పరిపుష్టి వుండదని బాబు ఓ పక్క చెపుతూనే ఎన్నికల ముందు విడుదల చేసిన తన మ్యానిఫెస్టోలో వ్యవసాయ ఋణాలన్నీ (ఇప్పుడు పంట ఋణాలు మాత్రమే అంటున్నారు) మాఫీ చేస్తామని ప్రకటించారు. ఎన్నికల సభల్లో బంగారం గురించి వాగ్దానాలు గుప్పించారు. అవి నమ్మిన రైతులు భారీగా ఓట్లేశారు. ఇక అధికారంలోకి వచ్చాక బాబుకు, కుటుంబరావుగారికి జ్ఞాననేత్రం తెరుచుకుంది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ వంటి కొత్త పదాలు తెలిశాయి. ఆధార్ కార్డు అనుసంధానం, ఓటరు కార్డు (ఓటరు కార్డుకి, అప్పుకి సంబంధం ఏమిటండి), ఒక వూళ్లో పొలం, మరొక వూళ్లో ఋణం, కౌలుదారు, సొంతదారు యిలాటి అనేక విషయాలు అప్పుడే కొత్తగా తెలిసినట్లు ప్రవర్తిస్తున్నారు. ఏ రాజకీయ నాయకుణ్నయినా అడగండి – మాది రైతు కుటుంబం, నేను రైతునే అంటూంటారు. మరి వీళ్లెవరికి అప్పటిదాకా ఏం జరుగుతోందో తెలియ లేదా? అన్ని అక్రమాలూ యిప్పుడే తెలిశాయా?

టిడిపి ఒరిజినల్‌గా చేసిన వాగ్దానాల ప్రకారం దాదాపు 80వేల కోట్ల దాకా ఖర్చవుతుందని అంచనా వుంది. టీవీ చర్చల్లో కుటుంబరావుగారిని యిదెలా సాధ్యం? ఒక ఆర్థికవేత్తగా సమాధానం చెప్పండి అని పలుమార్లు నిలదీశారు. సాధ్యమే, మేమన్నీ లెక్కలు వేశాం, సర్వం సిద్ధం అని ఆయన అతి కాన్ఫిడెంటుగా చెపుతూ వచ్చారు. ఒకసారి అధికారం వచ్చాక కోటయ్య కమిటీ అన్నారు, కంప్యూటర్లు పాడయ్యాయన్నారు, జాబితాల్లో అవకతవకలన్నారు, యిలా కాలం నెట్టుకుంటూ వస్తున్నారు. నడుస్తున్న దేమిటంటే – కొన్ని షరతులు విధించి యిలా అయితే ఎంత భారం పడుతుందో చెప్పండి అని అధికారులను అడుగుతున్నారుట.

వాళ్లు లెక్కలేసి యింత అని తేలుస్తున్నారు, అమ్మో, అది కూడా భరించలేం, యింకో క్రైటీరియా (షరతు) చేర్చండి అంటున్నారు. మళ్లీ కసరత్తు సాగుతుంది. ఇంత.., అబ్బే, యిదీ ఎక్కువే.. యింకో క్రైటీరియా చేరుద్దాం.. యిలా సాగుతోంది బండి. చివరకు రైతుల ఎత్తు, లావు కూడా లెక్కలోకి తీసుకుని మాఫీ పరిధిలోకి వచ్చే ఖాతాలు ఏ వందల్లోకో తెస్తారేమో! టిడిపికున్న యీ అతితెలివి మాకు లేకపోయిందే అని జగన్ వగస్తున్నారు. రైతులు టిడిపిపై పగబట్టి, తిరగబడతారని, వచ్చే ఎన్నికలలో బుద్ధి చెపుతారని ఆశపడుతున్నారు. ఎన్నికల దాకా ఎందుకు గానీ, మీ షరతుల ప్రకారం నాకు అర్హత వున్నా మాఫీ చేయలేదేం, నేను పెట్టిన డాక్యుమెంట్లు జిరాక్సువి కావు అని వాదిస్తూ రైతులు కోర్టులకు వెళ్లిన సందర్భాలు బయటకు రాలేదు. వాళ్లకూ తెలుసు – సూది కోసం సోది కెళితే ఏం జరుగుతుందో!

ఈ భారీ పథకం వలన జరిగిన మేలేమిటంటే – రైతులు, రాజకీయనాయకులు, బ్యాంకులు కలిసి అన్నదాతలను ఆదుకోవడం పేర దశాబ్దాలుగా ఆడుతున్న నాటకాని తెర పడింది. బ్యాంకుల్లో ఇంటర్నల్ ఆడిట్లు, ఎక్స్‌టర్నల్ ఆడిట్లు, ఆర్‌బిఐ ఆడిట్లు – యిలా ఏవేవో జరుగుతూనే వుంటాయి. వాళ్లెవరూ పట్టుకోలేని యిర్రెగ్యులారిటీలు కుటుంబరావుగారి టీము పట్టుకుని ఉతికి ఆరేసింది. ఇకపై బ్యాంకులు పంట ఋణాలంటే వద్దు బాబోయ్ అంటాయి. ఇచ్చినా అతి కొద్దిగా, యివ్వదగినంతే యిస్తాయి. వ్యవసాయ ఋణాలపై వడ్డీ సబ్సిడీ పేరుతో జరుగుతున్న దుర్వ్యయం ఆగుతుంది. సరైన రైతులకే, సరైన అవసరాలకే ఋణం దొరుకుతుంది. వ్యవస్థను చక్కదిద్ది యీ ఉపకారం చేసినందుకు మనందరం టిడిపికి, చంద్రబాబుకు ఋణపడి వుండాలి. (దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరూ మాఫీ చేయలేరు). అదే సమయంలో కెసియార్‌కు కూడా. ఎందుకంటే ఫీజు మాఫీ పథకం పేరు చెప్పి వసతులు లేని కాలేజీలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. అక్కడ చదువు వంటపట్టని కుర్రాళ్లు అనేకమంది సబ్బుబిళ్లల్లా తయారై, ఇంజనీర్ల పేరుతో చలామణీ అవుతూ, ఆ వుద్యోగానికి అర్హత లేక, చిన్న వుద్యోగానికి వెళ్లడానికి మొహం చెల్లక, తలిదండ్రులకు, సమాజానికి భారంగా మారుతున్నారు. ఆ ఫీజు భారం తగ్గించుకోవడానికై కెసియార్ మొదట 1956 షరతు పెట్టబోయారు, కోర్టు చివాట్లు వేయడంతో యిట్నుంచి నరుక్కొద్దామని కాలేజీల్లో సౌకర్యాల పరీక్ష అని జెఎన్‌టియు ద్వారా కోతల కార్యక్రమం తలపెట్టారు. ప్రయివేటు కాలేజీలే కాదు, ప్రభుత్వ కాలేజీల్లో కూడా కనీస సౌకర్యాలు లేవని, ఫ్యాకల్టీ లేదని, వసతులు లేవని బయటకు వచ్చింది. కాలేజీల గుర్తింపులు రద్దవుతున్నాయి, ఇంజనీరింగు సీట్లు రద్దవుతున్నాయి. దానివలన తెలంగాణలో అనవసరమైన యింజనీర్లు తయారు కారు. విద్యార్థులు యితర వుపయుక్తమైన కోర్సుల్లో చేరి జీవనోపాధి గడించుకుంటారు. ఈ భారీ పథకం కూడా యీ విధంగా సత్ఫలితాలను యిస్తోంది. ఆంధ్రలో కూడా యీ కసరత్తు జరిగి విద్యావ్యవస్థ క్షాళన మయితే తెలుగు యువతీయువకుల జీవితాలు మెరుగుపడతాయి.
**– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2015)**

## మే 06 ఎమ్బీయస్ : విద్యావంతులేం చేస్తున్నారు?

రాహుల్ గాంధీ కెసియార్‌ను మినీ మోదీ అని ఎందుకన్నారో తెలియదు కానీ, తననుకున్నది చేయడానికి వెరవకపోవడంలో యిద్దరికీ పోలిక వుంది. జాతీయస్థాయిలో ప్రతిపక్షంలాగానే తెలంగాణలో కూడా ప్రతిపక్షం కూడా చచ్చుబడి వుంది. అక్కడ పార్టీ ఫిరాయింపులు లేవు, యిక్కడ అవీ వున్నాయి. ఏ ప్రతిపక్ష నాయకుడికీ తన సహచరుడు తనతో బాటే వుంటాడన్న నమ్మకం లేదు. నియోజకవర్గంలో పనుల కోసం.. అన్న ఒక్క సాకు చెప్పి గోడ దూకేయవచ్చు. కెసియార్ చేస్తున్న తలతిక్క పనుల గురించి మీడియా కూడా గట్టిగా పోట్లాడటం లేదు. ఆంధ్రజ్యోతి ఒక్కటీ కాస్త గట్టిగా రాస్తోంది కాబట్టి దాని ఛానెల్ ఎవరికీ కనబడకుండా చేసేశారు కెసియార్. ఎవరేం చెప్పినా వినటం లేదు. నిషేధానికి కొన్నాళ్లలో ఏడాది అవుతుంది. ఆంధ్రజ్యోతికి మద్దతుగా నిలబడడానికి మీడియాలోని యితర పెద్దలకు దమ్ము చాలటం లేదు. అందరికీ యిక్కడ స్థిరాస్తులున్నాయి, కెసియార్ మొండివాడనీ, తలచుకుంటే ఏమైనా చేయగలడనే ఎఱిక వుంది. అందుకని అందరూ సహిస్తున్నారు.

ఈ వైభోగం ఎంతకాలం నడుస్తుందో తెలియదు కానీ ప్రస్తుతం ఆయన చూపు ఉస్మానియా యూనివర్శిటీ స్థలాలపై పడింది. ఇప్పటికే కొంత స్థలం కబ్జా అయిపోయింది. ఉద్యమకాలంలో ఆ స్థలాన్ని మళ్లీ రాబడతామని అన్నారు. అది రాబట్టకపోగా యిప్పుడు ప్రభుత్వమే 11 ఎకరాలు కబ్జా చేస్తోనంటోంది. దానికి ఒప్పుకోం అని ఉస్మానియా విద్యార్థులంటే వారిని మెచ్యూరిటీ లేని పోరగాండ్లు అనేశారు కెసియార్. మరి యిదే పోరగాండ్లు మొన్నటిదాకా ఉద్యమానికి దీపధారులు. విప్లవవీరులు. అధికారం చేజిక్కేసరికి చవటల్లా కనబడుతున్నారు.

వాళ్లకు మెచ్యూరిటీ లేదన్న మాట అక్షరాలా నిజం. ఉండి వుంటే తెలంగాణ రావాలని ఆత్మహత్యలు ఎందుకు చేసుకుంటారు? వాళ్లల్లో ఒక్కడికి ప్రాణం మళ్లీ వచ్చి లేచినా, యీనాటి తెలంగాణ చూస్తే దీని కోసమా నేను ఆత్మత్యాగం చేసినది అని హతాశుడై మళ్లీ మరణిస్తాడు. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని యువతంతా ఆశపడింది. ఏడాది పాలనలో ఎన్ని వచ్చాయి? అని అడిగితే 60 ఏళ్లగా రానివి ఒక్క ఏడాదిలో వస్తాయా? అని పాలకులు ఎదురు ప్రశ్నిస్తున్నారు. వాళ్లకు బుగ్గకార్లు, ఇన్నోవాలు, పార్లమెంటు సెక్రటరీ పదవులు, జీతభత్యాల పెంపు అన్నీ నెలల్లోనే వచ్చేశాయి. వీళ్ల ఉద్యోగాలకు మాత్రం యింకో 60 ఏళ్లు ఆగాలా? ఐదేళ్లలో లక్ష వుద్యోగాలు వస్తాయనుకుంటే ఏడాదిలో 20 వేలైనా రావాలి కదా! 20 వందలైనా వచ్చాయా? అసలు అమరవీరులకు సరైన

గుర్తింపు లభించిందా? ఉద్యమం నడిచినంత కాలం 1200 మంది పోయారంటే 1500 మంది అని చెప్పుకున్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక దానిలో సగం మందైనా లేరంటున్నారు. గల్లీ నుంచి ఢిల్లీ సభ దాకా ప్రతీ చోటా తెలంగాణ అనగానే శవాల ప్రస్తావనే జరిగింది. ఇప్పుడు అంతా గప్‌చుప్. తెలంగాణ వచ్చాక కొంతమందికి కొన్ని ప్రయోజనాలు ఒనగూడాయి. కానీ అందరి కంటే ఆశోపహతులు మాత్రం విద్యార్థులు, నిరుద్యోగులు, చిరుద్యోగులే. పేదలకు యిళ్లు కడతామంటున్నారు. మంచిదే. అది ఉస్మానియాలోనే కట్టాలనేముంది? సికింద్రాబాదులో యింకెక్కడా చోటు లేదట. అసలు సికింద్రాబాదులోనే యిళ్లు కట్టాలనేముంది? ఇదంతా శాటిలైట్ టౌన్స్ యుగం. ఊరికి చివర శాటిలైట్ టౌన్లు కట్టి అక్కణ్నుంచి వూళ్లోకి తక్కువ బస్సు టిక్కెట్టుతో బస్సులు, రైళ్లు నడిపితే వూరిపై ఒత్తిడి తగ్గుతుంది. తమిళనాడులో అదే చేస్తున్నారు. అనేక మహానగరాల్లో అదే పని చేస్తున్నారు.

కొత్త చోట ఏదైనా కట్టడం సులభం. విశాలమైన రోడ్లు, చక్కటి డ్రైనేజీ, నీటి సరఫరా అన్నీ బాగా ప్లాన్ చేయవచ్చు. పాతబడిన నగరంలో యిళ్లు పడగొట్టి ఫ్లాట్లు కడితే గతంలో పదిమంది వుండే చోట యిప్పుడు వందమంది నివసిస్తారు. డ్రైనేజిపై, నీటి సప్లయిపై, రోడ్లపై విపరీతమైన ఒత్తిడి పడి మాటిమాటికీ బ్రేక్‌డౌన్లు అవుతాయి. పైగా యూనివర్శిటీకి పక్కగా బస్తీ వాసులుంటే శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతుంది. ఆ యిళ్లల్లో ఆడపిల్లల్ని విద్యార్థులు ఏడిపించారనో, విద్యార్థినులను బస్తీవాసులు ఏడిపించారనో నిరంతరం కలహాలు ఏర్పడతాయి. యూనివర్శిటీ అనగానే బంద్‌లు, లాఠీ చార్జిలు, బాష్పవాయు ప్రయోగాలు సహజం. విద్యార్థులు పోలీసులపై రాళ్లు రువ్వి బస్తీలో పోయి దాగుంటారు. పోలీసులు వెళితే పేదలపై దాడి జరిగిందని గగ్గోలు పెడతారు. తెలంగాణ ఉద్యమసమయంలో జరిగినదదే. ఇప్పుడు ఆ ఉద్యమం అయిపోయింది. తెలంగాణ వచ్చింది. రేపు మరొక రకమైన ఆందోళన రావచ్చు. ఎప్పటికైనా తలకాయనొప్పే. పేదలకు ఎందుకు అక్కడ కట్టాలి? అని అడిగితే కెసియార్ యూనివర్శిటీకి అంత స్థలం అక్కరలేదు, అయినా పేదలు బతకవద్దా అంటున్నారు. యూనివర్శిటీ హాస్టళ్లలో వుండేది పేద విద్యార్థులు కారా? అక్కడ హాస్టళ్లు ఎప్పుడో కట్టినవి, వాటిని బాగు చేయించాలి. కొత్తవి కట్టాలి. ఉస్మానియా అనుబంధ కాలేజీల విద్యార్థులు సైతం అక్కడ వుండేట్లా మరిన్ని హాస్టళ్లు కట్టవచ్చు కదా. ఆ ఆలోచన ఎందుకు రావటం లేదు? యూనివర్శిటీకి అంత స్థలం అక్కరలేదని కెసియార్ తీర్మానించారు. మరి ఫిలిం సిటీకి వేల ఎకరాలు కావాలా? ఫార్మా సిటీకి కావాలా? ఏ ప్రాతిపదికన ఆ ప్రకటనలు చేశారు?

కెసియార్‌కు పర్యావరణం గురించి స్పృహ వుందా లేదాని సందేహం వస్తోంది. ఎన్టీయార్ స్టేడియంలో కళాభారతి కడతామంటున్నారు. అక్కడెందుకు దాన్ని ఆటలకై వదిలేసి, డిబిఆర్ మిల్స్ వున్న చోట కట్టండి అంటే తెలంగాణ సంస్కృతికి మీరంతా విరోధులు అంటారు. అసలు ఆడిటోరియంలు మాత్రం వూరి మధ్యలోనే ఎందుకు వుండాలి? రవీంద్రభారతి, త్యాగరాయ గానసభ వున్నాయి కదా. శివార్లలోనే ఎక్కువ జనాభా వుంటున్నారు. వారికి ఆడిటోరియం అక్కరలేదా? రంగారెడ్డి జిల్లాలో కళాభారతి కట్టకూడదా? దాని కోసం నగరానికి వున్న లంగ్ స్పేస్ పోగొట్టుకోవడం దేనికి? ఉస్మానియా యూనివర్శిటీలో బస్తీవాసులకు యిళ్లు కడితే అక్కడి వాతావరణం కూడా వేడెక్కడం ఖాయం. కలకత్తాలో జాగా తక్కువ. చోటు కోసం చాలా వెతుక్కుంటారు. అయినా ఊరి మధ్యలో వున్న మైదాన్, విక్టోరియా మెమోరియల్, రేస్ కోర్సు వంటి ప్రాంతాలను వాళ్లు ముట్టుకోలేదు. అందుకనే అక్కడ ఆ మాత్రమైనా గాలి ఆడుతోంది. హైదరాబాదు ఒకప్పుడు వేసవిలో కూడా చల్లగా వుండేదని చెపితే యిప్పుడెవరూ నమ్మలేని పరిస్థితి వచ్చింది. కెసియార్ ఐదేళ్ల పాలన పూర్తయ్యేలోగా యింకెంత పర్యావరణ విధ్వంసం జరుగుతుందో తెలియదు. ఏమడిగినా సమైక్యవాదుల పాలనలో నాశనమైంది అంటున్నారు. ఇప్పుడు నాశనం చేస్తున్నదీ వారేనా?

ఉస్మానియాపై జరుగుతున్న దాడి గురించి మేధావులు ఎందుకు మౌనంగా వున్నారు? కెసియార్‌ను విమర్శిస్తున్నది రాజకీయపక్షాలు మాత్రమే. పార్టీ నాయకులు మాట్లాడితే పదవిలో మీరుండగా ఏం చేశారు అని ఒకరినొకరు దెప్పి పొడుచుకుంటారు. తటస్థులను, మేధావులను, విద్యావంతులను అలా అనలేరు. అందుకని గొంతు విప్పి పాలకులను ప్రశ్నించాల్సింది విద్యావంతులే. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించినది ఉస్మానియాలో చదువుకున్న, పాఠాలు చెప్పిన మేధావులే. ఈ రోజు వారి మాతృసంస్థకు యీ గతి పడుతూంటే నోరు విప్పరేం? ఇదే గతంలో అయితే ఎంత రచ్చ చేసేవారు? మరి ఈనాడు నోరు పెగలక పోవడానికి కారణం – పదవులా? భయమా? టెక్స్‌ట్‌బుక్ కమిటీలో స్థానం యిస్తే సంతృప్తి పడిపోయారా? తెలంగాణ భవిష్యత్తు పట్ల వీరికి ఏ బాధ్యతా లేదా? ఈనాటి నిష్క్రియాపరత్వానికి రేపటి తరానికి వీరు జవాబు చెప్పుకోవలసి వస్తుందన్నది మాత్రం తథ్యం.
**– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2015)**

## మే 07 సినీ స్నిప్పెట్లు 01 – ఎన్టీయార్

ఇది కొత్త శీర్షిక. తెలుగు, హిందీ, అప్పుడప్పుడు యితర భాషాచిత్రాల గురించిన కొన్ని కబుర్లు. ప్రస్తుతం రాస్తున్నవన్నీ మరీ సీరియస్ టోన్‌లో వున్నాయని యిది ప్రారంభిస్తున్నాను. సినిమా ముచ్చట్లు అనే శీర్షిక చాలామంది వుపయోగిస్తున్నారు కాబట్టి దానితో ప్రాస కుదిరేట్లు స్నిప్పెట్ (సమాచార శకలం, ఏదైనా పుస్తకంలోని ఉటంకింపు) అనే యింగ్లీషు పదాన్ని తెలుగైజ్ చేసుకున్నాను. గతంలో తెర వెనుక విశేషాలు ఎవరూ చెప్పేవారు కారు. గత 15, 20 ఏళ్లగా అందరూ చెప్పడం ప్రారంభించారు. ఎవరైనా ఏదైనా చెప్పగానే దినపత్రికల వాళ్లు, ఎఫ్‌ఎమ్ వాళ్లు, టీవీ యాంకర్స్ అందరూ వాటిని పదేపదే ప్రస్తావిస్తున్నారు. అయినా మనం మిస్సయ్యేవి

కొన్ని వుంటూనే వుంటాయి. నాకు తారసిల్లినవి నేను యిక్కడ చెపుతున్నాను. వాటిలో కొన్ని మీలో కొందరికి యిప్పటికే తెలిసి వుండవచ్చు. వాటిని వదిలి మిగతావి చదవండి.

మే 28 న ప్రారంభిస్తున్నాను కాబట్టి ఎన్టీయార్ ఉదంతాలు మొదటగా చెప్పడం సముచితం. ''యువచిత్ర'' బ్యానర్‌పై మంచి సినిమాలు తీసిన కె మురారి ''నవ్విపోదురు గాక..'' అనే పేరుతో 520 పేజీల్లో తన జీవితచరిత్ర రాసుకున్నారు. మూడేళ్ల క్రితం అది వెలువడినప్పుడు దానిలోని నాలుగైదు విషయాలను పట్టుకుని పుస్తకాన్ని వివాదాస్పదంగా చిత్రీకరించారు. నిజానికి దానిలో ఆయన చాలా విషయాలు బాగా రాశాడు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, వ్యవసాయ కుటుంబాలు రాజకీయాల్లోకి రావడం యిత్యాది అనేక విషయాలు విపులంగా తన కోణంలో రాశారు. నిజానికి వాటికి అక్కడక్కడ కల్పన, నాటకీయత జోడించి టీవీ సీరియల్‌గా తీస్తే ''బునియాద్'' వంటి మంచి సీరియల్ తయారయ్యేది. ఆయన రాసిన కొన్ని విషయాలు మనకు తెలిసిన నటీనటుల్ని కొత్త కోణంలో చూపుతాయి కూడా. ఎన్టీయార్ గురించి ఆయన రాసిన ఒక సంఘటన రాస్తున్నాను.

''గోరింటాకు'' (1979) షూటింగు కోసం మురారి తన యూనిట్‌తో వైజాగ్ వెళ్లారు. అప్పటి కింకా నటుడుగానే వున్న ఎన్టీయార్ పోలీసుల కోసం నిధులు సేకరించడానికి రైల్లో వచ్చారు. ఎవరో ఎన్టీయార్‌కు చెప్పారు 'ఊళ్లో దాసరిగారి దర్శకత్వంలో సినిమా షూటింగు జరుగుతోంది' అని. నిర్మాతెవరో కనుక్కుని ఆయన అనుమతి తీసుకుని ఆర్టిస్టులందరినీ పెరేడ్ గ్రౌండ్స్‌లోని కార్యక్రమానికి తీసుకురమ్మనమని ఎన్టీయార్ మనిషిని పంపారు. అతను తన వద్దకు రాగానే మురారికి ఒళ్లు మండింది 'ఆయన ప్రోగ్రాం కోసం మనం షూటింగు కాన్సిల్ చేసుకుని వెళ్లడమేమిట'ని. డైరక్టరు దగ్గరకి పంపితే ఆయనే కుదరదంటాడు అనుకుని ఆ మనిషిని పంపితే దాసరి 'అలాగే, అందరం వస్తాం' అని చెప్పి పంపించేశారు. భోజనాల దగ్గర ఆ విషయం తెలిసి మురారికి చికాకేసింది. ఆయన ఎయన్నార్‌కు వీరాభిమాని కావడం, స్వతహాగా అహంభావం, దూకుడు వుండడంతో దాసరితో ''కావాలంటే మీరు వెళ్లండి, నేను రాను'' అని చెప్పేశారు. సావిత్రి అది విని ''అలా అనవచ్చా? మేమందరం వుండగా నీ దగ్గరకే మనిషిని ఎందుకు పంపారు? నిర్మాతగా గౌరవం యిచ్చినట్లే కదా'' అన్నారు. మురారికి ఏం చెప్పాలో తెలియకుండా ఆలోచిస్తూంటే 'సాయంత్రం ఫంక్షన్‌కు దండలు ఏర్పాటు చేయండి' అని దాసరి ప్రొడక్షన్ వాళ్లకు చెప్తున్నారు. మురారికి యింకా పట్టుదల వచ్చింది – '' దండలు మీరందరూ వేస్తే వేయండి, నేను అక్కడకు వచ్చినా దండా అదీ ఏం వేయను'' అన్నారు.

మురారికి చాలా ఆత్మీయుడైన శోభన్‌బాబు అప్పుడు ''నువ్వు అక్కడికి వెళ్లగానే ఆయన నిన్నే ముందు పిలుస్తారు, నువ్వు దండ వేస్తావు. ఆ తర్వాత నీ మాటలు, చేతలు నీ అధీనంలో వుండవు'' అన్నారు. మురారి తెల్లబోయి చూస్తే ''అవును, నువ్వు ఆయన దగ్గరకు వెళ్లగానే ఆయన కళ్లలోకి చూడగానే నీ మతి మతిలో వుండదు. ఆయన ముఖంలో అంతటి ఆకర్షణశక్తి వుంది.'' అని రెట్టించారు. ''సోది కబుర్లు చెప్పకు'' అని మురారి కొట్టి పారేశారు. ''నేను చెప్పినట్లు నువ్వు లేచి వెళ్లి ఆయనకి దండ వేస్తావు. దమ్ముంటే పందెం కాయి'' అన్నారు శోభన్. పక్కనే వున్న నటుడు చలం, దాసరి కూడా శోభన్ వైపు మాట్లాడుతూ పందెం అన్నారు. ''ఓడిపోతే రేపు మీ అందరికీ లంచ్‌లో స్వీట్లు, కోడి కూర'' అన్నారు మురారి పంతంగా. సావిత్రి నవ్వుతూ విన్నారు.

సాయంత్రం మీటింగుకి వెళ్లినపుడు యూనిట్‌కు సకల మర్యాదలు జరిగాయి, వాళ్ల కార్లను వేదిక దాకా వెళ్లనిచ్చారు, ముందు వరుసలో కూర్చోబెట్టారు. వేదికపై ఎన్టీయార్ మైక్ వద్దకు వచ్చి 'అందరికీ స్వాగతం, యువచిత్ర యూనిట్టంతా వచ్చినందుకు నిర్మాత మురారి గారికి ధన్యవాదాలు'' అని ''రండి మురారిగారూ'' అంటూ వేదికపైకి పిలిచారు. శోభన్‌బాబు చెప్పినదానిలో మొదటిది నిజమైంది. మురారికి ఆనందంతో బాటు అనుమానం, కాళ్లలో వణుకు ప్రారంభమైంది. కదలలేదు. సావిత్రిగారు నవ్వుతూ చెయ్యి తట్టి ''నిన్నే పిలుస్తున్నారు, వెళ్లు'' అన్నారు. ''నీ పని అయ్యిందిలే'' అన్నట్టు చలం చూస్తున్నారు. శోభన్‌బాబు మాత్రం ఆయన పరిస్థితిని అర్థం చేసుకుని లేచి నిలబడి తన చెయ్యి పట్టుకుని స్టేజి దాకా తీసుకెళ్లారు. కాస్త అయోమయస్థితిలోనే యీయన వేదికపైకి వెళ్లారు. ఎన్టీయార్ రాజసంగా తన చూపులతోనే వేదికపై మురారి స్థానాన్ని సూచించారు. వెళ్లి కూర్చున్నారు. తర్వాత దాసరి, సావిత్రి, శోభన్, చలం – అందర్నీ వేదికపై ఆహ్వానించారు. సావిత్రి పైకి రాగానే రామారావుగారి పక్కన పదహారణాల తెలుగింటి యిల్లాలులా వున్న ఆయన భార్య బసవతారకం గారికి నమస్కరించారు. అది చూడగానే మురారి అసంకల్పితంగా లేచి తనూ ఆవిడకు నమస్కరించారు.

కాస్సేపటికి దాసరి మైక్ తీసుకుని యూనిట్ అందర్నీ పరిచయం చేయడం మొదలుపెట్టారు. మొదటగా మురారి పేరు చదివారు. ఈయన బింకంగా, తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో దండ తీసుకోకుండా ఎన్టీయార్ వద్దకు వెళ్లారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దండ వేయకూడదని, కేవలం నమస్కారం పెట్టి వచ్చేద్దామని మురారి ప్లాను. కానీ కాస్సేపు పోయాక చూస్తే యీయన దండ వేయడం, పెద్దాయన 'రండి మురారిగారూ' అంటూ దగ్గరకు తీసుకోవడం జరిగాయి. ఇదెలా జరిగిందో తనకే తెలియలేదంటారు మురారి. తన ఆత్మకథలో ''నా చేతికి ఎవరు దండ యిచ్చారో, నేను ఎలా వేశానో నాకే తెలియదు. చలం అంతకుముందే అన్నారు – 'ఆయన ముఖంలోని తేజస్సు మనల్ని మనకి తెలియకుండానే ఆకర్షణలో పడేస్తుంది' అని. తర్వాత ఏం జరిగిందో నాకు యిప్పటికీ గుర్తు లేదు. తెలియని అనుభూతి. నాలో నేను లేను. నిజంగానే ఆయన రారాజు.'' అని రాసుకున్నారు.

తన అవస్థ చూసి చలం, శోభన్‌బాబు నవ్వుతూంటే మురారికి కోపం రాలేదట. తెలియని ఆనందపు మైకంలో వాళ్లకి మనసులోనే ధన్యవాదాలు చెప్పారట. మురారి మైకం, తన్మయత్వం గమనించిన శోభన్ ఆయన కుర్చీలో కూర్చోబోతూంటే కిందపడి పోతాడేమో

అన్నట్లుగా లేచి పట్టుకుని కుర్చీలో కూర్చోబెట్టారు. మర్నాడు షూటింగు లంచ్‌లో అందరికీ స్వీట్లు, కోడికూర. ''మురారి పందెం ఓడితే యిలా వుంటుందన్నమాట'' అన్నారు సావిత్రి. 'ఇది ఓడడం కాదు, ఓడి గెలవడం' అనుకున్నారు మురారి లోలోపల.

**–ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2015)**

**మే 08 – 09** **ఎమ్బీయస్ : ఏ దేశమేగినా, ఎందు కాలిడినా...**

రాయప్రోలు సుబ్బారావుగారి యీ గేయం ఎంతమందికి గుర్తుందో నాకు తెలియదు. 'ఏ దేశమేగినా, ఎందు కాలిడినా, ఏ పీఠమెక్కినా ఎవరెదురైనా, పొగడరా నీ తల్లి భూమి భారతిని, నిలపరా నీ జాతి నిండు గౌరవమ్ము..' అని సాగుతుంది. చాలా గొప్ప సూక్తి. మనలో మనం ఎన్నయినా అనుకోవచ్చు, మన దేశంలో అధికారంలోకి వచ్చినవారిని మనం యిష్టపడకపోయి వుండవచ్చు, వారి విధానాలతో మనం విభేదించవచ్చు. కానీ యింకో దేశం వెళ్లినపుడు మాత్రం అవన్నీ పక్కకు పెట్టి 'మేమందరం భారతీయులం. మా జాతి గొప్పది. మీకేమీ తీసిపోము' అని అనడం పరిపాటి.

ఈ పద్యం యితర భాషల్లో యిలాగే లేకపోయి వుండవచ్చు కానీ భావం మాత్రం ప్రపంచ నాయకులందరూ గ్రహించారు. ఎవరూ యితర దేశంలో తమ దేశం గురించి చులకనగా మాట్లాడరు. మా దేశం అప్పుల్లో మునిగిపోయింది, అవినీతిలో కూరుకుపోయింది, అసమర్థత రాజ్యమేలింది అని ఎప్పుడూ చెప్పరు. 'మేం ఎప్పుడూ ముందుకు సాగుతూనే వున్నాం, యిప్పుడు మరింత చురుగ్గా సాగుతున్నాం. మాతో కలిసి మీరు దీర్ఘకాల ప్రణాళికలు వేయవచ్చు, భారీ పెట్టుబడులు పెట్టవచ్చు. ఈలోగా ఎన్నికలు వచ్చి మేం గద్దె దిగిపోయినా ఏమీ ఫర్వాలేదు, మా తర్వాత వచ్చేవాళ్లు రాక్షసులేమీ కాదు, మిమ్మల్ని కొత్తగా కమిషన్లు అడగరు, యిప్పుడు చేసుకున్న ఒప్పందాలను మన్నిస్తారు, కొత్త షరతులు పెట్టి మిమ్మల్ని తరిమివేయరు' అని చెప్తారు. అలా చెప్పకపోతే అవతలివాళ్లు ఒప్పందాలు చేసుకోవడానికి ముందుకు రారు.

ఎందుకంటే వాళ్లకూ తెలుసు – యీనాడు తమతో వ్యవహరిస్తున్న పార్టీకి నూటికి ఏ 35యో, 40యో శాతం ఓట్లు వచ్చి వుంటాయనీ, మెజారిటీ ప్రజలు వీరి విధానాలను వ్యతిరేకించాయనీ, ప్రతిపక్షాలు కలిసికట్టుగా భవిష్యత్తులో ఎదిరిస్తే యీ ప్రభుత్వం కూలిపోతుందని, వచ్చే ఎన్నికల్లో ఓడిపోతుందనీ! ఎన్నికలే లేని నియంతృత్వ వ్యవస్థలో సైతం, నియంతపై సైనిక తిరుగుబాటు జరిగే అవకాశం వుంటుంది. అధికారంలో ఎవరూ శాశ్వతం కాదు. తామూ కాదు, విదేశీ అతిథీ కాదు అనే ఎఱుక అందరికీ వుంటుంది. అందువలన విదేశీ గడ్డపై తన దేశంలోని ప్రతిపక్షాల గురించి చులకనగా ఎవరూ మాట్లాడరు. అలా మాట్లాడిన ప్రత్యేకత మోదీది మాత్రమే. మొదటిసారి అలా మాట్లాడినప్పుడు మనవాళ్లు వులిక్కిపడి వుంటారు. కెనడాలోనూ ఉలిక్కిపడి వుంటారు కానీ అతిథి పట్ల గౌరవంతో పైకి ఏమీ అని వుండకపోవచ్చు. విమర్శలకు చలించే రకం కాదు మోదీ. అందుకే చైనాలో మళ్లీ మాట్లాడారు. కెనడాకు వచ్చిన తొలి ప్రధాని తానే అని ఆయన చెప్పినది తప్పు అని రుజువయ్యాక కూడా ఆయన క్షమాపణ లేదా సవరణ చెప్పలేదు. ఆయనకు నోట్సు రాసిచ్చినవారిని మందలించారో లేదో తెలియదు. కాంగ్రెసునో, జనతా పరివార్‌నో తిట్టాలంటే ఎన్నికల సభల్లో తిట్టవచ్చు, అక్కడకి వెళ్లి తిడితే ఏం లాభం? వాళ్లేమైనా ఓట్లేస్తారా? నవ్వుకుని వూరుకుంటారు.

మోదీ ఏడాది పాలన కొడుతున్న డప్పులో విదేశీ పర్యటనల ప్రస్తావన విపరీతంగా జరుగుతోంది. అసలు ఏడాది పాలన గురించి యింత ప్రచారం అవసరమా? గతంలో ఎవరూ యింత హంగు చేయలేదు. ఇదేమైనా పివి నరసింహారావు వంటి అస్థిర ప్రభుత్వమో, అతుకుల బొంత వంటి యునైటెడ్ ఫ్రంట్, నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వమో, 13 నెలలు మాత్రమే రాజ్యం చేయగలిగిన దినదినగండం వాజపేయి రెండో ప్రభుత్వమో యిలాటి ప్రచారం చేసుకుంటే కాస్త అర్థం వుంది – చచ్చీచెడి ఏడాది మైలురాయి దాటాం, ఎన్నాళ్లు వుంటామో తెలియదు కాబట్టి యిప్పుడే పండగ చేసేసుకుంటే మంచిదని. కానీ మోదీది అలాటి పరిస్థితి కాదు. చాలా దశాబ్దాల తర్వాత పూర్తి మెజారిటీ లభించిన పార్టీ ప్రభుత్వం. తక్కినవాళ్లకు చోటు యివ్వడం సౌహార్దపూర్వకంగానే తప్ప అవసరానికి కాదు. ఇలాటిది ఏడాదేం ఖర్మ, ఐదేళ్లు పూర్తి చేస్తుందని అందరం అనుకుంటున్నాం. ఐదేళ్లేమిటి, కాంగ్రెసు కోలుకోదు, జనతా పరివార్ కలవదు, 2029 వరకు మాదే రాజ్యం అంటున్నాయి బిజెపి శ్రేణులు. ఇంత ఆత్మవిశ్వాసం తొణికిస లాడేవారికి ప్రజాధనంతో యింత ఆర్భాటం అవసరమా? ఇది చూసి రాష్ట్రప్రభుత్వాలన్నీ యిదే స్థాయిలో ప్రచారం మొదలుపెడితే, ఎంత వృథా వ్యయం? ప్రచారం అస్సలు అక్కరలేదని ఎవరూ అనరు, మోతాదు మించిందని మాత్రమే అనిపిస్తోంది.

కొన్ని క్లెయిమ్స్ వింటూంటే నవ్వు వస్తోంది. ఏడాదిలో అవినీతి అస్సలు జరగలేదట – అది యిప్పుడేం తెలుస్తుంది? కాగ్ రిపోర్టులు, పిఏసి రిపోర్టులు అవీ వచ్చి మీడియాకు మోదీ మైకం దిగి పరిశోధనల్లోకి దిగినప్పుడు అప్పుడు చెప్పగలుగుతాం – అవినీతి జరిగిందా లేదా, జరిగితే ఏ మేరకు అని. పిక్నిక్కులో ఏం జరిగిందో వెంటనే తెలియదు. ఐదారు నెలలు పోయాకనే చిన్నెలు కనబడతాయి. ప్రభుత్వం విషయంలో కొన్ని ఏళ్లు పడతాయి. ద్రవ్యోల్బణం తగ్గిందంటున్నారు కానీ ఆ ఛాయలు సామాన్యుడి జీవితంలో ఏమీ కనబడటం లేదు. అంతర్జాతీయంగా పెట్రోలు ధర తగ్గినా, యిక్కడ పెరుగుతోంది. గ్యాస్ ధరలు తగ్గలేదు, పప్పులు, బియ్యం, నూనె, రైలు చార్జీలు, బస్సు టిక్కెట్లు – ఏవీ తగ్గలేదు. తగ్గిందేమైనా వుందంటే రూపాయి మారకం విలువ తగ్గింది. ధరలు తగ్గే వరకు అచ్చే దిన్ వచ్చినట్లు ఎవరూ ఫీలవరు – యాడ్స్‌లో ఏం రాసి మెరిపించినా, మోదీగారు ఎంత వ్యంగ్యవైభవం కురిపించినా!

ఆర్థికపరమైన విషయాల్లో మోదీ పాలన ఎలా వుంది, బజెట్‌లో నిర్ణయించుకున్న గమ్యం ఏ మేరకు చేరారు అనేది గణాంకాలన్నీ తెలిసిన తర్వాతే చెప్పగలం. ఆయన పాలన తీరు గురించి చెప్పాలంటే – నేను భయపడినట్లుగానే నియంతృత్వ పోకడలతోనే సాగుతోంది. ఈయన మరో ఇందిరా గాంధీ అవుతాడన్న భయం ఎప్పుడూ వుంది, అది సహేతుకమో, నిర్హేతుకమో కాలమే నిర్ణయిస్తుంది. ఆయన ఏడాది పాలన ప్రచారంలో విశేషంగా ప్రస్తావిస్తున్న, ప్రస్తుతిస్తున్న విదేశీ పర్యటనల గురించే కాస్త ముచ్చటిస్తాను. 'మోదీ 12 నెలల్లో 18 విదేశాలు తిరిగి భారతదేశపు ప్రతిష్ఠ యినుమడింప చేశారు.' అని మరీమరీ రాస్తున్నారు. పర్యటనల వలన ప్రతిష్ట పెరిగిపోతుందంటే మన ఎమ్మెల్యేలు, ఎంపీలను కూడా ప్రతీ వారం విదేశాలకు పంపిస్తూ వుండవచ్చు. ప్రపంచంలో మూలమూలలా మన దేశమేం ఖర్మ, రాష్ట్రాల ప్రతిష్ఠ కూడా పెరిగిపోతుంది. 'అక్కడ మోదీకి ఘనస్వాగతం లభించిందంటే అది మోదీ పట్ల ప్రపంచ దేశాల దృక్కోణానికి నిదర్శనం' వంటివి అతిశయోక్తులు. అక్కడ మోదీ తన వ్యక్తిగతమైన హోదాలో వెళ్లటం లేదు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ ప్రతినిథిగా వెళుతున్నారు.

'ఇందిరా గాంధీ యుఎన్‌ఓలో స్పీచి యిస్తే అందరూ లేచి చప్పట్లు కొట్టారు' వంటి వార్తలు బాగా ప్రచారం చేసే రోజుల్లో చో రామస్వామి రాశారు – 'ఆ చప్పట్లు 90 కోట్ల ప్రజలకోసం కొట్టిన చప్పట్లు. వాటిల్లో మీకూ, నాకూ కూడా భాగం వుంది' అని. టింబక్టూ దేశాధిపతి ఎంత మేధావి అయినా ఆయన ప్రసంగానికి అన్ని చప్పట్లు పడవు – దేశం యొక్క ప్రాధాన్యత బట్టి దాని ప్రతినిథికి విలువ పెరుగుతుంది. మొన్న రిపబ్లిక్ ఉత్సవాల్లో ఒబామా కోసం ఎన్నో మినహాయింపులు యిచ్చారు. అతను అమెరికా అధ్యక్షుడు కాకుండా అర్జెంటినా అధ్యక్షుడైతే అంత విలువ యిస్తామా? మన వూరి బయటకు వెళ్లినపుడు మన వూరికి ప్రాతినిథ్యం వహిస్తాం, రాష్ట్రం బయటకు వెళ్లినపుడు రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహిస్తాం, మనమేదైనా మిస్‌బిహేవ్ చేస్తే గబుక్కున 'తెలుగువాళ్లంతా యింతేరా' అనేస్తారు. విదేశాలకు వెళ్లినపుడు ఇండియాకు ఆటోమెటిక్‌గా యిండియాకు రిప్రజెంటేటివ్ అయిపోతాం.

ఇక్కడ ఓ చిన్న సంఘటన చెప్తాను. మా మావయ్య ఫ్రెండు ఒకాయన ఇరిగేషన్ డిపార్టుమెంటు సీనియర్ యింజనీరుగా అంతర్జాతీయ బృందంతో కలిసి ఈజిప్టు వెళ్లాడు. అప్పట్లో ఈజిప్టు అధ్యక్షుడైన నాజర్ వీళ్లను పలకరించడానికి వచ్చాడు. ఈయన ఇండియా నుంచి వచ్చానని అనగానే ఆయన సంతోషంగా "హౌ ఈజ్ నెహ్రూ? ఫైన్!?" అని కుశలం అడిగాట్ట. నెహ్రూ, నాజర్ అలీన ఉద్యమంలో సారథులు, మంచి మిత్రులు. ఇండియా అనగానే నాజర్‌కు నెహ్రూయే గుర్తుకు వచ్చాడు. ఈ ఇంజనీరూ, నెహ్రూ కుటుంబసభ్యులైనట్టు ఒకరిని చూడగానే మరొకరు గుర్తుకు వచ్చినట్లు అడిగేశాడు. నిజానికి యీయన ఇండియాలో నెహ్రూను కలవగలడా? ఆ క్షణానికి నాజర్‌కు అవేమీ తోచలేదు. అలా మనం ఇండియా నుంచి.. అనగానే అవతలి విదేశీయుడు – గాంధీ, రాజ్ కపూర్, తందూరీ చికెన్... యిలా ఏదో ఒకటి గుర్తు చేసుకుంటాడు. వారిపై/వాటిపై తనకున్న యిష్టాన్ని మనపై చూపుతాడు. అదంతా మన ప్రతిభే అనుకుంటే పొరబాటు. భారత ప్రధాని స్థానంలో మోదీ కాదు, మరొకరు వెళ్లినా దేశాల మధ్య యిలాటి ప్రొటోకాల్ పాటిస్తారు.

ఇక వెళ్లగానే యిరుదేశాల మధ్య సంబంధాలు మెరుగుపడిపోయాయని అనడం తొందరపాటు. మనవాళ్లు ఏ దేశమెళ్లినా, ఏ దేశనాయకుడు మన దేశం వెళ్లినా యిరు దేశాల మధ్య తరతరాలుగా సాంస్కృతిక బంధం వుందని యిద్దరూ ఉద్ఘాటిస్తారు. చిన్నప్పుడు తొలిసారి యివి విన్నప్పుడు పులకించి పోయేవాణ్ని. తర్వాత తర్వాత అది తగ్గిపోయింది. అమెరికా వాళ్లు, రష్యా వాళ్లు, చైనా వాళ్లు – ఎవరైనా సరే ఇండియాకు వచ్చి ఏం అప్పచెపుతారో, పాకిస్తాన్‌లోనూ అదే చెప్తారు, శ్రీలంక లోనూ అదే చెప్తారు, బర్మాలోనూ అదే చెప్తారు. వెనకాల స్క్రిప్టు రైటర్స్ వుంటారుగా, పాత వాటినే అటూయిటూ మార్చి రాసి యిచ్చేస్తారు. పాత బంధాలు తవ్విపోయడం వలన వచ్చే లాభం ఏమీ వుండటం లేదు. అసలైన సరిహద్దు సమస్యలు ఎప్పుడూ పెండింగులోనే వుంటాయి. ఇక ఒప్పందాలంటారా, వాటి గురించిన కసరత్తు ఏళ్ల తరబడి సాగుతుంది. ఎప్పణ్నుంచో చేసుకుంటూ వచ్చిన బేరసారాలు తెమిలి, అప్పుడు లాంఛనంగా సంతకాలు పెడతారు. ఈ ప్రభుత్వాధికారులు మొదలుపెట్టిన ప్రక్రియ వచ్చే ప్రభుత్వహయాంలో పూర్తి కావచ్చు, అలాగే గతప్రభుత్వం చేసిన కృషి యీ ప్రభుత్వకాలంలో ఫలించవచ్చు. ఇక్కడ మన దగ్గర అధికారం మారగానే మన దేశం పట్ల వారి దృక్పథం రాత్రికి రాత్రి మారిపోయిందనుకోవడం అర్థరహితం. మోదీ విదేశీ పర్యటనలు అవసరం కంటె రెట్టింపు వున్నాయని నా భావన. చాలా దేశాల విషయంలో అది మొక్కుబడి వ్యవహారమే! తక్కినవాటి ప్రభావం సంగతి కూడా యిప్పుడే చెప్పలేం. కొన్నాళ్లు ఆగితేనే తెలుస్తుంది.

మామూలు గృహస్తు యింట్లో మాత్రమే గౌరవింపబడతాడు, విద్వాంసుడు దేశవిదేశాల్లో ఎక్కడకు వెళ్లినా గౌరవింపబడతాడు అని ఆర్యోక్తి. ఈ కాలంలో ధనికుడు అనుకోవాలి. మన దేశం ఆర్థికంగా బలమైన శక్తిగా వున్నపుడు మాత్రమే మన దేశప్రతినిథి మాట బయట చెల్లుబాటవుతుంది. ప్రస్తుతం వస్తున్న గౌరవమంతా మన దేశం సంపద చూసి కాదు, మన దేశస్తుల మేధోసంపద చూసి. ఇతర దేశాల్లో మనవాళ్లు సాధిస్తున్న విజయాలను చూసి ఇండియా అంటే ఆదరం పెరుగుతోంది. కానీ అది చాలదు. మనం ఆర్థికంగా బలపడాలి. దానికోసం పాలకులు నిరంతరం శ్రమించాలి. నిర్ణయాధికారం ఎవరికీ యివ్వకుండా, సర్వం గుప్పిట్లో పెట్టుకున్న ప్రధాని యింటి పట్టున వుండకుండా యాత్రలపై యాత్రలు చేస్తూ వుంటే ఆర్థిక ప్రక్రియ కుంటుపడుతుంది, జాప్యమవుతుంది. ఈ విషయంలో చైనావాళ్లను చూసి మనం చాలా నేర్చుకోవాలి. వాళ్లు చాలా దశాబ్దాల పాటు బయటకు రాలేదు. ఉపన్యాసాలు దంచలేదు. తమను తాము దిద్దుకుంటూ, ఆర్థికంగా బలపడుతూ వున్నారు. వాళ్లు గొప్ప శక్తిగా ఎదిగాక, అందరూ వాళ్ల చుట్టూ

రౌండ్లు కొడుతున్నారు. మోదీగారు యీ పాఠాన్ని నేర్చుకోవాలి. విదేశాలు తిరిగితే తిరగనివ్వండి, సెల్ఫీలు తీసుకోవాలనుకుంటే తీసుకోమనండి, కొత్త కొత్త సూట్లు వేసుకోవాలంటే వేసుకోనివ్వండి కానీ వాటి వలన ఏదో ఒరిగిందని యిప్పుడే ప్రచారం చేయకండి, ప్లీజ్!**– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2015)**

**మే 10** **ఎమ్బీయస్ : ఏడాది పాలనలో ఏం మారింది?**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఏడాది అవుతోంది. ఉద్యమసమయంలో లేవనెత్తిన అనేక అంశాల్లో సాంస్కృతిక పరమైన అణచివేత ఒకటి. ఆంధ్ర పాలకులు తెలంగాణ భాషను, తెలంగాణ సంస్కృతిని ఎద్దేవా చేశారని, సినిమా నుంచి సాహిత్యరంగాల దాకా అన్ని కళారూపాల్లో తెలంగాణ కళాకారులను అణచివేశారని విపరీతమైన ప్రచారం జరిగింది. తెలంగాణ ఏర్పడ్డాక యివన్నీ చక్కదిద్దుతామని అన్నారు. ఆ లక్ష్యాలు ఏ మేరకు నెరవేరాయి?

తెలుగుతల్లికి భిన్నంగా కెసియార్ తెలంగాణ తల్లిని తీసుకుని వచ్చారు. తెలుగుతల్లిని దయ్యమో ఏదో అన్నారు (ఆయన తిట్టిన తిట్లల్లో అన్నీ గుర్తు పెట్టుకోవడం కష్టం) ఆంధ్రులు రాక్షససంతతి అన్నపుడు, తెలుగు తల్లి రాక్షసమాత, లేక రాక్షసి అయివుండాలి. కానీ ఆయన అలా అనలేదు. తెలంగాణ తల్లి చల్లని తల్లి అన్నారు. ఊరూరా ఆవిడ విగ్రహాలు నెలకొల్పుతామన్నారు. ఉద్యమసమయంలో తీరిక చిక్కకో నిధులు చాలకో ఆ పని చేయలేదు. ఇప్పుడైనా ఆ పని చేస్తున్నట్లు వార్తల్లో రావటం లేదు. విగ్రహాల కాంట్రాక్టు అంటే కాంట్రాక్టర్లు ఉత్సాహం వుండదన్న శంకో ఏమో, ఏకంగా అన్ని కళలకూ కలిపి ఒక్కటే పెద్ద కళాభవనం కట్టేస్తానంటున్నారు. తెలంగాణ కళల గురించి అవగాహన పెరగవలసినది పట్టణాల్లో, గ్రామాల్లో. కానీ యీయన దాన్ని తెలంగాణేతరులు పెద్ద సంఖ్యలో వున్న హైదరాబాదులో కడతానంటున్నారు. కెసియార్ కంటికి, చంద్రబాబు కంటికి పెద్దపెద్ద భవనాలు, బహుళ అంతస్తుల ఆకాశహర్మ్యాలు తప్ప వేరే ఏవీ ఆనటం లేదు. భూకంప ప్రమాదం వుండే జోన్‌లో వున్నామని తెలిసి కూడా మల్టీస్టోరీడ్ బిల్డింగులు కడతామంటున్నారు. భవనం కడితే కాంట్రాక్టర్లు సంతోషిస్తారు బాగానే వుంది. మరి ప్రదర్శన జరిగితే ఆడియన్సు రావాలి కదా! వస్తారా? హాళ్లు నిండుతాయా? ఇప్పటికే రవీంద్ర భారతి, త్యాగరాయ గానసభ కళ తప్పాయి. టిక్కెట్లతో ఆడిటోరియం తనను తాను పోషించుకుంటుందా? లేక నిధులివ్వలేక ప్రభుత్వం దానిలో మల్టీప్లెక్సులు, కమ్మర్షియల్ కాంప్లెక్సులు అనుమతించి ఆదాయం గడిస్తుందా? అలా అయితే వాణిసేవ కంటె ఎక్కువగా వాణిజ్యసేవలకే యిది ప్లాను చేస్తున్నారని అనుకోవాలి.

కళాకారులకు తెలంగాణ పెద్దపీట వేస్తుంది అన్నారు. ఉద్యమంలో గజ్జె కట్టి ఆడినవారికి, పాడిన వారికి టిక్కెట్లు యిచ్చారు. కళాకారులను గుర్తించి సాంస్కృతిక సారథులుగా ఉద్యోగాలు యిచ్చేమన్నారు. అది ఎంత వివాదాస్పదమైందో ఆంధ్రజ్యోతి కథనాలు వివరిస్తున్నాయి. కళతో సంబంధం లేనివారికి కూడా పదవులు, ఉద్యోగాలు దక్కాయని కొందరి ఆరోపణ. ఉద్యమంలో పాలు పంచుకోనివారికి కూడా ఉద్యోగాలు యివ్వడమేమిటని విమర్శ. తెరాస కార్యకర్తలనే కళాకారులుగా బనాయిస్తున్నారని మరో ఆరోపణ. నిజానికి ఉద్యమంలో పని చేయకపోయినంత మాత్రాన వాళ్లు కళాకారులు కాకుండా పోరు. తెలంగాణ ఔన్నత్యాన్ని ప్రజలకు చాటి చెప్పి వారిలో ఆత్మగౌరవం పెంపొందించడమే సారథుల కర్తవ్యమైతే దాన్ని ఎవరు ఎంత బాగా చేయగలరు అనేదే పరిగణించాలి తప్ప తక్కినవి పట్టించుకోకూడదు. ఏదైతేనేం, కడుపు మండిన కళాకారులు యిప్పుడు కెసియార్‌నే తమ ధూంధాంలకు లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఉద్యోగాలు దక్కించుకున్న సారథులు తెలంగాణ గురించి కీర్తిస్తారా లేక తెరాస గురించి కీర్తిస్తారా అన్నది వేచి చూడాలి. మిషన్ కాకతీయ, స్వచ్ఛ హైదరాబాదు వంటి ప్రభుత్వ కార్యక్రమాల గురించి ప్రజల్లో అవగాహన కోసం వీరిని వుపయోగించుకుంటే మంచిదే. కానీ కెసియార్ కుటుంబసభ్యుల కీర్తనలు చేస్తే మాత్రం ప్రభుత్వధనం వృథా అయినట్లే.

తెలంగాణ వాళ్లమన్న కారణంగా సినిమా రంగంలో పైకి రాకుండా తొక్కేశారు అని విజయశాంతి వంటి వారు అప్పుడు గగ్గోలు పెట్టేశారు. టీవీల్లో కూడా తొక్కేస్తున్నారంటూ రాణీ రుద్రమ అనే టీవీ యాంకర్ వరంగల్ నందీ ఆవార్డుల సభలో వివాదం లేపారు. తెలంగాణ భాషను, యాసను ఎద్దేవా చేశారని ఎంతమంది అన్నారో లెక్కే లేదు. ఈ ఏడాదిలో ఆ దిశగా దిద్దుబాటు చర్యలు ఏమైనా చేపట్టారా? తెలంగాణలో పుట్టిన హీరో, హీరోయిన్లతో సినిమా తీస్తే యింత సబ్సిడీ అన్నారా? ప్రభుత్వం పూనుకుని ప్రతీ సినిమాలో 20% మంది తెర ముందు, 30% మంది తెర వెనుక తెలంగాణ వాళ్లను పెట్టుకోవాలి అని నిర్మాతలకు కౌన్సిలింగు చేపట్టిందా? తెలంగాణ యాస కమెడియన్లకు వాడితే జరిమానా, హీరోలకు వాడితే వినోదపు పన్ను రద్దు, విలన్లకు వాడితే సినిమాయే రద్దు అన్నారా? ఫిల్మ్ సిటీ రెండు వేల ఎకరాల్లో కడతామన్నారు. దానిలో తెలంగాణ నిర్మాతలకైతే రిజిస్ట్రేషన్, స్టాంపు చార్జిలు వుండవు అని ప్రకటించి తెలంగాణ వారిని సినీ రంగంలో పెట్టుబడుల కోసం ప్రోత్సహించారా? జై బోలో తెలంగాణ వంటి సినిమాలు తీసినవారిని పిలిచి గతంలో ఫిల్మ్స్ డివిజన్ వాళ్ల చేత తీయించినట్లు ప్రభుత్వధనంతో తెలంగాణ చరిత్రపై డాక్యుమెంటరీలు, ఫీచరు ఫిల్ములు తీయిస్తున్నారా? కాకతీయ వైభవానికి అద్దం పట్టిన "రుద్రమదేవి" సినిమాకు వినోదపు పన్ను మినహాయిస్తామన్న ప్రకటన ఏదైనా చేశారా? ఉద్యమకాలంలో పాల్కురికి సోమనాథుడు, గుణాఢ్యుడు గురించి అన్ని కబుర్లు చెప్పారే, వారి పేర ఉత్సవాలు, సప్తాహాలు, సెమినార్లు నిర్వహించారా? వాళ్ల రచనలను తక్కువ ధరలో ముద్రించి అందుబాటులోకి తెచ్చారా? అంతెందుకు ఉగాది పురస్కారాలంటూ తెలంగాణ ప్రభుత్వం అవార్డుల యిచ్చిన వారిలో చాలామంది గురించి నా బోటివాళ్లకు తెలియదు. 'సమైక్యపాలనలో

యీ ప్రతిభావంతులను తొక్కేయడం వలన వారి గురించి ప్రచారం లేకపోయింది' అనుకుంటే మరి వారి కృషి ఏమిటో ప్రజలకు తెలియచెప్పడానికైనా వారి పుస్తకాలు, వారి గురించి పుస్తకాలు అవీ ప్రభుత్వ సంస్థల ద్వారా వేయాలి కదా.

కూచిపూడి నాట్యకళాకారులెన్నైన రాజారెడ్డి, రాధారెడ్డి దంపతులు తమకు రవీంద్రభారతి యివ్వలేదని బహిరంగంగా చెప్పేశారు. వారు తెలంగాణలో పుట్టినా ఆంధ్రుల నాట్యరూపమైన కూచిపూడిలో పేరు తెచ్చుకున్నందుకు వారికీ శిక్ష. "కూచిపూడి ఆంధ్రకు చెందినది కదా, దానితో మనకు పనేమిటి?" అని సంచాలకుల సందేహమట. మరి తంజావూరులో పుట్టిన భరతనాట్యం మాటేమిటి? ఒడిస్సాలో పుట్టిన గీతగోవిందం మాటేమిటి? అసలా ఆడిటోరియంకు బెంగాల్‌లో పుట్టిన రవీంద్రుడి పేరు పెట్టుకోవడమేమిటి? ఖవ్వాలీ, తిల్లానా, గజల్ ఎక్కడ పుట్టిందో తెలుసుకుని వెళ్లి ఆ యా రాష్ట్రాల్లో ప్రదర్శించుకోండి, యిక్కడ పేరిణి శివతాండవం (దానికున్న మరో పేరు – ఆంధ్ర నాట్యం వాడకుండా వుంటేనే!) తప్ప మరేమీ ఒప్పుకోం అంటారేమో! ఇలా చీల్చుకుంటూ, అవతల పారేస్తూ పోతే ఏం మిగులుతుందో కొత్త పాలకులకే తెలియాలి. ఇక్కడ పుట్టినా ఆంధ్ర మూలాలు వున్నాయన్న కారణంగా జనాభాను విడదీసి చూస్తున్నారు. వారిలో ప్రతిభ వున్నా అవార్డు యివ్వడానికి వెనకాడుతున్నారు. పోనుపోను యిది ఎక్కడకు దారి తీస్తుందో తెలియదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2015)**

**జూన్ 01** **ఎమ్బీయస్ : రేవంత్ అంశం ఎంతదూరం వెళుతుంది?**

టిడిపికి రేవంత్ పెద్ద చిక్కే తెచ్చిపెట్టారు. ఇరు తెలుగు రాష్ట్రాలలో పార్టీ ఫిరాయింపులు చాలాకాలంగా సాగుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్ర విభజన ప్రకటన వచ్చిన దగ్గర్నుంచి పెద్ద పెద్ద నాయకులు కూడా పార్టీలు మారిపోవడం ప్రారంభించారు. కొందరు ఎన్నికల ముందు మారితే, కొందరు ఎన్నికల తర్వాత మారారు. రాజకీయ భవిష్యత్తు కోసం పార్టీలు మారడం ఎప్పణ్నుంచో వుంది కానీ యీ ఫిరాయింపుల్లో బెదిరింపులు, లాలింపులు, పూరింపులు కూడా వుంటున్నాయని తోస్తూంది. తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల గురించి గట్టిగా మాట్లాడే టిడిపి, ఆంధ్రలో ఫిరాయింపులను సమర్థించుకుంటూ వచ్చింది. తమ పార్టీనుంచి టిడిపికి ఫిరాయించినవారిని విమర్శిస్తున్న వైకాపా అసలు తమ పార్టీయే ఫిరాయింపుదార్లతో ప్రారంభమైన మాట మర్చిపోతూ వచ్చింది. రాజకీయాలకు కొత్తవారిని, విద్యాధికులను, యువకులను రాజకీయాల్లోకి ఆకర్షించి వారిని క్యాడర్‌గా మలుచుకుందామనే ఓపిక ఎన్టీయార్ తర్వాత వేరెవ్వరికీ కనబడటం లేదు. పార్టీ పెట్టగానే యిప్పటికే ఫిరాయింపుల్లో, రాజకీయ క్రీడల్లో ఆరితేరినవారిని అనుభవం పేర తీసుకోవడం, ఆ తర్వాత వాళ్లు తమ నుంచి వెళ్లిపోయినపుడు వారికి స్థిరత్వం లేదని తిట్టుకోవడం జరుగుతోంది.

ఫిరాయింపుల్లో కాంట్రాక్టులో, డబ్బులో ప్రధాన భూమిక పోషిస్తున్నాయని తెలుసు కానీ రుజువులు దొరకవు. సిద్ధాంతాలు నచ్చి అనో, నా ప్రయోజనాలు కాదు, నా నియోజకవర్గం ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి కోసం అధికార పార్టీలో చేరుతున్నాను అనో పైకి చెప్తారు. నమ్మితే నమ్మవచ్చు, మీరు నమ్మకపోయినా వాళ్లకు పోయేది ఏమీ లేదు. తెలంగాణలో కెసియార్ బాహాటంగా ఫిరాయింపులు ప్రోత్సహిస్తున్నారు. నియమాలకు విరుద్ధంగా కౌన్సిల్‌లో టిడిపిని స్వాహా చేయడానికి పూనుకున్నారు. కెసియార్ చేష్టలను వ్యతిరేకించే సత్తా తెలంగాణలో ఎవరికీ కనబడటం లేదు. మీడియా భయంతోనో, భక్తితోనో అణిగి వుంది. మేధావులు నోటికి తాళం వేసుకున్నారు. కాంగ్రెసు చేష్టలుడిగి కూర్చుంది. టిడిపిలో కొందరు మాత్రమే గొంతు విప్పుతున్నారు కానీ ఎవరు ఎప్పుడు గోడ దూకుతారో తెలియదు కాబట్టి తన సహచరుల పట్ల ప్రతీ నాయకుడు అనుమానంగా చూస్తున్నాడు. ఇక వారిలో ప్రతిఘటించే శక్తి ఎలా వస్తుంది? తను ఏం చేసినా చెల్లిపోతుందనే ధైర్యంతో కెసియార్ ముందుకు దూసుకుపోతున్నారు. టిడిపిలో ఎర్రబెల్లి దయాకరరావు ఆయనను సమర్థవంతంగా ఎదుర్కోవటం లేదు. చేతకాకనో, మనసు రాకనో తెలియదు. అందువలన తను తెలంగాణలో ఏకైక టిడిపి నాయకుడిగా ఎదిగే అవకాశం వుందని రేవంత్ రెడ్డి అంచనా వేసుకున్నారు. అసెంబ్లీలో భీకరంగా పోరాడుతున్నారు. నిజానికి తెలంగాణలో ఏకైక ప్రతిపక్ష నాయకుడిగా రేవంత్ గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అతన్ని చూసి తెరాస నాయకత్వం భయపడుతోందని, ఎలాగైనా అతని గొంతు నొక్కాలని చూస్తోందని అందరికీ తెలిసిన విషయమే. కెసియార్ వ్యతిరేకులందరూ యిష్టం వున్నా, లేకపోయినా రేవంత్ వెనక్కాల చేరి, అతనికి దన్నుగా నిలబడక తప్పని పరిస్థితి వస్తోందని అనుకుంటూండగా రేవంత్ యీ దుస్సాహసం చేశారు.

రేవంత్ చేసినది దుస్సాహసమా? పట్టుబడ్డాడు కాబట్టి అలా అనిపిస్తోంది. ప్లాను వేసి పట్టుకున్నారు కాబట్టి యిది బయటకు వచ్చింది. బయటకు రానివి ఎన్నో! ఇలా పట్టుకుంటారన్న భయం రేవంత్‌కు లేదా? వీడియో టేపులో అతను మాట్లాడే ధోరణి చూస్తే యిలాటివి సర్వసాధారణమే అనిపిస్తోంది. ఇక్కడ టిడిపి ఎమ్మెల్యే ఓటును కొంటోంది. తెరాస కూడా యిదే రీతిలో కొని వుంటుంది. ఆ మాటే చంద్రబాబు అన్నారు. ఉన్న ఓట్లకు మించి వాళ్లకు ఎక్కువగా ఎలా వచ్చాయి, కొనకపోతే..? అని! దాదాపు మూడున్నర దశాబ్దాలుగా రాజకీయాల్లో వున్న ఆయనకు యీ విషయాలు బాగా తెలుస్తాయి. సినిమాల్లో స్మగ్లర్లలా ఎక్కడో రహస్యప్రదేశంలో కలవడం, కోడ్‌లో మాట్లాడుకోవడం అలాటివి ఏమీ లేవు. ఎమ్మెల్యే ఆత్మీయుల యిళ్లకే వచ్చి బ్యాగులో డబ్బు తెచ్చి టేబుల్ మీద సర్దేసి ఫ్రీగా మాట్లాడేసుకోవడమే. ఆ సమయంలో ఆ యింటికి అతిథులెవరైనా వస్తే ఏం బాగుంటుంది అన్న జంకేనా లేదు. ఎమ్మెల్యే కూడా తను అప్పుల్లో వున్నాననీ, తన ఓటు అమ్మకానికి వుందని క్వికర్‌లో పెట్టలేదు కానీ తన ఆత్మీయులతో అన్నాడట. ఆయన

కాంగ్రెసు నడిగితే మాకు యింట్రస్టు లేదన్నారట, మాకుంది అంటూ రేవంత్ ముందుకు వచ్చారట. వీళ్లంతా కలిసి మనకు ప్రజాస్వామ్య విలువల గురించి, రాజకీయాల్లో అవినీతి నిర్మూలన గురించి ఉపన్యాసాలు దంచుతూ వుంటారు. మనం వింటూ వుంటాం.

ఈ పని రేవంతే ఎందుకు చేపట్టారు? దయాకర రావు కంటె తనే లీడరుగా ఎదగాలన్న తపనతోనా? ఈ స్టీఫెన్‌సన్ రేవంత్ జిల్లా ఆయన కాదు, ఆయన కమ్యూనిటీకి చెందినవాడు కాదు. టిడిపి తరఫున ఎవరైనా వెళ్లి వుండవచ్చు. టెర్మ్స్ గురించి రేవంత్ వేరే వాళ్ల చేత ఫోన్లో మాట్లాడించి, ఎవరైనా నమ్మకస్తుల చేత డబ్బు పంపించేసి వుండవచ్చు. పీతల సుజాత గారు మా యింట్లో మతిమరుపు మనిషి పది లక్షలు వదిలేసి వెళ్లింది అన్నట్లు (అదేమిటో అలాటి మనుషులెవరూ మన యింటికి రారు, మంత్రుల యిళ్లకే వెళతారు, మెథడ్ యిన్ మ్యాడ్‌నెస్ అన్నట్టు మతిమరుపులో మంత్రిమరుపు వుంటుందన్నమాట – మంత్రి యింట్లో వుండగానే మరుపు కమ్ముతుంది, మంత్రులు వాగ్దానాలు చేసి మర్చిపోతారు, వీళ్లు డబ్బులు తెచ్చి మర్చిపోతారు) 'మా డ్రైవరును 50 లక్షలు పార్టీ ఫండ్‌కి కట్టేసి రమ్మంటే మతిమరుపు చేత దార్లో కనబడిన ఎమ్మెల్యే యింట్లో పడేసి వచ్చాడు' అని రేవంత్ చెప్పే అవకాశం వుండేది. కానీ యాయన స్వయంగా వెళ్లాడు. పని సాధించుకుని వచ్చి చంద్రబాబు గారి చేత 'శభాష్, ఎర్రబెల్లి కంటె నువ్వే బెటరు, ఘటనాఘటన సమర్థుడివి, రేపు 2019 ఎన్నికలలో 40 సీట్లు గెలిచినా తక్కినవి కొనుగోలు చేయగలనని నిరూపించుకున్నావ్, కాబోయే సిఎం నువ్వే' అనిపించుకోవాలనా? తను తెలంగాణ సిఎం కావడానికి వుండే అవకాశాల గురించి రేవంత్ చాలా లాజికల్‌గా మాట్లాడారు. అలా జరగడానికి ఎంతైనా అవకాశం వుంది.

ఇంత లాజికల్‌గా మాట్లాడినాయన బాబు గురించి చెప్పినది మాత్రం అబద్ధమవుతుందా? స్టీఫెన్‌సన్ ఓటు గొడవ పసిగట్టి తెరాస ఆయనపై చర్య తీసుకుంటే ఆదుకుని ఆంధ్రలో ఏదోలా కాంపెన్సేట్ చేయగలిగినది బాబు ఒక్కరే కదా. ఆ హామీ బాబు యివ్వనిదే రేవంత్ తనంతట తాను పక్క రాష్ట్రంలో పదవి గురించి ధీమాగా మాట్లాడగలరా? రెండున్నర కోట్ల వరకు తనకు లిమిట్ వుందని, ఆ పైన అయితే బాస్‌ను అడగాలని అనడం కూడా రీజనబుల్‌గానే తోస్తోంది. ఆ రేటుకు బాస్ ఒప్పుకోకపోయినా, తను ఒప్పించి సాధించానని మధ్యవర్తులు చెప్పుకుంటూ వుంటారు. రేవంత్ అదే విధంగా వ్యవహరించారు. ఎమ్మెల్సీ సీటు గురించి కాదనీ, యిది బాబు వెర్సస్ కెసియార్ ప్రిస్టేజి క్వశ్చన్ అనీ ఆయన అన్నది నూటికి నూరు శాతం సత్యం. రేవంత్ ఏజంటుగా వచ్చారు తప్ప ప్రిన్సిపల్‌గా రాలేదని ఆయన సంభాషణ స్పష్టంగా తెలుపుతోంది. రేవంత్ స్వలాభం గురించో, తన సీటు నిలుపుకోవడానికో యీ పని చేయడం లేదు, తమ పార్టీ అభ్యర్థిని గెలిపించడానికే యీ అకృత్యానికి ఒడిగట్టారు. పార్టీ అధ్యక్షుడికి దీనిలో ఏ మేరకు ప్రమేయం వుంది అన్నదే చర్చనీయాంశం.

అధ్యక్షుడికి తెలియకుండా రేవంతే యీ పని చేసి వుంటే..? చేసి వుంటారా? దేనికోసం? ఎవరి కోసం? తన సొంత డబ్బు 5 కోట్లు ఖర్చు పెట్టి టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపిస్తే రేవంత్‌కు కలిగే లాభం ఏమిటి? ఆ ఎమ్మెల్సీ యాయన ముఖ్యమంత్రి కావడానికి ఓటేస్తాడా? ఈయనకు కాంట్రాక్టులు యిప్పిస్తాడా? ఏదైనా హత్య జరిగినపుడు దీనివలన ప్రయోజనం కలిగేది ఎవరికి? ఈ హత్య చేయడానికి అవకాశం వున్నది ఎవరికి? అనే కోణాలతో పరిశోధన ప్రారంభిస్తారు. ఆ విధంగా చూస్తే యీ లంచపు వ్యవహారంలో రేవంత్‌కు కలిగే ప్రయోజనం ఏమీ కనబడటం లేదు. 'ఏదో ఒకటి చేసి కెసియార్ కాండిడేటును ఓడించగలిగావు' అని బాబు మెప్పు పొందడం తప్ప! దానికోసం 5 కోట్లు స్వార్జితం ఖర్చు పెడతారా రేవంత్? ఆయన అధికార పార్టీలో లేడు, యిప్పట్లో ఎన్నికలు లేవు, అధికార పార్టీకి కంటిలో నలుసుగా వున్నందువలన మిషన్ కాకతీయ వంటి పనుల్లో తన వాళ్లకు కాంట్రాక్టులు యిప్పించి సంపాదించడం మహా కష్టం. ఇప్పుడు యిచ్చినది మళ్లీ సంపాదించుకునే అవకాశాలు తక్కువ. రేవంత్ తనకోసం కాకపోతే వేరే ఎవరికోసం యీ పని చేసినట్లు?

లంచం యివ్వడానికి స్వయంగా వెళ్లడంలో రేవంత్ అడాసిటీ చూపించారు. అది వట్టి దుస్సాహసమే కాదు, బేపర్వాతో కూడినది, ఎవరేమనుకుంటే నాకేం యిలాటిది ఎంతమంది చేయటం లేదు కనుక, మనం పట్టుబడం, ఒకవేళ పట్టుబడినా తక్కినవాళ్లు చేయటం లేదా అని దబాయించవచ్చు అనే ధీమాతో ముందుకు వెళ్లారు. స్వయంగా వెళ్లి పని చేసుకుని వచ్చిన ఆనందాన్ని పొందుదామనుకున్నారో, లేక తను వెళ్లకపోతే అవతలివ్యక్తి నమ్మడనుకున్నారో తెలియదు. టిడిపి–తెరాస మధ్య నడిచే వార్ నడుస్తోందని తెలుసు, వేరే వారిని పంపించి తనను పట్టిస్తారన్న భయం ఆ ఎమ్మెల్యేకు కూడా వుండవచ్చు కదా. 'నేను కూడా యిన్వాల్వ్ అయ్యాను, నిన్ను బయటపడితే నేనూ చిక్కుల్లో పడతాను, అంతా రహస్యంగానే వుంచుదాం' అని ధైర్యం చెప్పడానికి రేవంత్ స్వయంగా వెళ్లారనుకోవాలి. అయితే అవతలివాళ్ల ప్లాను వేరేగా వుండడంతో ఆయన పవిత్రుడు అయిపోయాడు, యీయన పాపి అయిపోయాడు.

దొరికేదాకా ప్రతీవాడూ దొరే. దొరికిపోయాక కూడా దొరలా మీసం మెలేసిన ఘనత మాత్రం రేవంత్‌దే. సాధారణంగా అలాటి సందర్భాల్లో రుమాలుతో మొహం కప్పుకుంటారు, నాకు ఛాతీలో నొప్పిగా వుందంటూ స్ట్రెచ్చర్ ఎక్కేస్తారు, లేకపోతే గంభీరంగా మొహం పెట్టి మా లాయరు వచ్చేదాకా నేనేమీ మాట్లాడను అంటారు. ఇలా మీసం మెలేయడం వెరైటీగా వుంది. సాధారణంగా భయం వేసినపుడు జనాలు ఒకలా నవ్వుతారు. కెమెరాలు దాచి భయపెట్టిన సందర్భాల్లో చూడండి, భయపడుతూనే నవ్వుతారు. భయాన్ని ఎడ్జస్ట్ చేసుకోవడానికి శరీరం అలాటి నవ్వును ప్రేరేపిస్తుందేమో, నాకు తెలియదు. సిగ్గు పడవలసిన సందర్భంలో రేవంత్ నవ్వడం (యింకా నయం తొడగొట్టలేదు), భవిష్యత్తులో యిదే పోలీసుల చేత కెసియార్‌ను అరెస్టు చేయిస్తానని చెప్పడం వింతగా

వుంది. రేపటి మాట సరే, యీ రోజు నువ్వు పట్టుబడ్డావు కదా, జైల్లోకి వెళుతున్నావు కదా, దాని గురించి మాట్లాడకుండా, కెసియార్ అరెస్టు గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా వుంది. 'రేపు' సి. నరసింహారావుగారు మానసిక విశ్లేషణలో దిట్ట. ఈ మీసం మెలివేత గురించి వ్యాసం రాస్తారేమో చూడాలి.

రేవంత్ ఎంత అడాషియస్‌గా ప్రవర్తించారో కెసియార్ కూడా అంతే అడాషియస్‌గా ప్లాన్ చేశారని చెప్పాలి. సాధారణంగా రాజకీయ నాయకులందరూ ఒకరి నొకరు రక్షించుకుంటూ వుంటారు. మన వీనులకు విందు చేయాలని 'మేం అధికారంలోకి వస్తే ప్రస్తుతం అధికారంలో వున్న అవినీతి పరులైన నాయకుల భరతం పడతాం, స్విస్ బ్యాంకుల్లో దాచిన డబ్బును కక్కిస్తాం, వాళ్ల ఆస్తులు స్వాధీనం చేసుకుని పేదలకు పంచుతాం' అని ప్రకటనలు చేస్తారు కానీ అలా చేసిన నాయకులను ఎవర్నీ చూడలేదు. (ఒక్క మినహాయింపు – కరుణానిధి–జయలలిత! కరుణానిధి–ఎమ్జీయార్‌ల మధ్య సైతం ఒప్పందమో, రాజీయో వుండేది) కేసులు పెడితే రాజకీయంగా కక్ష సాధించారని అవతలి వాళ్లు అంటారు, ప్రజలు అది నమ్మి వారిపై సానుభూతి పెంచుకుంటారన్న భయం కాబోలు అనుకునేవాణ్ని. అదేమీ కాదని తర్వాత అర్థమైంది. ప్రతిపక్షంలో వున్న వైయస్ బాబుపై కేసులు పెట్టారు, మళ్లీ ఎందుకోగాని విత్‌డ్రా చేసేసుకున్నారు. అలా అని బాబు మంచివాడని సర్టిఫికెట్టు యిచ్చారా? లేదు. అసెంబ్లీలో హెూరాహెూరీ తిట్టేసుకుంటూనే వచ్చారు. బాలకృష్ణ యింట్లో కాల్పుల కేసును ఎంత దారుణంగా కామాపు చేశారో చూశాం. అధికారంలో వున్న పార్టీ చొరవ లేకుండా అలా జరిగేదా? రాజకీయ ప్రతిక్షకులు యిలా సహకరించు కోవడమేమిటి? టిడిపి అధికారంలోకి వచ్చి ఏడాది అయింది. జగన్ లక్షకోట్లను బయటకు లాగడం గురించి చేసిన ఎన్నికల వాగ్దానం దిశగా ఒక్క అడుగేనా పడిందా? ఆరోపణ అబద్ధమనీ అనరు, అతిశయోక్తి అనీ అనరు, మళ్లీ మళ్లీ దాన్నే అసెంబ్లీలో, టీవీ చర్చల్లో ప్రస్తావిస్తూనే వుంటారు. కానీ చట్టానికి పట్టిచ్చే దిశగా ఏమీ చేయరు. ఎందుకిలా?

మాఫియా నాయకుల మధ్య నిశ్శబ్ద నియమం (ఒమెర్తా) వుంటుంది – ఒకరి పనులపై మరొకరు మాట్లాడకూడదని. రాజకీయనాయకుల మధ్య వుండే నియమం యిలాటిదే కానీ కాస్త తేడా వుంటుంది – పైకి మాట్లాడతాం, కానీ ఏమీ చేయం – అని. నాది నువ్వు సాక్ష్యాలతో బయటపెడితే, నీది నేను సాక్ష్యాలతో బయటపెడతా అన్న బెదిరింపు అంతర్లీనంగా వుంటుంది. అందుకని ఒకరు ఆరోపణ చేస్తారు, అవతలివాళ్లు ఆధారాలు చూపించండి అని గర్జిస్తారు, వీళ్లు సరైన టైములో పోలీసులకు ఆధారాలు యిస్తాను అంటారు, సమయం గడిచిపోతుంది, వాళ్లు అడగరు, వీళ్లు యివ్వరు, పోలీసులు కూడా వచ్చి మీ దగ్గరేవో ఆధారాలున్నాయట యివ్వండి అని అడగరు, కోర్టులో అనేక విషయాలు సుమోటో (తమంతట తామే) చేపడతాయి కానీ యిలాటి వాటి జోలికి వెళ్లరు. ప్రభుత్వ ఆస్తులు, దేవాలయ భూములు, వక్ఫ్ స్థలాలు, చెఱువులు – యివన్నీ కబ్జా అయిపోయాయి. మేం అధికారంలోకి రాగానే వాళ్ల దుంప తెంపుతాం అన్నవారెవరూ ఆ ఆక్రమణదారులపై కేసులు పెట్టిన దాఖలాలు లేవు. తమ ఎమ్మెల్యేలు అవతలి పార్టీలో మారిపోయినప్పుడు వారిని ప్రలోభపెట్టారని ఆరోపించి వూరుకుంటారు తప్ప ఆ ప్రలోభమేమిటో సాక్ష్యాధారాలతో నిరూపించడానికి ఎవరూ పూనుకోరు. ఎందుకంటే ఆ తీగ లాగితే తమ డొంక కూడా కదులుతుందని భయం. ఇది ఎన్నో ఏళ్లగా చూస్తూ వచ్చాం. ఈ రోజు కెసియార్ చేసినది దీనికి పూర్తిగా విరుద్ధంగా వుంది.

టిడిపి ఎమ్మెల్యేలను కొంటోందని పబ్లిగ్గా అల్లరి పెడితే, ఆ ఆరోపణ తిరిగి వచ్చి తమకు తగులుతుందన్న భయం వుండాలి. తాము పట్టిచ్చినట్టే, వాళ్లూ తమను పట్టిస్తే ఘోరావమానమన్న జంకు వుండాలి. నిజానికి కెసియార్ యీ మేరకు తెగించడం యితర రాజకీయనాయకులకు కూడా రుచించదు. 'చూసీ చూడనట్లు వదిలేయాలి తప్ప, యిలా బయటపెట్టుకుంటే ప్రజలకు మనందరి మీదా అసహ్యం వేయదా?' అని వాళ్లు మందలిస్తారు కూడా. ఇప్పుడు వ్యవహారం తన మెడకు చుట్టుకుంటోంది కాబట్టి చంద్రబాబు జాతీయ నాయకుల చేత కెసియార్‌కు చెప్పించే ప్రయత్నం చేస్తారు. ముఖ్యంగా మోదీ చేత.. కనీసం వెంకయ్య నాయుడు చేత! వాళ్లు కూడా కెసియార్ చర్యను దుందుడుకు చర్యగానే చూస్తారు. తమను యిబ్బందికర పరిస్థితిలోకి నెట్టినందుకు చికాకు పడతారు. తెలంగాణకు రావలసిన నిధులపై, కేంద్రసహాయంపై దాని పర్యవసానం ఎలా వుంటుందో, యిప్పుడు ఎవరూ వూహించలేరు. ఎన్టీయార్ యిలాటి దుస్సాహసపు పనులు చాలా చేశారు కానీ దానికి కారణం రాజకీయాల్లో ఆయన అనుభవరాహిత్యం! కానీ రాజకీయాల్లో తలపండిన కెసియార్ యివన్నీ ముందే లెక్కేసుకుని వుంటారు. అయినా దూకుడుగా ముందుకు వెళ్లారు. దెబ్బకు చంద్రబాబును రాజకీయంగా ఫినిష్ చేయలేక పోయినా నిర్వీర్యం చేసేద్దా మనుకుంటున్నారేమో! అది సాధ్యమా? కాలమే చెప్పాలి.

పర్యవసానాలు ఎలా తేలతాయో తెలియదు కాబట్టి రేవంత్‌ను పట్టివ్వడం కెసియార్ తీసుకున్న పెద్ద రిస్కే అనాలి. ఈ స్థాయిలో గ్యాంబుల్ చేయడం దేనికి? తెలంగాణలో టిడిపి బలంగా లేదు. ఉన్న లీడర్లందర్నీ కెసియార్ వూడ్చేస్తున్నారు. రేవంత్ ఒక్కరు తప్ప తక్కినవాళ్లు గట్టిగా పోరాడడం కూడా లేదు. బాబుపై కసి వుంది అనుకోవడానికి రాజకీయాల్లో శాశ్వత శత్రువులూ వుండరు, మిత్రులూ వుండరు. ఎంత కసియైనా యింత దూరం వెళతారా? రేవంత్, బాబులలో ఎవరు ఎ1యో, ఎవరు ఎ2యో త్వరలో తెలుస్తుంది. బాబు ఎమ్మెల్యేతో మాట్లాడినట్లు ఆడియో సాక్ష్యం వుందని తెలంగాణ హెూం మంత్రి అంటున్నారు. అలా అయితే బాబు ఎ1 అయి, రేవంత్ బాబు ఏజంటుగా ఎ2 అవుతారు. ఎ1 అయినా ఎ2 అయినా ముఖ్యమంత్రిపై కేసు బుక్ చేస్తే అది పెద్ద స్కాండలే అవుతుంది. కేసు బుక్ చేయడానికి గవర్నరు అనుమతి వంటి బోల్డు తతంగం వుంటుంది. ఫైనల్‌గా కోర్టులో కేసు వీగిపోవచ్చు, కానీ యీ లోపున రాజకీయంగా మాత్రం బాబు యిరకాటంలో పడతారు.

ఇప్పటికే యిరకాటం సంగతి అర్థమవుతోంది. ఈ విషయంలో బాబు మౌనం, టిడిపి నాయకుల మౌనం, బై అండ్ లార్జ్ తెలుగు మీడియా మౌనం యివన్నీ చాలా విషయాలు చెపుతున్నాయి. 'సైలెన్స్ యీజ్ ఎలాక్వెంట్' అని ఇంగ్లీషులో ఎక్స్‌ప్రెషన్ వుంది. 'మౌనం సుదీర్ఘంగా భాషించింది' అంటారు రమణగారు ఓ చోట. ఇలాటి సమయంలో మౌనంగా వుండడమే అనేక విషయాలు చెప్పేసినట్లు లెక్క! 'వాళ్లు ఎమ్మేల్యేలను కొని మాపై కేసు పెట్టారు' అని బాబు చేసిన కామెంటు రేవంత్ వ్యవహారంపై వివరణ కాదు. చూపించిన వీడియో ఫేక్ అనో, మరోటనో, రేవంత్ స్వతంత్రంగా వ్యవహరించారనీ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం దూకుడుగా వెళ్లారని అంటే ఆ సంగతి వేరు. అవేమీ అనలేదు. టిటిడిపి నాయకులైతే 'కెసియార్ చేసినది రైటయితే, రేవంత్‌దీ రైటే' అని ప్రకటన చేశారు. కెసియార్ చేసిన ప్రలోభాలపై ఆధారాలు లేవు, రేవంత్‌కు వ్యతిరేకంగా ఆధారాలున్నాయి. తేడా అది!

ప్రస్తుతం వున్న యిరకాట పరిస్థితిలోంచి బయటపడడానికి బాబు ఏదైనా చేయవచ్చు, రాష్ట్రప్రభుత్వ ప్రయోజనాలను తాకట్టు పెట్టేస్తారేమోనని భయంగా వుంది అంటూ కొందరు పాఠకులు రాశారు. ఎలా బయటపడతారో మనకూ తెలియదు, బయటపడడానికి కొంతకాలం పడుతుందనుకోండి, యీలోగా ఏమౌతుంది అన్నది ఆలోచించి చూడండి. చట్టం తన పని తాను చేసుకుని పోతే మాత్రం బాబు కొంతకాలం అధికారానికి దూరంగా వుండవలసి వస్తుంది. జయలలితకైతే పన్నీర్ సెల్వమ్ వున్నారు. బాబుకి అంత నమ్మదగిన వ్యక్తి ఎవరున్నారు? ఉపముఖ్యమంత్రులిద్దరిలో ఎవరిని తాత్కాలిక ముఖ్యమంత్రిగా కూర్చోబెడతారని అడిగితే అందరం తెల్లమొహం వేయాల్సిందే. సర్వే నిర్వహిస్తే లోకేశ్‌ను కూర్చోబెడతారని ఫలితాలు వస్తాయి. లాలూ తన భార్యను కూర్చోబెట్టినట్లు, బాబు కొడుకుని కూర్చోబెట్టి రిమోట్ కంట్రోలుతో పనులు చక్కబెట్టవచ్చు. కానీ ఎపి ముఖ్యమంత్రిగా బాబు లేకపోతే పరిస్థితిలో చాలా మార్పు వస్తుందనడంలో తభావతు లేదు. బాబు యిప్పటిదాకా పెద్దగా ఏమీ చేయకపోయినా, ఆయన పరిపాలనాసమర్థుడని, కార్యదక్షుడని, కేంద్రాన్ని ఒప్పించి ఏదో ఒకటి చేస్తారనీ ఆశ పెట్టుకున్నవారు లక్షల మంది వున్నారు. బాబు ఆ సీట్లో లేరు అనగానే సింగపూరు వాళ్ల దగ్గర్నుంచి అందరూ తటపటాయిస్తారు. తెలంగాణ నుంచి తరలి వెళదామనుకున్న పారిశ్రామికవేత్తలు అక్కడ ఎవరొస్తారో చూసి వెళదాం అని జాప్యం చేస్తారు. ఎందుకంటే టిడిపిలో బాబు భుజాల దాకా వచ్చే లీడరు లేరు. అలా లేకుండా బాబు జాగ్రత్త పడుతూ వచ్చారు. పార్టీ పదవి, సిఎం పదవి రెండూ తనే నిర్వహిస్తూ, ఎక్కడా తనకు పోటీ లేకుండా చూసుకున్నారు.

ఆంధ్ర ప్రగతి కుంటుపడితే తెలంగాణకు, తెలంగాణ సిఎంగా వున్న కెసియార్‌కు లాభం. అందుకే యింత గ్యాంబుల్ చేశారని అనుకోవాలి. తెరాస, వైసీపీ, కాంగ్రెసు కలిసి రాష్ట్ర ప్రభుత్వాన్ని, తెలుగుదేశం పార్టీని యిబ్బందుల్లోకి నెట్టాలని చూస్తున్నాయి అని బాబు ఆక్రోశించడం వెనుక యిదే ఆలోచన వుందేమో! టిడిపిని యిబ్బందుల్లోకి నెడుతున్నారనడం వరకు కరక్టే. తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిని ఓడిస్తే ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని యిబ్బందుల్లో నెట్టడం ఏమిటి? ఇబ్బందేమిటంటే ఆంధ్ర అంటే బాబు అయిపోయింది. బాబు దెబ్బ తింటే ఆంధ్ర పరిస్థితి అయోమయం. అదే కెసియార్‌కు కావలసినది. రేవంత్‌తో ఆగితే లక్ష్యం నెరవేరినట్లు కాదు.

బాబును దెబ్బ తీయడానికి కెసియార్ చాలా పెద్ద వ్యూహం పన్నారు. ఆంధ్ర నాయకుల ఫోన్‌లు ట్యాపింగుకు గురయ్యాయని తెలుస్తోంది. హైదరాబాదు వదిలిపెడితే మళ్లీ తెలంగాణలో టిడిపి పుంజుకోలేదేమోనన్న భయంతో బాబు రాజధానిని హైదరాబాదు నుండి తరలించడానికి సుముఖంగా లేరు. ఏడాది క్రితం 'ఆంధ్రకు వెళ్లి గుడారాల్లో పని మొదలుపెడతాం, 1953లో కర్నూల్లో అలా వుండలేదా' అంటూ కబుర్లు చెప్పారు. తాత్కాలిక రాజధాని గుర్తించాం అన్నారు, దసరా నుంచి అక్కడ నుంచే పని అన్నారు. కానీ ఉద్యోగులు సుముఖత వ్యక్తం చేయలేదు, ఉమ్మడి రాజధానిగా పదేళ్ల వ్యవధి వున్నపుడు వదులుకుని పోవడం దేనికి అని నాయకులు, ఉద్యోగులు వాదించారు. బాబు కూడా హైదరాబాదు వదిలేస్తే బొత్తిగా పరాయివాళ్లమై పోతామని బెదిరారు. తెలంగాణ పోలీసులు తమ ఫోన్ ట్యాపింగ్ చేసి కేసుల్లో యిరికించడం చూశాక 'ఇక్కడ ఎందుకున్నారాం బాబూ' అనుకుని వుంటారు. అదే ఆంధ్రలో వుంటే పోలీసు వ్యవస్థంతా తమ చేతిలో వుండేది.

కెసియార్ ట్యాపింగ్ చేయించి, ఎసిబి ద్వారా రేవంత్‌ను పట్టించారు. కానీ ఎసిబిని పూర్తిగా నమ్మలేదని, ప్రయివేటు డిటెక్టివ్‌ల ద్వారా స్టింగ్ ఆపరేషన్ నిర్వహించి, చివరి నిమిషంలో ఎసిబిని రంగంలోకి తెచ్చారని తెలుగుగ్లోబల్ డాట్‌కామ్ రాసింది. అంటే ఆంధ్ర నాయకులకే కాదు, తెలంగాణ సిఎంకు కూడా తెలంగాణ అధికారులపై నమ్మకం లేదన్నమాట. బాబు వలన ఉపకారాలు పొందిన అధికారులు పోలీసు వ్యవస్థలో, న్యాయవ్యవస్థలో వున్నారని, వారు తన పథకం పారనివ్వరని కెసియార్‌కు సైతం అనుమానమన్నమాట. వీడియో రికార్డింగు బయటకు వచ్చేదాకా బింకం చూపిన టిడిపి, ఆ తర్వాత కొలాప్స్ అయిపోయి జవాబిచ్చే స్థితిలో లేకుండా పోయింది. రేవంత్ నోరు విప్పితే ఏమవుతుందోనన్న భయం పట్టుకుంది. స్మార్ట్‌గా. యంగిష్‌గా వుండే ఆయన కూడా అరెస్టవగానే తనకు అర్జంటుగా అనారోగ్యం ముంచుకు వచ్చిందన్నాడు. ములాఖత్‌కు వచ్చినవాళ్లను కలవటం లేదు. ఏ స్టేటుమెంటు యిస్తే ఏం మునుగుతుందో తెలియదు. తెలంగాణ ప్రభుత్వం వద్ద వున్న ఆధారాలను నిర్ధారించుకుని అప్పుడు మాట్లాడితే బెటరు అనుకుంటున్నారు లాగుంది. ప్రపంచంలో దేని గురించైనా వ్యాఖ్యానించడానికి రెడీగా వుండే ఆంధ్ర సిఎం, ఆయన మీడియా సలహాదారు యీ విషయంలో గప్‌చుప్‌గా వున్నారు. 'తనకు నిద్రపట్టడం లేదని సిఎం అన్నారని వచ్చిన వార్తలో నిజం లేదు' అని మాత్రమే పరకాల ప్రభాకర్ ప్రకటించారు తప్ప రేవంత్ చర్యను సమర్థిస్తూనో, వ్యతిరేకిస్తూనో బాబు తరఫున స్టేటుమెంటు యివ్వలేదు.

కెసియార్ గేమ్ ఏ మేరకు సక్సెసవుతుందన్నదే యిప్పుడు సస్పెన్స్. మోదీ సహకారం వుంటేనే కథ రక్తి కడుతుంది. లేకపోతే

నీరుకారుతుంది. అప్పుడే పీయూష్ గోయల్ బాబు యింటికి, కెసియార్ యింటికి వచ్చి వెళ్లారట. రాజీ ప్రతిపాదనలు జరుగుతున్నాయనుకోవాలా? మోదీ ధోరణి ఎలా వుంటుందో కాస్త వూహించి చూద్దాం.

అధికారంలోకి వచ్చాక మోదీ రాజకీయాల్లో ఒక ధోరణి కనబడుతోంది – చాలాకాలంగా పార్టీకి మిత్రులుగా వున్న శివసేన, అకాలీదళ్‌కు ముకుతాడు వేస్తున్నారు. కొంతకాలం దగ్గరగా వుండి, తర్వాత దూరమై, మళ్లీ దగ్గరైన టిడిపితో పైకి సఖ్యత కనబడుతున్నా వాళ్లకు ఒరగబెట్టినది ఏమీ లేదు. కాంగ్రెసు యిస్తానన్న ప్రత్యేక హెూదా యిచ్చినా ఆంధ్రలో టిడిపి ప్రతిష్ఠ పెరిగేది. ఆ పని కూడా చేయలేదు. కేంద్ర ప్రభుత్వ ప్రతినిథిగా వున్న గవర్నరు ఆంధ్రకు అన్యాయం చేస్తున్నారని టిడిపి వారే చాలా ఉదాహరణలు యిస్తున్నారు. కేంద్రం ఆంధ్రకు ప్రత్యేకంగా యిచ్చిన నిధులేవీ లేవు. రాజధాని నిర్మాణ నిధుల గురించి కాజువల్‌గా చేసిన ప్రకటనలు కూడా లేవు. ఋణమాఫీ విషయంలో కేంద్ర ప్రభుత్వ అధీనంలో వున్న రిజర్వ్ బ్యాంకు, ప్రభుత్వబ్యాంకులు ఏమీ సహకరించలేదు. ఏడాదిగా బాబు ఏమీ చేయలేదన్న అభిప్రాయం కలిగించడంలో మోదీ పాత్ర కూడా వుంది. 'మిత్రపక్షం కాబట్టి ఏమీ అనలేకపోతున్నాం, అదే యుపిఏ అయి వుంటే చెరిగేసి వుండేవాళ్లం, ఎన్‌డిఏ కాబట్టి సఖ్యంగా బతిమాలో బామాలో, యివాళో రేపో మర్నాడో సాధించుకుని వస్తాం' అని టిడిపి నాయకులు చెపుతూ కాలక్షేపం చేయవలసి వస్తోంది. టిడిపిని దుంపనాశనం చేయడానికి కంకణం కట్టుకున్న కెసియార్‌ను మోదీ శత్రువుగా చూడటం లేదు, కవితకు కేంద్ర కేబినెట్‌లో స్థానం కల్పిస్తారేమోనన్న పుకార్లు పుట్టాయి. వాటికి మూలం తెరాసయే కావచ్చు, కానీ బిజెపి అధికార ప్రతినిథి వాటిని యిప్పటిదాకా ఖండించలేదు. ఇది కూడా టిడిపికి యిబ్బందికరంగానే వుంది.

పార్టీకి దూరంగా వున్న ప్రాంతీయ పార్టీల పట్ల మోదీ విధానం వేరేలా వుంది. తమిళనాడు, బెంగాల్‌లలో పార్లమెంటు ఎన్నికలలో బిజెపి గతంలో కంటె విజయాలు సాధించినా, స్థానిక ఎన్నికలలో ప్రాంతీయ పార్టీలు తమ పట్టు చూపించుకున్నాయి. స్థానిక నాయకత్వం బలపడి, రాష్ట్ర రాజకీయాల్లో గణనీయమైన పాత్ర పోషించడానికి చాలా టైము పడుతుందని, యీ లోపుగా తననుకున్న బిల్లులు పాస్ చేయించుకోవడానికి రాజ్యసభలో బలం చాలదు కాబట్టి వీటిని దగ్గరకు తీయాలని మోదీ అనుకున్నట్టు కనబడుతోంది. అక్రమాస్తుల కేసులో జయలలిత పట్ల చూపిన ఔదార్యం జగద్విదితం. శారదా స్కాము కేసు విస్తరిస్తున్న కొద్దీ, తన మంత్రులు అరెస్టు అవుతున్నకొద్దీ మమతా బెనర్జీ చల్లబడి, మోదీ స్నేహహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. త ృణమూల్, ఎడిఎంకె మద్దతు కూడగట్టుకోగలిగితే మోదీకి టిడిపి అవసరం బొత్తిగా వుండదు. ఆట్టే మాట్లాడితే యిప్పుడే లేదు. యుపిలో సొంతంగా బలపడుదామని చూస్తున్నారు కానీ లేకపోతే మాయావతిని కూడా సిబిఐ ద్వారా లొంగదీసి దరి చేర్చుకునేవారే!

ఇలాటి పరిస్థితిలో రేవంత్ అంశం మోదీ ముందుకు వచ్చింది. దీన్ని మోదీ రాజకీయంగా ఎలా వాడుకుంటారు అన్నదే గమనించాలి. చంద్రబాబు దోషా కాదా అన్న ప్రశ్న పాఠకులలో వుండవచ్చు, నాయకులలో వుండదు. బాబు యిప్పటివరకు మౌనంగా వున్నా, నాయిని స్టేటుమెంటుపై మండిపడుతూ "నన్ను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు" అన్నారు. ఆయనకు ఉపన్యాసాలు రాసిచ్చేవారెవరో కానీ కొంప ముంచారు. బ్లాక్‌మెయిల్ అనే పదం ఎప్పుడు వస్తుంది? నువ్వు ఒక తప్పు లేదా ఒక నేరం చేసి వుండాలి. దాన్ని అవతలివాడు పసిగట్టి, డబ్బు కోసమో మరో ప్రయోజనం కోసమో నిన్ను బెదిరించాలి. అలా బ్లాక్‌మెయిల్ చేయడం కూడా నేరమే. అది వేరే విషయం. కానీ బ్లాక్‌మెయిల్ చేయబడుతున్నాను అని ఎవరైనా అంటే దాని అర్థం వాళ్లు బహిరంగంగా చెప్పుకోలేని తప్పో, నేరమో చేసి వుంటారని! ఈ పొరపాటును బాబు ద ృష్టికి ఎవరైనా తెస్తే ఆయన వెంటనే 'నేనలా అనలేదు. మీడియా స ృష్టి, యిది కూడా తెరాస కుట్రలో భాగం' అనవచ్చు. ఆయన మాట నమ్మే వీరభక్తులూ వుండవచ్చు. ఎందుకంటే పదేళ్లగా ఆయన అధికారానికి దూరంగా వున్నారు. ఈ పదేళ్లలో ప్రాజ్ఞత కలిగిన యువ ఓటర్లకు బాబు హయాంలో గతంలో జరిగిన అవినీతి గురించి అవగాహన లేదు. ఎవరైనా వ్యాసం రాసినా, అది వారి మనసుకు హత్తుకోదు. మనం హైస్కూలు, కాలేజీ టైములో విన్న పాటలే మనకు నచ్చుతాయి. అంతకు ముందు పాటలన్నీ బోరు కొడతాయి. ఏ సినిమా ఎప్పుడు రిలీజైందో కచ్చితంగా చెప్పలేం. గతమంతా అలుక్కుపోయి కనబడుతుంది. పక్షపాతంగా వ్యవహరించే మీడియా దాన్ని మరింత అలికేస్తుంది.

పాతికేళ్లకు అటూయిటూ వున్న తెలుగు ఓటర్లందరికీ అవినీతి అంటే కాంగ్రెసు మాత్రమే గుర్తుకు వస్తుంది – రాష్ట్రంలోను, కేంద్రంలోను అదే పాలిస్తూ వచ్చింది కాబట్టి. అందుకే 2014 ఎన్నికల ప్రచారంలో బాబు తను నిప్పులాటి వాణ్నని చెప్పుకుంటే నమ్మి ఓట్లేశారు. అంత నిప్పులాటి వాళ్లయితే యితర పార్టీలతో సమానంగా ఓటర్లకు వీళ్లు డబ్బులెలా పంచిపెట్టారన్న ప్రశ్న వాళ్ల మెదడులో మెదలకుండా మీడియా వూదరగొట్టేసింది. రేవంత్ విషయంలో యింత ఘోరంగా పట్టుబడి పోయినా బాబు అతి ధైర్యంగా నీతి గురించి ఉపన్యాసాలిస్తూ, కెసియార్‌పై కేసు పెట్టు అంటూ నాయినిని ఛాలెంజ్ చేస్తూ నెగ్గుకొచ్చేస్తున్నారంటే యీ మద్దతే కారణం. ఇప్పుడు కేసు ముందుకు సాగుతున్న కొద్దీ ఆ ఆడియో తనది కాదని, తన వాయిస్‌ను రాష్ట్రంలో ప్రతి మిమిక్రీ ఆర్టిస్టు అనుకరించగలడని ఆయన వాదిస్తారు. కేసు రిజిస్టరై యీయన్ని సీటు నుంచి తప్పుకోమని కోర్టులు అనడానికి చాలా టైము పడుతుంది. కోర్టులో ఆ ప్రమాదం జరగకుండా చూడడానికి బాబు ఎప్పణ్నుంచో ఏర్పాట్లు చేసుకుంటూ వచ్చారు. ఆయన వలన ఉపకారం పొందినవారు అన్ని చోట్లా వున్నారు. నాట్ బిఫోర్ మీ అంటూ కేసును త్రో బాల్‌లా తోసేస్తూ జాప్యం చేసేయగలరు.

కానీ యీ మచ్చ తొలగించుకోకపోతే బాబు అథారిటీ పార్టీలో, ప్రభుత్వంలో బలహీనపడుతుంది. అవినీతి నిర్మూలన గురించి అధికారులకు ఉపన్యాసం దంచుతూ వుంటే ముసిముసి నవ్వులు వినబడవచ్చు. కేసు తేలాక రాజధాని సంగతి చూదాం అని

సింగపూరు వాళ్లు కబురంపితే, పెట్టుబడులు రావడం ఆలస్యమైతే బాబు యిమేజికి భంగం. అక్కడేదో జరుగుతున్నట్లు చూపకపోతే ప్రజలు పెట్టుకున్న ఆశలన్నీ వమ్ము అవుతాయి. ఇప్పటికే అక్కడ కొయ్యగుఙ్టం టైపు యాక్టివిటీ నడుస్తోంది. రోజూ పేపర్లో ఏదో వార్త వస్తుంది, జరుగుతున్నదేమీ కనబడదు. ఈ పరిస్థితుల్లో 'నా పై మచ్చ తొలగించుకుని అగ్నిపునీతుడనై మళ్లీ అధికారం చేపడతా' అని స్టేటుమెంటు యిచ్చి పక్కకు తప్పుకుని, దిగువ కోర్టులోనైనా ఏదో ఒక సాంకేతిక కారణంతో కేసు ఎడ్మిట్ కాకపోతే 'అదిగో నేను నిర్దోషినని కోర్టు చెప్పింది' అంటూ మళ్లీ అధికారం చేపట్టవచ్చు. ఇలా జరిగే సావకాశం తక్కువ అని అనేకమంది పాఠకులు భావిస్తున్నారు. తక్కువే, కానీ అలా చేయకపోతే యీ మచ్చతో ఎక్కువకాలం సాగదీయడం బాబుకి, రాష్ట్రానికి హాని కలగిస్తుంది.

ఈ మచ్చ తొలగించుకోవాలంటే మోదీ సహకరించాలి. జయలలిత కేసులో అయితే ప్రత్యర్థి కరుణానిధికి, మోదీకి ఎన్నడూ సఖ్యత లేదు. ఇక్కడ బాబును అన్యాయంగా యిరికించారు అని చూపించాలంటే కెసియార్‌ను బద్నామ్ చేయాలి. కెసియార్ పట్ల మోదీ అంత తీవ్రంగా వ్యవహరిస్తారా అన్నది అనుమానం. పబ్లిక్ మనీకి సంబంధించిన వ్యవహారాల్లో రాజకీయ నాయకుణ్ని బయటపడేయడంలో కష్టం లేదు. కానీ యిక్కడ ఇద్దరు ముఖ్యమంత్రులు తలపడ్డారు. ఎగదీస్తే గోహత్య, దిగదీస్తే బ్రహ్మహత్య అన్నట్టు తయారైంది. చివరకు ఎవరిని ఆదరిస్తారు, ఎవరిని నియంత్రిస్తారు అన్నది ఆసక్తికరంగా మారింది. తెలంగాణలో బిజెపికి ఎప్పణ్నుంచో క్యాడర్ వుంది. తెలంగాణ ఉద్యమాన్ని బలపరిచింది కూడా. అయినా ఎన్నికలలో లాభం పొందలేకపోయింది. ఆంధ్రలో బిజెపి మొదటి నుంచి బలహీనమే. టిడిపి పొత్తుతో సీట్లు గెలుచుకుంటోంది. స్వతంత్రంగా ఎదగాలి అని అమిత్ షా హెచ్చరించి వెళ్లారు. ఏ కారణం చేతనైనా బాబుకు అవినీతి మచ్చ అంటితే లాభపడేది బిజెపియే.

జగన్ అంటే మూర్తీభవించిన అవినీతి అన్న యిమేజి బలంగా ప్రజల్లోకి వెళ్లడం చేతనే 2014 ఎన్నికలలో వైకాపా ఓడిపోయింది. రాజధాని నిర్మాణం అంటే లక్షల కోట్లతో కూడిన సంగతి, జగన్ వంటివాడు సిఎంగా వుంటే చాలా భాగం స్వాహా అయిపోతుంది. రాయలసీమ ఫ్యాక్షనిస్టులు రాజధానిలో తిష్ట వేసి స్థలాలు కబ్జా చేసేస్తారు. ఈ అవినీతి చూసి పెట్టుబడిదారులు యిటు తొంగి చూడరు. జగన్‌కు బదులు పరిపాలనాదక్షుడిగా పేరుబడిన బాబును ఎన్నుకుంటే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది అని మధ్యతరగతి ప్రజలు ప్రగాఢంగా నమ్మి టిడిపికి ఓట్లేశారు. ఇప్పుడు బాబు కూడా అదే కోవకు చెందినవాడని ఏ మాత్రం శంక కలిగినా టిడిపి పట్ల విముఖత పెరుగుతుంది. దాన్ని బిజెపి ఎన్‌క్యాష్ చేసుకోగలుగుతుంది. వైకాపా ప్రతిపక్షంగా కూడా చాలా నీరసంగా వుంది. జగన్ ఫుల్‌టైమ్ పొలిటీషియన్‌గా పని చేయడం లేదు. అప్పుడప్పుడు ఏవో దీక్షలు చేస్తూ, ఎన్నికల సమయంలోనే ఉధృతంగా కాన్వాస్ చేసుకుంటే చాలనే ఆలోచనలో వున్నట్టు కనబడుతోంది. కాంగ్రెసు కోలుకోవడానికి యింకా నాలుగైదేళ్లు పట్టవచ్చు. బిజెపిలో నాయకులు వచ్చి చేరారు కానీ వాళ్లకు పనేమీ లేదు. బాబును యిరకాటంలో పెట్టి రాజకీయశూన్యం సృష్టించగలిగితే దాన్ని పూరించడానికి వీళ్లందరూ ముందుకు దూసుకుని వస్తారు. ఈ అవకాశాన్ని మోదీ వదులుకుంటారా? వదులుకుంటే మాత్రం టిడిపి నుంచి పెద్ద మూల్యమే రాబడతారు. కథ ముందుముందు ఎలా నడుస్తుందో కానీ ప్రస్తుతానికి ఆసక్తికరంగానే వుంది. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2015)**

## జూన్ 05 ఎమ్బీయస్ : ఆంధ్రులకు మసి పులమడం అన్యాయం

రేవంత్ రెడ్డి వ్యవహారంలో టిడిపి తప్పటడుగులు కొనసాగిస్తోంది. నిజం చెప్పాలంటే యిప్పటి సంకటస్థితి అత్యంత జటిలమైనది. దీనిలోంచి లాఘవంగా, అతి తక్కువ నష్టాలతో బయటపడడం ఎవరికైనా కష్టమే. బాబు తన తెలివితేటలతో, తన సలహాదారుల, న్యాయవాదుల ఉపాయాలతో ఎలా గట్టెక్కుతారా అందరూ ఉత్సుకతతో చూస్తున్న తరుణంలో ఆయనా, ఆయన పార్టీ సమస్యను క్లిష్టతరం చేస్తున్నారు. అనవసర విషయాలను దీనిలోకి లాగుతున్నారు, తమకు పట్టిన మసిని అందరికీ పులిమి, యిది యిరు రాష్ట్రాల మధ్య సమస్యగా, ఆంధ్రులకు అవమానంగా చిత్రీకరిద్దామని చూస్తున్నారు. ఇది పూర్తిగా తప్పుడు స్ట్రాటజీ.

వీడియోలో రేవంత్ పట్టుబడి రెండు వారాలవుతోంది. ఇప్పటిదాకా రేవంత్ చర్యను సమర్థించడమో, వ్యతిరేకించడమో చేయలేదు. రేవంత్ యింట్లో నిశ్చితార్థానికి వెళ్లారు కాబట్టి... అని అర్థాలు తీయకూడదు. అది వ్యక్తిగతమైన కార్యక్రమం. ఆ టైములో పార్టీ సహచరుని కుటుంబానికి అండగా నిలవడం మానవత. రాజకీయంగా రేవంత్ పార్టీ ఆదేశాన్ని ధిక్కరించో, ముందుగా చెప్పకుండా తనంతట తానే వెళ్లడమో చేసి డబ్బుతో వెళ్లి వుంటే 'మాకు సంబంధం లేదు' అనే ప్రకటన రావాలి. రాలేదు, ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లో, సంజాయిషీ కోరినట్లో కూడా ప్రకటన రాలేదు. అలా అని రేవంత్ చేసినదాన్ని సమర్థిస్తున్నారా అంటే ఆ దిశగానూ ప్రకటన లేదు. టిడిపి నాయకులు కెసియార్ ఫార్మ్‌హౌస్‌లో చేస్తే ఒప్పూ, మేం చేస్తే తప్పూ అయిందా వంటి వాదనలు మానలేదు. కెసియార్ చేసినది ఒప్పని ఎవరైనా అన్నారా? తెరాస నాయకులైనా మేం డబ్బు పెట్టి కొన్నాం, భయపెట్టాం అది ఒప్పు అని చెప్పారా? మా సిద్ధాంతాలు నచ్చి వాళ్లు వచ్చి చేరితే వద్దనాలా? అంటూ వాదించారు. ఎన్నికలకు ముందు, వెనకా టిడిపిలో చేరిన యితర పార్టీ నాయకులు డబ్బు తీసుకుని చేరారు, అది ఒప్పు అని ఎవరైనా అన్నారా?

తెరాసకు తగినంత బలం లేకపోయినా అదనపు అభ్యర్థిని నిలబెట్టిందంటేనే ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి ప్లాను చేసినట్లే అని వాదించడానికి లేదు. ఆ మాట కొస్తే టిడిపికీ తగినంత బలం లేదు, అయినా అభ్యర్థిని నిలిపింది కదా, వాళ్లు మాత్రం ఎలా

గెలిపించు కుందామనుకున్నారట? ఇలాటి జూదం గతంలో టిడిపితో సహా అనేక పార్టీలు ఆడారు. పలుకుబడితోనో, ధనంతోనో అదనపు ఓట్లు తెచ్చుకుంటాడనే ఊహతోనే ధని పారిశ్రామికవేత్తలను కౌన్సిల్‌కు, రాజ్యసభకు నిలబెట్టిన సందర్భాలు అనేకం చూశాం. వాళ్లు గెలిచారంటే డబ్బు చేతులు మారిందని వూహిస్తాం తప్ప రుజువులు దొరకలేదు. ఇన్నాళ్లకు యిప్పుడు రేవంత్ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయారు. ఇతరులు చేశారు కాబట్టి నేనూ చేశా, తప్పేముంది, వాళ్లు పట్టుబడలేదు కాబట్టి పట్టుబడినా నన్ను వదిలేయండి అని ఏ ముద్దాయియైనా కోర్టులో వాదించగలడా?

రేవంత్ చేసినది వీడియోలో వచ్చేసింది కాబట్టి దాని గురించి నోరెత్తలేక పోతున్నారు కానీ ఆడియో టేపుల్లో చంద్రబాబు వాయిస్ గురించి ఏదేదో కవర్ చేద్దామని చూస్తున్నారు. మొదట్లో ఆ గొంతు చంద్రబాబుది కాదు, ఎవరో మిమిక్రీ ఆర్టిస్టుది అయి వుంటుంది అన్నారు. ఆ తర్వాత ఆ మాట ఎత్తడం మానేశారు. ఇప్పుడు తెరాస నాయకులు పదేపదే అడుగుతున్నారు – ఆ వాయిస్ తనది కాదని చెప్పమనండి చూదాం అని. ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తే ఆ వాయిస్ ఒరిజినల్‌దో కాదో చెప్పేస్తారని బాబుకి ఎవరో చెప్పి వుంటారు. ఆయన తన వాయిస్ కాదని చెప్పడం మానేశారు. 'కట్ అండ్ పేస్ట్ చేసిన వాళ్లను అడుగు..' అని విలేకరిని గసరడం బట్టి అది తన గొంతే అనీ, వేర్వేరు సందర్భాల్లో మాట్లాడినది కావాలని గుదిగుచ్చి అప్రదిష్టపాలు చేస్తున్నారనే లైన్ తీసుకున్నారు. అంటే మొదట చెప్పిన వాదన తప్పని తనే ఒప్పుకున్నట్టయింది. వేర్వేరు సందర్భాల్లో సంభాషణల్లో మాట్లాడినవి ఏరుకుని యీ అర్థం వచ్చేట్లు కిట్టింపు చేశారన్న లైన్‌ను నమ్ముకున్నా బాగుండేది. నా ఫోన్ ట్యాపింగ్ చేశారు అనే యింకో వాదన ముందుకు తెచ్చారు. 'నా ఫోన్ ట్యాపింగ్ చేశారు' అనగానే 'నేను అలా మాట్లాడినది వాస్తవం, అది నా గొంతు అన్నది వాస్తవం, మీరు ట్యాప్ చేసి నన్ను పట్టేసుకున్నారు' అని ఒప్పుకున్నట్టు అయింది.

దీనికి ఒక రైడర్ ఏమిటంటే – కట్ అండ్ పేస్ట్ పనికి మీరు ఏరుకున్న సంభాషణా శకలాలు నేను వేర్వేరు వ్యక్తులతో మాట్లాడినవి, యీ స్టీఫెన్‌సన్‌తో మాట్లాడినవి కాదు అని వాదించే అవకాశం వుంది. 'మన వాళ్లు బ్రీఫ్‌డ్ మీ.. ఐ యామ్ విత్ యూ.. డోంట్ బాదర్... వాట్ ఆల్ దే ప్రామిస్‌డ్, విల్ బి ఆనర్‌డ్.. దటీజ్ అవర్ కమిట్‌మెంట్' వంటి వాక్యాలు ఏదో రహస్య చెల్లింపులు, ఒప్పందాలకు సంబంధించిన సంభాషణ లాగానే వుంది. ఏ పారిశ్రామిక వేత్తతోనో పెట్టుబడులు ఆహ్వానిస్తూ చేసిన సంభాషణలా లేదు.

ఫోన్ ట్యాపింగ్ చేయలేదు, చేయలేదు అని తెలంగాణ నాయకులు, ఎసిబి చీఫ్ ఖాన్ అందరూ చెప్తున్నారు. మామూలుగా ఆలోచించి చూస్తే తన ఫోన్ లోంచి యిలాటి డీల్స్ మాట్లాడే పిచ్చిపని ఏ నాయకుడూ చేయడు. ముఖ్యంగా కమ్యూనికేషన్లపై విపరీతమైన నిఘా వున్న యీ రోజుల్లో! ఎవరు ఎవరితో, ఎంతసేపు మాట్లాడారన్నది కాల్ డేటాలో వచ్చేస్తోంది. ఏ నాయకుడైనా సరే రాయబారుల చేత కబురు పంపిస్తారు. అవతలివాళ్లు మరీ హామీ కోరితే అనుచరుడి ఫోన్‌లోంచి మాట్లాడతారు. అలాటిది బాబు తన వ్యక్తిగత ఫోన్‌లోంచో, అఫీషియల్ ఫోన్‌లోంచో యిలాటి సంభాషణ చేశారంటే నమ్మలేం. అవతలివాళ్లు మాట్లాడితే తన ఫోన్‌లో ఆ సంభాషణను రికార్డు చేసే సౌకర్యం చాలా ఫోన్లలో వుంది. స్టీఫెన్‌సెన్ వద్ద అలాటి ఫోన్ వుందనుకుంటే, బాబును యిరికిద్దామనే ప్లానుతో అతనా సంభాషణను రికార్డు చేశాడనుకుంటే విషయం సింపుల్‌గా అర్థమవుతుంది. అలా కాకుండా బాబు ఫోన్‌ను ట్యాప్ చేశారు అని ఆరోపిస్తే దాన్ని నిరూపించడం చచ్చే కష్టం. 'బాబు సంభాషణలు మా వద్ద చాలా వున్నాయి' అని నాయిని అన్న స్టేటుమెంటు ఆధారంగా ట్యాప్ జరిగిందని నిర్ధారించలేం. స్టీఫెన్‌సన్ ఒక్కడి ఓటుతో టిడిపి అభ్యర్థి గెలవలేడు కాబట్టి యింకా కొంతమందితో బాబు మాట్లాడి వుండవచ్చు, వారిని కూడా పురికొల్పి ఆ సంభాషణలు రికార్డు చేయించి వుండవచ్చు. నాయిని చెప్పిన 'మరిన్ని ఆడియో రికార్డింగులు..' అవే కావచ్చు. నిజానికి బాబు ఫోన్ కనక ట్యాప్ చేయగలిగి వుంటే, ఆయన యిలాటివి, మరో లాటివి వ్యవహారాలన్నీ ఆ ఫోన్ల ద్వారానే మాట్లాడుతూ వుంటే ఆంధ్ర రాష్ట్రం గుట్టుమట్లన్నీ తెలంగాణ ప్రభుత్వం చేతిలో వున్నట్లే. ఈ విషయాన్ని యిప్పటిదాకా తెలుసుకోలేకపోవడం ఆంధ్ర పోలీసుల, యింటెలిజెన్సు విభాగం వైఫల్యం. ముందు వారికి దండన వేయాలి.

'సాక్ష్యాధారాలన్నీ కోర్టుకు సమర్పించినపుడు లేని యీ ఆడియో రికార్డింగు ఎక్కడిది?' అని పరకాల ప్రభాకర్ ప్రశ్నించారు. 'సాక్ష్యాలన్నీ సమర్పించేశాం, యికపై ఏం దొరికినా సమర్పించం' అని పోలీసులు కోర్టుకి ఎప్పుడైనా చెప్తారా? కొత్త సాక్ష్యాలు చేతికి వస్తూ వుంటే టైమ్ బార్‌డ్ అనుకుంటూ వాటిని గాలికి వదిలేస్తారా? జగన్ కేసుల్లో ఎవరైనా ముద్దాయి ఎప్రూవర్‌గా మారి కొత్త సాక్ష్యాలు పట్టుకుని వస్తే అవి తీసుకోం అంటారా పోలీసులు? కొత్త కోణం దొరికితే కొత్త సాక్షులను చివరి నిమిషంలో కూడా ప్రవేశ పెడుతూ వుంటారు ప్రాసిక్యూషన్ లాయరూ, డిఫెన్సు లాయరూ. జడ్జి అనుమతిస్తూంటాడు కూడా. ఆడియో అప్పుడు లేకపోవచ్చు, తర్వాత చేతికి చిక్కవచ్చు. 'ఈ టేపులు ఎక్కడనుంచి వచ్చాయో చెప్పాలి' అని అడిగారు పరకాల. అది కోర్టు వాళ్లు ఎలాగూ అడుగుతారు. అవి ఎంతవరకు నమ్మవచ్చు అని అడుగుతారు. అందుకే ఫోరెన్సిల్ లాబ్‌కు పంపించి, వారు నిజమైనవే అని సర్టిఫై చేశాకనే ఆడియో, వీడియోలు సాక్ష్యాలుగా చూపుతాం అని ఎసిబి అంటోంది. లాబ్‌కు పంపింది కూడా.

తమకు వ్యతిరేకంగా పత్రికల్లో ఏదైనా కథనం రాగానే 'ఈ సమాచారం మీకు ఎక్కణ్నుంచి వచ్చిందో చెప్పండి' అని నాయకులు మీడియాపై ఒత్తిడి తెస్తారు. వినోద్ మెహతా ఆత్మకథలో అలాటి ఉదంతాలు చాలా కనబడ్డాయి. 'మా సోర్స్ మేం చెప్పం, ఎక్కణ్నుంచి వచ్చిందో మేం చెప్పం. అది అబద్ధమైతే ఖండించండి' అని ఎడిటర్లు మొండికేస్తారు. ఖండిస్తే తమ కథనాన్ని సమర్థించుకుంటూ

విలేకరి యింకా కొన్ని విషయాలు బయటపెట్టవచ్చున్న భయంతో నాయకులు యింకేమీ అనలేక కక్షసాధింపు చర్యలు చేపడతారు. 'మమ్మల్ని అబాసుపాలు చేయడానికి, మా స్థయిర్యాన్ని దెబ్బ తీయడానికి తెచ్చారా?' అనే మాట పరకాల అనకుండా వుండాల్సింది. అవి బయటకు రావడం వలన తాము అబాసుపాలు అయ్యామని ఒప్పుకున్న ధ్వని అందులో వుంది. రేవంత్ వెళ్లలేదు, డబ్బు ఆఫర్ చేయలేదు అని అనకుండా, ఆ టేపుల్లో వాయిస్ చంద్రబాబుది కాదు అనకుండా 'అసలీ సాక్ష్యాలు ఎలా సంపాదించారో చెప్పండి, ట్యాపింగ్ చేశా?' అని అడగడంలోనే నేరం ఒప్పుకున్నట్లు అనిపిస్తోంది.

ట్యాపింగ్ చేయడం నేరం అని చెప్పుకోవడమే తప్ప దానికై శిక్ష పడిన సందర్భాలు నాకు గుర్తు రావటం లేదు. రామకృష్ణ హెగడే కర్ణాటక ముఖ్యమంత్రిగా వుండే రోజుల్లో చాలా పేరు తెచ్చుకున్నారు. ప్రధానమంత్రి కావడానికి అర్హత వున్న నాయకుల్లో ఒకరు అని కూడా మీడియా రాసేది. అంతలో ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల్లో చిక్కుకున్నారు. దానివలన రాజకీయంగా వివాదం చెలరేగింది తప్ప, ఆయనకు శిక్ష ఏమీ పడలేదు. ఇప్పుడు కెసియార్ స్వయంగా ట్యాపింగ్‌కు ఆదేశించారు అని నిరూపించడం కష్టం. హెూం మంత్రో, లేక సంబంధిత పోలీసు విభాగాధిపతో ఆదేశించారని విచారణలో తేలిందనుకోండి. వారి చేత రాజీనామా చేయించడమో, సస్పెండ్ చేయడమో, శాఖ మార్చడమో చేసి సరిపెడతారు. అంత కంటె ముందు ట్యాపింగ్ జరిగిందని నిరూపించాలి. బాబు, సహచరులు 120 మంది ఫోన్లపై ట్యాపింగ్ జరిగిందని ఆరోపిస్తున్నారు. రేవంత్ వ్యవహారం బయటకు వచ్చిన వారం రోజుల్లోనే యీ విషయం ఎలా పసిగట్టారో నాకు అర్థం కావటం లేదు. ఫలానా ఫలానా వారి ఫోన్లపై నిఘా వేయండి అని పోలీసు శాఖ కమ్యూనికేషన్స్ శాఖను కోరుతుందని, వారు అనుమతిస్తేనే అది సాధ్యపడుతుందని గతంలో చదివాను. పోలీసు శాఖ పంపిన జాబితా బాబు సహచరుల చేతికి చిక్కిందా!? అదే చేత చిక్కి వుంటే తమ అనుకూల మీడియాలో లీక్ చేయకుండా వుంటారా!? కేంద్రానికి ఫిర్యాదు చేయడంతో ఎందుకు సరిపెడుతున్నారు? ఆ ఫిర్యాదులో యీ 120 అంకె రాయలేదేం? 'ఏపి సిఎంతో పాటు, రాష్ట్రమంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులను లక్ష్యంగా చేసుకుని చట్టవిరుద్ధంగా ఫోన్ల ట్యాపింగ్ చేశారు' అని జనరల్‌గా రాశారేం? 120 అంకెకు ఆధారాలు దొరకలేదా?

కేంద్రం యిప్పటికే శాఖాంతర్గత విచారణకు ఆదేశించింది. అది సరిపోదు, అత్యున్నత స్థాయి విచారణ జరిపించాలని బాబు లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వం అనధికారికంగా అత్యాధునిక ట్యాపింగ్ యంత్రాలను సమకూర్చుకుందని, ట్యాపింగ్ యంత్రాలను చట్టవిరుద్ధంగా సమకూర్చుకున్న ఒక ప్రయివేటు డిటెక్టివ్ సంస్థకు ఫోన్ ట్యాపింగ్ పనిని తెలంగాణ ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్‌కు యిచ్చిందని బాబు ఆరోపించారు. ఇందులో రెండు అంశాలున్నాయి. ఒకటి – ప్రభుత్వమే అత్యాధునిక ట్యాపింగ్ యంత్రాలను సమకూర్చు కుందంటున్నారు. రాష్ట్రంలో ఉగ్రవాద చర్యలను అరికట్టడానికి యివి అవసరం అని చెప్పి అధికారికంగానే సమకూర్చుకోవచ్చు. అనధికారికంగా ఆ పని చేయడం దేనికి? అవి తన దగ్గర పెట్టుకుని పైన చెప్పినవారందరి ఫోన్లూ ట్యాప్ చేస్తూండగా లేనిది, యీ సెబాస్టియన్ వ్యవహారంలో మాత్రం ప్రయివేటు డిటెక్టివ్‌కు ఫోన్ ట్యాపింగ్ పని అప్పగించడం దేనికి? అలా అప్పగించేటప్పుడు తన వద్దనున్న అత్యాధునిక యంత్రాలనే వాడుకోమనకుండా అది ట్యాపింగ్ యంత్రాలను అక్రమంగా సమకూర్చుకుందా లేదో చూసుకుని అప్పుడు అప్పగించడం దేనికి? ఏదైనా ప్రయివేటు డిటెక్టివ్ సంస్థ చట్టవిరుద్ధంగా ఆధునిక యంత్రాలను సమకూర్చుకుని చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేస్తూ వుంటే, దానిపై టిడిపి నాయకుడెవరైనా పోలీసులకు ఫిర్యాదు చేసేయవచ్చు కదా! పక్క రాష్ట్రపు ముఖ్యమంత్రి వెళ్లి ఏకంగా ప్రధానమంత్రికి ఫిర్యాదు చేయాలా? ఎందుకలా? ఆధారాలు లేవా? ఇవన్నీ వినికిడి కబుర్లేనా? ఆధారాలు కనిపెట్టే పని కూడా బాబు మోదీకి అప్పగించి వచ్చారా? సెబాస్టియన్ ఫోన్‌ను మే 25 నుంచి ఫోన్ చేశారని విశ్వసనీయ సమాచారం వుందని, ఆయన ఉగ్రవాది కాదని, తీవ్రవాది కాదని బాబు వాపోయారు. తన ఫోన్ ట్యాప్ అయినందుకు సెబాస్టియన్‌కు ఏ చింతా లేనట్టుంది. చేస్తే గీస్తే ఆయన చేయాలి ఫిర్యాదు! కానీ బాబు ఫీలవుతున్నారు. ఎందుకు?

ట్యాపింగ్/ హ్యాకింగ్ నిరూపించడం ఎంత కష్టమో తెలిపే వుదంతం యివాళ్టి పేపర్లో వచ్చింది. అమెరికన్ విజిల్ బ్లోవర్ ఎడ్వర్డ్ స్నోడెన్ అమెరికన్ ప్రభుత్వపు నేషనల్ సెక్యూరిటీ ఏజన్సీ (ఎన్ఎస్ఏ) జర్మన్ ఛాన్సెలర్ ఏంజిలా మెర్కెల్ సెల్‌ఫోన్‌ను హ్యాక్ చేసిందని 2013 అక్టోబరులో వెల్లడించాడు. వెంటనే దాన్ని వైట్ హౌస్ ఖండించింది. కానీ ఆ ఖండన నిర్ద్వంద్వంగా లేకపోవడంతో రకరకాల అనుమానాలకు తావిచ్చింది. ఏంజిలా ఒబామాకు ఫోన్ చేసి స్నేహితుల మధ్య యిలాటి గూఢచర్యం సవ్యంగా లేదంది. హ్యాకింగ్‌ను నిరూపించే బాధ్యతను జర్మన్ ప్రభుత్వం తమ చీఫ్ ఫెడరల్ ప్రాసిక్యూటర్‌కు అప్పగించింది. ఆయన 2014 జూన్‌లో హ్యాకింగ్ జరిగిందనడానికి తగినంత సాక్ష్యం వుందని ప్రకటించాడు. పరిశోధన కొనసాగింది. చివరకు 2014 డిసెంబరులో 'కేసు పెట్టడానికి చాలినంత సాక్ష్యం దొరకటం లేదు. నేరపరిశోధన చురుగ్గా సాగటం లేదు' అని ప్రకటించాడు. చివరకు నిన్న అమెరికన్ ప్రభుత్వంపై జర్మన్ ప్రభుత్వం తన ఆరోపణలను విరమిస్తూ ప్రకటన చేసింది. సాక్ష్యాలకు దొరకనంత నేర్పుగా అమెరికన్ ప్రభుత్వం గూఢచర్యం చేసిందని అనుకుందామనుకున్నా, జర్మన్‌వారి సాంకేతిక పరిజ్ఞానం కూడా తక్కువ కాదు. పట్టుకుందామని వాళ్లూ గట్టిగానే ప్రయత్నించి వుంటారు. చివరకు ఏమీ దొరకలేదు. మరి రేవంత్ కేసులో ట్యాపింగ్ కూడా ఎలా నిరూపిత మవుతుందో వేచి చూడాలి. నిరూపించడం కష్టమనే భావనతోనే చంద్రబాబు 'అత్యాధునిక పరికరాలతో..' అనే మాట వాడారా? అలాటప్పుడు సాక్ష్యం దొరక్కపోయినా ఆరోపణ మాత్రం మిగులుతుంది. నమ్మినవాళ్లు నమ్ముతారు.

ఇంకొక సాంకేతిక అంశం టిడిపి నాయకులు చర్చల్లో లేవనెత్తారు కానీ బాబు తన లేఖలో ప్రస్తావించలేదు. ఈ వ్యవహారం ఎసిబి

పరిధిలోకి రాదని, అయితే గియితే ఎన్నికల సంఘం పరిధిలోకి వస్తుందని వారి వాదన. బాబు తన లేఖలో 'ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని విషయాల్లో కేంద్ర ఎన్నికల సంఘమే నిర్ణయం తీసుకోవాల్సి వుంటుంది' అని వదిలేశారు తప్ప ఎసిబిని ఎలా ప్రయోగించారు అని ప్రశ్నించలేదు. 'స్టింగ్ ఆపరేషన్ ముసుగులో భయాందోళనలకు గురి చేసే కుట్రకు ఒడిగట్టారు' అన్నారు. స్టింగ్ ఆపరేషన్‌కు భయపడేవారు ఎవరు? నేరస్తులే కదా! స్టింగ్ ఆపరేషన్‌లు చేయకూడదు అని టిడిపి వాదించగలదా? అలా మాట్లాడితే అన్యాయాలు వెలికి రావడం మీకిష్టం లేదన్నమాట అని అవతలివాళ్లు అడుగుతారు. అసలు ఒక మాట – ఎసిబికు అధికారం వుందా లేదా, వీడియో వాళ్లు తీశారా, మరొకరు తీశారా, టీవీ ఛానెల్‌కు ప్రభుత్వ మద్దతు వుందా లేదా? ఇవన్నీ సాంకేతిక విషయాలు. రామ్ జెఠ్మలానీ లాటి వాళ్లు లేవనెత్తే ప్రశ్నలు. దశాబ్దాలుగా చూస్తున్నాను. ఏదైనా ఘోరమైన నేరం జరగగానే నిందితుడు రామ్ జెఠ్మలానీని పిలుస్తాడు. ఆయన వచ్చి కోర్టులో మొట్టమొదట లేవనెత్తే ప్రశ్న – 'అసలు యీ కేసు విచారించడానికి నీకు జ్యురిస్‌డిక్షన్ వుందా?' అని. ఈ కేసు యీ సెక్షన్ కింద రాదు, మరో సెక్షన్ కింద వస్తుంది వంటి సాంకేతిక అంశాలు లేవనెత్తి, నిందితుడికి బెయిలు తెప్పిస్తాడు. ఆ తర్వాత కాలికేస్తే వేలికేసి, వేలికేస్తే కాలికేసి కేసు సాగదీస్తాడు. చివరకు ముద్దాయో, న్యాయమూర్తో, పాలకులో ఎవరో ఒకరికి ఏదో ఒకటి అయి శిక్ష వాయిదా పడుతుంది, లేక తగ్గుతుంది. చట్టాల ప్రకారం రామ్ జెఠ్మలానీ విజయం సాధించవచ్చు కానీ ప్రజల ద ృష్టిలో ముద్దాయి ముద్దాయిగానే నిల్చిపోతాడు. వీడియో తీయడం తప్పయితే, దాన్ని సాక్ష్యంగా చూపడం తప్పయితే కోర్టు వాటి సంగతి చూస్తుంది. ఎసిబి తన పరిధికి మించి వ్యవహరిస్తే దానికీ అక్షింతలు పడతాయి. నేరం జరిగిందా లేదా అన్నదే ప్రజలు గమనిస్తారు.

నేరాన్ని అరికట్టడానికి లేదా నేరస్తులను పట్టుకోవడానికి పోలీసులు అనేక విధానాలను అవలంబిస్తారు. దొంగతనం చేసినవాణ్ని బుజ్జగిస్తూ అడిగితే వాడు నేరం ఒప్పుకోడు. నాలుగు తగిలిస్తేనే నిజం చెపుతాడు. అది చట్టవిరుద్ధం కావచ్చు. కానీ పోలీసువాళ్ల పద్ధతే అది. మెత్తగా వుంటే సాక్ష్యం ఎప్పటికీ దొరకదు. కోర్టులు కూడా యీ సంగతి గ్రహించి పోలీసు క్రౌర్యాన్ని చూసీచూడనట్టు వదిలేస్తాయి – లాకప్ డెత్ అయితే తప్ప! ఇలాటి నేరాలు పట్టుకోవడం ఎసిబి పని కాదు అంటున్నారు టిడిపి నాయకులు. మరి ఎవరి పని? రేపు ఆంధ్రలో వైసీపీ నాయకులు టిడిపి ఎమ్మెల్యేలను కొనడానికి ప్రయత్నిస్తే వాళ్లను ఎలా పట్టుకుంటారు? ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశా? వాళ్లు కదిలి వచ్చేటప్పటికి యిక్కడివాళ్లు ఎలర్ట్ అవరా? ఎన్నికల కమిషన్ ఎన్నికల టైములోనే కింగ్, మామూలు సమయాల్లో కోరలు లేని పాము. ఋణమాఫీ గురించి వంటి టిడిపి ఎన్నికల వాగ్దానాల గురించి ఎన్నికల సమయంలో వారిని నిలదీసింది. అవి ఆచరణసాధ్యమే అని టిడిపి అప్పుడు కమిషన్‌కు నచ్చచెప్పుకుంది. ఇప్పుడు ఆచరణసాధ్యం కాదు అని చేతులెత్తేసింది. కమిషన్ ఏం చేయగలుగుతోంది? అబద్ధపు వాగ్దానాలతో నెగ్గిన ఎన్నిక చెల్లనేరదు అని టిడిపి నాయకుల ఎన్నికను రద్దు చేయగలదా?

ఎన్నికల టైములో రాష్ట్ర యంత్రాంగం సమస్తం ఎన్నికల కమిషన్ చెప్పినట్టు పని చేయాలి. ఎన్నికలు అయిపోయాక రాష్ట్రప్రభుత్వానిదే అజమాయిషీ. సాధారణ ఎన్నికల టైములోనే కమిషన్‌కు ఆ విశేషాధికారాలు. ఉపయెన్నికల టైములో, కౌన్సిల్ ఎన్నికల టైములో అలాటివి వుపయోగించినట్లు ఎన్నడూ చూడలేదు. ఉపయెన్నికల టైములో కొత్త స్కీములు ప్రకటించకూడదు, వేళ దాటి ఉపన్యసించకూడదు వంటి చిన్న చిన్న ఆదేశాలు యివ్వడమే తప్ప యిలాటి స్టింగ్ ఆపరేషన్లు చేసి ఫిరాయింపుదార్లను అరికట్టిన ఉదంతం యిప్పటిదాకా వినలేదు. ఎమ్మెల్సీ ఎన్నిక కాబట్టి ఎన్నికల కమిషన్ మాట ఎత్తారు. రేపు టిడిపి ప్రభుత్వంపై వైకాపా అవిశ్వాస తీర్మానం పెట్టి దానికి అనుకూలంగా ఓటేయమని టిడిపి ఎమ్మెల్యేలను డబ్బుతో ప్రలోభపెట్టిందనుకోండి. అప్పుడు ఏ శాఖ కలగజేసుకోవాలి? చెప్పండి. ఎందుకైనా మంచిది ఇవన్నీ ముందే అనేసుకుంటే నాయకులకు, ప్రజలకు ఒక క్లారిటీ వచ్చేస్తుంది. ప్రస్తుతానికి తెలంగాణ ప్రభుత్వం ఎసిబిని దింపడం తప్పు అని కేంద్రం యింకా ఏమీ అనలేదు. అయినా సమర్థుడిగా పేరుబడ్డ ఎకె ఖాన్‌కు తన పరిధి తెలియకుండా వుండదు. రేవంత్ స్టింగ్ ఆపరేషన్ టీ–ఛానెల్ నిర్వహించి వుంటే అదంతా బోగస్ అనేయగలిగేవారు. అందుకే ఎసిబిని దింపారు. అబ్బే కాదు, యిది హోం శాఖ పరిధిలోకే వస్తుంది అంటే ఎసిబి తమకు దొరికిన సాక్ష్యాలను వాళ్లకు బదిలీ చేసేయవచ్చు. అప్పుడేమంటారు?

బాబుగారికి హఠాత్తుగా సెక్షన్ 8, హైదరాబాదుపై గవర్నరు అధికారాల సంగతి గుర్తుకు వచ్చింది. నిజానికి విభజన చట్టంలో దాన్ని పెట్టడమే తప్పు. హైదరాబాదును కేంద్రపాలితం చేయాలి, లేకపోతే ఆంధ్రుల ఆస్తిపాస్తులకు, మానప్రాణాలకు ముప్పు అని వాదించిన ఆంధ్ర కాంగ్రెసు నాయకులను చల్లార్చడానికి ఆ సెక్షన్ చేర్చారు. ఏ మాట కా మాట చెప్పాలంటే అలా పెట్టడం రాష్ట్రప్రభుత్వంపై విశ్వాసరాహిత్యమే. తన పౌరులను అది కాపాడదని, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి దానిపై అజమాయిషీ చేయాల్సిందేనని ఒప్పుకున్నట్లు అయింది. తెలంగాణలో ఈ రోజు తెరాస ప్రభుత్వమైంది, రేపు టిడిపి ప్రభుత్వమే రావచ్చు. అప్పుడైతే యీ సెక్షన్ అక్కరలేదని అనగలరా? విభజన జరిగి ఏడాది అయింది. ఈలోగా తెలంగాణ ప్రభుత్వం అనేక ఉమ్మడి ఆస్తులను స్వాధీనం చేసేసుకుంది. ఆంధ్ర అధికారులను తెలంగాణ ఉద్యోగులు అడ్డుకున్న సందర్భాలున్నాయి. వీటిపై టిడిపి యింత పెద్ద ఎత్తున ఉద్యమించలేదు. ఎందుకంటే తెలంగాణకు గుండెకాయ వంటి హైదరాబాదు పై గవర్నరు అజమాయిషీ అంటే ఏ తెలంగాణ నాయకుడికి రుచించదు. రాజకీయంగా యిక్కడ బలపడదలచిన టిడిపి దీని గురించి గట్టిగా పట్టుబడితే సెంటిమెంటుకు వ్యతిరేకంగా వెళ్లినట్లవుతుందని భయపడింది. ఈ రోజు తన చాప కిందకే నీరు రావడంతో బాబు ఉలిక్కిపడి లేచి, గవర్నరుకు అధికారాలు అప్పగించవలసినదే అని

పట్టుబడుతున్నారు. రేపు మర్నాడు బిజెపి తన పార్టీ నాయకుణ్ని గవర్నరుగా పంపి, బాబును యిరకాటంలో పెట్టడానికి యిలాటి స్టింగ్ ఆపరేషన్‌కు ఆదేశిస్తే అప్పుడు ఎవరికి అప్పగించమంటారు? గవర్నరు అంటే రాజకీయ నియామకమే అని అందరికీ తెలుసు. బాబుకి యీరోజు బిజెపి మిత్రపక్షం. రేపటిమాట ఎవరికి తెలుసు? బాబు కొంతకాలం కమ్యూనిస్టులతో కలిసి బిజెపిని ఓడించడానికి ప్రయత్నించారు, యింకొంతకాలం బిజెపితో కలిసి కమ్యూనిస్టులను ఓడించడానికి చూశారు. టిటిడి బోర్డు విషయంలో మాట తప్పిన బాబును దారికి తేవడానికి బిజెపి రేవంత్ అంశాన్ని కాస్త వాడుకుంది. కానీ తెలుగు మీడియా బాబు ఢిల్లీ వెళ్లగానే మోదీ భరోసా యిచ్చారని, అండగా వుంటామని అమిత్ షా హామీ యిచ్చారని రాసేసింది. అండ సంగతి అవతల తెలుస్తుంది కానీ ప్రస్తుతానికి టిటిడి బోర్డు సంగతి గిల్లి గుర్తు చేసినట్లు తేలింది.

గవర్నరుకు అధికారాలు అప్పగిస్తే సమస్యలన్నీ తీరిపోతాయని బాబు ఎలా అనుకుంటున్నారో తెలియదు. హైదరాబాదు వరకే కదా, గవర్నరు పరిధి! రేపు వేరెవరైనా ఎమ్మెల్యే 'మెదక్ జిల్లాలో నా ఫార్మ్‌హౌస్‌లో కలిసి డబ్బులివ్వండి' అని స్టింగ్ ఆపరేషన్ చేయిస్తే, అప్పుడు గవర్నరు ఏం చేయగలడు? ఆపించగలడా? అర్జంటుగా సెక్షన్ 8 అమలు చేయాలంటూ కన్విన్స్ చేయడానికి బాబు తన లేఖలో వింత వింత వాదనలు చేశారు. 'కెసియార్, ఉద్యోగులు గత ఏడాది కాలంగా ఆంధ్రప్రాంత ప్రజలను దొంగలు, దోపిడీదారులుగా సంబోధిస్తూ అవమానిస్తున్నారు' అని రాశారు. గత ఏడాదిగానా!? పార్టీ పెట్టినప్పటినుంచీ కెసియార్ అదే ప్రేలాపన. తెలుగు భాషలో వున్న తిట్లన్నీ ఆంధ్రులను సంబోధించి అనేశారు. రాక్షస జాతి అన్నారు, తెలుగుతల్లి దయ్యం అన్నారు, ఒకటా రెండా గుర్తుండడానికి! అలాటి కెసియార్‌తోనే 2009లో బాబుగారు పొత్తు పెట్టుకున్నారు. తమది మహా కూటమి అని చెప్పుకున్నారు. ఇప్పుడు అర్జంటుగా యీ తిట్లు అక్కరకు వచ్చాయి.

లేఖలో రాసినట్టు లేదు కానీ, టిడిపి నాయకుల ప్రకటనల్లో అయ్యప్ప సొసైటీలో అక్రమ కట్టడాల కూల్చివేత, నాగార్జున కన్వెన్షన్ సెంటర్ వ్యవహారం – వీటన్నిటినీ  ఆంధ్రులపై దాడిగా, సినిమావారిపై దాడిగా చూపారు. అక్రమ కట్టడాలను ఆంధ్ర పేరుతో ఎలా సమర్థిస్తారు? అక్రమ కట్టడాలు అక్కడే వున్నాయా? పాత బస్తీలో లేవా? మరో చోట లేవా అని ప్రశ్నించవచ్చు. కానీ అయ్యప్ప సొసైటీలోవి ఆంధ్రుల కట్టడాలు కాబట్టి అక్రమమైనా కూల్చకూడదని ఎవరైనా వాదించగలరా? నాగార్జున చెఱువు భూమిని కబ్జా చేస్తే దాన్ని ప్రభుత్వం స్వాధీన పరచుకుంటే అది ఆంధ్రులపై దాడిలా ఎలా చెప్పగలరు? పద్మాలయా అక్రమాలకు రక్షణ కల్పిస్తే, అది ఆంధ్రులను రక్షించినట్లా? అయినా అయ్యప్ప సొసైటీలో కూల్చివేసినవన్నీ ఆంధ్రులవే తప్ప యితరులవి లేవు అని ఖండితంగా ఎవరైనా చెప్పగలరా? అక్రమాలకు ప్రాంతీయత పులమడం చాలా తప్పు. ఈ పని తెలంగాణావాదులందరూ చేశారు. ఆంధ్ర మూలాలున్న ఆక్రమణదారులను కొందరిని ఎత్తి చూపి ఆంధ్రులందరూ కబ్జాదారులే అని చిత్రీకరించారు. మిషన్ కాకతీయా సందర్భంగా చెఱువులను ఆక్రమించిన వారి జాబితా తయారుచేస్తే ఆక్రమణదారుల ప్రాంతీయత ఏమిటో తెలుస్తుంది. తెలంగాణ వాదులకు ధైర్యం వుంటే ఆ జాబితాను ప్రకటించాలి.

సినిమావాళ్లు భయభ్రాంతులకు గురవుతున్నారు, రిలీజుకు ముందు తెరాసవారికి మామూళ్లు చెల్లించుకుంటే తప్ప సినిమా విడుదల చేసుకునే పరిస్థితి లేదు అని కూడా టిడిపి నాయకులు అంటున్నారు. ఈ ముక్క సినిమావాళ్లు అనటం లేదు. పైకి అనడానికి కూడా భయపడుతున్నారని అనుకుందాం, ఆ పరిస్థితుల్లో యిక్కడ నుంచి తరలించే కార్యక్రమం చిన్నగానైనా ప్రారంభించాలి. ఆ దాఖలాలు ఏమీ కనబడటం లేదు. అనేక సినిమాలకు పెద్ద పెద్ద స్టూడియోలు అక్కరలేదు, చిన్నపాటి యిళ్లు, సెట్టింగులు చాలు. టీవీ సీరియల్స్‌కు యింకా చిన్నవి చాలు. ఏవీ హైదరాబాదు నుంచి కదలి ఆంధ్రకు వెళ్లినట్లు లేదు. వెళ్లిపోతూంటే తెరాస ప్రభుత్వం పట్టుకుని ఆపలేదు కదా! తెలంగాణ నిర్మాతల సంఘం, నటీనట సంఘం.. యిలా విభేదాలు వస్తున్నమాట వాస్తవం, అయినా అవి తీవ్రస్థాయికి చేరి, సినిమా పరిశ్రమ భయపడే పరిస్థితికి వచ్చినట్లు లేదు. కానీ తనకు ముప్పు వచ్చేసరికి టిడిపి దాన్నో అంశం చేద్దామనుకుంటోంది.

బాబు తన లేఖలో సమగ్ర సర్వే గురించి కూడా ప్రస్తావించారు. కోర్టు అప్పుడే దానికి ముకుతాడు వేసింది. 1956కు ముందు నివాసం వంటి అంశాలకు కూడా కోర్టు కళ్లెం వేసింది. తన పౌరులను విడగొట్టి పాలించడానికి కెసియార్ ప్రయత్నిస్తున్నారనడంలో సందేహం ఏమాత్రం లేదు. ఆంధ్ర మూలాలున్న వారి హక్కులు పరిరక్షిస్తాం అని టిడిపి, మజ్లిస్ ప్రకటనలు యివ్వడం తప్ప యీ చర్యలను ప్రతిఘటిస్తూ ఊరేగింపులు, నిరసనలు, రాస్తా రోకోలు, అలాయ్‌బలాయ్‌లు, వీధిభోజనాలు చేశాయా? ఎందుచేత? అలా చేస్తే తెలంగాణ వాదుల ఓట్లు పోతాయేమోనన్న భయం చేత! ఈ రోజు మాత్రం నిద్రలోంచి మేలుకొన్నట్లు అన్నీ ఒక్కసారిగా గుర్తుకు వచ్చేశాయి. హైదరాబాదులోని ఆంధ్ర ప్రాంత ప్రజల ప్రాణాలు, ఆస్తులు, స్వేచ్ఛకు రక్షణ కల్పించాలి అని డిమాండ్ చేస్తున్నారు బాబు. తెలంగాణలోని తక్కిన నగరాలలోని వారి మాటేమిటి? ఈ ఆంధ్ర ప్రాంత ప్రజలు అన్నవారెవరు? వారికి నిర్వచనం ఏమిటి? వారు ముందుకు వచ్చి మేం తెలంగాణవారం కాము, ఆంధ్రులం, మా ఆస్తులకు, ప్రాణాలకు రక్షణ లేదు అని ప్రకటించి ఎమ్మెల్యేలలా పోలీసు పహరా కావాలని అప్లికేషన్ పెట్టుకోవాలా?

ఇవన్నీ ఏకరువు పెట్టి గవర్నరు చేతికి అధికారాలు అప్పగించమంటున్నారు. ఢిల్లీలో లెఫ్టినెంట్ జనరల్‌కు, ఎన్నికైన ప్రభుత్వానికి జరుగుతున్న వివాదం కళ్లారా చూశాక, కేంద్రప్రతినిధికి సమస్తాధికారాలు యిమ్మనమని చెప్పి అనడానికి ఎవరూ సాహసించరు. అయినా టిడిపి ప్రభుత్వం తన యావచ్ఛక్తిని యీ వాదనపైనే కేంద్రీకరించింది. గవర్నరు సలహాదారులు బాబును కలిసి తమ

పరిమితులను వివరించారు. మరి బాబు కేంద్రంతో చెప్పి వారి అధికారాలు పెరిగేట్లు చేయగలుగుతారో లేదో చూడాలి. మత్తయ్యను అడ్డుపెట్టుకుని ప్రభుత్వ అధికారాలు వినియోగించి, టిడిపి తెలంగాణ ప్రభుత్వంతో కయ్యానికి కాలుదువ్వుతోంది. మత్తయ్య చెప్పినది ఎంతవరకు వాస్తవమో, అతను ఎలాటివాడో కోర్టులో తేలుతుంది. ఈ లోపుగా ఆంధ్ర ప్రభుత్వం అతనికి రక్షణ కల్పించడమే వింతగా వుంది. కేసులో నిందితులుగా వున్నవారిని తిప్పి పంపమని విదేశాలనే కోరతాం. వారికి వాళ్లు ఆశ్రయం కల్పిస్తే కోపగిస్తాం. అలాటి పక్క పక్కరాష్ట్రం వాళ్లలో ఆ పాటి సహకారం లేకపోతే ఎలా?

ఇప్పటిదాకా తెలంగాణ ప్రభుత్వం బాబుపై కేసు పెట్టలేదు. రేవంత్ రెడ్డిపై మాత్రమే పెట్టింది. కానీ ఆంధ్రలో కెసియార్‌పై అనేక కేసులు టపటపా పెట్టేశారు. తప్పు లేదు. పెట్టదగ్గ వ్యక్తే. ఆంధ్రుల గురించి ఆయన పలికిన అవాకులు, చవాకులపై పరువునష్టం దావాలు యిప్పటికే బోల్డు వేయవచ్చు. కానీ ఇప్పుడు 13 జిల్లాలలో దాదాపు 70 కేసులు ఫోన్ ట్యాపింగ్ గురించేట! అది తప్ప ఆంధ్రులకు వేరే చింతలేమీ లేవా!? ఆ కేసుల దర్యాప్తుకై ఆంధ్ర ప్రభుత్వం సిట్ వేసే విషయం పరిశీలిస్తోందట. అంటే చంద్రబాబుపై కేసు పెడతారేమోనన్న సందేహం రాగానే దానికి ముందుగానే కెసియార్‌పై సిట్ విచారణ మొదలుపెడుతుందన్నమాట. ఫోన్ ట్యాపింగ్ అంత సీరియస్ విషయమా? నిన్నే పేపర్లో వచ్చింది. కేంద్రప్రభుత్వం నెలకు 9 వేల ఫోన్లను ట్యాప్ చేస్తుందట. రాష్ట్రాలు ట్యాప్ చేసేవాటిని కూడా కలిపితే ఆ అంకె ఎన్ని రెట్లు వుంటుందో మరి! సాక్షాత్తూ ఆంధ్ర ముఖ్యమంత్రి ఫోన్ ట్యాప్ అయింది అన్న అంశంపైనే యింత రచ్చ జరుగుతోంది. అయిందని తేలితే కేసు ముందుకు నడుస్తుంది. ఒకవేళ కాలేదు అని దర్యాప్తులో తేలితే, అప్పుడేం చేస్తారు? అంతటితో ఆపుతారా? కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం కుమ్మక్కయి ఆంధ్ర ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నాయని కొత్త రగడ మొదలుపెడతారా? ఇక్కడ యిరుక్కున్నది టిడిపి పార్టీ, దాని నాయకులు. దాన్ని ఆంధ్ర ప్రభుత్వానికి, ఆంధ్ర ప్రజలకు పులమడం అన్నిటికన్న అన్యాయం. దానిపై అసెంబ్లీ తీర్మానం చేయడం, అయిదు కోట్ల ఆంధ్రులను అవమానించారడం అర్థరహితం, అనర్థదాయకం. ఇది రెండు రాష్ట్రాల మధ్య, రాష్ట్రప్రజల మధ్య చిచ్చు పెట్టడమే. తమాషా ఏమిటంటే జరిగిన నేరం గురించి మాట్లాడటం లేదు, నేరం ఎలా బయటపడింది అన్నదానిపైనే యాగీ చేస్తున్నారు. ట్యాపింగ్ చేయడం బట్టి కదా, ఎమ్మెల్యేను ప్రలోభపెట్టే మా సంభాషణ రికార్డు చేయగలిగారు అని గొడవ చేస్తున్నారు. మధ్యలో ఆంధ్రులు ఎక్కణ్నుంచి వచ్చారు? వాళ్లేమైనా పక్కరాష్ట్రం కౌన్సిల్‌లో నెగ్గి రా అని తమ ముఖ్యమంత్రికి చెప్పారా? టిడిపి అధ్యక్షుడు యీ కేసులో ఎ1 లేదా ఎ2 అయితే ఆంధ్రులకు అవమానమా? ఒకవేళ బిజెపి అధ్యక్షుడే యిలాటి కేసులో యిరుక్కుంటే అప్పుడు యావత్ భారతీయులకు అవమానమా? ఎలాటి వాదన యిది!

అయిన దానికీ కాని దానికీ ఆంధ్రులను ఆడిపోసుకోవడం, వారిని యిరికించడం యిన్నాళ్లూ తెలంగాణ వాదుల పేటెంటుగా వుంది. ఫలానా సినిమా వ్యక్తి అక్రమ నిర్మాణం చేశాడు అనకుండా, ఆంధ్రులు చేశారు అంటూంటారు, అక్కడికి ఆంధ్రులందరూ దుర్మార్గులు అయినట్టు! మొన్న పాలమూరు, డిండి ప్రాజెక్టుల అనుమతుల గురించి ఆంధ్ర మంత్రి అభ్యంతరం తెలిపితే కెసియార్ తన ఉపన్యాసంలో ఆయనను పేరు పెట్టి విమర్శించకుండా 'ఆంధ్ర సన్నాసులు' అంటూ జాతివాచకం వుపయోగించి ఆంధ్రులందరినీ అవమానించారు. తెలంగాణ సెంటిమెంటే పెట్టుబడిగా అధికారం చేజిక్కించుకున్న దాన్ని సజీవంగా వుంచడం కోసం ఆంధ్రద్వేషం చిమ్ముతూనే వున్నారు. ఈ మధ్య ఓ నాలుగు మంచి మాటలు అన్నా అవి హైదరాబాదు కార్పోరేషన్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్నవే తప్ప హృదయంలోంచి వచ్చినవి కావని అందరికీ అనుమానం. ఆంధ్రుల పట్ల కెసియార్ దృక్కోణం ఎటువంటిదో తెలియడానికి టైము పడుతుంది. ఒకవేళ ఆయన ఆపినా, ఆ పల్లవిని తెలంగాణలోని తక్కిన పార్టీల వాళ్లు అందుకోవచ్చు.

ఇలాటి బాధ చాలనట్లు, యిప్పుడు చంద్రబాబు తన పట్టిన మసిని ఆంధ్రులకు పులుముతున్నారు. ఆయన దళితుడు అయి వుంటే దళితులను దొరలు వేధించారని అనేవారేమో, ఆ ఛాన్సు లేకపోబట్టి తన జాతిని ముందుకు తెచ్చారు. బాబుని రక్షించే ఒక్కో అస్త్రం ఖర్చయిపోతున్న కొద్దీ యీ సెంటిమెంటుపై పడ్డారు. ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టులు బయటకు వచ్చాక అది ఆయన గొంతు కాదని అనగలరో లేదో తెలియదు. ఎసిబి తన పరిధిని మించి వ్యవహరించిందని టిడిపి నాయకులు అంటూ వచ్చారు. ఇప్పుడు మీడియా ఎసిబిని పాత్రను కాకుండా అది నేరం మోపిన సెక్షన్లను తప్పుపడుతోంది. ఇక హైదరాబాదుపై అధికారాలను గవర్నరుకు కట్టబెట్టించినా అది మున్ముందు కాపాడుతుంది కానీ జరిగిపోయిన దానికి ఏం చేయగలరు? ఫోన్ ట్యాపింగ్ జరగలేదని కేంద్ర సంస్థ నిర్ధారిస్తే కప్పుకోవడానికి ఏమీ మిగలదు. అందుకని సెంటిమెంటు రగిలిద్దామని చూస్తున్నారు. ఇది దుర్మార్గం. తమ ముఖ్యమంత్రిని పనిగట్టుకుని వేధిస్తున్నారని ఆంధ్రులలో చాలామంది అనుకుంటున్నారని మీడియా రాసేస్తోంది. నిజంగానా!? నేరస్తుణ్ని పట్టుకుంటే వేధింపా? నేరం చేస్తూ పట్టుబడ్డవాడు సక్రమ మార్గాల్లో పట్టుబడ్డాడా, అక్రమ మార్గాల్లో పట్టుబడ్డాడా అనేది సాంకేతిక విషయం. తమ ముఖ్యమంత్రి ఏ నేరం చేసినా పట్టుకోకూడదని, అలా పట్టుకుంటే వేధింపేననీ, తమకు అవమానం జరిగినట్లే అని రాష్ట్ర పౌరులు ఎందుకనుకుంటారు? అలా పట్టుబడడం వలన తమకు జరిగే నష్టం గురించే ఆలోచిస్తారు తప్ప!

బాబు యిలా యిరుక్కోవడం ఆంధ్ర రాష్ట్రానికి నష్టమనే నేను నమ్ముతున్నాను. ఈ సందర్భంగా పాఠకులు చేసిన కొన్ని వ్యాఖ్యలకు జవాబిస్తున్నాను. సినిమాల విషయంలో లాగానే ఎన్నికల ఫలితాల విషయంలో కూడా అనేక అంశాలు ప్రభావితం చేస్తాయి. 2014 ఎన్నికల ఫలితాల విశ్లేషణ వ్యాసాల్లో వాటి గురించి విపులంగా రాశాను. అవినీతి ముద్ర, క్రైస్తవ ముద్ర, ఫ్యాక్షనిస్టు ముద్ర యిత్యాది అనేక అంశాలు జగన్‌కు ప్రతికూలంగా పనిచేశాయి. రాజధాని నిర్మాణం, అవినీతి యిత్యాది అంశాలపై మధ్యతరగతి వర్గాలు

టిడిపిని పూర్తిగా బలపరిచాయి. కాపు ఓట్లు, బిజెపి మద్దతు వగైరా విశ్లేషణలు కొంతవరకే పనికి వస్తాయి. వైయస్‌కు కంచుకోటగా నిలిచిన తూర్పుగోదావరి జిల్లాలో వైకాపా దెబ్బ తినడానికి, వైకాపా గౌరవాధ్యక్షురాలు వైజాగ్‌లో పరాజయం పొందడానికి కారణాలేమిటో వైకాపా అభిమానులు తరచి చూసుకోవాలి. ఆంధ్ర రాజధాని నిర్మాణానికి సరైన సారథి బాబే అని నమ్మిన హైదరాబాదులోని ఆంధ్రులు యిక్కడా, అక్కడా రెండు చోట్లా టిడిపికి ఓట్లు వేశారు. అందుకే జంటనగరాలలో టిడిపి, దానితో పొత్తు పెట్టుకున్న బిజెపి గెలిచాయి. మళ్లీ యిలా జరగకూడదనే కెసియార్ జంట నగరాల ద్వంద్వ ఓటర్లపై నిఘా వేశారు. బాబు తన లేఖలో 'ఆంధ్రప్రాంత ప్రజలలో అభద్రతా భావం సృష్టించడానికి సర్వే ఆదేశించారు' అని పేర్కొనడానికి కారణం యిదే.

బాబు రాజకీయంగా అస్థిరమైతే ఆంధ్ర రాజధాని నిర్మాణం, దానికి వచ్చే పెట్టుబడులు కొంతకాలం పాటు కుంటుపడతాయన్నది వాస్తవం. అబ్బే పెట్టుబడి పెట్టేవారు ముఖ్యమంత్రిని చూసి రారు, అవకాశాల బట్టి వస్తారు అని వాదించేవారు 'మోదీ కాలంలో గుజరాత్ అభివృద్ధి చెందింది' 'బుద్ధదేవ్ కాలంలో బెంగాల్ నుంచి పెట్టుబడులు బయటకు వెళ్లిపోయాయి' వంటి స్టేటుమెంట్లలోని ఔచిత్యాన్ని ప్రశ్నించాలి. డ్రైవర్ కౌశలం బట్టే కారు వేగం వుంటుంది. ముఖ్యమంత్రి సామర్థ్యం రాష్ట్రప్రగతిని ప్రభావితం చేస్తుంది. బాబు యిమేజి దెబ్బ తిన్నా, ఆయన స్థానంలో మరొకరు వచ్చినా ఆంధ్రకు యిబ్బందే. జయలలిత స్థానంలో పన్నీరు సెల్వం వుండగా తమిళనాడు పరిస్థితి ఎలా దెబ్బ తిందో గతంలో రాశాను. ఇలా చెప్పడం వలన ఆంధ్రులలో అభద్రత నింపుతున్నావని ఆరోపిస్తున్నారు కొందరు. నాయకుల వాగ్దానాల హెూరులో, బ్రోషర్ల జోరులో నా హితోక్తులు ఎంతమందికి వినబడుతున్నాయో నాకు తెలియదు. హైదరాబాదు కోల్పోవడంతోనే ఆంధ్రకు అపారమైన నష్టం కలిగింది. ఇప్పట్లో కోలుకోవడానికి పరిస్థితులు అనుకూలంగా లేవు. భారీ పరిశ్రమలు, ఆకాశ హర్మ్యాల పగటి కలలు మానేసి, పంజాబీల తరహాలో చిన్న పరిశ్రమలు పెట్టుకుని శ్రమించడం, వ్యవసాయోత్పత్తుల ద్వారా సంపాదించడం, కేరళీయుల తరహాలో విద్యార్జన, నైపుణ్యం పెంచుకోవడం ఆంధ్ర ప్రజలు చేయవలసిన పని. అప్పుడు ప్రభుత్వం స్థిరంగా వున్నా, అస్థిరంగా వున్నా వారి జీవితాలు ఆటుపోట్లకు లోను కావు. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2015)**

**జూన్ 10 వీక్షీక్షై ఎమ్బీయస్ : ఉపయెన్నిక బరిలో జయలలిత**

స్పెషల్ కోర్టు తీర్పు కారణంగా శ్రీరంగం నియోజకవర్గం సీటు వదులుకోవలసిన జయలలిత కర్ణాటక హై కోర్టు తాజా తీర్పుతో మళ్లీ ముఖ్యమంత్రి పదవి చేపట్టి, ఆరు నెలల్లోగా అసెంబ్లీకి ఎన్నిక కావడానికై ఉత్తర చెన్నయ్‌లోని రాధాకృష్ణ నగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని నిశ్చయించుకున్నారు. తన పార్టీ శాసనసభ్యుడు పి వెట్రివేలు చేత మే 17 న రాజీనామా చేయించి జూన్ 27 న జరిగే ఉపయెన్నికలో పోటీ చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ కూడా ఆమెకు సహకరిస్తోంది. శ్రీరంగం నియోజకవర్గం ఉపయెన్నిక గురించి ప్రకటించడానికి 75 రోజులు తీసుకున్న కమిషన్ యీ సారి ప్రకటనకు కేవలం పది రోజులు తీసుకుంది. తనపై వున్న అవినీతి ఆరోపణలు, కేసులు నగరవాసులను కూడా ప్రభావితం చేయలేదని నిరూపించుకోవడానికి జయలలిత తొలిసారిగా రాజధాని నుంచి పోటీ చేస్తున్నారు. రికార్డు స్థాయిలో గెలవడానికి 50 మందితో పోల్ కమిటీ వేసి దాని నేతృత్వాన్ని పన్నీర్ సెల్వంకు అప్పగించారు. ఈ హంగామా అంతా చూసి ప్రతిపక్షాలు బెదిరిపోయి, ఆమెతో తలపడమనేశాయి. కమ్యూనిస్టు పార్టీలు మాత్రమే ముందుకు వచ్చి తమ ఉమ్మడి అభ్యర్థిగా సిపిఐకు చెందిన సి మహేంద్రన్‌ను నిలబెట్టాయి. ఇంకా 26 మంది అభ్యర్థులు వున్నారు కానీ కమ్యూనిస్టు అభ్యర్థి మాత్రమే కొద్దో గొప్పో జయలలితకు వ్యతిరేకంగా ఓట్లు కూడగట్టుకోవాలి.

తమిళనాడుకు 2016లో అసెంబ్లీ ఎన్నికలు రానున్నాయి. ఏడాది భాగ్యానికి నిలబడడం దేనికి, పైగా అధికారపక్షం డబ్బు కుమ్మరిస్తుంది, పోటీ పడడం అనవసరం అని ప్రతిపక్షాలు వాదిస్తున్నాయి. నిజానికి మే 24 న మధురైలో స్టాలిన్ నిర్వహించిన సభ విజయవంతమైంది. అయినా డిఎంకెకు ధైర్యం చాలలేదు. తక్కిన పార్టీలు కలిసి వస్తే ఏమైనా చేసేదేమో! కాంగ్రెసు నుండి బయటకు వచ్చి 2014 నవంబరులో తమిళ మానిల కాంగ్రెసు (టిఎంసి) పార్టీని పునరుద్ధరించి 45 లక్షల మంది సభ్యులను చేర్చించగలిగిన జి కె వాసన్ (మూపనార్ కుమారుడు) తనతో కలిసి వస్తే లెఫ్ట్ పార్టీలను, వీలైతే విజయకాంత్‌ను లాక్కుని రావచ్చని డిఎంకె అనుకుంది. అయితే కాంగ్రెసు నుండి మూకుమ్మడిగా టిఎంసిలోకి వచ్చిన క్యాడర్ ఎడిఎంకెతో పొత్తు అయితే ఫర్వాలేదు కానీ డిఎంకెతో కలవవద్దని చెప్పడంతో వాసన్ అడుగు ముందుకు పడలేదు. అందుకే జయలలితపై వచ్చిన కోర్టు తీర్పుపై కూడా అతను వ్యాఖ్యానించకుండా మౌనంగా వున్నాడు.

రాష్ట్ర బిజెపి తరఫున కేంద్రమంత్రిగా వున్న పొన్ రాధాకృష్ణన్ జూన్ 2 న ఒక ప్రకటన చేస్తూ కూటమిలో తమ భాగస్వాములైన డాఃఎ రామదాసు (పిఎంకె) విజయకాంత్ (డిఎండికె)లను సంప్రదించి బిజెపి తన అభ్యర్థిని నిలుపుతుందని ప్రకటించారు. కానీ అదే రోజు రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు తమిళిశై సౌందరరాజన్ డిఎండికె అభ్యర్థిని నిలిపితే తాము బలపరుస్తామని చెప్పారు. డిఎండికె పార్టీ తరఫున అభ్యర్థిని నిలబడితే బలపరుద్దామని డిఎంకె కూడా అనుకుంది. తన పార్టీ ద్వారా ఎన్నికైనవారు ఎడిఎంకెలో చేరిపోవడంతో నీరసించి వున్న విజయకాంత్ ఎటూ తేల్చకుండా వున్నాడు. అతనితో పొత్తులో చిక్కు ఏమిటంటే తనే ముఖ్యమంత్రి అవుదామనుకుంటున్నాడు. డిఎంకె తరఫున స్టాలిన్, పిఎంకె తరఫున అన్బుమణి రాందాస్ కూడా అదే ఆశతో వున్నారు. పిఎంకె

తను 2016 అసెంబ్లీ ఎన్నికలలో డిఎంకెతో కాని, ఎడిఎంకెతో కాని పొత్తు పెట్టుకోనని స్పష్టం చేస్తోంది. బిజెపి కూడా అదే పంథాలో ఆలోచిస్తోందని అరుణ్ జైట్లే ప్రకటించారు.

మొత్తానికి కమ్యూనిస్టులు తప్ప తక్కిన పార్టీలన్నీ ఉపయెన్నిక యిచ్చే అవకాశాన్ని వదులుకుంటున్నాయి. జయలలిత కేసులో కర్ణాటక హైకోర్టు తీర్పు చాలా వింతగా వుంది. జయలలిత కున్న అప్పులు రూ.10.67 కోట్లు అని ట్రయల్ కోర్టు అంటే, కాదు, కాదు రూ.24.17 కోట్లు అనేశారు, హై కోర్టు జడ్జి! మొదటి అంకె కరక్టయితే ఆమె అక్రమాస్తులు వుండవలసిన దాని కంటె 76.76% ఎక్కువ వున్నట్టు తేలుతుంది, రెండోది తీసుకుంటే 8.12% మాత్రమే అవుతుంది. హైకోర్టు జడ్జి రెండోది లెక్కలోకి తీసుకుని, ఓస్ యింతేగా అని వదిలేశాడు. శశికళ, సుధాకరన్, ఇళవరసిలకు ఆదాయం వచ్చే మార్గాలేమీ లేవు కాబట్టి, అవన్నీ మొదటి ముద్దాయి జయలలితవే అంటూ ట్రయల్ కోర్టు జడ్జి లెక్కేస్తే, అబ్బే వాళ్లు బ్యాంకు లోన్లు తీసుకుని కొన్న స్థిరాస్తులు అన్నారు హైకోర్టు జడ్జి. సుధాకరన్ పెళ్లి ఖర్చు రూ. 6.45 కోట్లు అని ప్రాసిక్యూషన్ అంది. రూ.98 లక్షలు అని జయలలిత యిన్‌కమ్‌టాక్స్ వారికి చెప్పింది. అబ్బే మేమే భరించాం, దాని కోసం రూ.92 లక్షలు బ్యాంకులో వేశాం అంటూ పెళ్లికూతురు అన్నగారు బ్యాంకు పాస్‌బ్యుక్ పట్టుకుని వచ్చాడు. దానిపై బ్రాంచ్ పేరు, స్టాంపు లేవు. పెళ్లి ఖర్చుల కోసం సేవింగ్స్ ఖాతా తెరవడం విడ్డూరంగా వుంది, పైగా జయలలిత సప్లయిర్సకు తన చెక్కులు యిచ్చింది. పెళ్లికి రూ. 3 కోట్లు ఖర్చయిందని నా అంచనా అన్నారు ట్రయల్ కోర్టు జడ్జి. 'అబ్బే 29 లక్షల రూ.ల లోపే ఖర్చయింది' అని తేల్చేశాడు హైకోర్టు జడ్జి. జయలలిత కొత్తగా కట్టించిన బిల్డింగులపై రూ.21 కోట్లు ఖర్చయిందని ట్రయల్ జడ్జి అంటే అబ్బే రూ.5 కోట్లే అన్నారు హైకోర్టు జడ్జి. 900 ఎకరాల కాఫీ ప్లాంటేషన్ రూ.7.50 కోట్లకు కొనడం, పంట భూములను ఎకరా 10 వేలకు కొనడం నమ్మశక్యంగా లేవు అని ట్రయల్ జడ్జి అంటే వాటి విలువ రూ.6.24 కోట్ల కంటె ఎక్కువ వుండదు అన్నారు హైకోర్టు జడ్జి.

ఇలాటి వింత పోకడలన్నీ ఏకరువు పెట్టి జనాలను ఎడ్యుకేట్ చేయడానికి ఎన్నికల సభలే సరైన వేదిక. మామూలు సమయాల్లో జనాలు సరిగ్గా వినరు, తలకెక్కించుకోరు. అలాటి అవకాశాన్ని తమిళనాడు ప్రతిపక్షాలు జారవిడుచుకుంటున్నాయి. మరో పక్క జయలలిత దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఫుల్ స్వింగ్‌లో ముందుకు వెళుతోంది. పన్నీర్ సెల్వం హయాంలో కుంటుపడిన ఎడ్మినిస్ట్రేషన్‌ను పరుగులెత్తిస్తోంది. పెండింగులో వున్న ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులను పూర్తి చేయిస్తోంది, సెప్టెంబరులో గ్లోబల్ యిన్వెస్టర్స్ మీట్ పెట్టి తమిళనాడుకు పెట్టుబడులు ఆకర్షించబోతున్నానని చెప్పుకుంటోంది. ఎన్నిక ఫలితం ఎలా వుంటుందో వేరే చెప్పనక్కరలేదు. – **ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2015)**

**జూన్ 11 వీక్లీకై ఎమ్బీయస్ : హస్తిన నాదా? నీదా?**

ఢిల్లీ చాలాకాలం పాటు కేంద్రపాలిత ప్రాంతంగా వుంది. దానికి రాష్ట్రస్థాయి కల్పించాలని బిజెపి చాలాకాలం పోరాడింది. చివరకు అర్ధరాష్ట్ర స్థాయి యిచ్చారు. శాంతిభద్రతల వంటి కొన్ని అధికారాలు కేంద్రం చేతిలో, మరి కొన్ని రాష్ట్రప్రభుత్వం చేతిలో! కేంద్రం తరఫున లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జి) వుంటారు. రాష్ట్రప్రభుత్వం తరఫున ఎన్నిక కాబడిన ముఖ్యమంత్రి వుంటారు. వీళ్లిద్దరి మధ్య తగాదాలు రావడం కొత్త కాదు కానీ, యిప్పుడు అవి పరాకాష్ఠకు చేరాయి. కేంద్రంలో యుపిఏ వున్నంతకాలం అధికారాలన్నీ గుప్పిట్లో పెట్టుకుందని, ఢిల్లీకి రాష్ట్రస్థాయి కల్పించలేదని తీవ్రంగా విమర్శించిన బిజెపి యిప్పుడు తనకు కేంద్రంలో అధికారం దక్కాక, ఢిల్లీ ముఖ్యమంత్రికి అధికారాలు దఖలు పరచడానికి యిచ్చగించటం లేదు. తమను చిత్తుగా ఓడించిన ఆమ్ ఆద్మీకి వేస్తున్న శిక్షకాబోలు, ఎల్‌జి ద్వారా ముఖ్యమంత్రిని తీవ్రస్థాయిలో సతాయిస్తోంది. అరవింద్ మాత్రం అప్పుడూ యిప్పుడూ ఒకే మాట – ఢిల్లీకి పూర్తి రాష్ట్రస్థాయి వుండాలని! (తనే ప్రధాని అయితే అప్పుడేం చేస్తాడో!) 2013–14లో మొదటిసారి 49 రోజులు ముఖ్యమంత్రిగా వుండే రోజుల్లో ఢిల్లీ పోలీసుపై రాష్ట్రప్రభుత్వానికి అదుపు వుండాలని డిమాండ్ చేస్తూ రైల్ భవన్ ఎదుట ధర్నా చేశాడు. ఇప్పుడూ అంతే! మే 27 న అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎల్‌జి అధికారాలకు పరిమితి వుండాలని వాదిస్తున్నాడు. అదే సమావేశంలో ఆమ్ ఆద్మీ శాసనసభ్యుడొకడు, పార్లమెంటు రాష్ట్రపతిని అభిశంసించినట్లే, అసెంబ్లీ ఎల్‌జిని అభిశంసించే వెసులుబాటు కల్పించేట్లా రాజ్యాంగ సవరణ చేయాలని ప్రతిపాదించాడు.

రాష్ట్ర నిర్వహణకు అత్యంత కీలకమైన వ్యక్తి చీఫ్ సెక్రటరీ. ఢిల్లీ రాష్ట్రానికి ఆ పదవిలో వున్న కెకె శర్మ పది రోజుల సెలవులో వెళ్లినపుడు అతని స్థానంలో అనేకమంది సీనియర్లను విస్మరించి ఎల్‌జి శకుంతలా గామ్లిన్‌ను నియమించాడు. శకుంతల నియామకాన్ని అరవింద్ వ్యతిరేకించాడు. పరిమళ్ రాయ్‌ను నియమించాలని అతని కోరిక. ఐయేయస్ ఆఫీసరుగా పని చేసి, తర్వాత రిలయన్సు ఇండస్ట్రీస్‌లో పని చేసి, యుపిఏ హయాంలో 2013లో ఎల్‌జిగా నియమితుడైన నజీబ్ జంగ్ ఆ కోరికను తిరస్కరించాడు. ఢిల్లీలో విద్యుత్, నీటి సరఫరా ప్రధాన సమస్యలు. విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కమ్)లు రిలయన్సు వంటి ప్రయివేటు కార్పోరేట్ల చేతిలో వున్నాయి. వాళ్లు తమకు ఋణాలు యివ్వాలని, లేకపోతే ప్రభుత్వం హామీ యిచ్చి లెటర్స్ ఆఫ్ కంఫర్ట్ యిప్పించాలని డిమాండ్ చేస్తున్నాయి. అరవింద్, రాష్ట్ర విద్యుత్ మంత్రి సత్యేంద్ర జైన్ యివ్వడానికి ఒప్పుకోవటం లేదు. ఇప్పుడు శకుంతల రూ.11 వేల కోట్ల లెటర్స్ ఆఫ్ కంఫర్ట్ యివ్వాలని సిఫార్సు చేసినట్లు జైన్ ఆరోపిస్తున్నారు. ఢిల్లీలో ఎక్కడ అవినీతి జరిగినా చెప్పండి, అధికారుల

భరతం పడతానంటూ అరవింద్ ప్రజలను కోరగా కేంద్ర ఉద్యోగుల జోలికి రాష్ట్ర ఎసిబి (అవినీతి నిరోధక శాఖ) వెళ్లడానికి వీల్లేదంటూ కేంద్ర హెూం శాఖ మే 21 న ఒక గెజిట్ నోటిఫికేషన్ వెలువరించింది. ఇది అవినీతిపరులను వెనకేసుకుని రావడం కాకపోతే మరేమిటని ఆమ్ ఆద్మీ పార్టీ విరుచుకు పడింది. ఎల్‌జి ఆదేశాలను ఉన్నతాధికారులెవరూ మన్నించనక్కరలేదంటూ తన ఉద్యోగులకు ఆదేశాలు యివ్వడమే కాకుండా అరవింద్ ప్రిన్సిపల్ సెక్రటరీ (సర్వీసెస్) ఆఫీసు మూసివేయించి ఎల్‌జి ఆదేశాలు వేరెవరికీ చేరకుండా చేశాడు. దానిపై ఎల్‌జి సిఎంను ఉద్దేశించి ఒక ఘాటైన లేఖ రాశాడు. ఢిల్లీ సిబ్బందిలో స్టెనో నుండి సిఎస్ దాకా ఎవరినైనా సరే నియమించే, బదిలీ చేసే, తీసేసే హక్కు తనకుందని దానిలో రాశారు. అది పట్టుకుని అరవింద్ ప్రణబ్ ముఖర్జీ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారు.

ఢిల్లీ హైకోర్టు హెూం శాఖ నోటిఫికేషన్‌పై వ్యాఖ్యానిస్తూ ఢిల్లీ ప్రభుత్వానికి కేంద్ర ఉద్యోగుల అవినీతిని విచారించే హక్కు వుందని చెప్పింది. దానిపై కేంద్రప్రభుత్వం సుప్రీం కోర్టుకి వెళ్లింది. సుప్రీం కోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసు యిచ్చి మూడు వారాల్లో బదులిమ్మంది. ఈలోగా హైకోర్టు తీర్పును నిలిపివేయమని కేంద్రం అడిగితే సుప్రీం కోర్టు ఒప్పుకోలేదు. అలా అంటూనే అది ప్రయోగాత్మకమే తప్ప, విధాయకం కాదంది. (టెన్టేటివ్, వుడ్ నాట్ బి బైండింగ్). ఇప్పటికే ఢిల్లీ స్థాయి గురించి న్యాయకోవిదులు వెలువరిస్తున్న భిన్నాభిప్రాయాల గందరగోళానికి కోర్టు వ్యాఖ్యానం తోడైంది. నేషనల్ కాపిటల్ టెరిటరీ యాక్ట్ లోని ఆర్టికల్ 293ఎఎ (4) ప్రకారం 'ముఖ్యమంత్రి నాయకత్వంలోని మంత్రివర్గం లెఫ్టినెంట్ గవర్నరుకు నిర్వహణలో సలహా, సహాయాలు (ఎయిడ్ అంట్ ఎడ్వయిజ్) అందిస్తారు' అని వుంది కాబట్టి అధికారం నాదే, వాళ్ల పని సలహాలు యివ్వడం వరకే, వినాల్సిన బాధ్యత నాకు లేదు' అంటున్నాడు ఎల్‌జి. 'స్వాతంత్ర్యం వచ్చాక ఏ పార్టీకి రానట్లుగా 54% ఓట్లు, 96% సీట్లు తెచ్చుకున్న పార్టీ ఎంచుకున్న ప్రభుత్వం మాట పెడచెవిన పెట్టడానికి ఎల్‌జి ఎవరు, అతన్ని ప్రజలు ఎన్నుకున్నారా? ఆప్‌ను గెలిపించి, ప్రజలు చీపురుతో తుడిచిపెట్టేసిన బిజెపికి చెందిన కేంద్ర ప్రభుత్వం నియమించిన వ్యక్తే కదా?' అంటున్నారు ఆప్ తరఫున మాట్లాడే నిపుణులు. 'సలహా, సహాయాలు అనే మాట ప్రతి గవర్నరు, రాష్ట్రపతి విషయంలో కూడా వాడతారు. వాళ్లు నామమాత్రపు పాలకుల కింద లెక్క. ఢిల్లీ ఎల్‌జి మాత్రం వాటిని అక్షరాలా పాటించేద్దామని చూడడం తప్పు' అంటున్నారు. అరవింద్ గతంలో రిలయన్సుపై, వీరప్ప మొయిలీపై కేసులు పెట్టిన తరహాలోనే యిప్పుడు ఒక కేంద్రమంత్రిని అరెస్టు చేయిస్తాడనే పుకారు రావడంతో కేంద్రం వివాదాన్ని యీ స్థాయికి తెచ్చిందని వార్తలు వస్తున్నాయి.

పేరుకి ఎల్‌జితో పోరాటం అంటున్నాం కానీ యిది ఆప్-బిజెపి మధ్య వివాదమని అందరికీ తెలుసు. తమను తుక్కుతుక్కుగా ఓడించిన ఆప్‌పై బిజెపి ప్రతీకారం తీర్చుకుంటోంది. ఈ విషయంలో అది కాంగ్రెసు పోకడే పోతోంది. నిజానికి ఎన్‌డిఏ అధికారంలోకి వచ్చినపుడు, విలువలతో కూడిన కొత్త శకం, కొత్త తరహా పాలన వస్తుందని ఎందరో ఆశ పెట్టుకున్నారు. లలిత్ మోదీ వ్యవహారంలో సుష్మా స్వరాజ్, వసుంధరా రాజే తోడ్పడిన తీరు బయటకు వచ్చాక యుపిఏకు వీరికి తేడా ఏముందనిపిస్తోంది. పలుకుబడి వున్నవారికి ఏ ప్రభుత్వంలోనైనా సరే, పనులు అయిపోతున్నాయి. లలిత్ భార్యకు కాన్సర్ కాబట్టి మానవతా దృక్పథంతో సాయం చేశానని సుష్మా చెప్పుకున్న మర్నాడే ఆమె భర్త, కూతురు లలిత్ తరఫున వాదించారని బయటకు వచ్చింది. ఇది "సండే టైమ్స్"లో బయటకు రావడానికి కారణం మర్డోక్‌కు తనకు ఐపియల్ విషయంలో వచ్చిన తగాదా అని లలిత్ ఆరోపిస్తున్నారు. ఎలా బయటకు వచ్చినా, ఇమిగ్రేషన్‌కు వసుంధరా రాజే సాయపడ్డారని, లలిత్ భార్య చికిత్స చేయించుకున్న ఆసుపత్రితో రాజస్థాన్ ప్రభుత్వం తరఫున ఒప్పందం చేసుకున్నారనీ అన్నీ తేటతెల్లమవుతున్నాయి. లలిత్‌ను వెనక్కి రప్పించి న్యాయవిచారణ జరిపించ వలసిన ఎన్‌డిఏ ప్రభుత్వం యుపిఏ కంటె దారుణంగా అతనికి సాయపడుతోంది. మోదీ స్వచ్ఛపాలనపై ఆశలు పెట్టుకున్నవారిని నిస్పృహకు గురి చేసే ఘట్టం యిది. కాంగ్రెసు అవినీతిని, వృథావ్యయాన్ని, నియంతృత్వ పోకడలను ఎండగట్టడంలో ఆప్, బిజెపి ఒకేలా ప్రచారం చేశాయి. మళ్లీ అదే తరహాలో నడుస్తున్నాయి. తన పార్టీని గుప్పిట్లో పెట్టుకోవడానికి అరవింద్ ఎలా వ్యవహరిస్తున్నారో చూస్తున్నాం. ఆయన సహచరుల గుణగణాలు కూడా బయటకు వస్తున్నాయి. ఇక చేసిందేమీ లేకపోయినా ఏడాది పాలన పూర్తయిందంటూ దేశమంతా హెూరెత్తించిన మోదీ తరహాలో తనను తాను ప్రొజెక్టు చేసుకోవాలని తన వంద రోజుల పాలన పూర్తయిందంటూ ఢిల్లీ అంతా తన ఫోటోల హెూర్డింగ్స్ పెట్టేసి కోర్టు చేత అక్షింతలు వేయించుకున్నాడు. అధికారం తన గుప్పిట్లో పెట్టుకోవాలని పోరాడుతూ బిజెపి, ఆప్ రెండూ ఢిల్లీ మౌలిక వసతులను పట్టించుకోవటం లేదని గుర్తించిన కాంగ్రెసు పారిశుధ్య సమస్యల గురించి లేవనెత్తింది. వెంటనే యిద్దరూ ఉలిక్కిపడి తమ వాలంటీర్ల ద్వారా ఢిల్లీని శుభ్రపరిచే కార్యక్రమంలో పడ్డారు. కేంద్రం అర్జంటుగా దానికై నిధులు విడుదల చేసింది. వీళ్లిలా కొట్టుకుంటూనే వుంటే, యింకో పార్టీ రంగంలోకి రావచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2015)**

**జూన్ 12 వీక్లీకై ఎమ్బీయస్ : సన్ టీవీకి రిలయన్స్ గ్రహణం?**

ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడానికి టీవీ మీడియాకు చాలా శక్తి వుందని అందరికీ తెలుసు. సన్ టీవీ వంటి నెట్‌వర్క్‌ను లోబరచుకుంటే తమ వ్యాపార, రాజకీయ ప్రయోజనాలు సాధించుకోవచ్చని ఏ గ్రూపయినా, ఏ పార్టీ అయినా అనుకుంటే ఆశ్చర్యం లేదు. దేశంలోని మొత్తం కేబుల్, శాటిలైట్ చందాదారుల్లో 35% మంది దక్షిణాది రాష్ట్రాలలో వున్నారు. ఆ రాష్ట్రాలలో అందరి కంటె

అగ్రగామిగా వున్నది 1993లో ప్రారంభమైన సన్ గ్రూపు. కేరళలో మాత్రమే ద్వితీయస్థానం. తెలుగు రాష్ట్రాలలో దాని మార్కెట్ వాటా 26%, కర్ణాటకలో 37%, కేరళలో 29%, తమిళనాడులో 48%, దేశం మొత్తం మీద చూసుకుంటే 10.5%. దానికి 33 టీవీ ఛానెళ్లు, 45 రేడియో స్టేషన్లు వున్నాయి. కోటి మంది డిటిఎచ్ చందాదారులున్నారు. ఏటా రూ.2244 కోట్ల రెవెన్యూ వస్తోంది. రూ.737 కోట్ల లాభం. గత 20 ఏళ్లగా డిఎంకె కేంద్రంలో అధికారంలో వున్న పార్టీతో సఖ్యత పాటిస్తూ సన్ టీవీ అభివృద్ధికి తోడ్పడింది. కార్యక్రమాల నిర్వహణలో వృత్తిపరమైన నైపుణ్యం ప్రదర్శించడం చేత ప్రేక్షకుల ఆదరణ చూరగొని అత్యంత వేగంగా విస్తరించింది. ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలతో సరిపెట్టకుండా సినిమా రంగంలోకి కూడా వెళ్లి, యింకా యింకా అనేక రంగాల్లోకి చొచ్చుకుపోయింది. కళానిధి మారన్ పేరు మీద రూ.14500 కోట్ల ఆస్తి వుంది. అతను, అతని భార్య కావేరీ జీతాల రూపేణా 2013-14లో రూ.60 కోట్లు ఆర్జించారు. అతని వాటాదారు, సోదరుడు దయానిధి మారన్ కేంద్రమంత్రిగా కూడా చేశాడు.

అలాటి సన్ గ్రూపు యిప్పుడు సంక్షోభంలో మునిగింది. కేంద్ర హెూం శాఖ దాని ప్రసారాలకు సెక్యూరిటీ క్లియరెన్సు నిలిపివేసింది. ఎందుకు అంటే మారన్ సోదరులపై కేసు నడుస్తోంది కాబట్టి అంది. మారన్ సోదరులకు ఆర్జన పెరిగినకొద్దీ ధనదాహం పెరిగిందనుకోవాలి. దయానిధి 2006లో టెలికామ్ మంత్రిగా వుండగా తన యింటికి 300 లైన్లతో ప్రయివేటు ఎక్స్‌ఛేంజ్ పెట్టించుకుని సన్ టీవికి వుపయోగించుకున్నాడు. అంతేకాదు, ఎయిర్‌సెల్ అధిపతి శివశంకరన్‌ను ఒత్తిడి చేసి ఆ కంపెనీని మలేసియావాసి ఆనందకృష్ణన్‌కు అమ్మించారు. అందుకుగాను కృతజ్ఞతాపూర్వకంగా ఆనందకృష్ణన్ సన్ టివి డిటిఎచ్ ఆపరేషన్స్‌లో రూ. 900 కోట్ల పెట్టుబడి ఇంగ్లండ్‌లో వున్న ఆస్ట్రో కంపెనీ ద్వారా పెట్టాడు. ఈ కేసు కారణంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ సన్ టివికి చెందిన రూ.742.58 కోట్ల ఆస్తులను ఎటాచ్ చేసింది. హైకోర్టు ఆ ఆర్డరును సమర్థించింది. సన్ టివి దీనిపై సుప్రీం కోర్టుకి వెళ్లవచ్చు. ఈ కేసులు పెండింగులో వున్నాయి కాబట్టి దాని ప్రసారాలకు సెక్యూరిటీ క్లియరెన్సు యివ్వం అంటున్నారు హెూం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్. దానికీ దీనికీ లింకేమిటి, యివ్వండి అని అరుణ్ జైట్లే చెప్పి చూశారు కానీ రాజ్‌నాథ్ వినలేదు. దాంతో సన్ గ్రూపు షేరు విలువ పడిపోయింది.

మారన్ల పట్ల ఎన్‌డిఏ ప్రభుత్వం వ్యవహరిస్తున్న విధానం అనుమానాస్పదంగానే వుంది. స్పైస్‌జెట్ చేతులు మారిన పద్ధతి గమనిస్తే యిది బోధపడుతుంది. అజయ్ సింగ్ అనే అతను స్థాపించి, ఛైర్మన్‌గా వున్న స్పైస్‌జెట్ కంపెనీలో అది ఆర్జిస్తున్న లాభాలు చూసి 2010లో మారన్ సన్ గ్రూపు ద్వారా రూ. 940 కోట్లు పెట్టుబడి పెట్టాడు. 2011 మార్చి నాటికి రూ.101 కోట్లు లాభంలో వున్న కంపెనీ మారన్ రూ. 800 కోట్లు ఖర్చు పెట్టి అనవసరంగా విస్తరించడంతో ఏడాది తిరిగేసరికి రూ.606 కోట్లు నష్టం మూటగట్టుకుంది. అయినా 2012లో అతను 27 బంబార్డియర్ క్యూ-400 ఎయిర్‌క్రాఫ్టులు కొని, వీటితో చిన్న పట్టణాలకు కూడా సర్వీసులు విస్తరిస్తాం అని చెప్పుకున్నాడు. మారన్ దూకుడు వలన 2014 మార్చి నాటికి కంపెనీ రూ.1003 కోట్ల నష్టానికి చేరుకుంది. స్వదేశీ, విదేశీ ఋణదాతలకు రూ. 2000 కోట్లు బాకీ వుంది. బ్యాంకులకు, ఆయిల్ కంపెనీలకు, ఎయిర్‌పోర్టు ఆపరేటర్లకు కలిపి రూ.1700 కోట్లు బాకీ పడింది. వడ్డీ రేట్లు తక్కువగానే వున్నా కంపెనీ వడ్డీ కూడా కట్టలేని పరిస్థితికి వచ్చింది. భారతదేశంలో అత్యంత ధనికుల జాబితాలో 38 వ పేరు కళానిధి మారన్‌ది. అయినా అతను తన డబ్బు పెట్టి కంపెనీని ఎందుకు కాపాడలేదో ఎవరికీ అర్థం కాలేదు. విచిత్రమైన పరిస్థితుల్లో దాని యాజమాన్యం అజయ్ సింగ్ చేతిలోకి వెళ్లేందుకు ప్రభుత్వం సహకరించింది. అది మారన్ సమ్మతితో జరిగిందో లేక ఎయిర్‌సెల్ విషయంలో మారన్లు శివశంకరన్‌ను ఒత్తిడి చేసి ఆనందకృష్ణన్‌కు అమ్మించినట్లు, ప్రభుత్వంలోని కొందరు పెద్దలు అజయ్ సింగ్‌కు అమ్మించారో ప్రస్తుతానికి తెలియటం లేదు.

అజయ్ సింగ్ బిజెపి నాయకులకు, ముఖ్యంగా ప్రమోద్ మహాజన్‌కు సన్నిహితుడు. 1996లో ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం వుండగా అతన్ని ఢిల్లీ ట్రాన్స్‌పోర్టు కార్పోరేషన్‌కు డైరక్టరుగా నియమించారు. కార్పోరేషన్‌కు కొత్త బస్సులు సమకూర్చడంలో అతను ప్రధాన భూమిక వహించాడు. కితం ఏడాది బిజెపి ఎన్నికల ప్రచార కమిటీలోని స్పెషల్ సెల్‌లో అమిత్ షా, పీయూష్ గోయల్, అరుణ్ జైట్లేతో బాటు అతను కూడా సభ్యుడు. ఔట్‌డోర్, ఎలక్ట్రానిక్ పబ్లిసిటీ బాధ్యతను అతను నిర్వహించాడు. అతనికి సుమారుగా 40 కంపెనీలతో అనుబంధం వుంది. వాటిల్లో కొన్ని బ్యాంకులకు బకాయి పడ్డాయి కూడా. 2014 డిసెంబరులో కళానిధి మారన్ తన వద్దకు వచ్చి తనకు, కాల్ ఎయిర్‌వేస్‌కు గల 58.46% వాటా అమ్మజూపాడని అజయ్ అంటాడు. అది ఎంతకు కొన్నాడో చెప్పడం లేదు కానీ ప్రస్తుతం స్పైస్‌జెట్‌లో 60.31% వాటా అతనిదే. తక్కినది పబ్లిక్‌ది. ఈ వాటాలు కొనడానికి అజయ్‌కు డబ్బు ఎక్కణ్నుంచి వచ్చిందో సెబి అడగలేదు. అసలు ఏ రేటున వాటాలు చేతులు మారాయో కూడా అడగలేదు.

ఏదైనా కంపెనీలో 25% కంటె ఎక్కువ వాటాలు అమ్ముదామనుకున్నపుడు అందరికీ ఓపెన్ ఆఫర్ యివ్వాలి, తనకు నచ్చిన వాడి చేతిలో పెట్టేయకూడదు. 2013లో జెట్ ఎయిర్‌వేస్‌లోని 24% వాటాలు ఎతిహాద్‌కు అమ్మేసినపుడు యీ ప్రశ్న వచ్చింది. 25% లోపే కదా అని జవాబిచ్చారు. అప్పుడు కూడా కొన్ని అవకతవకలు జరిగాయి. యుపిఏ ప్రభుత్వం ఎతిహాద్‌కు మూడేళ్లలో 13,300 సీట్ల నుండి 50 వేలకు పెంచుకోవడానికి అనుమతి యిచ్చి ఎయిర్‌ఇండియా వ్యాపారాన్ని దెబ్బతీసింది. అంతేకాదు, జెట్ ఎయిర్‌వేస్ భారత ప్రభుత్వం తనకిచ్చిన లండన్ ఎయిర్‌పోర్టులో పార్కింగ్ హక్కులను ఎతిహాద్‌కు 7 కోట్ల డాలర్లకు అమ్మడం కూడా అనుమానాలు రేకెత్తించింది. వీటిపై సుబ్రహ్మణ్యం స్వామి సందేహాలు లేవనెత్తుతూ సుప్రీం కోర్టుకి వెళ్లారు. అదే సుబ్రహ్మణ్యం స్వామి యిప్పుడు బిజెపి లెటర్‌హెడ్‌పై మోదీని ఉద్దేశించి ఏప్రిల్ - మేలలో మూడు లేఖలు రాసి స్పైస్‌జెట్‌ను అజయ్ సింగ్‌కు అప్పగించడంలో

జరిగిన అక్రమాలను ప్రస్తావించారు. సెబి, యితర రెగ్యులేటరీ సంస్థలు తమ బాధ్యతలను విస్మరించాయని ఆరోపించారు. స్పైస్‌జెట్‌కు రూ.20 వేల కోట్ల ఆస్తులున్నాయని, దాదాపు 40% వాటాలు సాధారణ షేరుహోల్డర్‌ల చేతిలో, బ్యాంకుల చేతిలో వున్నాయనీ, యింత పెద్ద కంపెనీ చడీచప్పుడు లేకుండా చేతులు మారడమేమిటని అడిగారు. ప్రతీసారి ఉత్తరం అందినట్లు ప్రధాని కార్యాలయం నుండి ఎక్నాలెజ్‌మెంట్ వచ్చింది తప్ప సమాధానం రాలేదు.

వాటాలు పొందాక సెబికి సమర్పించిన పత్రాలలో షేరును కొన్న రేటు వెల్లడించవలసిన చోట అజయ్ సింగ్ "రహస్యం" (కాన్ఫిడెన్షియల్) అని రాశారు. అయినా సెబి కిమ్మనలేదు. స్పైస్‌జెట్ ధోరణిలో సన్ టీవీని రిలయన్సుకు అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఒక వెబ్‌సైట్ రాసింది. రిలయన్సు ప్రతినిథి దానిలో వాస్తవం లేదని ఖండించారు కానీ అనుమానాలు తొలగిపోలేదు. ఎందుకంటే దక్షిణాదిన విస్తరించవలసిన రాజకీయ అవసరం బిజెపికి వుంది. దానికి మీడియా చేతిలో వుండడం ఎంతైనా ఉపయోగకరం. తెలుగు మీడియా దిగ్గజం యిప్పటికే రిలయన్సు చేతికి వెళ్లిపోయింది. సన్ గ్రూపును కూడా రిలయన్సు వశపరచుకోగలిగితే అంబానీలకు వ్యాపారప్రయోజనాలు, బిజెపి రాజకీయప్రయోజనాలు రెండూ నెరవేరుతాయి. తమిళనాడులో డిఎంకెని ఎదుర్కోవాలంటే సన్ టీవీపై అదుపు ఉపకరిస్తుంది. ఇప్పటికే కేసుల పేరు చెప్పి సన్‌కు లైసెన్సులు ఆపేసి సన్ గ్రూపు షేరు విలువ పడిపోయేట్లా చేశారు. భయంతో వాటాదారులు షేర్లు అమ్మడం మొదలుపెడితే రిలయన్సు ఆ షేర్లను కొనేసి బలపడవచ్చు. తర్వాత ప్రభుత్వం ద్వారా కేసుల బూచి చూపించి సన్ యాజమాన్యం నుండి మారన్‌లను తప్పించవచ్చు. ఏం జరుగుతుందో ముందుముందు తెలుస్తుంది.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2015)**

**జూన్ 13**

## ఎమ్బీయస్ : సినీ స్నిప్పెట్స్ 02 – సావిత్రి

"మిస్సమ్మ" సినిమాలో కథానాయిక పాత్ర వేయడంతో సావిత్రికి మంచి పేరు వచ్చింది. అసలా పాత్ర భానుమతి వేయవలసింది. సావిత్రికి యిచ్చినది జమున పాత్ర. నాలుగు రీళ్లు షూటింగు పూర్తయ్యాక భానుమతి షూటింగుకు లేటుగా వచ్చారు. ఇంట్లో పూజ కారణంగా ఆలస్యంగా వస్తానని ముందు రోజే ఆవిడ లేఖ రాసి పంపారు. చక్రపాణి గారి అసిస్టెంటు పొరపాటు వలన ఆయనకు కబురు తెలియలేదు. భానుమతి చెప్పలేదని అపోహపడి, ఆగ్రహంతో ఆమెను ఆ పాత్ర నుంచి తొలగించడమే కాక, అప్పటికప్పుడు షూట్ చేసిన ఫిల్మ్‌ను తగలబెట్టించారు. సావిత్రికి ఆ పాత్రను అప్పగించారు. ఈ సంఘటన అందరికీ తెలుసు. దీని తర్వాత కూడా భానుమతి, చక్రపాణి–నాగిరెడ్డిల మధ్య స్నేహం చెడిపోలేదు. విజయా సినిమాలలో ఆమె మళ్లీ నటించకపోయినా, చక్రపాణి నడిపే "యువ"కు కథలు రాసేవారు. చక్రపాణిని వెక్కిరిస్తూ వ్యంగ్యరచనలు వేశారు కూడా. అయితే సావిత్రితో ఆమె రిలేషన్‌షిప్ ఎలా వుండేది అనే విషయం ఎవరూ స్పష్టంగా చెప్పలేదు. "వెండితెర విషాద రాగాలు" అనే పుస్తకం రాసిన పసుపులేటి రామారావు పత్రికా విలేకరిగా యిద్దర్నీ దీని గురించి యింటర్వ్యూ చేసిన సంగతిని తన పుస్తకంలో రాశారు.

తక్కిన హీరోయిన్ల గురించి మాట్లాడుతూ సావిత్రి "వాహినీ స్టూడియోలో చెట్టు క్రింద బ్రేక్ టైమ్‌లో అందరం చేరి హాయిగా కబుర్లు చెప్పుకునేవాళ్లం. జానకి, సూర్యకాంతమ్మలు యిళ్ల దగ్గర్నుంచి రకరకాల కూరలు, పిండివంటలు స్వయంగా చేసి తీసుకువచ్చేవాళ్లు. అందరికీ వడ్డించి మరీమరీ తినిపించేవారు. జి. వరలక్ష్మి గారైతే ఆవిడ టైపే వేరు. ఆవిడ నోటికి అందరం భయపడిపోయేవాళ్లం. అందరం లక్ష్మి మీద జోకులు వేస్తూ నవ్వుకునేవాళ్లం. ఆట పట్టిస్తూంటే పాపం ఉడుక్కునేది. తర్వాత నవ్వించేవాళ్లం. జమునకు కోపం ఎక్కువ. సరదాగా అన్నా కోపం తెచ్చుకునేది. కానీ తనది మంచి మనసు." అని చెప్పినపుడు "భానుమతి గారు కూడా మీకు ఫ్రెండేనా?" అడిగారు పసుపులేటి. అప్పుడామె "ఫ్రెండ్స్ కానివారు ఎవరూ లేరు. భానుమతిగారు నా కంటె సీనియర్. ఆవిడ యాక్టింగ్ అంటే చాలా యిష్టం నాకు. ఆవిడ చేసే కారెక్టర్స్ కొన్ని మేమెవరం చేయలేం. ఆవిడ పాటంటే కూడా నాకు బాగా యిష్టం. ఇండస్ట్రీలో ఆవిడ ఒక ప్రత్యేకమైన మనిషి. మిస్సమ్మలో అనుకోకుండా ఆవిడ చేయాల్సిన పాత్ర నాకు వచ్చింది. చక్రపాణి గారు అలాటి డెసిషన్ సడన్‌గా తీసుకుంటారని ఎవరం అనుకోలేదు. అప్పట్నుంచీ ఆవిడకు నామీద కోపం. ఎక్కడైనా కనిపిస్తే నేనే పలకరిస్తాను. ముక్తసరిగా మాట్లాడతారంతే. ఎప్పుడో "మిస్సమ్మ" నాటి కోపం యింకా అవిడలో అలానే వుంది. మా యింటి గృహప్రవేశానికి, మా అబ్బాయి బారసాలకు ఇంటికెళ్లి పిలిచినా రాలేదు." అన్నారు.

సావిత్రి కష్టాల్లో పడ్డాక ఆవిడ గురించిపసుపులేటి భానుమతిగారితో మాట్లాడినప్పుడు ఆమె "మీరంతా సావిత్రిది స్వయంకృతాపరాధం అనుకుంటున్నారు కదా, కాదు, అదంతా ఆమె జాతక ప్రభావం. ఆమెది మహత్తరమైన జాతకం. కానీ చివరి రోజులు భయంకరంగా వుంటాయి. ఆమె మరణం కూడా అంతే! సావిత్రి అప్పుడప్పుడు పూజలు చేసేది తప్ప తన జాతకం చూపించుకున్నది లేదు. ఎదుగుతున్న వ్యక్తులకు గండాలుంటాయి. గ్రహాలు మారుతూంటాయి. జ్యోతిష్కులను అడిగి గ్రహాలకు శాంతులు చేయించుకోవాలి. సినిమాలు చేయడం, డబ్బు సంపాదించుకోవడం సరిపోదు. తనకు తెలియకపోతే తెలిసిన వాళ్లనైనా అడగాలి. సావిత్రిపై కోపంతో యీ మాటలు అనడం లేదు. తన చుట్టూ అంతమందిని పెట్టుకుంటుంది. సమయానికి మంచి సలహా కూడా చెప్పనివాళ్లంతా ఎందుకంట? అసలు ఆమె చుట్టూ చేరిన వాళ్లంతా దొంగలే" అన్నారు.

"పోనీ మీరైనా ఓ మాట చెప్పలేకపోయారా?" అని అడిగితే "అడగందే చెప్పకూడదు. అవి ఎప్పుడూ సిద్ధాంతులే చెప్పాలి. ఓ సారి

మంచికి పోయి ఓ లైట్‌మ్యాన్‌కు సలహా చెపితే క్రియలో ఏదో వక్రీకరించింది. మా రామకృష్ణగారు కొట్టినంత పని చేశారు. ఇంకెప్పుడూ నీ బోడిజాతకాలు, పూజలు చెప్పకు, చెప్పావంటే నీ నాలిక కత్తిరిస్తానన్నారు. అప్పణ్నుంచి నేను యిలాటి విషయాల్లో బయటపడడం లేదు. పోనీ సావిత్రయినా నోరు తెరిచి ఏమిటక్కయ్యా ఇలాగుంది పరిస్థితి ఏం చెయ్యమంటారు? అంటూ అడిగింది లేదు. నాకెందుకయ్యా దురద?" అని జవాబిచ్చింది. "కానీ మీరంటే ఆవిడకు చాలా గౌరవం కదా" అంటే "సావిత్రి మంచిదే. కాదనను. కానీ తాను లేనిపోని ఆర్భాటాలకు పోయింది. తెలిసీ తప్పులు చేసింది. అలాంటప్పుడు నేను బాధపడిన సందర్భాలున్నాయి. అయితే 'మిస్సమ్మ' సంఘటన నుండి తనకీ నాకూ మధ్య దూరం పెరిగిన మాట వాస్తవమే. మా మధ్య సఖ్యత లేదు. తన పొరపాటు ఏమీ లేదన్న విషయం నాకు తెలుసు. దేవుని వ్రతం వల్ల షూటింగ్‌కు ఆలస్యమైంది. చక్రపాణి ఒప్పుకోలేదు. తనకు కావాల్సిన సావిత్రిని అప్పటికప్పుడు ఫిక్స్ చేసేసుకున్నాడు. ఈ విషయంలో సావిత్రిని తప్పుపట్టడం లేదు. చక్రపాణినీ తప్పుపట్టడం లేదు. కానీ తనతో స్నేహంగా వుండటానికి నాకు మనస్కరించడం లేదు." అని వివరించింది.

పసుపులేటి భానుమతి గారి జాతకాల సిద్ధాంతం సావిత్రి వద్ద ప్రస్తావిస్తే ఆమె "పూజలూ, శాంతులూ మనిషి జీవితాలను బాగు చేస్తాయా? పెద్దావిడ ఏదో అన్నారు. వదిలేయండి. నేను కర్మను నమ్ముతాను. దాని నుండి సంప్రాప్తమయ్యే ఫలాన్ని నమ్ముతాను. అంతా అయిపోయాక యిప్పుడు ఆకులు పట్టుకుంటే సుఖం ఏమిటి? కొడిగట్టి పోతోంది జీవితం. రేపో మాపో ఆరిపోతుంది. ఆ రోజు కోసం చూడ్డమే మన వంతు." అని వైరాగ్యం ప్రకటించింది సావిత్రి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2015)**

**జూన్ 15**

## ఎమ్బీయస్ : అనువాద కథలెందుకు?

"ఎమ్బీయస్ కథలు" శీర్షికలో యిటీవల అన్నీ అనువాద కథలు యిస్తున్నాను. "ఆఖరి కోరిక" కథ కింద వ్యాఖ్య రాస్తూ ఒక పాఠకుడు ఆ కథకు మూలమైన "మంకీస్ పా" కథ 1997లో (నేను అనువాదం చేసిన సంవత్సరం) అరుదైనదేమో కానీ యిప్పుడు ఇంటర్నెట్‌లో విరివిగా దొరుకుతోందని, మూలకథే చదువుకోగల స్థితిలో పాఠకులు వున్నారనీ రాశారు. మొదటగా చెప్పవలసినది – 1997లో కూడా అది అరుదైన, అలభ్యమైన కథ కాదు. హైస్కూలు స్థాయి పాఠ్యపుస్తకాల్లో కొన్నేళ్లపాటు పాఠ్యాంశంగా వుంది. అంతమాత్రం చేత అందరూ ఆ కథ చదివేశారని కాదు. ఆ మాట కొస్తే యిప్పటికీ అందరూ చదివేశారని కాదు.

నిజమే యింటర్నెట్‌లో యిదే కాదు, అనేక కథలు విరివిగా, అతి సులభంగా దొరుకుతున్నాయి. అయితే డబ్ల్యు. డబ్ల్యు. జాకబ్ అనే ఒక మంచి రచయిత వున్నాడని అతను "మంకీస్ పా" అనే గొప్ప కథ రాశాడని ఎవరైనా మనకు చెప్పాలి కదా. అప్పుడే వెతుకుతాం. ఎవరైనా గొప్ప కథ అని రికమెండ్ చేస్తే మనకు అనుమానం – అతనికి గొప్ప అనిపించినది మనకు చెత్త అనిపిస్తుందేమోనని. అందుకే అనువాదం చేసి ముందు పెడుతున్నాం. ఇది రుచి చూసి నచ్చితే ఒరిజినల్ కథ చదవవచ్చు, అంతటితో ఆగకుండా జాకబ్ యితర కథలు కూడా చదవవచ్చు. నాకు నచ్చిన ఉడ్‌హౌస్, డరోతీ పార్కర్, స్టీఫెన్ లీకాక్ వంటి కొందరు హాస్య రచయితల రచనలు తెలుగులో అందిస్తున్నాను. మాతృభాషలో కాబట్టి త్వరగా చదివి స్వారస్యం గ్రహించవచ్చు. నచ్చితే ఆ రచయితల యితర రచనలకై వేటాడవచ్చు. నిజానికి హాస్యరచనలను మూలభాషలో చదవగలిగితే ఆ ఆనందమే వేరు. ఇంగ్లీషులో చదివే శక్తి, ఆసక్తి లేనివారు తెలుగుతోనే సరిపెట్టవచ్చు. ఇది ప్రపంచమంతా వున్నదే. మనం ఇంగ్లీషు నవలలుగా పొరబడే అనేక గొప్ప నవలలు ఫ్రెంచ్ నుండి అనువదింపబడినవే. మహాభారతం సంస్కృతంలో వుంది కదా, మళ్లీ తెలుగులో ఎందుకు అని కవిత్రయం అనుకుని వుంటే ఆంధ్రభారతం దక్కేది కాదు. శ్రీనాథుడు స్వతంత్రంగా గొప్ప కవి అయి వుండి కూడా హర్షుడి "నైషధం"ను తెలుగులోకి అనువదించాడు. సొంత రచనలు చేసేవారు కూడా అనువాదాలను తక్కువగా చూడలేదు – అప్పుడూ యిప్పుడూ కూడా!

తెలుగువాళ్లు అనువాదాలను ఎప్పుడూ ఆదరించారు. 1950లలోనే ఆంధ్రపత్రిక వీక్లీ ప్రసిద్ధ ఆంగ్ల, ఫ్రెంచ్ నవలలను తెలుగులోకి అనువదింప చేసింది. నేను "టామ్ సాయర్" తెలుగు అనువాదాన్ని హైస్కూలు రోజుల్లో చదివాను. తర్వాత కాస్త ఇంగ్లీషు వంటపట్టాక ఒరిజినల్ చదివాను. "టామ్ సాయర్" తొలి తమిళ అనువాదం తెలుగులోకి వచ్చిన దాదాపు 40 ఏళ్లకు వచ్చింది. తమిళంలో శరత్ నవలలు, రవీంద్రుడి నవలలు తప్ప యితర భారతీయ భాషల్లోని రచనలను తమిళులు పెద్దగా దిగుమతి చేసుకోలేదని నా పరిశీలన. తెలుగు వాళ్ల లాగానే కన్నడం వాళ్లు అనువాదాలను ధారాళంగా ఆమోదిస్తారు. కానీ అనువాద కథలే ప్రధానంగా నడిచే "విపుల" వంటి పత్రిక మరే యితర భాషలోను వుంటుందనుకోను. హిందీ నుంచి తెలుగు వాళ్లు అనేక అనువాదాలు చేశారు కానీ హిందీ మాతృభాషగా కలవారు తెలుగు నుంచి హిందీలోకి అనువాదం చేయలేదు. మాతృభాషలోకి కాల్పనిక రచనలు చేసేవారు అనువాదాలు చేస్తే అవి అందంగా వుంటాయి. ఇంగ్లీషు మన మాతృభాష కాదు కదా, ఇంగ్లీషు వాళ్లు మన భాష నేర్చుకుని అనువాదాలు చేయాలంటే అది ఎప్పటికి సాధ్యపడేను? ఇంగ్లీషులో ఫిక్షన్ రాసే తెలుగువారు తెలుగు పుస్తకాలను ఇంగ్లీషులోకి అనువాదాలు చేస్తే అవి బాగుంటాయి. ఇంగ్లీషు వచ్చినంత మాత్రాన అనువాదానికి ఉపక్రమిస్తే సొగసు వుండదు.

ఇతర భాషల్లో నుంచి అనువాదం చేసేటప్పుడు నేను నుడికారం గురించి, నేటివిటీ గురించి చాలా జాగ్రత్తగా వుంటాను. నేను వాడే తెలుగు జాతీయాలు ఇంగ్లీషు లేదా హిందీ రచనల్లో వుండవు. వారి భావాన్ని గ్రహించి తెలుగువాడైతే ఎలా రాస్తాడు అనుకుని ఆ ధోరణిలో రాస్తాను. అది ఒక కష్టమైన ప్రక్రియ. టైము బాగా పట్టినా అనువాదాలు చేయడం నాకిష్టం. ప్రపంచంలో యింతమంది

గొప్ప రచయితలున్నారు సుమా, రుచి చూడండి అని పాఠకులకు చెప్పడంలో తృప్తి పొందుతాను. నా ప్రొఫైల్ రాసుకునేటప్పుడు 'అనువాదకుడు' అని కూడా రాసుకుంటాను. తెలుగులో రానురాను అనువాదాలకు ఆదరణ తగ్గింది. ''విపుల'' తప్ప పత్రికలు ప్రోత్సాహించడం మానేశాయి. ఈ మధ్యే ''నవ్య'' అనువాద కథలు వేస్తోంది. ప్రసిద్ధ విదేశీ నవలలను అనువాదం చేసి సీరియల్‌గా వేయటం లేదు. వాటి కథను సంక్షిప్తంగా చెప్పే వ్యాసాలను నవలా పరిచయం పేర ''ఆంధ్రభూమి'' వీక్లీ కొన్నేళ్ల క్రితం వేసింది. ''నవ్య'' యిటీవల ఆ ప్రయత్నం చేసింది. పాఠకుడి మేధోవిస్తృతికి యీ ప్రయత్నాలు దోహదపడతాయి.

మళ్లీ ''ఆఖరి కోరిక'' కథ వద్దకు వస్తాను. ఇంగ్లీషు కథల్లో, సినిమా డైలాగుల్లో క్లుప్తత, క్రిస్ప్‌నెస్ వుంటుంది. సాధారణ తెలుగు పాఠకులకు భావం పూర్తిగా బోధపడదు. మన వాళ్లకు కాస్త వివరణ అవసరం. ఇంగ్లీషు భాషలో ఒక్క పదం తెలియకపోయినా స్వారస్యం బోధపడదు. పుస్తకం చదువుతూ మధ్యలో వెళ్లి డిక్షనరీ చూసే అలవాటు నూటికి ఒకరికైనా వుందో లేదో. సందర్భం బట్టి వూహించేద్దాం అనుకుంటూ కథ చదివేసి, చివర్లో నోరు చప్పరించేయవచ్చు. ఆఖరి కోరిక కథ తెలుగులోనే చాలామందికి అర్థం కాలేదు. ఇంగ్లీషులో అయితే యింకా గందరగోళ పడేవారు. కథ ముగింపు అర్థం కాక వివరించమంటూ నాకు మెయిల్స్ రాశారు కొంతమంది. ఆ కథలో వున్నది అద్భుతరసం. రెండో కోరిక కారణంగా చనిపోయిన కొడుకు తిరిగి వచ్చాడు, మూడో కోరిక కారణంగా తిరిగి వెళ్లిపోయాడు అని అనుకోవచ్చు, లేదా కోరిక నెరవేరడం అనేది ట్రాష్, మొదటి కోరిక నెరవేరడం కాకతాళీయం అనుకోవచ్చు. అతీంద్రియ శక్తులున్నాయో లేదో యితమిత్థంగా చెప్పకుండా సంభ్రమాశ్చర్యాలకు గురి చేసే కథ అది.

''కొండూర'' అనే మరాఠీ కథలో యిలాటి చిక్కుముడే వుంటుంది. దాని ఆధారంగా శ్యామ్ బెనగల్ ''అనుగ్రహం'' అని తెలుగులో వాణిశ్రీ హీరోయిన్‌గా సినిమా తీశారు. జనాలకు అర్థం కాక, సినిమా ఆడలేదు. నిజానికి అద్భుతరసంలో మన తెలుగులో కథలు చాలా అరుదుగా వున్నాయి. ''నవరసాల శ్రీశ్రీ'' పేరుతో శ్రీశ్రీ నవరసాల్లో కథలు రాశారు. నన్నడిగితే శ్రీశ్రీ మహాకవే కానీ గొప్ప కథకుడేమీ కాదు. కోనేటిరావు కథలు కొత్తగా వుంటాయి. ఆయన అనువాద కథలు కూడా నన్ను ఆకట్టుకోలేదు. ఈ నవరసాల కథల్లో అద్భుతరసం కింద మాస్కోలోని క్రెమ్లిన్ భవనంలో భద్రపరిచిన లెనిన్ శవం మాయమైందని, దానికి ప్రాణప్రతిష్ఠ జరపడానికి ప్రయత్నాలు జరిగాయనీ, అయితే ఏవో అవాంతరాలు వచ్చి మళ్లీ శవంగా మార్చేశారనీ కథ కల్పించారు. కథ అంతంత మాత్రంగానే వుంటుంది.

నా వరకు అద్భుతరసంలో కథలు రాయాలన్న సరదా వుంది. 16 ఏళ్ల క్రితమే ''అద్భుత రసయామిని'' అనే కథామాలిక ప్లాన్ చేశాను. ఒక ముఖ్యమంత్రిగారు రాష్ట్ర పర్యటనలో వుండగా సడన్‌గా తుపాను రావడంతో ఒక బంగళాలో రాత్రంతా గడపవలసి వస్తుంది. ఆ బంగళాలో దెయ్యాలున్నాయా అని చర్చ మొదలై, అసలు దెయ్యాలున్నాయా, అతీంద్రియ శక్తులున్నాయా, వివరించలేని కొన్ని సంఘటనలు ఎందుకు, ఎలా జరుగుతాయి అని తర్కించుకుంటూ ఒక్కొక్కరు తమకు ఎదురైన వింత అనుభవాలను చెప్తారు. అవన్నీ అద్భుతరసంలో వుండాలి. ఇదీ స్కీము. అతి కష్టం మీద ఆరేడు రాయగలిగాను. కనీసం పదమూడైనా లేకపోతే సీరియల్ ఎవరూ వేసుకోరు. మంచి థీమ్‌లు తట్టినప్పుడే తక్కినవి రాద్దామనుకుని ఆ కథలను అలాగే అట్టిపెట్టాను. ఎక్కడా వుపయోగించలేదు. చెప్పవచ్చేదేమిటంటే అద్భుతరసం అంత క్లిష్టమైన ప్రక్రియ. వాటిల్లో ఎన్నదగిన కథ ''ఆఖరి కోరిక''. వీలైతే ఒరిజినల్ చదవండి. – **ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2015)**

**జూన్ 22 వీక్లీకై ఎమ్బీయస్ : గుబులు పుట్టిస్తున్న లలిత్‌గీతం**

దేశంలోని రాజకీయనాయకులందరూ యిప్పుడు 'లలితగీతం' వినడానికి బెదురుతున్నారు. లలిత్ మోదీ ఎప్పుడు ఏం ట్వీట్ చేస్తాడోనని భయపడుతున్నారు. అతనికి అన్ని పార్టీల నాయకులతోనూ సత్సంబంధాలున్నాయి, లావాదేవీలున్నాయి. ఇంతమంది వుండి కూడా తనకు ఎవరూ ఏమీ చేయటం లేదన్న లేదా కావలసినంత చేయటం లేదన్న ఉక్రోషంతో వున్నాడతను. తనంతట తనే అనేక విషయాలు బయటపెడుతున్నాడు. ఎప్పుడేం బయటకు వస్తుందో, వస్తే ఎలా సమాధానం చెప్పుకోవాలో అని అందరూ గుబులుగా వున్నారు. 2.8 బిలియన్ డాలర్ల మోదీ ఎంటర్‌ప్రైజెస్‌కు అతను చైర్మన్. క్రికెట్ ద్వారా అనేక సక్రమ, అక్రమ వ్యాపారాలు నడిపి స్టార్‌లా వెలిగిన లలిత్ మోదీ సునంద పుష్కర్‌తో వచ్చిన తగాదా వలన ఆవేశానికి లోనై యింతవరకు తెచ్చుకున్నాడు.

ఒక టైములో అతను చాలా పొగరుగా వుండేవాడు. 2009లో ఐపియల్ సెకండ్ సీజన్ షెడ్యూల్ గురించి యుపిఏ ప్రభుత్వంతో మాట్లాడడానికి యిద్దరు బిసిసిఐ అధికార్లను, ఒక కాంగ్రెసు నాయకుణ్ని వెంట పెట్టుకుని హెూం సెక్రటరీ మధుకర్ గుప్తాతో మాట్లాడడానికి వెళ్లాడు. ''మీరు షెడ్యూల్ మార్చుకోండి, ఆ సమయంలో దేశవ్యాప్తంగా పార్లమెంటు ఎన్నికలు జరుగుతాయి'' అన్నారు గుప్తా. ''కావాలంటే ఎన్నికలు వాయిదా వేసుకోండి, అవి లేకపోయినా ఏమీ కాదు. ఐపియల్‌కు మాత్రం ఏ అవాంతరం రానీయకండి'' అన్నాడు లలిత్ పెద్ద పోజుగా. అలాటివాణ్ని కోచీ ఫ్రాంచైజీలో అవతలకి పొమ్మనమని సునంద సన్నిహితులు అనడంతో కినిసి కోచీ ఫ్రాంచైజీ గురించి 2010 ఏప్రిల్‌లో ట్వీట్ చేశాడు. ఆ తర్వాత శశి థరూర్‌కు ఉద్వాసన జరిగింది. తీగ లాగితే డొంక కదిలింది. ఏప్రిల్ – మేలో ఐపిఎల్‌లో జరిగిన ఆర్థికపరమైన అవకతవకలు వెలుగులోకి వచ్చాయి.

దాంతో తన ప్రాణానికి ముప్పు వుందని ఆరోపించి లలిత్ దేశం విడిచి పారిపోయాడు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి)

రంగంలోకి దిగి బిసిసిఐకు విదేశీ విరాళాలు ఎలా వచ్చాయో చెప్పమని నోటీసులు యిచ్చింది. అందరూ లలిత్‌పైకి నెట్టేశారు. అతనే అన్ని వ్యవహారాలు చూసుకున్నాడు అని చెప్పి తప్పించుకున్నారు. లలిత్‌పైన అనేక ప్రభుత్వ ఏజన్సీలు మనీ లాండరింగ్ (నల్ల ధనాన్ని సక్రమంగా చేసే ప్రక్రియ)తో సహా రెండు డజన్లకు పైగా కేసులు మోపాయి. ఇడి రూ.1600 కోట్ల మేరకు 16 కేసులు పెట్టి 2010లో అతనిపై "లుక్ ఔట్" నోటీసు యిచ్చింది. అయినా అతను బ్రిటనులోనే నివాసముంటూ స్థానిక రాజకీయ నాయకుల పలుకుబడితో అక్కడే కొనసాగాడు. అక్కణ్నుంచే బిసిసిఐ అధ్యక్షుడు శ్రీనివాసన్‌పై, యింకా అనేకమందిపై యుద్ధం చేస్తూ వున్నాడు. లండన్‌కు వచ్చిన పోలీసు అధికారులను, భారత రాజకీయ నాయకులను కలుస్తూనే వున్నాడు. విందులు, విలాసాలు కొనసాగుతూనే వున్నాయి. సుష్మ, వసుంధరల సహాయంతో 2014 సెప్టెంబరులో ట్రావెల్ డాక్యుమెంట్లు చేతికి వచ్చిన దగ్గర్నుంచి లలిత్ సోషల్ మీడియాలో అతి చురుగ్గా వున్నాడు. తను హాజరవుతున్న ఫంక్షన్లవి, ఫ్యామిలీ హాలిడేస్‌వి, యూరోప్‌లో తిరుగాడిన ప్రదేశాలవి ఫోటోలు తెగ అప్‌లోడ్ చేస్తున్నాడు.

2011లో అతని పాస్‌పోర్టు రద్దు చేశారు. దాన్ని పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ పెట్టుకున్నాడు. సుష్మా స్వరాజ్ కూతురు బాన్సురీ అతని తరఫున వాదించింది. అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. ఏడాది క్రితం నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చాక 2014 ఆగస్టులో మళ్లీ అభ్యర్థన పంపుకున్నాడు. అదే కోర్టు, అదే లాయరు, వేరే బెంచ్, యీసారి మాత్రం పాస్‌పోర్టు పునరుద్ధరించేశారు. కోర్టులో వున్న ఇడీ అధికారులు నోరిప్పి అభ్యంతరం తెలపలేదు. లలిత్ భార్యకు కాన్సర్ వ్యాధి. పోర్చుగల్‌లో ఆసుపత్రిలో వైద్యం. అక్కడకు వెళ్లాలనుకున్నాడు. వెళ్లాలంటే బ్రిటన్ అనుమతించి వీసా యివ్వాలి. విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ సాయం అడిగాడు. కాదనలేక పోయింది. సుష్మ భర్త స్వరాజ్ కౌశల్ లలిత్‌కు యిరవై ఏళ్లగా లాయరు. ప్రస్తుతం కూతురు కూడా లలిత్ తరఫున వాదిస్తోంది. 2014 ఆగస్టులో స్వరాజ్ కౌశల్ మేనల్లుడికి ఇంగ్లండులోని ససెక్స్ యూనివర్శిటీలో సీటు కావలసి వచ్చినపుడు లలిత్‌ను అడిగితే అతను బ్రిటన్ లేబర్ పార్టీ ఎంపీ కీత్ వాజ్‌కు చెప్పి సీటు యిప్పించాడు. ఇన్ని మొహమాటాలున్నపుడు సుష్మ ఎలా కాదనగలదు? బ్రిటిష్ హై కమిషనర్‌కు 'లలిత్ అభ్యర్థనను మీరు బ్రిటిష్ నియమాలకు అనుగుణంగానే పరిశీలించండి. ఒకవేళ మీరు అతనికి వీసా యిచ్చినా మన యిరుదేశాల సంబంధాలు చెడిపోవు' అని లేఖ రాసి పంపింది. మరో పక్క కీత్ వాజ్ యుకె వీసా డైరక్టర్ జనరల్‌కు లలిత్ మోదీ ట్రావెల్ పేపర్లను త్వరగా యిప్పించమని అభ్యర్థిస్తూ లేఖ రాశాడు. తన లేఖ గురించి సుష్మ కాబినెట్ సహచరులతో ఏమీ చెప్పలేదు. ఇప్పుడు బయటపడ్డాక 'మానవతా దృక్పథంతో చేశా' అని చెప్పుకుంటోంది. గట్టిగా నిలదీస్తే కోర్టు అతని పాస్‌పోర్టు పునరుద్ధరించిందిగా అని వాదిస్తుంది. కోర్టు పాస్‌పోర్టు మళ్లీ యిచ్చింది కానీ వేరే దేశాలకు వెళ్లడానికి వీసా సిఫార్సు చేయమని చెప్పలేదుగా.

సుష్మతో లలిత్‌కు స్నేహబాంధవ్యం అలాగే వున్నా వసుంధరా రాజేతో బెడిసికొట్టినట్టుంది. దశాబ్దాలుగా వారు మిత్రులు, వసుంధర కొడుకు దుష్యంత్ కంపెనీకి లలిత్ మారిషస్ కంపెనీ ద్వారా పెట్టుబడులు కూడా సంపాదించి పెట్టాడు. అందుకే వసుంధర లలిత్ ఇమ్మిగ్రేషన్ అప్లికేషన్ సపోర్టింగ్ డాక్యుమెంట్లపై సంతకం పెట్టింది. తను చేసే పని సక్రమమైనది కాదని తెలుసు కాబట్టి యిలా పెట్టిన విషయం భారత అధికార్లకు చెప్పకూడదు అనే షరతు విధించింది. 2013 డిసెంబర్లో రాజస్థాన్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రత్యక్షంగా వెళ్లడం కుదరలేదు – తనేం చేసినా అందరూ గమనిస్తారని తెలుసు. అయినా తను ముఖ్యమంత్రి అయ్యాక లలిత్ భార్యకు చికిత్స అందిస్తున్న ఆసుపత్రి యాజమాన్యం రాజస్థాన్‌లో ఒక ఆసుపత్రి పెట్టడానికి రాజస్థాన్ ప్రభుత్వం తరఫున ఒప్పందం చేసుకుంది. ఆ టెర్మ్స్ బయటకు వస్తే లలిత్ ప్రయోజనాలు కాపాడడానికి రాజస్థాన్ ఎంత భూమి అప్పగిస్తోందో తెలుస్తుంది. ఇంత చేసినా లలిత్ వసుంధర పై అలక పూనాడు. అతనికి మళ్లీ క్రికెట్‌లో ఒక వెలుగు వెలగాలని ఆశ. వసుంధర ముఖ్యమంత్రి కాగానే రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి పోటీ పడ్డాడు. మనిషి యిక్కడ లేకపోయినా యిన్‌ఆబ్సెన్షియా గెలిచేశాడు. అయితే బిసిసిఐలోని లలిత్ శత్రువులు యీ ఎన్నికను గుర్తించడానికి నిరాకరించి, రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్‌ను సస్పెండ్ చేశారు. రాష్ట్రంలో, కేంద్రంలో బిజెపి వున్నా తన కింత అన్యాయం జరుగుతూంటే వసుంధర ఏమీ చేయకుండా వుందని లలిత్‌కు ఒళ్లు మండిపోయింది. అందుకే వసుంధరను దీనిలోకి తనే లాగాడు. 'నేను పోర్చుగల్ వెళ్లలేదు' అని ఆమె అంటూ వుంటే 'అబ్బే నా భార్య చికిత్స జరుగుతూంటే ఆమె నాతో పాటు పక్కనే వుంది' అంటాడు లలిత్. ఎవరి మాట నిజమో కొన్నాళ్లకు కానీ తెలియదు.

అసలు యిదంతా బయటకు ఎలా వచ్చింది? ఒక కథనం ప్రకారం – బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి లలిత్ పాస్‌పోర్టు పునరుద్ధరింపబడడంతో అతను ఏ క్షణాన్నైనా దేశానికి తిరిగి వచ్చి తమ పని పడతాడని బిసిసిఐలో లలిత్ శత్రువులకు, క్రికెట్ వ్యాపారంలో ఆసక్తి కలిగిన ఒక కేంద్రమంత్రికి భయం పట్టుకుంది. వాళ్లు ఒక ఇజ్రాయేల్ గూఢచారి సంస్థను నియమించి, లలిత్ ఈమెయిల్‌ను హ్యాక్ చేయించారు. దాంట్లో కీత్ వాజ్ ద్వారా యితను పోర్చుగల్ వీసా సంపాదించడం వగైరా బయటకు వచ్చాయి. ఆ సమాచారాన్ని లలిత్‌కు గతవిరోధాలున్న ముర్డోక్ బ్రిటన్‌నుంచి వెలువరించే "సండే టైమ్స్" పత్రికకు రహస్యంగా అందించారు. భారతదేశం నేరస్తుడిగా పరిగణిస్తున్న వ్యక్తికి కీత్ వాజ్ ఎలా సాయపడుతున్నాడో చూడండి అంటూ జూన్ 7 న ఆ కథనం వెలువడింది. అయితే క్రికెట్ బాల్ లాగే అది మధ్యలో స్పిన్ తిరిగి, భారతీయ రాజకీయ నాయకులకు తగిలింది. లలిత్ మౌనంగా వున్నా పోయేది. కానీ అతనే అన్నీ బయటపెట్టసాగాడు. సుష్మా భర్త, కూతురు తన లాయర్లని, ఫ్యామిలీ ఫ్రెండ్సనీ, శరద్ పవార్, ప్రఫుల్ పటేల్, సల్మాన్ ఖుర్షీద్, రాజీవ్ శుక్లా – యిలా అన్ని పార్టీల వాళ్లూ తనకు స్నేహితులేననీ, చిదంబరం ఒక్కడే తనపై

పగబట్టాడనీ యింటర్వ్యూ యిచ్చి చెప్పాడు, ట్వీట్లు చేస్తున్నాడు.

లలిత్ వ్యవహారంపై నరేంద్ర మోదీ ఎలా స్పందిస్తారన్నదే కుతూహలం కలిగిస్తోంది. వసుంధర రాజే మోదీ గ్రూపు మనిషి కాదు. ఎంపీగా వున్న తన కొడుకు దుష్యంత్‌కు మంత్రిపదవి యివ్వనందుకు ఆమెకు కోపం వచ్చిందని కూడా వినికిడి. ఇప్పుడు ఆమెను రక్షించడానికి మోదీ ప్రయత్నించకపోవచ్చని అంటున్నారు. అమిత్ షా కూడా ఆమె పట్ల సానుభూతి చూపటం లేదు. ఆమె ఢిల్లీ పర్యటనలు కూడా రద్దవుతున్నాయి. ఆమెను పదవి నుంచి తప్పించకపోవచ్చు కానీ, ఆమెను వెనకేసుకుని వచ్చే పని కూడా చేయకపోవచ్చు. ఆరెస్సెస్ కూడా ఆమెను సమర్థించటం లేదట. లలిత్ మోదీ రాజకీయబాధితుడని, అతను యిమిగ్రేషన్‌ను నేను సమర్థిస్తున్నానని 2011 ఆగస్టు 18 న రాజస్థాన్ ప్రతిపక్ష నాయకురాలుగా వుండే రోజుల్లో వసుంధర సంతకం పెట్టిన డాక్యుమెంటును కాంగ్రెసు బయటపెట్టాక ఎవరు సమర్థించాలన్నా కష్టమే! ఇక సుష్మ. ఒకప్పుడు ఆమె మోదీ ప్రధాని అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించిన మాట వాస్తవమే. కానీ మోదీ బలపడుతున్నకొద్దీ అతని నాయకత్వాన్ని ఆమె అంగీకరించింది. తన శాఖను సమర్థవంతంగా నిర్వహిస్తూన్న కొద్దిమంది మంత్రులలో ఆమె ఒకరు. మోదీ విదేశీ పర్యటనలు విపరీతంగా చేస్తూ ఖ్యాతి తెచ్చుకుంటున్నా ఏమీ అనకుండా, నేపథ్యంలోనే వుండి సహకరిస్తూ మోదీ సానుభూతి గెలుచుకుంది. పైగా సుష్మను ఆరెస్సెస్ నాయకులు యిప్పటికే సమర్థించారు. అందువలన సుష్మపై ఏ చర్యా వుండదని అనుకుంటున్నారు. 'మానవత్వం వలన యిచ్చామంటున్నారు, రేపు దావూద్ ఇబ్రహీంకు కూడా యిలాటి పరిస్థితుల్లో యిస్తారా?' 'ఇది బయటపడేవరకూ మౌనంగా వుండడమేమిటి?' 'హోం శాఖకు చెప్పకుండా మీరే నిర్ణయం తీసుకోవడ మేమిటి?' లాటి ప్రశ్నలు ప్రతిపక్షాలు ఎన్నయినా వేయవచ్చు. కానీ సుష్మకు ఏమీ కాదనే ప్రస్తుతానికి అనిపిస్తోంది.

సుష్మకే కాదు, లలిత్‌కు కూడా అంతిమంగా ఏమీ కాకపోవచ్చు. అధికారంలో వున్నది యుపిఏ కానీ, ఎన్‌డిఏ కానీ, వాటి డిఎన్ఏ ఒకటే – డబ్బున్న నేరస్తులను చట్టం నుంచి కాపాడడం! ఆ విషయాన్ని లలిత్ చాటి చెపుతున్నాడు. సుష్మ, వసుంధరలతో వదలలేదు. ఒక్కోరి పేరు బయట పెడుతున్నాడు. రాష్ట్రపతి ప్రణబ్ సెక్రటరీ అమితా పాల్‌కు దేశంలోనే అతి పెద్ద హవాలా వ్యాపారి వివేక్ నాగ్‌పాల్‌తో సన్నిహిత సంబంధాలున్నాయన్నాడు. స్విస్‌లో ఓ పెద్ద బ్యాంకుకు ఎండీగా వున్నాయన భార్య మన దేశంలో మనీ లాండరింగ్ వ్యవహారాల యిన్‌చార్జిగా పని చేస్తున్నారన్నాడు. ఒకప్పటి విలేకరి రాజీవ్ శుక్లా యిప్పుడిన్ని కోట్లు ఎలా గడించాడని అడిగాడు. బిసిసిఐ మాఫియాను బద్దలు కొడతానన్నాడు. 'మీ అంతట మీరే బయటకు వస్తారా, లేక నన్ను చెప్పమంటారా?' అని ఛాలెంజ్ చేస్తున్నాడు. అతనిచ్చిన వూపుతో కాబోలు బిజెపి ఎంపీ కీర్తి ఆజాద్ ఆర్థికమంత్రి అరుణ్ జైట్లేకి చెందిన క్రికెట్ క్లబ్‌పై ఆరోపణలు గుప్పించాడు. తప్పుడు డిగ్రీ ఆరోపణలతో తమ మంత్రిని అరెస్టు చేయించిన కేంద్రప్రభుత్వంపై యిప్పుడు ఆప్ తిరగబడింది – స్మృతి ఇరానీ డిగ్రీపై కూడా విచారణ జరుగబోతోంది కాబట్టి అలాటి చర్య తీసుకుంటారా? అని అడుగుతోంది. స్వచ్ఛపాలనపై లెక్చర్లు దంచిన మోదీ వీటిపై మాట్లాడరేమి అని ప్రతిపక్షాలు నిలదీస్తున్నాయి. ఇలాటి సందర్భాల్లో మౌనం పాటించి మన్‌మోహన్ సింగ్ మౌనమోహన్ సింగ్‌గా పేరు ఎలా తెచ్చుకున్నారో చూశాం. ఇప్పుడు నరేంద్రుడు మూకేంద్రుడు (మూగకు సంస్కృతం – మూక) అవుతున్నాడు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2015)**

**జూన్ 17** **ఎమ్బీయస్ : సినీ స్నిప్పెట్స్ 03 – వెళ్లవచ్చా అని గొల్లపూడిని అడిగిన ఇందిరా గాంధీ**

1972. అవి గొల్లపూడి మారుతీరావుగారు ఆలిండియా రేడియోలో పని చేస్తూ సినిమాలకు రచనలు చేస్తూన్న కాలం. ఆయన నిర్మాతల్లో అట్లూరి పూర్ణచంద్రరావుగారు ఒకరు. ఆయన ఎస్.భావనారాయణ గారి దగ్గర ప్రొడక్షన్ మేనేజర్‌గా పని చేసి ప్రతిభ, పరిశ్రమతో పాపులారిటీ సాధించి నిలదొక్కుకున్న నిర్మాత. సాహసి. వ్యాపారానికి కావలసిన ముందుచూపు, ఒక నిర్ణయం తీసుకోవడంలో మొండిధైర్యం కల మనిషి. కొత్త తరహా సినిమాలు కూడా తీసి ఎన్నో విజయాలు సాధించిన వ్యక్తి. హీరోల చుట్టూ కథలు తిరిగే రోజుల్లో లక్ష్మీ ప్రొడక్షన్స్ పేరిట వ్యాంప్ వేషాలు వేసే విజయలలితను స్టంట్ హీరోయిన్‌గా పెట్టి "రౌడీరాణి" (1970) సినిమా తీసి హిట్ చేశారు. ఆ సినిమాకు ఆధారం "డెత్ రైడ్స్ ఎ హార్స్". "లాస్ట్ యిన్ ద డిజర్ట్" అనే మరో ఆంగ్ల చిత్రాన్ని తెలుగులో తీయాలని గొల్లపూడిని రచయితగా పెట్టుకున్నారు. దీని కథంతా ఒక చిన్న పిల్లవాడి చుట్టూ తిరుగుతుంది. డబ్బున్న కుటుంబంలో ఏకైక సంతానమైన ఒక కుర్రవాడు తన మేనమామతో ప్రయివేటు విమానంలో వెళుతూండగా అది ఒక ఎడారిలో కూలిపోయింది. మేనమామ చచ్చిపోయాడు. కుర్రవాడు ఒంటరివాడై పోయాడు. అతన్ని రక్షించడానికి ఒక బృందం, అతన్ని చంపడం ద్వారా ఆస్తిని భక్షించడానికి మరో బృందం బయలుదేరతాయి. ఎడారిలో ఆ కుర్రవాడు అష్టకష్టాలు పడతాడు. ఈ కథకు గొల్లపూడి "పాపం పసివాడు" అని టైటిల్ సూచించి తెలుగు సినిమాకు కావలసినట్లుగా కథ అల్లారు. ఎడారిలో షూటింగుకై రక్షణ శాఖ అనుమతి తీసుకుని, ఎండల్లో ఎడారిలా మకాం పెట్టి 20 రోజుల షూటింగు చేశారు. ఒక చిన్న విమానాన్ని కొన్నారు. సినిమా ప్రచారానికి వూరూరా కరపత్రాలు విమానంలో ఆకాశం నుంచి వెదజల్లారు. కరుణరసం, ఉత్కంఠ కలిపిన యీ సినిమా పెద్ద హిట్ అయింది.

అప్పటి రాష్ట్రపతి వివి గిరిగారు తెలుగువాడు. ఆయనకు యీ సినిమా చూపిద్దామని నిర్మాత పూర్ణచంద్రరావు అనుకున్నారు. రాష్ట్రపతి భవన్‌లో ఎవరికో హిందీ పాఠాలు స్వామి అనే ఒకాయన ద్వారా రాష్ట్రపతి భవన్‌లో సినిమా ప్రొజక్షన్‌కు ఆహ్వానం లభించింది. 1973 జనవరిలో నిర్మాత, గొల్లపూడి, దర్శకుడు వి.రామచంద్రరావు ఢిల్లీ వెళ్లి గిరిగారిని కలిసి సినీనిర్మాణంలో వాళ్ల

సాహసాలూ, సినిమా విజయం గురించి చెప్పారు. ఆయన ఓపికగా విన్నారు. తర్వాత ఆయనా, ఆయన కుటుంబసభ్యులూ, మరి కొద్దిమంది సభ్యులతో ప్రొజక్షన్ హాలు నిండింది. సినిమా చివరిదాకా చూసి వీళ్లను అభినందించారు. ఎలాగూ యింతదూరం వచ్చాం కదాని చండీగఢ్ వెళ్లి మళ్లీ ఢిల్లీ చేరారు.

పేపరు తిరగేస్తూంటే సాయంత్రం బెంగాలీ, హిందీ నటుడు ఉత్పల్ దత్ వేస్తున్న ''తూటా'' అనే బెంగాలీ నాటక ప్రదర్శన వుందని తెలిసింది. గొల్లపూడి, పూర్ణచంద్రరావు టిక్కెట్లు తెప్పించుకుని ఢిల్లీలో జనవరి చలి భరించలేక కోట్లు వేసుకుని బయలుదేరారు. హాల్లో మధ్య బ్లాక్‌లో మొదటి వరసలో కూర్చుని చూడసాగారు. బెంగాలీ సగంసగం అర్థమవుతూ ఉత్పల్ దత్ నటనాకౌశలానికి ముగ్ధులవుతూ వుండగా సగం నాటకం అయేసరికి ఎవరో వెనక మెల్లగా మాట్లాడుతున్నట్లనిపించి వెనక్కి చూశారు గొల్లపూడి. అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీ రెండో వరసలో అటు చివర కూర్చుని పక్కన కూర్చున్న బెంగాలీ మహిళ (ఆమె ఉత్పల్ భార్య సోయా) డైలాగుల అర్థం వివరిస్తూంటే వింటున్నారు. ఇందిర శాంతినికేతన్‌లో కొంతకాలం చదువుకున్నారు. బెంగాలీ కొద్దిగా తెలుసు. లలిత కళలంటే అభిమానం వుంది కాబట్టి, ఉత్పల్‌పై గౌరవంతో నాటకానికి వచ్చారు. దేశప్రధానిని అలా నాటకాభిమానిగా చూడడం థ్రిల్లింగ్‌గా తోచింది గొల్లపూడికి. పూర్ణచంద్రరావును గోకారు. ఆయనా చూసి తుళ్లిపడ్డాడు. నాటకం నడుస్తూండగా మధ్యమధ్యలో ఆమె కేసి చూడసాగారు. విచిత్రమేమిటంటే వీళ్లెన్నిసార్లు చూసినా ఆవిడా వీళ్లనే చూస్తోంది. అలా చూడడం గొప్పగా తోచి వీళ్లు మళ్లీ మళ్లీ చూశారు. ఆవిడా మళ్లీమళ్లీ...!

నాటకం అయిపోయింది. అప్పటికి ప్రేక్షకులందరికీ ప్రధాని హాల్లో వున్నట్టు అర్థమై లేచి కదలకుండా నిలబడ్డారు. ఆవిడ వెళ్లాకనే ఎవరైనా కదలాలి. అందుకే వీళ్లిద్దరూ కూడా నిలబడ్డారు. ఇందిర వీళ్లిద్దరినే గమనిస్తున్నారు. ఎంతోసేపు నిశ్శబ్దం. కాస్సేపయాక ఇందిర వీళ్లను సూటిగా చూసి ''కెన్ ఐ గో? (నేను వెళ్లవచ్చా?'' అని అడిగారు. ఏం చెప్పాలో తెలియక వీళ్లు కంగారుపడిపోయారు. ఈ లోగా ఒకాయన వెనకనుంచి పరుగున వచ్చి ''బయలుదేరండి మేడమ్'' అన్నారు. అప్పుడావిడ కదిలారు. ఆ వచ్చిన వ్యక్తిని చూశాక వీళ్లకు విషయం అర్థమైంది. ఆ వ్యక్తి చొక్కా కాలరు కోటు బయట వేసుకుని వున్నాడు. అతను మఫ్టీలో వున్న యింటెలిజెన్సు ఆఫీసరు. ఆ నాటి వారి గుర్తు కోటు మీద కాలరు వేసుకోవడం. అంత మాత్రమే ప్రధానికి వారు చెప్పి వుంటారు. వీళ్లు కూడా యాదృచ్ఛికంగా కోట్లు వేసుకుని కాలరు బయటకు వేసుకున్నారు. వీళ్లు తన సెక్యూరిటీ అని ఆవిడ అనుకున్నారు. అందుకే వీళ్లు చూసినప్పుడల్లా ఆవిడ గమనించారు. చివర్లో బయలుదేరడానికి వీళ్ల క్లియరెన్సు కోసం అడిగారు. ఇది అర్థమయ్యేటప్పటికి వీళ్లకు తమాషాగా తోచింది.

మర్నాటి అనుభవంతో ప్రధాని సెక్యూరిటీ ఏర్పాట్లు ఎలా వుంటాయో యింకా బోధపడింది. ఆ రోజుల్లో రోజూ ఉదయం ఒక గంటసేపు సమయంలో సామాన్యులెవరైనా సరే ప్రధానమంత్రిని కలుసుకోవచ్చు. వీళ్లు వెళదామనుకుని స్వామి ద్వారా ఎపాయింట్‌మెంట్ తీసుకున్నారు. ఉదయం 8 గంటలకు కారులో ప్రధాని యింటి సమీపంలోకి వచ్చేసరికి పంజాబీ దుస్తులు వేసుకుని వున్న ఒక బిచ్చకత్తె వాళ్ల కారుకి అడ్డంగా పరిగెత్తింది. డ్రైవరు బ్రేకు వేశాడు. వీళ్లు అచ్చమైన తెలుగులో ఆమెని తిట్టుకున్నారు. ఆమె రహస్య సిబ్బందిలో భాగం. వీళ్ల మాటలతో తెలుగువాళ్లని రహస్యశాఖకి ఉప్పందిపోయింది. అవి ప్రత్యేకాంధ్ర ఉద్యమం జోరుగా సాగుతున్న రోజులు (ఈ సంఘటనలన్నీ తన ఆత్మకథ ''అమ్మకడుపు చల్లగా''లో రాసిన గొల్లపూడి విశాఖ ఉక్కు ఉద్యమం రోజులని పొరపాటుగా రాశారు), తెలుగువాళ్లు ఇందిరపై మండిపడుతున్నారు కాబట్టి తెలుగువాళ్లపై ఒక కన్నేసి వుంచమని యింటెలిజెన్సు వారి ఆదేశాలు. ప్రధానిని పేర్లు నమోదు చేసుకునే టైముకి యిద్దరు తెలుగులో పలకరించారు. ''హైదరాబాదు నుంచి వచ్చినవారెవరు?'' అని పదేపదే ప్రశ్నించారు. మేం కాదు అన్నారు వీళ్లు. తెలుగువాళ్లనగానే హైదరాబాదు అని వాళ్ల భావం. కానీ వీళ్లు వెళ్లినది మద్రాసు నుంచి. కాస్త కన్‌ఫ్యూజన్ వచ్చింది. అనుమతి పత్రం చేతికి వచ్చి లోపలికి వెళ్లేలోగా తమిళంలో మాట్లాడే అరవాయన, తెలంగాణ భాష మాట్లాడే ఆయన, మరో తెలుగాయన యిలా నలుగురైదుగురు తారసపడి వీళ్లని వడపోసేశారు.

ప్రధానిని కలుసుకోవడానికి వచ్చేవారికి చెట్ల కింద చిన్న చదరలు వేశారు. వచ్చిన బృందాలు ఒక్కొక్క చదర మీద కూర్చుంటారు, ప్రధాని వారి దగ్గరకొచ్చి పలకరిస్తారు. ముందున్న చదరల్లో వున్న పిల్లల వద్దకు ఇందిర వచ్చి ఆప్యాయంగా పలకరించింది. వాళ్లు లేచి నిలబడ్డారు. ఫోటో తీయించుకుంది. వీళ్లలో ఉత్సాహం పెరిగింది. వీళ్ల చదరలో ఎవరో కొత్త మొహం వచ్చి అటుతిరిగి కూర్చున్నాడు. పొమ్మంటే పోడు. కొత్త మనిషి గురించి స్వామి యింటెలిజెన్సు మనిషికి ఫిర్యాదు చేస్తే అతను సాధికారికంగా ''అతను మా మనిషి. అక్కడే వుంటాడు. మేడమ్ వచ్చినపుడు మీరు లేవకూడదు, కూర్చునే మాట్లాడాలి.'' అన్నాడు. ఇందిర రాగానే వీళ్లు పాపం పసివాడు కథ, గిరిగారు మెచ్చుకున్న విషయం చెప్పారు. ఆవిడ నవ్వారు. స్వామి ''మాతాజీ ఒక ఫోటో..'' అంటూ రెండుసార్లు రెట్టించేసరికి ఆవిడ క్లుప్తంగా ''నో, మీరు ఫోటో సినిమాలో కమ్మర్షియల్‌గా వాడితే నేను పార్లమెంటులో సమాధానం చెప్పుకోవాలి.'' అన్నారు. స్వామి మాతాజీ అంటూ లేవబోయేసరికి వెనక కూర్చున్న వ్యక్తి అతన్ని బలంగా కిందకి గుంజాడు.

ఇంత శ్రద్ధ తీసుకున్న రహస్య సిబ్బంది చుట్టూ వున్నా అదే చోట పదకొండు ఏళ్ల తర్వాత ఇందిర హత్య జరిగింది – ఆమె సిబ్బంది చేతిలోనే! **– (సశేషం) ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2015)**

**జూన్ 23** వీక్లీకై **ఎమ్బీయస్ : బ్రిటన్‌లో పాగా వేస్తున్న రష్యా ప్రభుత్వపు టెలివిజన్**

ప్రపంచ రాజకీయాలను పశ్చిమదేశాల మీడియా ప్రభావితం చేస్తోంది కాబట్టి, దానికి ముకుతాడు వేయాలని రష్యా అధినేత పుతిన్ తలపోశాడు. టివి-నొవోస్తీ అనే లాభాపేక్ష లేని సంస్థను నెలకొల్పి దానికి రష్యన్ ఫెడరల్ ఏజన్సీ ఫర్ ప్రెస్ అండ్ మాస్ కమ్యూనికేషన్స్ శాఖ ద్వారా నిధులు సమకూర్చాడు. ఆ సంస్థ ద్వారా ఆర్‌టి (రష్యా టుడే) అనే టీవీ ఛానెల్‌ను 2005లో నెలకొల్పి రష్యన్, అరబిక్, ఇంగ్లీషు, స్పానిష్ భాషల్లో ప్రసారాలు ప్రారంభించాడు. 2010 ఆర్‌టిఅమెరికా అనే ఛానెల్ కూడా ప్రారంభమైంది. 100 దేశాల్లో 50 కోట్ల మంది తమ ప్రసారాలను చూస్తున్నారని ఆర్‌టి చెప్పుకుంటుంది. 8 నెలల క్రితం లండన్‌లో తమ స్టూడియో పెట్టి ఇంగ్లండు రాజకీయాలను కవర్ చేయడం మొదలుపెట్టినపుడు దాన్ని ఆహ్వానించిన వారు అతి తక్కువ. అది పుతిన్ బాకా టీవీ అనీ, లండన్ గురించి నెగటివ్ న్యూస్ యిస్తోందని ఫీలయ్యారు. తక్కిన మీడియా సంస్థలు 'మేం యిప్పటికే స్వతంత్రంగా, నిర్భయంగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నాం. మా కంటె వీళ్లు ఏం పొడిచేస్తారు?' అంటూ విమర్శించారు. కొందరు మీడియా పెద్దలయితే ఆ టీవీలో చేరిన వారందరూ తమ సంస్థల్లోంచి తీసిపారేసిన వాళ్లే అన్నారు, మరి కొందరు టీవీని, దాని సిబ్బందిని, వాళ్లకు యాడ్స్ యిచ్చినవారిని పేరుపేరునా తిట్టారు. బ్రిటన్‌లో వ్యవస్థకు వ్యతిరేకంగా వ్యాఖ్యానించడం సర్వసహజం. పత్రికా స్వేచ్ఛ బాగానే వుంది. ఆర్‌టి కూడా తమలో ఒక టీవీగా వుంటుంది అనుకోకుండా యిలా విరుచుకుపడడం దేనికి? ఎందుకంటే అది విదేశీ ప్రభుత్వపు నిధులతో నడిచే సంస్థ. యూరోప్‌లోని 35 దేశాల్లో యిప్పటికే ప్రవేశించి వుంది. పశ్చిమదేశ సంస్కృతికి పుట్టినిల్లు వంటి బ్రిటన్‌లో కాలూనడానికి పుతిన్ ఎంతైనా ఖర్చు పెడతాడన్న భయం తోడయింది. మొదటి ఏడాదే 25 కోట్ల పౌండ్ల నిధులను కేటాయించాడు. ఇది బిబిసి బజెట్ కంటె చాలా ఎక్కువ.

ఇంత వ్యతిరేకత మధ్య ప్రారంభమైన బ్రిటన్ ఆర్‌టి క్రమేపీ పెరగనారంభించింది. మార్చి నాటికి తమ 5 ఛానెళ్లకు 2 బిలియన్ల యూ ట్యూబ్ వీక్షకులున్నారని ప్రకటించుకుంది. అంటే సిఎన్ఎన్ కంటె మూడు రెట్లు, అల్ జజీరా కంటె రెండున్నర రెట్లు, యూరో న్యూస్ కంటె మూడున్నర రెట్లు ఎక్కువన్నమాట. బిబిసి యూట్యూబ్ చందాదారులు 5 లక్షల మంది కాగా, ఆర్‌టి చందాదారులు 5 రెట్లు ఎక్కువగా 25 లక్షల మంది వున్నారు. డబ్బు గుమ్మరించినంత మాత్రాన యింత వ్యూయర్‌షిప్ వస్తుందా? రాదు. ఆర్‌టి నిపుణులైన పాత్రికేయులను నియమించుకుని క్షేత్రస్థాయిలో తిరుగుతూ వారు సమర్పించే నిష్పక్షపాతమైన కథనాలను ఆధునికత, సాంకేతికత జోడించి సమర్పిస్తోంది కాబట్టే యింత పాప్యులర్ అయింది. ఎడిటర్ యిన్ చీఫ్ గా వ్యవహరిస్తున్న మార్గరీటా సిమోన్యాన్ ప్రతిభను అందరూ కొనియాడక తప్పని పరిస్థితి వచ్చింది. తక్కిన ఛానెళ్లన్నీ రాజకీయ సమస్యలపైనే దృష్టి కేంద్రీకరిస్తూండగా ఆర్‌టి "గోయింగ్ అండర్‌గ్రౌండ్" వంటి కార్యక్రమాల ద్వారా ప్రజాసమస్యలను స్పృశిస్తోంది. ప్రభుత్వపు పొదుపు చర్యల ప్రభావం ప్రజలపై ఎలా పడుతోంది, యితర దేశాల నుంచి వలస ఉద్యోగాలపై కలిగిస్తున్న ప్రభావం యిటువంటివి చర్చిస్తోంది. ఆర్‌టికి పెరుగుతున్న పాప్యులారిటీ అమెరికాకు ఒళ్లు మండిస్తోంది. యుఎస్ బ్రాడ్ కాస్టింగ్ బోర్డు ఆఫ్ గవర్నర్స్‌కు కొత్తగా అధిపతిగా వచ్చిన ఆండ్రూ లాక్ "ద న్యూయార్క్ టైమ్స్"కు యింటర్వ్యూ యిస్తూ "ప్రజల్లోకి వ్యాప్తి చెందడానికి మాకు అనేక సవాళ్లు ఎదురుతున్నాయి. ఒక ప్రత్యేకమైన ఆలోచనాధోరణిని విస్తరింప చేస్తున్న ఆర్‌టి ఛానెల్, మధ్యప్రాచ్యంలో ఇస్లామిక్ స్టేట్, బోకో హరామ్ వంటి గ్రూపులు యివన్నీ మాకు ప్రత్యర్థులే" అన్నాడు. దానిపై మార్గరీటా మండిపడుతూ "లోకంలో జరిగే సంఘటనలను రిపోర్టు చేస్తున్న మమ్మల్ని, వేలాదిమంది ప్రాణాలను హరిస్తున్న టెర్రరిస్టు సంస్థలను ఒకే గాటన కట్టి మాట్లాడడం క్షమార్హం కాదు. మా జర్నలిస్టులు తీవ్రవాదుల్లా కనబడుతున్నారా?" అంటూ ఖండించింది. అంతేకాదు, దానిపై కథనాలను ప్రసారం చేసింది. అమెరికన్ ప్రభుత్వాధికారి బాధ్యతారహితమైన వ్యాఖ్యలను అమెరికన్ జర్నలిస్టు అసోసియేషన్, ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్‌స్టిట్యూట్, వికీలీక్స్, యూరోపియన్ పార్లమెంటులోని కమ్యూనిస్టు ఎంపీ ఒకరు కూడా ఖండించారు కానీ బ్రిటిషు మీడియా మాత్రం నిరసన తెలపలేదు. పాత్రికేయుల మధ్య అసూయ ఆ స్థాయిలో వుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2015)**

**జూన్ 23 వీక్లీకై ఎమ్బీయస్ : దేవుడి బంగారం బ్యాంకుల్లోనా? – ఒప్పుకోం**

.. అంటున్నాయి కొన్ని దేవస్థానాలు. ఏ దేశానికైనా బంగారమే పెట్టుబడి. దాని ఆర్థికబలం దానికున్న బంగారు నిల్వలపై ఆధారపడి వుంటుంది. అమెరికా ప్రభుత్వం వద్ద 8133.50 టన్నుల బంగారం వుంది. భారత ప్రభుత్వం వద్ద వున్నది 557.70 టన్నులు, ప్రపంచంలో 11 వ స్థానం. 2014-15 సంవత్సరంలో దేశంలోకి దిగుమతి అయిన బంగారం 850 టన్నులు. ఇది కాక దొంగతనంగా అయ్యేది 175 టన్నులుంటుందని ఒక అంచనా. శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో బాటు వైజాగ్ ఎయిర్‌పోర్టులో కూడా గోల్డ్ స్మగ్లర్లు దొరుకుతున్నారు. ఏడాదేడాదికి దిగుమతులు పెరుగుతున్నాయి. 2014 మార్చిలో 73 టన్నులు దిగుమతి అయితే 2015 మార్చిలో అది 121 టన్నులు. ఇంత బంగారం దిగుమతి అవుతూంటే మరి ప్రభుత్వం వద్ద 558 టన్నులు మాత్రమే వుండడమేమిటి అంటే సుమారు 22 వేల టన్నుల బంగారం ప్రజలలో, దేవాలయాల్లో, ట్రస్టులలో వుందని అంచనా. దీనిలో 3 వేల టన్నులదాకా దేవుని ఆభరణాల రూపంలో దేవాలయాల్లో వుందని లెక్క. ఈ లెక్కలన్నీ కాకిలెక్కలే ఎందుకంటే ఏ దేవాలయమూ తమ వద్ద ఎంత విలువైన బంగారం వుందో లెక్కలు చెప్పటం లేదు. ఒక అంచనా ప్రకారం ట్రిలియన్ డాలర్ల విలువైన బంగారం యిలా

మూలుగుతూండడం వలన ప్రజలకు కాని, ప్రభుత్వానికి కాని ఏ విధమైన ప్రయోజనమూ కలగడం లేదు. భారతదేశపు బాలన్స్‌షీటులో దిగుమతుల కారణంగా కరంట్ ఎక్కవుంట్ డెఫిసిట్ (లోటు) వుంటోంది. 2012-13లో యీ లోటులో 28% బంగారపు దిగుమతుల కారణంగానే!

నరేంద్ర మోదీ ప్రభుత్వం యీ లోటు పూడ్చడానికి దేవాలయాల్లోని బంగారాన్ని బయటకు తీసుకుని వచ్చి దాన్ని ఆపరేషనల్ ఎస్సెట్‌గా మారుద్దామని చూస్తోంది. దేవాలయాలు తమ వద్ద వున్న బంగారాన్ని బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తే గోల్డ్ బాండ్స్ యిస్తారు. క్యాష్ డిపాజిట్లపై వడ్డీ యిచ్చినట్లే వీటిపై కూడా వడ్డీ యిస్తారు. తర్వాత అవసరం వచ్చినపుడు ఆ బాండ్స్‌ను తిరిగి యిచ్చి బంగారాన్ని తీసుకోవచ్చు. బ్యాంకులు తమ కిచ్చిన బంగారాన్ని కరిగించి, పోతపోసి, కాయిన్స్‌గా, కడ్డీలుగా మార్చి ప్రజలకు అమ్ముతారు. స్థానికంగా బంగారం లభిస్తుంది కాబట్టి బంగారపు దిగుమతుల అవసరం పడదు. బాలన్స్‌షీటులో లోటు తగ్గుతుంది. వినడానికి యిది బాగున్నా ప్రముఖ దేవస్థానాలు సహకరించటం లేదు. ఆభరణాలను కరిగిస్తే భక్తుల మనోభావాలు దెబ్బ తింటాయి అంటున్నాయి. తిరువాన్కూర్, కొచ్చిన్, మలబార్ దేవస్థానం బోర్డులు 3890 గుళ్లను నిర్వహిస్తున్నాయి. అవి యీ పథకాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ''ఆనాటి తరహాలో ఆభరణాలు చేసే కంసాళ్లు యిప్పుడు లేరు. 1963 భారత-చైనా యుద్ధం సందర్భంగా బంగారాన్ని డిపాజిట్ చేయమని అడిగితే యిలాగే యిచ్చాం. కొన్నేళ్లు పోయాక గోల్డ్ బార్ రూపంలో తిరిగి యిచ్చారు. మళ్లీ అవే ఆభరణాలు చేయిద్దామని చూస్తే యిప్పటి స్వర్ణకారులకు చేత కాలేదు.'' అంటున్నాయి. క్రైస్తవుడైన కేరళ ముఖ్యమంత్రి ఊమెన్ చాండీ ''నేనూ యీ పథకానికి వ్యతిరేకం. భక్తులు హుండీలో వేసినవి స్వామివారికే సొంతం. భక్తుల అనుమతి లేనిదే దేవస్థానాలు యిలాటి నిర్ణయాలు తీసుకోకూడదు'' అన్నారు.

తిరుపతి దేవస్థానానికి మాత్రం యిలాటి అభ్యంతరాలు లేవు. తమ హుండీలో వేసిన ఆభరణాలను ముంబయి పంపించి 22 కారట్ల నాణాలుగా తయారు చేయించి భక్తులకు అమ్ముతున్నారు. కొంత బంగారాన్ని బ్యాంకుల్లో కూడా పెడుతున్నారు. గుజరాత్‌లోని ఆనంద్‌జీ కళ్యాణ్‌జీ ట్రస్టు 1300 జైన్ దేవాలయాలను నిర్వహిస్తుంది. అది కూడా బంగారాన్ని బ్యాంకుల్లో పెట్టి వడ్డీ సంపాదిస్తోంది. అంబాజీ ఆలయం, ద్వారకాధీశుని ఆలయం నిర్వహించే ట్రస్టులు కూడా గోల్డ్ డిపాజిట్ స్కీములో ఆసక్తి చూపుతున్నాయి. వడ్డీ రేట్లు పెంచితే ఆలోచిస్తాం అంటున్నారు ముంబయిలోని సిద్ధి వినాయక గుడి, షిర్డీలోని సాయిబాబా సంస్థాన్. 29 దేవాలయాలను నిర్వహిస్తున్న ప్రభుత్వ ట్రస్టు దేవాలయాలకు యిచ్చిన ఆదేశాల ప్రకారం వారికి విరాళాలుగా వచ్చిన బంగారంలో 10% గుడి అభివృద్ధికి, 20% స్టేటు బ్యాంకు గోల్డ్ డిపాజిట్ స్కీములో పెట్టడానికి అనుమతి వుంది. ఇంకో 20% కూడా భవిష్యత్తు అవసరాలకై దాచవచ్చు. తక్కిన 50% ను ప్రభుత్వ సంస్థ అయిన ఎంఎంటిసి ద్వారా కాయిన్లుగా, మెమొంటోలుగా తయారుచేయించి అమ్ముకోవచ్చు. ప్రస్తుతం యీ స్కీమును వ్యతిరేకిస్తున్న దేవస్థానాలు తమ వైఖరి మార్చుకుంటే దేశ ఆర్థికవ్యవస్థకు ఎంతో మేలు కలుగుతుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2015)**

**జూన్ 18** **ఎమ్బీయస్ : సినీ స్నిప్పెట్స్ 04 – రాజాజీ ఆఖరి సంతకం సింగీతంకే!**

సింగీతం శ్రీనివాసరావు గారు కెవి రెడ్డి గారి వద్ద అసిస్టెంటు డైరక్టరుగా పనిచేసేవారు. ఆయన విజయావారికి తీసిన ''సత్య హరిశ్చంద్ర'' (1965), ''ఉమా చండీ గౌరీ శంకరుల కథ'' (1968) రెండూ ఫెయిలయ్యాయి. సొంత సంస్థ జయంతీ పిక్చర్స్ పేర తీసిన ''భాగ్యచక్రం'' (1968) కూడా ఎలాగోలా పూర్తి చేసి విడుదల చేస్తే అది కూడా బాగా ఆడలేదు. ఇక కెవి రెడ్డిగారి మార్కెట్ అయిపోయిందనుకున్న విజయావాళ్లు ఆయనను తొలగించివేసి అప్పటిదాకా కల్పించిన సౌకర్యాలు కూడా వెనక్కి తీసేసుకున్నారు. రెడ్డిగారికే పని లేకపోతే సింగీతం వారికేం వుంటుంది? విజయావాళ్లు ఆయనను కూడా తీసేశారు. సంసారం గడవడం ఎలా అని ఆయన భార్య దిగులుపడితే ఏం ఫర్వాలేదు, 'నేను పెయింటర్‌ను కదా, 1969 కొత్త సంవత్సరం గ్రీటింగ్ కార్డులు పెయింట్ చేసి డిజైన్ చేసి, వ్యాపారం చేస్తా చూడు' అన్నారు. ఆ బిజినెస్ చేస్తే బాగానే డబ్బు వచ్చింది. ఇలా నడుస్తూండగానే స్క్రిప్టులో సాయం కోరుతూ యితరులు పిల్చుకుని వెళుతూండేవారు. ఆదాయానికి లోటు లేకుండా గడిచిపోతూ వుండేది. ఈ దశలో శంకరరెడ్డి గారనే ఆయన కర్నూలు, బళ్లారికి చెందిన పారిశ్రామిక వేత్తలు ఎచ్.వి.సంజీవరెడ్డి, ఎం.లక్ష్మీకాంత రెడ్డి గార్లను పిలుచుకుని వచ్చారు. 'మేం మొదటిసారిగా సినిమా తీయబోతున్నాం. మీరే డైరక్టరు, దర్శకత్వ పర్యవేక్షణగా కెవి రెడ్డిగారిని పెట్టుకుందాం' అని ప్రతిపాదించారు. 'మీ ఐడియా బాగుంది. డైరక్షన్‌కు నేను రెడీయే. కానీ పెద్దాయన కెవి గార్ని కలిస్తే మర్యాదగా వుంటుంది' అన్నారు సింగీతం. వచ్చిన నిర్మాతలతో కెవి 'మీ రెండో పిక్చర్ సింగీతంకు యిద్దురుగాని, మొదటి సినిమా మాత్రం నేనే చేస్తాను' అన్నారు. కెవికి మార్కెట్ లేదనుకున్న నిర్మాతలు ఆలోచిస్తాం అని చెప్పి వెళ్లిపోయారు. ఈ విధంగా సింగీతంకు వచ్చిన మొదటి ఛాన్సు పోయింది.

జయంతి పిక్చర్స్‌కు అసోసియేట్ ప్రొడ్యూసరు, కవి అయిన తిక్కవరపు పట్టాభిరామిరెడ్డిగారు కన్నడంలో యు.ఆర్.అనంతమూర్తి రాసిన ''సంస్కార''ను కన్నడ సినిమాగా తీద్దామని నిశ్చయించుకుని డైలాగులు కూడా రాయించుకుని షూటింగు ప్రారంభించబోయే ముందు సింగీతం వద్దకు వచ్చి డైరక్షన్‌లో సాయం చేయమని అడిగారు. సాయం చేయమన్నారు కానీ చివరకు దర్శకత్వ బాధ్యతంతా సింగీతం మీదనే పడింది. డైరక్టరుగా తన పేరు వేయమని అడగవచ్చు కానీ కథ, డైలాగులు, తారాగణం అన్నీ పట్టాభిగారే

చూసుకున్నారు కాబట్టి, ఆయన పేరు డైరక్టరుగా వేసి, తన పేరు ఎక్జిక్యూటివ్ డైరక్టరుగా వుంటే సబబుగా వుంటుందనుకున్నారు సింగీతం. అలాగే జరిగింది. దానికి జాతీయ అవార్డు, రాష్ట్రపతి బంగారు పతకం, అనేక ప్రశంసలు లభించాయి.

ఈ లోపున కెవి రెడ్డిగారు ఖాళీగా ఆదాయం లేకుండా వుండడం చూసి బాధపడిన ఎన్టీయార్ ఆయనకు డబ్బు యివ్వబోయారు. 'ఊరికే యిస్తే పుచ్చుకోను, ఏదైనా సినిమాకు డైరక్షన్ చేయించుకో' అన్నారు కెవి. అప్పుడు "శ్రీ కృష్ణ సత్య" (1971) సినిమాకు దర్శకత్వం అప్పగించారు ఎన్టీయార్. 'కెవి ఆ సినిమా చేస్తున్నారు కాబట్టి, మీరు మా సినిమా చేసిపెట్టండి' అంటూ గతంలో వచ్చిన నిర్మాతలు మళ్లీ వచ్చి సింగీతంను అడిగారు. సరే అని చేసిన సినిమాయే "నీతి–నిజాయితీ". హీరో మూగవాడు. సతీష్ అరోడా అనే పంజాబీ యువకుడు ఆ పాత్ర వేశాడు. సినిమాకు, దానిలో పాటలకు మంచి పేరు వచ్చింది కానీ డబ్బులు రాలేదు. అయినా ఆ సినిమా నిర్మాణంలో వుండగానే సింగీతం దర్శకత్వ ప్రతిభ గమనించిన నవతా కృష్ణంరాజుగారు సొహ్రాబ్ మోదీ సినిమా "శీష్ మహల్" ఆధారంగా తను తీయ తలపెట్టిన "జమీందారు గారమ్మాయి" సినిమాకు బుక్ చేశారు. నీతి–నిజాయితీ ఫ్లాపు కావడంతో డిస్ట్రిబ్యూటర్స్ జంకారు. నిర్మాణం వాయిదా పడింది.

ఇంతలో సింగీతం రాజాజీ రాసిన "దిక్కట్ర పార్వతి" (దిక్కులేని పార్వతి) అనే తమిళ కథకు ఆంగ్లానువాదం "ఫాటల్ కార్ట్" చదివి చాలా యిష్టపడి దాన్ని తమిళంలో ఆర్ట్ ఫిల్మ్‌గా తీద్దామని ముచ్చటపడ్డారు. రాజాజీకి సినిమాలంటే యిష్టం లేదని ప్రతీతి. ఆయన అనుమతి లేనిదే సినిమా తీయలేం. ఎలా? కల్కి పత్రికలో ఎడిటర్‌గా పని చేసే ఎస్‌విఎస్‌గారు రాజాజీగారి సెక్రటరీ. ఆయన్ను పరిచయం చేసుకుని ఆయన ద్వారా రాజాజీని వెళ్లి అడిగితే "సినిమాలెందుకు యిష్టం లేదు? చెడ్డ సినిమాలు యిష్టం లేదంతే" అన్నారట. సింగీతం కోరిక మన్నించి సుస్తీగా వున్నా ఓపిక చేసుకుని పర్మిషన్ లెటర్‌పై సంతకం చేశారు. అదే ఆయన ఆఖరి సంతకం. పై వారానికి పోయారు. ఆయన వద్దకు వెళ్లడం యింకో వారం ఆలస్యమైతే ఆ సినిమా తీయగలిగేవారు కాదు. రాజాజీ కథను సినిమాగా తీస్తారట అని పత్రికలలో వచ్చి పబ్లిసిటీ బాగానే వచ్చింది. బజెట్ రూ. 2 లక్షలయితే లక్షన్నర అప్పు యివ్వడానికి ఫిలిం ఫైనాన్స్ కార్పోరేషన్ సిద్ధపడింది. కథకు తగిన లొకేషన్ చూద్దామని హొసూరు వెళితే రాజాజీ పుట్టి కొంతకాలం పెరిగిన తొరపల్లి గ్రామం అక్కడకి 5 కి.మీ.లని తెలిసింది. వెళ్లి చూస్తే కథలో వర్ణించిన వాతావరణం అక్కడ కనపడింది. కాస్త దూరం లోనే కర్ణాటక సరిహద్దు. కర్ణాటకలో తీస్తే ఏ భాషా చిత్రానికైనా సరే రూ.50 వేల సబ్సిడీ. ఇక్కడైతే ఆ వెసులుబాటు లేదు. కథకు తగిన వాతావరణమా? సబ్సిడీయా? చివరకు నేటివిటీయే ముఖ్యం అనుకుని ఎచ్.వి.సంజీవరెడ్డి, ఎం.లక్ష్మీకాంత రెడ్డి గార్లను కలుపుకుని సినిమా మొదలుపెట్టారు.

శ్రీకాంత్, లక్ష్మి హీరోహీరోయిన్లు, తర్వాతి రోజుల్లో కమెడియన్‌గా పేరు తెచ్చుకున్న వైజి మహేంద్రన్ తొలిపరిచయం, విలన్ వేషం. సంగీతం వీణ చిట్టిబాబు. రెండు పాటలు. పాడినది వాణీ జయరాం. వాటిలో ఒక పాట రాజాజీదే. 22 రోజుల్లో షూటింగు ముగించుకున్నారు. 1974లో రిలీజైంది. దానికీ పేరు వచ్చింది. కానీ ఫ్లాప్. జాతీయ ఎవార్డుగా రూ.5000 లు వచ్చినా అది బాండ్ రూపంలో యిచ్చారు. ఫిలిం కార్పోరేషన్‌కు యివ్వాల్సిన బాకీ వుండిపోయింది. అప్పుడు సింగీతం ముఖ్యమంత్రి ఎమ్జీయార్‌ను వెళ్లి కలిస్తే ఆయన సినిమా చూసి చాలా బాగుంది, తాగుడు వలన గ్రామీణుల జీవితం ఎలా నాశనమవుతోందో వివరిస్తోంది. ప్రభుత్వం ద్వారా దీన్ని కొని, మీకు అప్పు లేకుండా చేస్తాను' అన్నారు. ఆ సినిమాను తమిళనాడు ప్రభుత్వం కొని, సింగీతం తరఫున కార్పోరేషన్ బాకీ తీర్చేసింది. సినిమా చరిత్రలో ఒక రాష్ట్ర ప్రభుత్వం సినిమాను కొనడం అదే మొదటిసారిట. "దిక్కట్ర పార్వతి" ప్రయత్నం వలన కలిగిన మేలేమిటంటే "జమీందారు గారమ్మాయి" సినిమా తీద్దామనుకున్న నవతా కృష్ణంరాజుకు సింగీతం దర్శకత్వ ప్రతిభపై మరింత నమ్మకం పెరిగి, డిస్ట్రిబ్యూటర్‌నైనా మారుస్తాను కానీ దర్శకుణ్ని మార్చను అనుకుని తన సినిమాకు అన్నపూర్ణా పిక్చర్స్‌ను ఒప్పించారు. 1975లో రిలీజైన ఆ సినిమా వంద రోజులు ఆడింది. ఆ తర్వాత వచ్చిన "ఒక దీపం వెలిగింది" (1976), "అమెరికా అమ్మాయి" (1976) సక్సెసయి సింగీతంను డైరక్టరుగా నిలబెట్టాయి. సింగీతం గారి శ్రీమతి లక్ష్మీకల్యాణి తమ కుటుంబ విశేషాలతో రాసిన "శ్రీ కల్యాణీయం" అనే పుస్తకంలో యీ వివరాలన్నీ వున్నాయి. **– (సశేషం) ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2015)**

**జూన్ 23**

## ఎమ్బీయస్ : సెక్షన్ 8 పై రచ్చ

విభజన జరిగిన ఏడాదికి సెక్షన్ 8 గురించి చర్చ, ఆపై రచ్చ జరుగుతున్నాయి. అమలు చేస్తే దీక్ష చేస్తానని కెసియార్ గవర్నరు వద్ద అన్నారట. ఢిల్లీకి వెళ్లి నిరాహార దీక్ష చేస్తామని తెలంగాణ ఉద్యోగసంఘాలంటున్నాయి. ఇదేదో కొత్తగా పెట్టినట్లు యింత హంగామా ఎందుకో అర్థం కావటం లేదు. ఇది విభజన చట్టంలోనే వుంది. ఆ చట్టాన్నే పార్లమెంటులో తెలంగాణ వీరులందరూ పాస్ చేయించుకున్నారు – అత్యంత భీకరమైన పరిస్థితులు సృష్టించి! ఇప్పుడు దానిలో కొంత భాగం పనికి రాదంటే ఒప్పుతుందా? ఇరు రాష్ట్రాల మధ్య ఆస్తులు, అప్పులు జనాభా నిష్పత్తిలో పంచి, విద్యుత్ మాత్రం గత ఐదేళ్ల వాడకం నిష్పత్తిలో పంచడం ఘోరమే, అయినా జయపాల్ రెడ్డిగారు అలా రాయించారు. టిడిపి తెలంగాణ ఎంపీలు సై అన్నారు, జై కొట్టారు. విభజన తర్వాత చంద్రబాబు యీ విషయంలో గగ్గోలు పెడితే ఎవరు విన్నారు? చట్టంలో వున్నది అమలు చేయాలి కదా అని సుద్దులు చెప్పారు. అదే లాజిక్ సెక్షన్ 8 విషయంలోనూ వర్తిస్తుంది. అసలప్పుడే దీని గురించి కెసియార్‌ను నిలదీశారు కొందరు – గవర్నరుకు విశేషాధికారాలు యిస్తే

యిక రాష్ట్రప్రభుత్వం విలువేముంది? ఇతర రాష్ట్రాలలో యిలాటిది లేదు కదా అని. అప్పుడు కెసియార్ 'పదేళ్లు ఉమ్మడి రాజధాని పద్ధతి కూడా యితర రాష్ట్రాలలో లేదు కదా, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మన రాష్ట్రం ఏర్పడుతున్నపుడు కొన్నిటికి రాజీ పడాల్సిందే' అని చెప్పి అనుచరులను చల్లార్చారు. ఇప్పుడు ఆయన పార్టీయే యితర రాష్ట్రాలతో పోలిక తెచ్చి సెక్షన్ 8 ఒప్పుకోం అంటోంది.

అప్పటి ప్రత్యేక పరిస్థితులేమిటో కెసియార్‌కు తెలుసు. ఆంధ్రులకు వ్యతిరేకంగా ఎన్నో ఎన్నో నినాదాలు. ఆంధ్రులు తీసే సినిమా షూటింగులకు వెళ్లి ఆపేయడాలు, ఆంధ్ర పారిశ్రామికవేత్తలు కొత్త యూనిట్లు పెట్టబోతూ వుంటే బెదిరింపులు. రాష్ట్రం విడిపోతే ఆంధ్రులను తరిమివేయవచ్చని వాళ్ల యిళ్లు స్థానికులు ఆక్రమించవచ్చునని గల్లీ నాయకుల వూరింపులు, ఆంధ్ర ఉద్యోగులను తరిమికొడితే ఆ ఉద్యోగాలు, ప్రమోషన్లు అన్నీ మనకే నని ఉద్యోగి సంఘాల నాయకుల హామీలు. మాజీ ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి సైతం యిక్కడ వుండాలంటే కర్రీ పాయింట్లు పెట్టుకుని బతుకు యీడ్వాల్సిందేనన్న సెటైర్లు. ఇలాటి పరిస్థితుల్లో కొత్త రాష్ట్రంలో తమ గతేమిటని ఆంధ్రులు భయపడడం, దాన్ని కేంద్ర నాయకులు గుర్తించక తప్పని పరిస్థితి రావడం జరిగింది. అందుకే సెక్షన్ 8 పెట్టారు. ఏడాది పాలనలో శాంతిభద్రతలకు విఘాతం కలగలేదు కాబట్టి యిక సెక్షన్ 8 అవసరం లేదు, ఎత్తేయవచ్చు అని యిప్పుడు తెరాస నాయకులు అనవచ్చు. ఇప్పటిదాకా యాక్సిడెంటు జరగలేదు కాబట్టి బండికి బ్రేకులు తీసేద్దాం, ఎవరూ ఎత్తుకుపోలేదు కాబట్టి యిన్సూరెన్సు కట్టడం మానేద్దాం అన్నట్టే వుంది యిది. ఈ 'శాంతి' ఎన్నాళ్లో ఎవరికి తెలుసు. తెరాస అధికారంలోకి వచ్చింది కాబట్టి, గొడవలు జరగటం లేదు (?), అదే కాంగ్రెసు బొటాబొటీ మెజారిటీతో ప్రభుత్వం ఏర్పరచి వుంటే తెరాస ఎన్ని ఆందోళనలు చేపట్టేది? భద్రాచలం ఆర్డినెన్సు పేరు చెప్పుకునే రెండు మూడు నెలలు రాష్ట్రాన్ని స్తంభింపచేసేది. చేతకాని ప్రభుత్వమని, ఆంధ్రులకు అమ్ముడుపోయిందని రచ్చరచ్చ చేసేది. ఇప్పుడు వాళ్లే అధికారంలో వున్నారు కాబట్టి 'రాత్రికి రాత్రి పనులు అయిపోతాయా? 60 ఏళ్ల సమైక్యపాలనలో యీ ప్రాంతాన్ని దుంపనాశనం చేశారు, పునర్నిర్మాణానికి పుష్కరాలు పడతాయి' అని సన్నాయినొక్కులు నొక్కుతున్నారు.

ఈ పరిస్థితి ఎంతకాలం వుంటుందో ఎవరు చెప్పగలరు? రాజకీయ పార్టీలు ఎప్పుడెలా చీలతాయో తెలియదు. టిడిపిలో ముసలం పుట్టి పార్టీ వ్యవస్థాపకుడైన ఎన్టీయార్‌ను దింపేస్తారని ఎవరైనా వూహించారా? ఎమ్జీయార్, కరుణానిధి కలహించుకుని డిఎంకె విడిపోతుందని కలగన్నారా? కాంగ్రెసు అన్ని సార్లు చీలుతుందని ఎపుడైనా జోస్యం చెప్పారా? తెరాస యిప్పుడున్న రూపంలో రేపు వుంటుందని చెప్పలేం. తొలినుంచీ జండా మోసినవారిని పక్కనబెట్టి యితర పార్టీల్లోంచి వచ్చినవారిని వాటేసుకుంటూ వుంటే దాని ప్రకంపనలు వుండవా? ఇతర నాయకులు కెసియార్ కుటుంబం పెత్తనం ఎంతకాలం సహిస్తారు? కుటుంబంలోనే చీలికలు రావా? ఏదైనా ఎపుడైనా జరగవచ్చు. ఆ రోజు అలా విడిపోయినవారు ఎత్తుకునే పల్లవి ఏమిటి? 'ప్రస్తుత ప్రభుత్వం ఆంధ్రులతో కుమ్మక్కయింది. తెలంగాణకు న్యాయంగా దక్కవలసిన వాటా కోసమే మేము విడిగా వచ్చి పోరాడుతున్నాం, పదవుల కోసం కాదు' అని. ఆంధ్రులకు వ్యతిరేకంగా హింసాత్మకమైన ఆందోళనతోనే వారు ప్రజల దృష్టిని ఆకట్టుకుంటారు. తెలంగాణ వస్తే చాలు ఉద్యోగాలు, పదవులు, పదోన్నతులు, ఆస్తులు ఆకాశం నుంచి వూడిపడతాయని ఆశపడి భంగపడిన వారందరూ వారి వెంట నడుస్తారు. 'ఆంధ్ర పెత్తనం' అనే పదం తెలంగాణ నాయకుల ఉపన్యాసాల్లోంచి నిష్క్రమించడానికి ఒక దశాబ్దం చాలుతుందో లేదో! 'ఆంధ్రుల కారణంగా తెలంగాణ వెనకబాటుతనం' అనే నినాదం మృతసంజీవిని. సొంత వైఫల్యం చేత ఏ నాయకుడైనా నీరసించి వుంటే దాన్ని అటక మీదనుంచి దింపి చేతి కందిస్తే చాలు, యిక దూసుకుపోతాడు. 65 ఏళ్లగా నడుస్తున్న కథ యిది. కనీసం యింకో 35 ఏళ్ల ఆయుర్దాయం వుంది దానికి. ఇలాటి పరిస్థితుల్లో ఏడాది పాలన చూసి, సెక్షన్ 8 రక్షణ అక్కరలేదు అనడం తొందరపాటే.

ఏడాదిపాలనలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిందా లేదా అన్న విషయం చర్చించేందుకు ముందు సెక్షన్ 8 సబబా, కాదా అన్న విషయం గురించి ఆలోచిద్దాం. ఏ మాట కా మాట చెప్పాలంటే గవర్నరుకు యిలాటి విశేషాధికారాలు యివ్వడం ఏ మాత్రం అభిలషణీయం కాదు. రాష్ట్రప్రభుత్వం తన పౌరులలో ఒక వర్గాన్ని కాపాడదు, వాళ్ల ప్రాణ, మాన, ఆస్తి నష్టాలు జరుగుతూంటే కిమ్మనకుండా కూర్చుంటుంది అని అనుమానం వ్యక్తం చేసినట్లే! ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి వుండే జవాబుదారీ గవర్నరుకు ఎందుకుంటుంది? ఈ రోజు సెక్షన్ 8 అమలు చేయాలని, గవర్నరు చేతిలో అధికారాలు పెట్టాలని ఉద్యమిస్తున్న టిడిపి రేపు నరసింహన్‌ను మార్చి మహారాష్ట్ర గవర్నరుగా వున్న విద్యాసాగరరావును తీసుకుని వచ్చి గవర్నరుగా పెడితే ఏం చేయగలదు? ఈ రోజు గవర్నరు తమ మాట వింటున్నాడన్న ఆనందంలో వున్న తెరాస రేపు మోత్కుపల్లి నరసింహులును గవర్నరును చేసి అక్కడ కూర్చోబెడితే ఏమంటుంది? మనం వ్యక్తుల గురించి కాకుండా వ్యవస్థ గురించి మాట్లాడాలి. గతంలో తెలంగాణ ప్రయోజనాలు కాపాడడానికి అంటూ కాంగ్రెసు నాయకుల మధ్య 'పెద్దమనుష్యుల ఒప్పందం', 'ముల్కీ రూల్స్' అంటూ పెట్టి గందరగోళ పరిచినట్లే యిప్పుడు హైదరాబాదులో 'ఆంధ్రుల రక్షణ కోసం' సెక్షన్ 8 అంటూ పెట్టి చికాకులు తెచ్చిపెట్టారు. 'అబ్బే, ఆంధ్రుల రక్షణ కోసం' అంటూ ప్రత్యేకంగా ఎక్కడా లేదు, యితర ప్రాంతాల వారందరికీ కలిపి అది. వారెవ్వరికీ లేని భయం ఆంధ్రుల కెందుకు?' అని తెలంగాణ నాయకులు వాదిస్తున్నారు. నిజమే, ఆంధ్రులకే ఎందుకు భయం వుండాలి? ఎందుకంటే తక్కినవారిని ఎవరినీ సెటిలర్లు అనటం లేదు కాబట్టి! గుజరాతీలు, మార్వాడీలు, ఇరానీయులు.. అంటున్నారు కానీ సెటిలర్లు అనటం లేదు.

తమిళనాడులో తరతరాలుగా స్థిరపడిన తెలుగువారిని తెలుగువాళ్లు అంటారు తప్ప సెటిలర్లు అనరు, కర్ణాటకలో స్థిరపడిన తమిళులనూ అనరు, మహారాష్ట్రలో స్థిరపడిన తెలంగాణ వారినీ అనరు. ఆ పదం తెలంగాణలో స్థిరపడిన ఆంధ్రులకు మాత్రమే ప్రత్యేకంగా వాడుతున్నారు, జర్మన్ జనాభాలో యూదులను ప్రత్యేకంగా పేర్కొన్నట్లు. ఆంధ్ర పదం నిజానికి తెలుగువారందరికీ

వర్తిస్తుంది. కానీ గత కొన్నేళ్లగా కోస్తా, సీమ వాళ్లకే దాన్ని వాడుతున్నారు. దాన్ని ఆమోదించి అక్కడ మూలాలున్నవారిని ఆంధ్రులు అనేస్తే పోతుంది. సెటిలర్లు అని ఎందుకనాలి? సెటిలర్లను కడుపులో పెట్టుకుంటాం, కాల్లో ముల్లు గుచ్చుకుంటే పంటితో తీస్తాం.. వంటి నినాదాలు ఎందుకు? అలా హామీ యివ్వడంలోనే బెదరవల్సిన పరిస్థితి వుందని అర్థమవుతోంది కదా. భయపడేవాడికే అభయం యిస్తారు. అందరూ నిర్భయంగా జీవించవలసిన పరిస్థితులు ఏర్పరచవలసిన పాలకులు కొందరికి అభయం యిస్తున్నారంటేనే తెలుస్తోంది వాతావరణం ఎంత లక్షణంగా వుందో! అందువలన సెక్షన్ 8 ఆంధ్రుల కోసమే అన్న మాట రూఢ్యర్థంలో వాడుతున్నారు. (ఈ పదం అర్థం తెలియనివారి కోసం రాస్తున్నాను – పంకజము అంటే తామరపువ్వు అని తెలుసు. బురదలో పురుగులతో సహా అనేకం పుడతాయి కానీ దానికి రూఢ్యర్థం తామరపువ్వే) తెలంగాణేతరులు అనగానే ఆంధ్రులే గుర్తుకు వస్తున్నారు. అదీ కాక తెలంగాణ పాలకులు తమ రాజకీయప్రత్యర్థి యైన చంద్రబాబును టిడిపి నాయకుడు అనటం లేదు, ఆంధ్రబాబు అని నిందార్థంలో వాడుతున్నారు. టి–టిడిపి వారిని ఆంధ్రభృత్యులు అని నిందిస్తున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు పైన నీటిని బిగబడుతున్నా అక్కడ మూలాలున్న తెలంగాణ పౌరులను ఏమీ అనడం లేదు, వెళ్లి మీ ప్రభుత్వంపై ఒత్తిడి చేసి నీళ్లు యిప్పించండి అనటం లేదు. కానీ ఆంధ్రులకు మాత్రం అలాటి సవాళ్లు విసురుతున్నారు. ఆంధ్రులపై ప్రస్తుతం వివక్షత పెద్దగా లేదు, కాబట్టి సెక్షన్ 8 అనవసరం అంటున్నవారున్నారు. రేపు కార్పోరేషన్ ఎన్నికలలో ఆంధ్ర ఓటర్లు అధికంగా వున్న చోట తెరాస అభ్యర్థులు ఓడిపోతే అప్పుడు తెరాస నాయకులు ఎలాటి రంకెలు వేస్తారో తెలియదు. అప్పుడు హఠాత్తుగా అవసరం అంటే చట్టాన్ని మారుస్తారా?

అందరికీ రక్షణ కల్పించవలసిన అవసరం వుందని కేంద్రం నిజంగా భావిస్తే సెక్షన్ 8 పితలాటకం పెట్టకుండా హైదరాబాదును యుటీ చేయవలసినది. అలా చేయాలని చంద్రబాబు ఎప్పుడైనా అడిగారా? ఆయన పార్టీలోని ఆంధ్ర నాయకులు యిప్పుడు అంటున్నారు. అప్పట్లో ఆంధ్ర కాంగ్రెసు నాయకులు – ముఖ్యంగా చిరంజీవి – యుటీకై అడిగేవారు. అయితే ఆయన పార్టీ అధ్యక్షురాలు సోనియా ఎప్పుడూ ఆ మాట ఎత్తలేదు. టిడిపి పార్టీలో ఆంధ్ర నాయకులు యుటీ కావాలన్నా, తెలంగాణ నాయకులు వద్దన్నా పార్టీ అధ్యక్షుడిగా బాబు మాటే ఫైనల్. ఆ ముక్క ఆయనే పదేపదే చెప్పారు కూడా. మరి ఆయన ఆ సబ్జక్ట్‌పై నోరు విప్పకపోతే ఆంధ్ర టిడిపి నాయకులు డిమాండ్ చేయడం ఆంధ్రులను మోసపుచ్చడానికే! బాబు ఎందుకు అడగకపోవాలి? నిజానికి అడిగితే ఆంధ్ర ప్రజలందరూ సంతోషిస్తారు కదా. హైదరాబాదులోని ఆస్తులన్నీ తమవే, సంస్థలన్నీ తమవే అంటున్న తెలంగాణకు ముకుతాడు పడుతుందని తృప్తి పడతారు కదా. బాబు అప్పుడే కాదు, యిప్పుడు కూడా అడగకపోవడానికి కారణం ఏమిటంటే – తెలంగాణ ప్రజలు దాన్ని హర్షించరని, తెలంగాణలో తన పార్టీ ప్రగతి కుంటుపడుతుందని. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆయనకు హైదరాబాదుపై మోజు పోనంతవరకు, తెలంగాణలో 2019లో అధికారంలోకి వచ్చేయాలన్న పేరాశ వదులుకోనంతవరకు ఆంధ్ర ప్రజలకు అన్యాయం జరుగుతూనే వుంటుంది.

ఇప్పటికీ యుటీ చేయమని అడగరు, గవర్నరుకు విశేషాధికారాలు యివ్వాలి అని వూరుకుంటున్నారు. ఇది కూడా ఎంతకాలం అంటారో తెలియదు. ఇప్పటికే కేంద్రంలో బిజెపి జోక్యం వలన తెరాస, టిడిపి రాజీ పడ్డాయని పేపర్లు రాస్తున్నాయి. అవినీతి గురించి గర్జిస్తున్న మోదీ ఓటు–నోటు కేసులో బాబును రక్షించరని, చట్టప్రకారం పోతారని ముందులో అనుకున్నారు. అయితే యీలోగా లలిత్ మోదీ ధర్మమాని బిజెపిలోనే కొందరి పేర్లకు మసి అంటింది. వారిపై చర్య తీసుకోకుండా బాబుపైన అడుగు ముందుకు సాగని పరిస్థితి. అందువలన యీ కేసును తెగేదాకా లాగకండి అని మోదీ కెసియార్–బాబులకు సంకేతాలు పంపారట. ఫలితంగా తెరాస బాబుకు వ్యతిరేకంగా వున్న సాక్ష్యాలు బయటపెట్టటం లేదట, ఫోన్ ట్యాపింగ్ సాక్ష్యాలను బాబు బయటపెట్టటం లేదట. ఇది నిజమే అయితే అది కూడా ఆంధ్ర ప్రయోజనాలకు విఘాతమే. రాజీ పడడంలో బాబు ఆంధ్ర ప్రయోజనాలను దెబ్బ తీశారా అన్న సందేహం వస్తుంది. బాబు రేవంత్ అంశంలో బుఱ్ఱ బద్దలు కొట్టు వుంటే కెసియార్ తన రాష్ట్రంలో కొత్త పరిశ్రమలకు లైసెన్సు యిచ్చే అడావుడిలో వున్నారు. తెలంగాణ నుంచి ఆంధ్రకు పరిశ్రమలు తరలిపోకుండా చూసుకుంటున్నారు. బాబు ప్రత్యేక హోదా గురించి కూడా పట్టుబట్టడం మానేశారు. అది వస్తే ఏం లాభం? దాని కంటె నిధులు అడిగి తీసుకోవచ్చుగా అంటున్నారు. నిధులు – వస్తే గిస్తే – ప్రభుత్వానికి వస్తాయి, ప్రత్యేక హోదా వలన పరిశ్రమలకు రాయితీలు వస్తాయి. అయినా నిధులు కావాలా? ప్రత్యేక హోదా కావాలా? అని బాబు అడగడం అర్థరహితం. అన్నమూ కావాలి, తినడానికి విస్తరీ కావాలి. అది యిస్తే యిది యివ్వం అని కేంద్రం బాహాటంగా చెప్పలేదు కదా. హోదా సాధించలేక మనకు నచ్చచెపుతున్న ప్రయత్నం యిది. సాధించలేకపోవడానికి కారణం ఏమిటో ఆయనకే తెలియాలి. ఇప్పుడు యిలాటి రాజీల్లో అది కూడా ఒక భాగమైతే యిక హోదా గురించి మర్చిపోవచ్చు.

ఒకలా చెప్పాలంటే తెలంగాణపై ఆశే, తెలంగాణ పరిస్థితిని అవగాహన చేసుకోకపోవడమే బాబును ముంచింది. టిడిపి మౌలిక ఆశయాలనే ఆయన విస్మరించారు. నిజానికి రాష్ట్రంలో అధికాంశం జనులు ఎప్పుడూ సమైక్యవాదాన్నే ఆదరించారు. ఒకచోట విభజన వాదం వచ్చినపుడు మరొక చోట సమైక్యవాదం వచ్చి, దాన్ని నిలవరించింది. కెసియార్ పదేళ్ల ఉద్యమం తర్వాత కూడా మూడు జిల్లాల కంటె ఎక్కువ మందిని ఒప్పించలేకపోయారు. ఇంకొకరితో పొత్తు పెట్టుకుంటే తప్ప పాతిక స్థానాలైనా గెలవలేని స్థితి తెచ్చుకున్నారు. అప్పుడు ఆయన టిడిపిలో కొందరు నాయకులను కోవర్టులుగా మార్చుకున్నారు. ఈ విషయాన్ని టిడిపి నాయకుడు దయాకరరెడ్డి మొన్న టీవీ చర్చలో చెప్పారు. తను కెసియార్‌ను పలకరించడానికి పోయినప్పుడు 'కడియం శ్రీహరితో టచ్‌లో వుందు' అని చెప్పాడని చెప్పారు. అప్పటికి కడియం టిడిపిలోనే వున్నారు. ఆయనా, ఎర్రబెల్లి తమ జిల్లాలో ప్రత్యేకవాదం బలంగా వుండడంతో

బాబును విభజనకు అనుకూలంగా లేఖ యిమ్మనమని ఒత్తిడి చేయసాగారు. ప్రత్యేక తెలంగాణ అంటూ దేవేందర్ గౌడ్ వంటి పెద్ద నాయకుడు బయటకు వెళ్లి పార్టీ పెట్టినా ఎక్కడా స్పందన లేదు. లేఖ యిచ్చి తీరాలని పట్టుబట్టిన నాగం జనార్దనరెడ్డి కూడా పెద్ద నాయకుడే అనేవారు. మొన్న ఎన్నికల్లో ఆయన ఓటమి చెప్పింది – ఆయన పలుకుబడి ఎంతో! బిజెపిలో కూడా ఆయన మాట ఎవరూ వింటున్నట్టు కనబడదు. ఇలాటి వాళ్లు ఒత్తిడి చేస్తే బాబు లొంగిపోయి లేఖ యిచ్చారు. కడియం శ్రీహరి యిప్పుడు ఎక్కడ వున్నారో చూడండి. ఇన్నాళ్లూ కెసియార్ ఏజంటుగా టిడిపిని తప్పుదోవ పట్టించి యిప్పుడు వదిలేశారు. ఎర్రబెల్లి యింకా టిడిపిలోనే వున్నా, ఎప్పుడైనా పార్టీ మారవచ్చు అనే పుకార్లు వస్తూనే వున్నాయి. ఆయన గురించిన వాస్తవం కొన్నాళ్ల తర్వాత తెలియవచ్చు.

ఒకసారి లేఖ యిచ్చి వూరుకోలేదు బాబు. మేం లేఖ యిచ్చాం, మీరు యింకా ఎందుకు విభజన చేయలేదు అని కాంగ్రెసును గద్దించసాగారు. చివరకు 2009లో ప్రకటన రాగానే కంగు తిన్నారు. ఇలా చేస్తారనుకోలేదు అన్నారు. తర్వాత చాలా డ్రామా నడిచింది. కాంగ్రెసు లాగానే టిడిపి కూడా రెండు గొంతుకలతో మాట్లాడింది. ఎందుకంటే సమైక్యవాదంపై ఎన్టీయార్‌కు వున్న కన్విక్షన్ ఆయనకు లేదు. సమైక్యవాదులుగా వున్న ఎన్టీయార్, వైయస్సార్ మాత్రమే రాష్ట్రమంతా మన్ననలు పొందారు. 2004 నాటికి వైయస్సార్ మాట చెల్లుబాటు కాకపోవడం చేతనే తెరాసతో పొత్తు పెట్టుకోవలసి వచ్చింది. ఆ తర్వాత దాన్ని చీల్చి బలహీనపరచడానికి ఆయన నిరంతరం ప్రయత్నించాడు. 2009లో తెరాసతో పొత్తు పెట్టుకోమని సోనియా బలవంతం చేస్తే ఎదురు తిరిగాడు. అయినా తెలంగాణలో వైయస్‌కు పెద్ద సంఖ్యలో అభిమానులున్నారు. ఎన్టీయార్ వారసుడు బాబుకు సమైక్యవాదంపై కన్విక్షన్ లేకుండా రాజకీయ అవసరాలనే నమ్ముకున్నట్టు వైయస్ వారసుడు జగన్ కూడా వైయస్ సమైక్య సిద్ధాంతాన్ని గాలికి వదిలేసి రాజకీయంగా ఏ ఎత్తు వేస్తే మంచిదో ఆలోచించారు. సమైక్యవాదానికి తెలంగాణలో వున్న బలాన్ని గుర్తించకుండా తెలంగాణలో తన పార్టీ బలహీన పడుతుందేమోనన్న భయంతో అంతా కేంద్రందే భారం అంటూ పల్లవి అందుకున్నాడు తప్ప, ఎట్టి పరిస్థితిలోనూ తెలుగువారు కలిసి వుండాలి అనే మాట లేదు. చివర్లో సమైక్యవాదం అన్నా అది ఉత్తుత్తి నినాదంగానే మారింది. ఎన్నికల సమయంలో కెసియార్‌కు వ్యతిరేకంగా మాట్లాడకపోవడం, యిప్పుడు కూడా కెసియార్ ఆంధ్రవ్యతిరేక విధానాలను ఖండించకపోవడం వలన తెరాసతో కుమ్మక్కు ముద్ర పడింది. ఇదంతా దేనికి? ఆంధ్రుల హక్కుల గురించి గట్టిగా అడిగితే తెలంగాణ ప్రజలు ఏమైనా అనుకుని పోతారేమోనన్న భయం. ప్రభుత్వంలో వున్న బాబు యిప్పటికీ తెలంగాణతో ముడి పడి వున్న చోట ఆంధ్ర ప్రయోజనాల గురించి గట్టిగా మాట్లాడటం లేదు. ఈ విధంగా పాలకుడు, ప్రతిపక్ష నాయకుడు యిద్దరూ ఆంధ్ర ప్రయోజనాలపై రాజీపడడం ఆంధ్రుల దురదృష్టం

ఆంధ్రులకు రావలసిన హక్కులు వాళ్లు తీసుకుంటే తెలంగాణ ప్రజలు బాధపడతారా? పోలవరం గ్రామాల గురించి ఆర్డినెన్సు తెచ్చుకుంటే యిక్కడ నిరసన ప్రదర్శనలు చేశారా? తెరాస ప్రభుత్వమే ఓ రోజు కాస్త హంగామా చేసి తర్వాత కట్టిపెట్టేసింది. ప్రజలేమైనా ఆందోళన చెందారా? టెన్త్ షెడ్యూల్ ప్రకారం హైదరాబాదులో వున్న వందకు పైగా సంస్థల్లో ఆంధ్ర ప్రభుత్వం తన వాటా తీసుకుంటానంటే తెలంగాణ ఓటర్లు వెళ్లి అడ్డం పడ్డారా? గొడవ జరుగుతున్నది ఉద్యోగుల మధ్య మాత్రమే. ఆంధ్ర వుద్యోగులు వెళ్లిపోతే తమకు ఉద్యోగాలు, పదోన్నతులు వస్తాయన్న ఆశతో కొందరు గొడవలు చేయవచ్చు. అవి పేపర్లో చదివి ఓహో అనుకోవడం తప్ప తెలంగాణలోని సాధారణ ప్రజలు చేస్తున్నదేమీ లేదు. ఉద్యోగులు ఎప్పుడూ లిటిగెంట్లే. ఈ రోజు యిద్దైంది. రేపు ఉత్తర తెలంగాణావాళ్లే అన్నీ పట్టుకుపోతున్నారని మరోరు అంటారు. రిజర్వేషన్లు అంటారు. అవి యిస్తే దానిలో కేటగరైజేషన్ కావాలంటారు. ఉద్యోగుల గొడవలతో మామూలు ఓటర్లకు సంబంధం వుండదు. అలాటప్పుడు వాళ్లను తలచుకుని భయం దేనికి?

ఈ రోజు సెక్షన్ 8 గురించి పొద్దస్తమానం గోల చేస్తున్న బాబు, ఏడాదిగా కొన్ని ఆఫీసుల్లో ఐయేయస్ అధికారులను అడ్డుకుంటూ వుంటే ఏం చేశారు? ఏం ఆయన పార్టీ యూనిట్ యిక్కడ వుంది కదా? పార్టీ కార్మిక సంఘాలున్నాయి కదా? వాళ్ల చేత అధికారులకు రక్షణ కల్పించారా? కోర్టుకి వెళ్లారా? గవర్నరు వద్దకు వెళ్లి సెక్షన్ 8 గుర్తు చేసి, అది అమలు చేయకపోతే నిరాహారదీక్ష చేస్తా అన్నారా? మాట్లాడితే ప్రాజెక్టుల వద్ద వారంలో రెండు రోజులు నిద్రపోతా, కాలువల వద్ద రెండు రోజులు నిద్రపోతా, హైవేల దగ్గర నిద్ర పోతా అంటూంటారు. ఈ ఆఫీసుల వద్ద అన్యాయం జరక్కుండా కాపు కాస్తూ యిక్కడ నిద్ర పోవచ్చుగా! సెక్షన్ 8 విషయంలో ఆంధ్ర ప్రభుత్వం కేంద్రానికి ఓ లేఖ రాసింది. 'మీ అధికారాలు గవర్నరుకు అప్పగిస్తూ ఫలానా పాయింట్లతో మీరు తీర్మానం చేయండి' అని కేంద్రం ఏడాది క్రితం లేఖ రాసింది. మేం చెయ్యం ఫో అంది తెలంగాణ ప్రభుత్వం. ఇంకో రిమైండర్ రాసి వూరుకుంది కేంద్రం. 'తల తీసి యింకోడి చేతిలో పెట్టే అసలు అలాటి తీర్మానం ఏ రాష్ట్రమైనా చేస్తుందా? రాజకీయంగా వాళ్లు బతకాలా అక్కరలేదా? వాళ్లు ఎన్నటికీ చేయరు కాబట్టి ప్రత్యామ్నాయం ఆలోచించండి. పార్లమెంటులోనే ఏదో సవరణ చేయడమో, ఆర్డినెన్సు యివ్వడమో, మరోటో చేయండి' అని ఆంధ్ర ప్రభుత్వం కేంద్రం వద్ద లాబీయింగ్ చేయాలా వద్దా? జంతర్ మంతర్ వద్ద దీక్షకు కూర్చోవాలా వద్దా? 'పోలవరం ఆర్డినెన్సు జారీ చేయకపోతే ప్రమాణస్వీకారమే చేయనన్నాను' అని బాబు గొప్పగా చెప్పుకున్నారు. ప్రత్యేక హోదా గురించి కూడా ఓ ముక్క అంటే పోయేది కదా. అవన్నీ చట్టంలో లేనివి, చట్టంలో వున్న సెక్షన్ 8 అమలు చేయించడం వాటితో పోలిస్తే సులభమైనదే కదా, అదెందుకు చేయించలేకపోయారు?

సెక్షన్ 8 సరిగ్గా అమలు కాకపోతే నష్టపోతే హైదరాబాదులో వున్న ఆంధ్రులు మాత్రమే. తెలంగాణలోని యితర ప్రాంతాల్లో ఆంధ్రులకూ ఎఫెక్టవరు. కానీ టెన్త్ షెడ్యూల్‌లోని సంస్థలలో భాగం దక్కపోతే ఆంధ్ర రాష్ట్రంలో వున్న ఆంధ్రులు విపరీతంగా

నష్టపోతారు. ఆ నష్టం నివారించడానికి వాళ్ల ముఖ్యమంత్రిగా బాబు ఏం చేశారన్నది అతి ముఖ్యమైన ప్రశ్న. పంపకాలు కాగానే ఎవరైనా చేసేది తమ వాటాకు ఎంత వచ్చిందో చూసుకుని దాన్ని రక్షించుకోవడం. ఇన్నాళ్లూ హైదరాబాదు రాజధాని కాబట్టి, సంస్థల ట్రెనింగ్ యిన్‌స్టిట్యూట్స్ దగ్గర్నుంచి యిక్కడే వున్నాయి. ఏడాది లోపుగా పంపకాలు పూర్తి చేసుకోవాలి, ఏడాది తర్వాత ఎక్కడ వుంటే వాళ్లవే అన్నపుడు పంపకాలు పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలి. ఎందుకంటే యిది ఉద్యోగాలు, ప్రమోషన్లు, స్కిల్స్ పెంచుకోవడం అనేటి అనేక అంశాలకు సంబంధించిన విషయం. ఇప్పుడేమైంది, తెలంగాణలోని 104 ఉమ్మడి సంస్థలు మావే అనేసింది తెలంగాణ సర్కారు. మీ తిరుపతిలోని యూనివర్శిటీలో మేం హక్కు కోరటం లేదు, మా హైదరాబాదులో వున్న యూనివర్శిటీల్లో మీరు ఏమీ అడగకండి అంటున్నారు గడుసుగా. ఆంధ్రలో వున్న సంస్థలకు పదిరెట్లు హైదరాబాదులో వున్నాయి – రాజధాని కాబట్టి. విభజన చట్టంలో ఆంధ్రకు అన్యాయం జరిగిందని బాబు పదేపదే చెప్పారు. అలాటి అన్యాయాల్లో యీ ఏడాది గడువు కూడా ఒకటన్నమాట. సెక్షన్ 8 చట్టంలో భాగం కాబట్టి అమలు చేయాలి అని వీరన్నట్టే, అదే చట్టంలో భాగం కాబట్టి ఉమ్మడి సంస్థల ఆధిపత్యం ఏడాది తర్వాత మాదే అని వీరంటున్నారు. అనేక లోటుపాట్ల చట్టం పార్లమెంటులో పాస్ కావడానికి సహకరించిన బిజెపి, టిడిపి (తెలంగాణ విభాగం – దానికి అధ్యక్షుడు కూడా బాబే) ఆంధ్రకు జరిగిన, జరుగుతున్న నష్టాలను నివారించడానికి చూడాలా వద్దా?

టెన్త్ షెడ్యూల్‌పై దృష్టి పెట్టకుండా బాబు ఎంతసేపూ రాజధాని గురించి పట్టుకున్నారు. అంతకుముందు ఋణమాఫీ. అలవికాని వాగ్దానం చేయడం, కెసియార్ లక్ష పరిమితి పెడితే తను లక్షన్నర పెట్టడం, మళ్లీ దాన్ని ఎలా కుదించాలా అన్న కసరత్తు చేయడం – దీనికే నెలలు పట్టింది. ఆ తర్వాత రాజధాని అంతర్జాతీయ స్థాయి నగరం అంటూ వూదరగొట్టడం, సింగపూరు, జపాన్ మోడళ్లు, మంత్రులను సింగపూరు పంపడం, ఏదో జరిగిపోతోందన్న భ్రమల్లో ప్రజలను ముంచడం. భూసమీకరణ పేర రైతులతో పేచీ. అన్నిటికన్నా ముందుగా రాబట్టుకోవలసిన ఆస్తిపాస్తులను పట్టించుకోలేదు. ఈ రోజు ఆంధ్ర విద్యార్థులకు, ఉద్యోగులకు అపారంగా నష్టం వాటిల్లింది. విద్యుత్ శాఖలో ఆంధ్ర మూలాలున్న ఉద్యోగాల గతి చూడండి. తెలంగాణ ఉన్నతాధికారులు వాళ్లని పంపేశారు. ఆంధ్రలో చేర్చుకోవటం లేదు. వీళ్లని తీసుకుంటే తక్కిన రంగాల్లోనూ యిదే జరుగుతుందని వారి భయం. అక్కడి నిరుద్యోగులకే ఉద్యోగాలు చూపిస్తారా? లేక వీళ్ల కోసం అదనపు ఉద్యోగాలు సృష్టిస్తారా? లేక పని లేకపోయినా ఉత్తినే జీతాలు యిస్తారా? వీళ్లను పంపేసి తెలంగాణలో ఉద్యోగాలు సృష్టిద్దామని తెరాస ప్రభుత్వం చూస్తోంది. ఈ రెండు రాష్ట్రాల మధ్య నలిగిపోయే ఉద్యోగులకు నెలజీతం లేకపోతే ఎలా గడుస్తుంది? వాళ్లకు కడుపుమండి రోడ్డెక్కి నాలుగు వాహనాలకు నిప్పుపెడితే అది శాంతిభద్రతల సమస్యగా మారదా? అప్పుడు సెక్షన్ 8 అమలు సబబే అని తెలంగాణ నాయకులు ఒప్పుకుంటారా? ఇన్నాళ్లూ చిన్న సంఘటనైనా జరగలేదు, ఎందుకు సెక్షన్ 8? అని అడిగేవాళ్లు యిలాటి విషయాలపై జవాబు చెప్పాలి. ఇలా రెచ్చగొడితే బాధితులు తిరగబడతారు. వీరి బాధలు ఆర్చేవారు, తీర్చేవారు ఎవరూ లేకుండా పోయారు. ఇప్పుడు ఓటు–నోటు విషయంలో బాబు, కెసియార్ రాజీ పడితే వీళ్ల గతేమిటో ఊహించడానికే భయంగా వుంది.

ఆంధ్రకు ప్రత్యేక హెూదా అక్కరలేదు అని బాబు కొత్తగా పల్లవి ఎత్తుకున్నాక ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ చరణాలు అందుకుని మే 10 న 'హెూదా గోదాలో..' అని రాస్తూ 'హెూదా వచ్చేస్తే స్వర్గం దిగి వచ్చేస్తుందనుకుని కొందరు ఢిల్లీ వెళ్లి పదిమందినీ కలిశారు, అలాటి వారి వలన ఆంధ్ర రాష్ట్రానికి దుస్థితి లభించింది, యిది ప్రజలు చేసుకున్న దురదృష్టం' అంటూ విమర్శించారు. ఆంధ్ర మేధావుల వేదిక తరఫున ఆ డెలిగేషన్‌కు నేతృత్వం వహించిన చలసాని శ్రీనివాస్ మే 15 ఆంధ్రజ్యోతిలో 'కేంద్రం దిగిరాదా? అదీ చూద్దాం' పేర దానికి జవాబు యిచ్చారు. దానిలో ఆయన – 'ప్రత్యేక హెూదా, కొన్ని ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, పన్ను ప్రోత్సాహకాలు, చట్టంలో వున్న సంస్థల ఏర్పాటు.. వగైరా విషయాలలో విభజన సమయంలో యిచ్చిన హామీలు భిక్ష కాదు, మా హక్కు – అని గుర్తు చేయడానికి మేం వెళ్లాం. ఈ హామీల అమలుకోసం ఆంధ్ర రాష్ట్ర శాసనసభ, మండలి తీర్మానాలైనా చేయలేదు. ఢిల్లీలో సమావేశాలు మొదలై చాలాకాలం గడిచినా ప్రత్యేక హెూదా కొరకు గట్టిగా అడగటం లేదు. పైగా తెలంగాణ సభ్యులు హైకోర్టు కోసం నిలదీస్తుండగా, మరి బిల్లులో 8 వ పాయింటు ప్రకారం గవర్నరు ప్రత్యేక హక్కుకోసం, హామీల కోసం ఎవరూ గొంతెత్తకపోవడం అందరిలాగా మాకు కూడా బాధ కలిగింది. అందుకే మేం వెళ్లి ప్రజల ఆవేదన వివరించాం.' అని వివరించారు. సెక్షన్ 8 అమలు గురించి ఆయన చేసిన పని కూడా టిడిపి, వైసిపిలు చేయలేదు. అది మే నెల మధ్యనాటి పరిస్థితి. జూన్ 1 వచ్చేసరికి టిడిపి సెక్షన్ 8 గురించి గుండెలు బాదుకోవడం మొదలుపెట్టింది. ఈ 15 రోజుల్లో జరిగినదేమిటో అందరికీ తెలుసు – రేవంత్ పట్టుబడడం!

రేవంత్ కేసును అడ్డం పెట్టుకుని, ఫోన్ ట్యాపింగ్ ఆరోపణ చేర్చి సెక్షన్ 8 కోసం బాబు పట్టుబడుతున్నారు. రేవంత్ చేసిన దానిపై ఆంధ్ర ప్రభుత్వ వైఖరి ఏమిటి? ఆ ప్రభుత్వంలోని న్యాయశాఖలో ఉపకార్యదర్శిగా పనిచేసే బాచిన రామాంజనేయులు అనే ఆయన ఆంధ్రజ్యోతిలో 'ఓటుకు నోటు – లీగల్ పాట్లు' పేర వ్యాసం రాస్తూ 'అవినీతి నిరోధక చట్టం 1988లో అవినీతి అనే పదాన్ని ఎక్కడా నిర్వచించలేదు... చట్టం అనుమతించే ప్రతిఫలం మినహా యితర ప్రతిఫలాన్ని అధికార విధులు నిర్వహించేందుకు అంగీకరిస్తేనే నేరమవుతుంది. చట్టం అనుమతించని ప్రతిఫలాన్ని 'యివ్వటాన్ని' ఎక్కడా నేరంగా నిర్ణయించలేదు. ..' అని రాశారు. ఈయన ప్రకారం లంచం యిచ్చిన రేవంత్ చేసినది నేరం కాదు. అనేక వేదికల నుంచి నైతికత గురించి మాట్లాడే త్రిపురనేని హనుమాన్ చౌదరిగారు ఆంధ్రభూమి జూన్ 26 – 'పివి–ఝూర్‌ఖండ్ ముక్తి మోర్చా కేసులో ప్రజలచే ఎన్నుకోబడిన ప్రతినిధులు డబ్బు తీసుకోవడం

యిచ్చుకోవడం చట్టవ్యతిరేకం కాదు, అది కేవలం నీతిపరంగా తప్పో, పాపమో అవ్వవచ్చు అని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. ఈ తీర్పు ప్రకారం తెలంగాణ ఎమ్మెల్యేని ఒక పార్టీ వారు కొనబోవడం సర్వసాధారణమైన, సర్వాంగీకారమైన ప్రక్రియే!' అని యిదేదో పెద్ద విషయం కాదని, మనమేమీ ఆందోళన చెందనక్కరలేదని తేల్చేశారు. ఇది సర్వాంగీకారమైన ప్రక్రియట! ఎవరు అంగీకరించారో ఆయనే చెప్పాలి. ఎవరైనా పార్టీలు మారితే, క్రాస్ ఓటింగు చేస్తే ఫలానా దాని కోసం చేశారని ఆరోపణలు వస్తాయి, అవి అబద్ధమని అవతలివాళ్లు కొట్టేస్తారు. ఓటు కొంటూ రెడ్‌హేండెడ్‌గా దొరికిన కేసులో కూడా సర్వసాధారణమైనదే అనుకుని వదిలేయాలా!?

ఇంతకీ పివి కేసులో ఏం చెప్పారు? నల్సార్ యూనివర్శిటీలోన్యాయశాస్త్రాన్ని బోధించిన మాడభూషి శ్రీధర్ కేంద్ర సమాచార కమిషనర్ కూడా. ఆయన జూన్ 10 సాక్షిలో 'పివి నరసింహారావు వర్సెస్ స్టేట్ (సిబిఐ) కేసులో సుప్రీం కోర్టు చెప్పిన తీర్పు ఒక రకంగా చాలా అన్యాయమైనదే. లంచాలు యిచ్చినవారికి శిక్షలు వుంటాయంటూనే లంచాలు తీసుకుని చట్టసభలో ఓట్లేసిన వారిని విచారించడానికి వీల్లేదని మినహాయింపు యివ్వడం దారుణం. కానీ ఆ దురన్యాయ తీర్పు కూడా లంచాలు యిచ్చిన ఎంఎల్ఏలకు, ఎంపీలకు మినహాయింపులు యివ్వలేదు. ఇచ్చినవారికి విముక్తి లేదు కనుకనే రేవంత్ గారు లంచం యివ్వజూపి కెమెరాల్లో చిక్కి ప్రస్తుతం జైల్లో వున్నారు..' అని రాశారు. చౌదరిగారు చట్టపరంగా ఎవరిదీ తప్పు కాదని తేల్చేస్తే శ్రీధర్ గారు రేవంత్‌ది తప్పన్నారు. రామాంజనేయులు గారు రేవంత్‌ను తప్పు కాదని చెపుతూనే తన వ్యాసంలో స్టీఫెన్‌సన్‌ను తప్పు పట్టారు '...డబ్బులకు ఓటు వేస్తానన్న వ్యక్తి ప్రథమ ముద్దాయిగా నిర్ణయించాలి. డబ్బులకు ఓటు వేస్తానని చెప్పి యితరులను ఆకర్షించి తర్వాత పోలీసులకు పట్టివ్వటాన్ని దురుద్దేశం (మాలఫైడ్ యింటెన్షన్)గా భావించాలి. దురుద్దేశంతో అవినీతి కేసులో యిరికించటాన్ని ఏ న్యాయస్థానం ఒప్పుకోదు.' అంటూ వాదించారు. రేవంత్ కేసు ప్రజా ప్రాతినిథ్య చట్ట పరిధిలోకి మాత్రమే వస్తుంది కానీ అవినీతి నిరోధక చట్టం పరిధిలోకి రాదు అంటూ సెక్షన్లు వల్లించారు. ఇప్పుడు ఎసిబితో బాటు ఎన్నికల కమిషన్ కూడా రంగంలో వుంది కాబట్టి ఆ ముచ్చటా తీరుతుంది.

నా బోటి సామాన్యులకు చట్టం తెలియదు, సంఘపరమైన న్యాయం మాత్రమే తెలుసు. దాని ప్రకారం ఓటు కొనబోవడం తప్పు. మామూలు ఎన్నికల సమయంలోనే టీవీ యాడ్స్ ద్వారా ఎన్నికల కమిషన్ మనలాటి సాధారణ ఓటర్లను హెచ్చరిస్తూ వుంటుంది. అభ్యర్థులు వాహనయోగం కల్పించబోయినా తీసుకోవద్దంటుంది. మరి ఎమ్మెల్యేలకు మినహాయింపు వుందేమో నాకు తెలియదు. ఇక స్టింగ్ ఆపరేషన్ చేసి నేరస్తులను పట్టిద్దామనుకునేవాళ్లు స్టీఫెన్‌సన్‌లాగే ప్రవర్తిస్తారు. గతంలో ఎన్టీయార్ తన మంత్రిని కూడా యిదే రీతిలో పట్టించారు. ఆయనది దురుద్దేశం అనాలా? కిడ్నాపర్లు డబ్బు యిచ్చి పిల్లాణ్ని పట్టుకెళ్లమంటే, మీరు పోలీసుల వద్దకు వెళతారు. డబ్బు యిస్తా ఫలానా చోటకి రండి అని కిడ్నాపర్లకు చెప్పి మమ్మల్ని ఎలర్ట్ చేయండి, వచ్చి పట్టుకుంటాం అని వాళ్లంటారు. పట్టుబడిన కిడ్నాపర్లు 'నువ్వు మాకు ఆశ చూపి రప్పించి పట్టించావు, నీది దురుద్దేశం' అని మీపై కేసు పెడతారా? అంతా అయోమయంగా వుంది. వ్యాసం రాసినాయన ప్రభుత్వంలో న్యాయశాఖలో ఉపకార్యదర్శి. దీన్ని బట్టి ఆంధ్రప్రభుత్వం వైఖరి ఎలా వుందో బోధపడుతోంది. పట్టుబడ్డాక మొత్తం బుకాయింపులోకి దిగారు, దానిలో భాగంగానే సెక్షన్ 8 గురించి చర్చ మొదలుపెట్టారు తప్ప దాని గురించి గాని, పదో షెడ్యూల్‌లోని సంస్థల గురించి గాని యిన్నాళ్లూ చిత్తశుద్ధితో లేరని క్లియర్‌గా తెలుస్తోంది.

ఇది గతం. ఇక ముందు ఎలా వుంటుంది? సెక్షన్ 8 గురించి ఎడ్వకేట్ జనరల్ సలహా యివ్వడం నిజమేనా? గవర్నరుకు హోం శాఖ సర్వాధికారాలు యిచ్చిందా? నువ్వే చూసుకో అని చేతులు దులిపేసుకుందా? ఎవరి వూహాగానాలు వారివి. జరిగిన విషయాలను క్రోడీకరిస్తూ ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ 'కాల్పుల విరమణతో కథ కంచికి!?' అని జూన్ 21 న రాసిన వ్యాసంలో సారాంశం యిది – 'మే 20 ప్రాంతంలోనే తెరాస రేవంత్‌పై ఫోకస్ పెట్టింది. అతను ఎంతకైనా తెగిస్తాడని వూహించి కొందరు తెరాస నాయకులు, పోలీసు అధికారులు వ్యూహం అమలు చేశారు. ఫలానా ఫలానా వారి ఫోన్ నెంబర్లు ట్యాప్ చేయమని సర్వీసు ప్రొవైడర్లకు లిఖితపూర్వకంగా ఆదేశాలు పంపారు. జాబితాలో టిడిపి ఎంపీ, ఎమ్మెల్యే సెబాస్టియన్ నంబర్లతో బాటు కొంతమంది ఉగ్రవాదులు, నక్సలైట్ల నంబర్లు చేర్చారు. ఆ ఆదేశాల ప్రకారం మే 23 నుంచి సర్వీసు ప్రొవైడర్లు ట్యాపింగ్ మొదలెట్టారు. దీనితో పాటు ప్రయివేటు సంస్థల ద్వారా కూడా మరికొంతమంది ఫోన్‌లు ట్యాప్ చేశారు. దాని వలన రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాలు తెలిశాయి. ఎసిబి ద్వారా పట్టిచ్చారు. సెబాస్టియన్ ఫోన్ నుంచి చంద్రబాబుకి వెళ్లిన ఫోన్ కాల్స్‌ను రికార్డు చేశారు. ఈ క్రమంలోనే ఒక ఎంపీకి, లోకేశ్‌కు జరిగిన సంభాషణలు కూడా రికార్డు చేశారు. నాయిని ప్రస్తావించిన ఆడియోలు యివే! ఆ ప్రకటనతో కంగు తిన్న బాబు మే 23 నుంచి జరిగినవన్నిటి గురించి వాకబు చేసి ఆధారాలు దగ్గర పెట్టుకున్నారు. తన పార్టీకి చెందిన ఎమ్మెల్యే, ఎంపీల ఫోన్లు ట్యాప్ చేయమని అధికారికంగా లేఖ రాసిన పోలీసు అధికారులు సజ్జనార్, శివధర్‌రెడ్డి, అనురాగ్ శర్మ, హోం సెక్రటరీ వెంకటేశంలపై ఫిర్యాదు చేశారు. వారిని విచారించినప్పుడు తాము కెసియార్ ఆదేశాలపై చేశామని చెపితే గతంలో కర్ణాటకలో ట్యాపింగ్ వ్యవహారంలో రామకృష్ణ హెగ్గడే రిజైన్ చేసినట్లే యిప్పుడు తనూ చేయవలసి వుంటుందని అర్థమయ్యాక కెసియార్ జోరు తగ్గించారు. ముందులో వేడుక చూసిన కేంద్రం కూడా శ్రుతి మించితే కొంపలు మునుగుతాయని గుర్తించి గవర్నరు ద్వారా యిద్దర్నీ చల్లబడమని సూచించింది. అందుకే వాతావరణం చల్లబడసాగింది.'

ఇదీ ఆ వ్యాసంలోని ప్రధానాంశం. దీనిలో తెరాస తన ఆపరేషన్ మొదలుపెట్టేముందు జగన్‌తో సమావేశమైంది అని కూడా రాశారు. రాధాకృష్ణకు, జగన్‌కు వున్న వైరాన్ని దృష్టిలో పెట్టుకుంటే దానికి ప్రాధాన్యత యివ్వనక్కర లేదనిపించింది. అటుగాని,

యిటు గాని జగన్‌కి ఏ పాత్రా లేదు. బాబుకి వ్యతిరేకంగా ఓ కేసు వస్తే దాన్ని కొండంతలు చేసి వ్యతిరేక ప్రచారం చేద్దామని చూడడం తప్ప వైకాపా చేయగలిగిందేమీ లేదు. పోలీసు అధికారులు, యంత్రాంగం అన్నీ తెరాస చేతిలో వున్నాయి. జగన్ సిఫార్సు, మద్దతు అక్కరలేదు. ఇంతకీ తేలినదేమిటంటే బాబు ఫోన్లు ట్యాప్ కాలేదు. 120 మందివి ట్యాప్ అయ్యాయన్న లెక్క కూడా పొల్లు మాటే అనుకోవాలి. ఎమ్మెల్యే, ఎంపీల ఫోన్లు ట్యాప్ చేసినందుకు తమపై విచారణ జరుగుతుందన్న భయం తెలంగాణ పోలీసు అధికారులకు వుందని, అందుకే సెలవుపై వెళ్లిపోయారని అంటున్నారు. అది నిజమే కావచ్చు. ఏది ఏమైనా బాబు జాగ్రత్తగానే వున్నారు. ట్రూత్ లాబ్స్ గాంధీని ప్రభుత్వ సలహాదారుగా పెట్టుకోవడమే దానికి నిదర్శనం. పార్టీ సలహాదారుగా పెట్టుకుంటే అదో అందం. ప్రభుత్వసలహాదారుగా పెట్టుకోవడమేమిటి? ఫోరెన్సిక్ లాబ్ రిపోర్టులు ఎలా వచ్చినా సాధారణ ప్రజలకు చింతేముంది? గతంలో మాట ఏమో కానీ, ట్యాపింగ్ చేయడం అనేక ప్రభుత్వాలు చేస్తున్న పనే అని యింతకు ముందే రాశాను. పైగా ట్యాపింగ్ జరిపినది తెలంగాణ పౌరులపై. ఫిర్యాదు చేస్తే వారు చేయాలి. ఆంధ్ర ప్రభుత్వం కాదు. దాన్నీ రేవంత్ లంచాన్ని ఒకే త్రాసులో తూచలేం.

అందువలన రాజీ టెర్మ్స్ ఎటువైపు మొగ్గాయో వూహించవచ్చు. తెలుగు యూనివర్శిటీ, ఓపెన్ యూనివర్శిటీల నిర్వహణా భారంలో 58% భరించడానికి ఆంధ్ర ప్రభుత్వం ఒప్పుకుందని యివాళ్టి పేపర్లో వచ్చింది. మరి ఆస్తుల్లో 58% వాటా వస్తుందా? ఇలాటి ఒప్పందం వలన ఆంధ్రకు నష్టమే కదా! తమిళనాడులో యూనివర్శిటీతో కూడా యిలాటి ఒప్పందమే పెట్టుకోవచ్చు. ఉమ్మడి రాజధాని సౌకర్యం పొంది లాభమేముంది? 'సంస్థను నెలకొల్పినది ఉమ్మడి రాష్ట్ర నిధులతోనే అయినా యిక యీ సంస్థ తెలంగాణదే, దాని నిర్వహణ, అజమాయిషీ, దానిలో సిబ్బంది ఎవరుండాలి యిత్యాది విషయాలన్నిటిలో తెలంగాణకే సర్వాధికారం. నిర్వహణా వ్యయంలో ఎక్కువ భాగం మాత్రం ఆంధ్ర భరించాలి' అని తెలంగాణ ప్రభుత్వం చేసిన వాదనను ఆంధ్ర ప్రభుత్వం అంగీకరించింది. ఇదేనా హక్కుల కోసం పోరాటం? ఇది రాజీ పడడం కాదా? ఎడ్మిషన్లు కోరే విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఒప్పుకున్నాం అని యిప్పుడు సంజాయిషీ చెప్పవచ్చు, యీ పరిస్థితి ఎందుకు రానిచ్చారు? ఏడాది లోపున ఆస్తుల, అప్పుల పంపకాలు చేసుకోవాలి అని విభజన చట్టం చెప్పినా ఎందుకు వూరుకున్నారు?

కెసియార్, బాబుల మధ్య రాజీ కుదిరిందో లేదో తెలియదు కానీ రేవంత్ మళ్లీ రాజీ పడ్డట్టు లేదు. ఆయన జైలు నుంచి బయటకు వస్తూనే అట్టహాసం చేశాడు. ఏ మాత్రం పశ్చాత్తాపం చూపకుండా, ఏదో ఘనకార్యం చేసినట్లు ప్రలాపాలు పలికాడు. కెసియార్ ప్రభుత్వం ఆయన మీద పగబట్టి, తన పరువు తీసుకుంది. బెయిల్ ఎలాగైనా రాకుండా చేయాలని ప్రయత్నించి, భంగపడి, యిచ్చిన బెయిలు రద్దు చేయమని సుప్రీం కోర్టుని కోరి, చివాట్లు కూడా తింది. విభజన పుణ్యమాని తెలుగువాళ్లు అందరి చేత సుద్దులు వినాల్సి వస్తోంది. దారుణమైన మతకలహాలు జరిగిన రాష్ట్రం నుండి వచ్చిన రాష్ట్రపతి కూడా 'పౌరుగును ఎంచుకోలేం, భరించండి' అని నీతులు చెప్పారు. మనకు సిగ్గుండాలి. ముక్తాయింపుగా చెప్పవలసిన దేమిటంటే – రాజీ కుదిరింది కదాని టిడిపి సెక్షన్ 8 పై చర్చ ఆపేయకూడదు. నోటు–ఓటు వ్యవహారాన్ని, సెక్షన్ 8 కు ముడిపెట్టడం మానేసి, తెలంగాణలో వున్న అన్ని ప్రాంతాల వారి భద్రత, పౌరహక్కుల రక్షణ కోసం అంటూ సెక్షన్ 8 అమలుకై ఉద్యమించాలి. కెసియార్ నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారని అందరికీ తెలుసు. తన పార్టీలో చేరడానికి యిచ్చగించనివారిపై కేసులు బనాయించే ప్రమాదం కూడా పొంచి వుంది. ఆయన పాలనపై ఘాటుగా విమర్శలు చేస్తున్నందుకే రేవంత్‌పై పగ పెంచుకున్నాడన్న విషయంలో సందేహమే లేదు. రేవంత్, కొంతవరకు కిషన్ రెడ్డి, యీ మధ్య విక్రమార్క కెసియార్‌కు అడ్డుకట్ట వేస్తున్నారు తప్ప తక్కిన నాయకులు, మీడియా అంతా దాసోహమనేసింది. అలాటి రేవంత్ యీ రకంగా కేసులో పట్టుబడడం తెలంగాణలో ప్రజాస్వామ్యానికి చేటు.

సెక్షన్ 8 గురించి ఉద్యమించడం టిడిపి సొంతంగా చేయలేదు. ఎందుకంటే దానికి యిప్పటికే మచ్చ అంటింది. తన రాష్ట్రంలో అఖిలపక్షం ఏర్పరచి, అందర్నీ కలుపుకుని పోతూ తీర్మానాలు చేస్తూ, కేంద్రానికి హెచ్చరికలు పంపుతూ వుండాలి. అంతేకాదు, తెలంగాణలోని అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు కూడా సెక్షన్ 8 గురించి పట్టుబట్టేట్లా చేయాలి. ప్రతీ పార్టీలోను ఆంధ్ర శాఖ ఒకలా, తెలంగాణ శాఖ ఒకలా మాట్లాడితే దానికి అర్థం వుండదు. విభజన చట్టంలో వుంది, దాన్ని అమలు చేయాలి, అమలు చేయడంలో హద్దు మీరితే అప్పుడే అభ్యంతర పెడదాం అనే అవగాహన అందరికీ స్పష్టంగా వుండాలి. ఈ పనికి పూనుకోవలసిన బాధ్యత ఆంధ్ర ముఖ్యమంత్రిగా బాబుపై వుంది. మిగతా వాళ్లతో పనేముంది, నేను ఒక్కణ్నే ఆంధ్రరక్షకుడిగా వెలుగుతాను అనుకుంటే జనం నమ్మరు. టెన్త్ షెడ్యూల్ ఆస్తులు ఏ పాటి రక్షించారో జనాలు గమనించారు. రేవంత్ అంశం రాకపోతే సెక్షన్ 8ని కూడా పట్టించుకోలేదనీ గమనించారు. కెసియార్‌ను అప్రజాస్వామిక వాది అని నిందించేముందు, తను అలాటి తప్పులు చేయకుండా వుండాలి. తను పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహిస్తూ, అఖిలపక్షాన్ని పిలవకుండా యిక్కడ మాత్రం ఆ కారణాలు చూపి సెక్షన్ 8 అమలు కోసం అడిగితే ఆ డిమాండ్‌కు విలువ వుండదు.

సీరీస్ ముగించేముందు కొన్ని వ్యాఖ్యలపై జవాబులు – 1) తెలంగాణ నాయకులు తమ వైఫల్యాలకు ఆంధ్రులను బాధ్యుల్ని చేస్తూనే వుంటారని, వాళ్లని అనవసరంగా యిరికిస్తూంటారని అని నేను రాసినదానికి ఒక పాఠకుడు అభ్యంతరం తెలిపారు. తాజాగా ఒక ఉదాహరణ – జెఎన్‌టియు యిటీవల ఇంజనీరింగు కాలేజీల క్షాళన పేరుతో మంచి పని చేస్తోంది. అఫ్‌కోర్సు, దానిలోనూ పక్షపాతాలు లేకపోలేదు, కానీ కనీస వసతులు లేని కాలేజీలో సీట్లు రద్దు చేస్తున్నారు. నాణ్యతాలేమి కారణంగా సీట్లు పోగొట్టుకున్న

తెలంగాణ కాలేజీ యజమానుల సంఘం చేసిన ఆరోపణ ఏమిటో తెలుసా? – ఆ కమిటీలో అందరూ ఆంధ్రులుండడం చేత తమకు అన్యాయం జరిగిందట! 2) చట్టం తెలియని సామాన్యుణ్ని నేను అనడంలో పొరపాటేముంది? ఎప్పుడైనా సెక్షన్లు, ఫలానా వెర్సస్ ఫలానా కేసులు కోట్ చేశానా? అటువంటివి రాసినప్పుడు –ట చేరుస్తాను. జగన్‌పై ఆర్టికల్స్‌లో సెక్షన్‌లు వల్లించానా? క్విడ్ ప్రో కో నిరూపించడం కష్టం అంటూ బ్యాంకు మేనేజరు కొడుక్కి యిండస్ట్రియలిస్టు ఉద్యోగం యివ్వడం, యిండస్ట్రియలిస్టుకు బ్యాంకు మేనేజరు లోను యివ్వడం వంటి సాధారణ ఉదాహరణలే యిచ్చాను. రేవంత్ అంశంపై (ఒక పాఠకుడు ఎత్తిచూపినట్లు) న్యాయకోవిదులు తలోరకంగా మాట్లాడుతున్నారని ఎత్తి చూపాను. ఓటు అమ్ముకోవడం తప్పు కాదని కోర్టులు చెప్పాయంటే రేపు జనరల్ ఎలక్షన్‌లో నా ఓటుకు నేను ఆన్‌లైన్ ఆక్షన్ నిర్వహించుకోవచ్చా అని కామన్ సెన్సుతో అడగవచ్చుగా?

పట్టిచ్చినందుకు స్టీఫెన్‌సన్‌ది దురుద్దేశం అని ఆంధ్ర ప్రభుత్వాధికారి అన్నారు. మరి యీ నెలలో సెన్సారు ఆఫీసరును ఒక నిర్మాత యిదే రీతిలో పట్టిచ్చారు. ఆయనదీ దురుద్దేశమేనా? మేధావులు చేసే వితండ వాదనను ఎత్తిచూపడమే నా లక్ష్యం. రేవంత్ దొరికిన దొంగ, అతన్నీ వదిలేస్తే దొరకని దొంగలకు మరింత ధైర్యం వస్తుంది, మంచివారినీ దొంగతనాలకు ప్రేరేపిస్తుంది. ఇక సమైక్యాంధ్రకు జనాల్లో ప్రజాదరణ వుందా లేదా అన్నది తెలుసుకోవడానికి 2014 ఎన్నికలు సూచిక కానే కాదు. అప్పటికే విభజన బిల్లు పాస్ అయిపోయింది. 2009లో వైయస్సార్ సమైక్యానికే నిలబడి గెలిచారు. టిడిపి, కమ్యూనిస్టులు విభజనవాది తెరాసను అక్కున చేర్చుకుని ఓడిపోయాయి. 2004లో టిడిపి సమైక్యవాదం చేత ఓడలేదు. బాబు పాలనలో గ్రామీణప్రాంతాల ఆర్థిక స్థితి దెబ్బ తినడం వలన ఓడింది. ఉమ్మడి రాష్ట్రంలో సాధారణ ఎన్నికలలో తెరాస ఒంటరిగా పోరాటం చేసే సాహసం చేయలేకపోయింది. కొన్ని ప్రాంతాల్లోనే గెలుస్తూ, రాజీనామా చేస్తూ అక్కణ్నుంచే మళ్లీ పోటీ చేస్తూ వచ్చింది. విభజన జరగ్గానే తెలంగాణలో విద్యుత్ కొరత రావడం వాస్తవం. ఆనాటి పేపర్లు చూస్తే తెలుస్తుంది. ఈ సీజన్‌లో వ్యవసాయానికి భారీగా కోత పెట్టి, పరిశ్రమలకు యిచ్చారు. కేంద్రం నుంచి కొంత తెచ్చారు, మరి కొంత కొన్నారు. తెలంగాణలో చాలినంత విద్యుత్ యిప్పటికూడా కూడా లేదు. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2015)**

**జూన్ 19** **ఎమ్బీయస్ : సినీ స్నిప్పెట్స్ 05 – ఘంటసాల భగవద్గీతావరణం**

లతా మంగేష్కర్ 1971లో ఆవిడ తండ్రి వర్ధంతిని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినప్పుడు ఘంటసాల కచేరీ చేసారు. ఆ సందర్భంగా లతా ఘంటసాలను సత్కరించి తను పాడిన భగవద్గీత రికార్డులు బహుమతిగా యిచ్చారు. 1970లో రెండు రికార్డుల సెట్టుగా విడుదలైన దానిలో 9 వ అధ్యాయంలో నుంచి 34 శ్లోకాలు, 12 వ అధ్యాయం నుంచి 20 శ్లోకాలు పాడారు. 4–5 శ్లోకాలు వరుసగా పాడిన తరువాత మగకంఠంలో ఇంగ్లీషు కామెంటరీ వుంది. మొత్తం 80 నిఎఎలు. సంగీతం హృదయనాథ్ మంగేష్కర్. ఆ రికార్డులు విన్న తరువాత అందరికీ అర్థమయ్యేలా సులభశైలిలో శ్లోకం కాగానే తెలుగు తాత్పర్యం చెపితే ఎలా వుంటుందన్న ఆలోచన ఘంటసాలకి వచ్చింది.

లతా మంగేష్కర్ హిందీలో భగవద్గీత పాడిన తరువాత ఎచ్.ఎం.వి. సంస్థ వారు ఎం.ఎస్.సుబ్బులక్ష్మి గారిచేత అదే తరహాలో పాడించి దక్షిణాదిన రిలీజ్ చేద్దామనుకున్నారు. హెచ్.ఎం.వి. సౌత్ మేనేజర్ మంగపతి గారు భగవద్గీత కృష్ణుడు చెప్పినది కాబట్టి మగవాళ్లు పాడితే బాగుంటుందని, దానికి ఘంటసాల గారే తగిన వారని మార్కెటింగ్ వారిని ఒప్పించి, ఘంటసాల వద్దకు వచ్చారు. '108 శ్లోకాలు సంస్కృతంలో మీరు పాడతారు, తెలుగులో వాటి తాత్పర్యం, మధ్యలో సంభాషణలు, వాటిలో నాటకీయత వుంటుంది కాబట్టి నటుల చేత చెప్పిస్తే బాగుంటుంది. నాగయ్యగారు చెప్తారు. మద్రాసు రామకృష్ణ స్కూలులో తెలుగు టీచరుగా పనిచేసి రిటైరైన కోట సత్యరంగయ్య శాస్త్రిగారి చేత తెలుగు వ్యాఖ్యానం రాయిస్తాను' అన్నారు మంగపతిగారు. కొన్ని రోజులకి నాగయ్యగారి ఆరోగ్యం బాగా లేదు కాబట్టి జగ్గయ్యగారి చేత చెప్పించాలనుకున్నారు. ఘంటసాల 'నాకు నాటకాలలో నటించిన అనుభవం వుంది కాబట్టి శ్లోకాలతో బాటు తాత్పర్యం కూడా నేనే చెప్తాను, కంటిన్యుటీ వుంటుంది' అన్నారు. మంగపతి ఒప్పుకున్నారు.

ఈ భగవద్గీత కూడా రెండు రికార్డులుగా ప్లాన్ చేశారు. మొదటి దాంట్లో మొదటి తొమ్మిది అధ్యాయాలలో వున్న 372 శ్లోకాలలో 56 ఎంచుకున్నారు. రెండవ దాంట్లో 10 నుంచి 18 వ అధ్యాయం వరకు వున్న 328 శ్లోకాలలో 50 శ్లోకాలు ఎంచుకున్నారు. అన్నిటికన్న ముందు ధ్యానశ్లోకం 'పార్థాయ ప్రతిబోధితాం', చివరిలో "గీతాశాస్త్రం మిదం పుణ్యం" అనే భగవద్గీతా మహాత్మ్యం శ్లోకం పెడదామనుకున్నారు. మొత్తం 108. కోట సత్యరంగయ్య శాస్త్రి గారి తాత్పర్యం కొన్నిచోట్ల గ్రాంథికంగా వుండి సాధారణ శ్రోతలకు అర్థం చేసుకోవడం కష్టమని తోచింది. అప్పుడు ఘంటసాల, ఆయన శ్రీమతి సావిత్రిగారు నాలుగు రకాల భగవద్గీత వ్యాఖ్యానాలు తీసుకొని ఏ వచనం బాగున్నదో చూసుకుని, విడిగా రాసుకున్నారు. శ్లోకాలు ఏ రాగంలో పాడాలో పక్కన రాసుకున్నారు. దీనికంతా ఆరు నెలలు పట్టింది. అప్పట్లో ఘంటసాల ఆరోగ్యం బాగులేదు. డాక్టర్లు మేడ మీద నుంచి క్రిందకి రాకూడదు, మెట్లు దిగకూడదన్నారు. బ్లడ్ ప్రెషర్ చాలా ఎక్కువగా వుంది, పాడటానికి వీల్లేదు అన్నారు. అందువలన తప్పులు రాకుండా సంస్కృత శ్లోకాలు బట్టీపట్టి భార్యకు అప్పచెపుతూ, ఉచ్చారణ సరి చూసుకోవడంలో ఆ సమయం గడిపారు.

ఆరునెలల తర్వాత ఆరోగ్యం కుదుటపడింది. ఒంట్లో బాగైన తరువాత మొదటి పాట 'జీవనతరంగాలు' సినిమాలో 'ఈ అందానికి

బంధం వేశా నీనాడు' పాడారు. అది అయిన తరువాత 'దొరబాబు' సినిమాలో కొన్ని పాటలు పాడారు. వాటి సాహిత్యం ఆయనకి నచ్చలేదు. ''సాహిత్యం మారిపోయింది. ఈ పిచ్చిపాటలు పాడకూడదు. కొత్త కుర్రవాళ్లు వస్తున్నారు. ఇక సినిమా పాటలు నాకొద్దు. భగవద్గీత, రామదాసు కీర్తనలు, అష్టపదులు – యివన్నీ రికార్డు చేస్తూ కాలక్షేపం చేస్తాను.'' అన్నారు. భగవద్గీత రికార్డు చేసేటప్పుడు కాషాయ వస్త్రాలు కట్టుకోవాలనుకున్నారు. భార్య యింట్లో వున్న పంచల జత తీసుకుని వెళ్లి కాషాయ రంగు వేయిస్తే అవి కట్టుకుని రికార్డింగుకి వెళ్లారు. మొదటి భాగంలో సమరభేరిలో కొన్ని వాయిద్యాలు అదనంగా వున్నాయి కానీ చాలా భాగంలో కీ బోర్డు, సితార, ఫ్లూట్, రిథమ్స్, తంబూరా తప్ప యితర వాయిద్యాలు లేవు. మొదటి భాగం రికార్డయిన తరువాత కొన్ని సినిమా పాటలు పాడారు. అప్పుడు మళ్లీ వైరాగ్యం – ''50 ఏళ్లు దాటాయి. భగవద్గీత పాడుకుంటూ కచ్చేరీలు చేసుకుంటే గడిచిపోతుంది'' అంటూ.

రెండో భాగం కంపోజింగ్ మొదలు పెట్టారు. దీనిలో శ్లోకాలకు కష్టమైన రాగాలు ఎన్నుకున్నారు. విశ్వరూప దర్శనానికి సరైనవి కుదరలేదు. మళ్లీ అనారోగ్యం ప్రారంభమైంది. ఆసుపత్రి పాలయ్యారు. 'పూర్తి చేయగలనో లేదో, మొదటిభాగమైనా రిలీజు చేయండి, ప్రజలలో స్పందన ఎలా వుంటుందో తెలుస్తుంది' అంటే గ్రామఫోన్ కంపెనీవాళ్లు ఒప్పుకోలేదు. రెండూ ఒకేసారి చేద్దాం అన్నారు. హాస్పటల్‌లో బెడ్ మీద పడుక్కుని నిరంతరం విశ్వరూపదర్శనం శ్లోకాల బాణీలు గురించి ఆలోచించేవారు. ఒక రాత్రి 2 గంటలకు మెలకువ వచ్చి కూర్చున్నారు. ఎలాటి బాణీలు, ఆర్కెస్ట్రా వుండాలో స్పష్టత వచ్చింది. నొటేషన్స్ రాసుకున్నారు. చివరిలో భగవద్గీతతో సంబంధం లేకుండా ఉపసంహారం ఎలా చేయాలా అని ఆలోచించి 'అసతోమా సద్గమయ' అనే శ్లోకంతో ముగిద్దామనుకున్నారు. శ్లోకాల కంపోజింగ్ పూర్తయేసరికి 1973 డిసెంబరు అయింది. మొదటిభాగం పూర్తయిన ఆర్నెల్లకి రెండో భాగం రికార్డింగ్ ప్రారంభమైంది. 25 శ్లోకాలు, వాటికి తెలుగులో వచనాలు ఒకే టేక్‌లో పాడారు. తర్వాత తక్కిన 25 శ్లోకాలు, వచనం. చివరిలో వచ్చే ''అసతోమా సద్గమయ'' ను ఘంటసాల తన పిల్లలని, సంగీతరావుగారి పిల్లలని తీసుకువెళ్లి వారి చేత పాడించి రికార్డు చేయించారు. రికార్డింగు పూర్తయ్యాక టేపును గ్రామఫోన్లుగా అచ్చొత్తించడానికి కలకత్తా ఆఫీసుకు పంపబోతూ ఒకసారి విని ఫైనలైజ్ చేయండి అని ఘంటసాలను పిలిచారు. ఆయన తన భార్యను కూడా తీసుకుని వెళ్లారు. 18 వ అధ్యాయం 30 వ శ్లోకం వచనంలో 'సత్వగుణ సముద్భవమని ఎరుంగుము' అనడానికి బదులు 'సత్వగుణ సంభవమని ఎరుంగుము' అన్నారు ఘంటసాల. సావిత్రిగారు ఆ తప్పును ఎత్తిచూపితే వెంటనే సరిచేశారు.

రికార్డులు ఎంత త్వరగా వస్తాయా, ప్రజలు ఎలా రిసీవ్ చేసుకుంటారా అని ఆదుర్దాగా వుంటూండగానే ఘంటసాలకు దేవుడి దగ్గర నుండి పిలుపు వచ్చింది. 1974 జనవరిలో ''యశోదాకృష్ణ'' సినిమాకై రాజేశ్వరావుగారి సంగీతదర్శకత్వంలో ''చక్కనివాడె..'' పాట, వేణుగారి సంగీతదర్శకత్వంలో ''భద్రాచల రామదాసు'' సినిమాకు పాటలు పాడారు. ఒప్పందం ప్రకారం పూర్తి చేయాల్సిన పాటలు పూర్తి చేస్తున్నారు. ఇంతలో ఎవరో అనామకుడు యిచ్చిన నాటుమందు సేవించడం వలన ఆరోగ్యం క్షీణించి 1974 ఫిబ్రవరి 11 న విజయా ఆసుపత్రిలో స్వర్గస్తులయ్యారు. ఆయన పోయిన తర్వాత రెండు నెలలకు ఏప్రిల్ 21 న విజయవాడలో ఎచ్.ఎం.వి. వారు యన్.టి.రామారావు చేతుల మీదుగా రికార్డు విడుదల చేసారు. తొలి రికార్డును విశ్వనాథ సత్యనారాయణ గారికి అందచేసిన ఎన్టీయార్ 'అంత్యకాలంలో ఘంటసాల ఈ భగవద్గీతను ఆలపించి దానిని చిరస్థాయిగా జాతికి అంకితం చేసార'ని అన్నారు. ఆ మాట అక్షరాలా వాస్తవం. ఇదివరలో భగవద్గీత అంటే కొంతమందికే పరిమితం. ఘంటసాల ధర్మమాని తెలుగునాట గుడిసెలలో కూడా భగవద్గీత వినబడుతోంది. నిరక్షరాస్యుడికి కూడా ఆ శ్లోకాలు పరిచితం. దేశంలోని తక్కిన ప్రాంతాలకు యీ సౌలభ్యం లేదు. ''ఘంటసాల భగవద్గీత గాన నేపథ్యం'' పేర పుస్తకంలో శ్రీమతి ఘంటసాల సావిత్రి యీ విశేషాలను పాఠకులతో పంచుకున్నారు.

**– (సశేషం) ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2015)**